భాషా చారిత్రక వ్యాసములు

కోరాడ రామకృష్ణయ్య

తిరుపతి

1954

భాషా చారిత్రక వ్యాసములు

కోరాడ రామకృష్ణయ్య

ప్రకాశకులు :

కోరాడ నాగేశ్వరరావు

రెండవ కూర్పు
1000 ప్రతులు.
1964

లిబర్టీ ప్రెస్,
మద్రాసు-1.

4=25
వెల : రూ. [redacted]

విషయ సూచిక

తొలి పలుకు

భాషాచరిత్రకు సంబంధించిన ఈ వ్యాసములన్నియు నిదివరకు 'భారతి' మొదలగు కొన్ని పత్రికలలోఁ బ్రకటింపఁబడినవే. కాని యవి యన్నియు నొక్కచోట జేర్పఁబడి యుండిన భాషా చరిత్రను గూర్చి వ్యాసంగము చేయువారి కెక్కువ యనుకూలముగా నుండునను తలంపుతోఁ గొందఱు మిత్రుల ప్రోత్సాహమున నిందొక సంపుటమునఁ జేర్పఁబడినవి. ఆంధ్రభాషా చరిత్రాన్వేషణపరుల కీ వ్యాసము లేమాత్రమైన సాహాయ్య మొనర్పగలిగినచో నీ ప్రకటనోద్దేశము సార్థకము కాగలదు.

తిరుపతి.
15-2-54

కోరాడ రామకృష్ణయ్య.

కోరాడ రామకృష్ణయ్యగారి యితర గ్రంథములు

1. ఆంధ్ర భారత కవితావిమర్శనము.
2. దక్షిణదేశ భాషాసారస్వతములు—దేశి.
3. సారస్వత వ్యాసములు.
4. కాళిదాసుని కళాప్రతిభలు.
5. భాషోత్పత్తి క్రమము - భాషా చరితము.
6. సంధి (చారిత్రక పరిశీలనము).

కోరాడ రామచంద్రకవి గ్రంథములు

1. మంజరీ మధుకరీయము (తెలుగు నాటకము).
2. నయప్రదీపము (తెలుగు గద్యము).
3. పరశురామ విజయము.
4. రథాంగదూతము.
5. బాలచంద్రోదయః (సంస్కృత గద్యము).
6. ఘనవృత్తమ్. (సంస్కృత కావ్యము, కాళిదాస మేఘ సందేశోత్తర క[illegible] భాగరూపము).

For Copies :

Dr. K. MAHADEVA SASTRI
Reader in Telugu, S. V. University
TIRUPATI

1

భాషాశాస్త్రము - దాని క్రమాభివృద్ధి

భాషాశాస్త్ర మనునది యిటీవలి కాలమున, అనఁగా నవీనయుగమున వృద్ధినొందిన శాస్త్రములలో నొకటి. ఇది పాశ్చాత్య దేశములందు-ముఖ్యముగా నైరోపా దేశమునందలి పండితులచే వృద్ధినొందింపఁబడిన శాస్త్రము. అయితే ఐరోపాదేశమున నీశాస్త్ర మభివృద్ధియగుటకు ముఖ్యకారణము క్రీ. శ. ౧౮ వ శతాబ్ద్యంతమున నా దేశమువారికిఁ గలిగిన సంస్కృత భాషాజ్ఞానమే. దీని ఫలిత మపారమైనది. ఆంగ్లకవి యగు షేక్స్పియర్ దయాగుణమునుగూర్చి చెప్పినట్లుగా నీసంస్కృత భాషాజ్ఞానముకూడ "*It blesseth him that gives and him that takes*"—ఇచ్చినవానికిని, పుచ్చుకొన్న వానికి నత్యంత లాభదాయకమై ఉభయతారకమైనదనవచ్చును. భాషాతత్త్వమునుగూర్చి చీకటిలోఁదడువులాడుకొనుచుండిన పాశ్చాత్య విద్వాంసుల కిది నూతనాలోకమును గల్పించినది. దీని వలన వారిలోఁగలిగిన చైతన్యమును జూచి ప్రబోధమును బొందిన ప్రాచ్యులును, తదాలోకనమునఁ దమ పూర్వులు సంపాదించిపెట్టిన విజ్ఞాన రాసులను గుర్తించి పైకి తీసి ప్రకాశింపఁజేయ మొదలిడిరి. పశ్చిమదిక్కునుండి వచ్చిన యీనూతనాలోకము మూలముగా హైందవవిజ్ఞానమునూతనరాగరంజితమై మరింత వెలుగొందఁజొచ్చినది. వేదములు, వేదాంతములు, పురాణములు, శాస్త్రములు, సాహిత్యము, వ్యాకరణము, ఆయుర్వేదాదివిద్యలు,

కళలు, బౌద్ధ జైన శైవ వైష్ణవాది మతవాఙ్మయములు
మొదలగున వనేకములు నూతన చైతన్యముతో, నూతన
కాంతులతోఁ బ్రకాశింపఁజొచ్చినవి. అట్టివానిలో నీభాషా
శాస్త్ర మొకటి. దీని యభివృద్ధికి సంస్కృత భాషాజ్ఞానమే
కారణమైనను, అది పాశ్చాత్యదేశములందే పెంపొంది యిటీ
వలనే మన దేశమునకు వచ్చినది. దాని ఫలముల నిప్పు
డిపుడే చవిచూచి యానందింపఁగలుగుచున్నాము. కావున
సంస్కృతభాషాజ్ఞాన మీయాధునికశాస్త్రాభి వృద్ధి కెట్లు
తోడ్పడినదో తెలిసికొనినగాని, దీని క్రమాభివృద్ధి యెట్టిదో
తెలిసికొనినవారము కాలేము.

వాస్తవముగా నాధునికభాషాతత్త్వ శాస్త్రమునకు
పునాది హిందూదేశముననే–వైదిక యుగముననే–వేయఁ
బడినది. ఇట్టి భాషాతత్త్వపరిశీలనకుఁగడంగిన మరియొక పురా
తన దేశము గ్రీసు. ఈ దేశమునను క్రీ. పూ. 3, ౪ శతాబ్ద
ముల కాలమున గ్రీకు తత్త్వవేత్తలు భాషాస్వరూపమును
గూర్చి, భాషా విభాగములను గూర్చి విచారింపఁ దొడగిరి.
కాని యూరోపు దేశములో ౧౮వ శతాబ్ది చరమభాగమున
సంస్కృతభాషాజ్ఞానము వారికిఁ గలుగువరకు, భాషాశాస్త్ర
మునఁ జెప్పఁకొనఁదగినంత అభివృద్ధి కలుగలేదు. కాని భార
తీయులు క్రీ. పూ. అనేక శతాబ్దములక్రిందటనే భాషావిష
యక చర్చలను, భాషాతత్త్వపరిశీలనమును ప్రారంభించిరి.

వేదములలో 'వాక్' ఒక దేవతగా భావింపఁబడి అనేక
విధముల స్తుతుల నందినది. భాషాప్రభావమును గూర్చి యా
కాలమువారే యాశ్చర్యచకితులై యుండిరి. భావమునకును,

భాషకును గల సంబంధ మెట్టిది? మన భావముల నాయా ధ్వనులచే నెట్లు వ్యక్తము చేయఁగలుగుచున్నాము? భాషా ముందా? భావము ముందా? ఈమొదలగు ప్రశ్న లాకాలము వారికిఁ గలిగినవి. వానికి సమాధానము లనేకములగు కథల మూలముననుఐతిహ్యముల మూలమునను మంత్రబ్రాహ్మణ ములలో వారు సూచించియుండిరి. ప్రధానముగా వారిదృష్టి ఆంతరంగికము, ఆధ్యాత్మికము నగుటచేఁ దదనుగుణముగనే వాగర్థముల సంబంధమును వారు నిర్వచింపసాగిరి. ఋగ్వేద ములో వాక్కు ఒక దేవతగా భావింపఁబడినది. ఆ దేవత శక్తి స్వరూపములనుగూర్చి యనేక విధములగు స్తోత్రములు చేయఁబడినవి ఋగ్వే. ౧౦ మం. ౧౨౫ సూక్తములో "అహమేవ స్వయ మిదం వదామి జుష్టం దేవేభిరుత మాను షేభిః, యంకామయే తముగ్రం కృణోమి తం బ్రాహ్మణం తం ఋషిం, తం సుమేధాం" -తా నెవనిని ప్రేమించునో వానిని వీర్యవంతునిగను, బ్రహ్మ స్వరూపునిగను, (ఋషి) మేధావంతునిగను జేయుదునని వాగ్దేవత చెప్పినట్లు తెలుపఁ బడినది. ఈ దేవతయే ప్రజాపతికి సహచరియై లోకమందు అర్థసృష్టికిఁ గారణమగును. కావుననే వాగర్థములు పార్వతీ పరమేశ్వర రూపములు. వీని కవినాభావము కలదు. సృష్టి లోని వస్తువులకును, వానిని బోధించు శబ్దములకును గల అవి నాభావసంబంధమే యిందు సూచితము. శబ్దార్థముల సంబం ధము నిత్యమని వైయాకరణులు. "సిద్ధేశబ్దార్థసంబంధే" యని భాష్యకారుఁడు పతంజలి వ్యక్తముచేసినాఁడు. శక్తి స్వరూప మగు శబ్దబ్రహ్మమే అర్థభావమున వివర్తమును బొందుటచే

జగత్సృష్టి కలిగిన దను భావమును వైయాకరణభూషణ
కారుఁడిట్లు వెల్లడించినాడు. "అనాదినిధనం బ్రహ్మ శబ్ద
తత్వంప్రచక్షతే వివర్తతేఽర్థ భావేన ప్రక్రియా జగతో
యతః." ఈశబ్దబ్రహ్మభావమే వైయాకరణులస్ఫోటవాదము
నకు మూలమైనది. ఇది ఋగ్వేదమునఁ దెలుపఁబడిన వాగ్దే
వతా ప్రజాపతుల సహచరభావమును సృష్టి కారకత్వ
భావమునే యనువదించు చున్నట్లున్నది. బ్రాహ్మణములలోఁ
గూడ భావమునకు భాషకుఁ గల సంబంధమును గూర్చిన
కథలు గలవు. అవ్యాకృతమైన వాక్కు నింద్రుఁడు తొలుత
వ్యాకరించినట్లు సూచించు కథ యొకటి శతపథబ్రాహ్మణ
మునఁ గలదు. దీనినిబట్టి యీభాషకుఁ దొలుత ఇంద్రుఁడే
వ్యాకరణకర్తయయియుండు నని తెలియుచున్నది. పాణిని
వ్యాకరణము బయలుదేరినపిదప, నంతకుఁబూర్వమునఁ గల
వ్యాకరణములతోఁబాటు ఈ ఐంద్రవ్యాకరణము గూడ
నశించినట్లుసోమదేవుని కథాసరిత్సాగరమందలియొక కథను
బట్టి తెలియవచ్చుచున్నది. ఏమైనను పాణినికిఁజిరపూర్వమే
మంత్రబ్రాహ్మణముల కాలమునుండి భాషాతత్త్వవిమర్శన
మీ దేశమున జరుగుచునేయున్నదనుట స్పష్టము. వేదము
లందలి స్వరవర్ణోచ్చారణరీతులు మారిపోకుండ అరికట్టుటకై
'ప్రాతిశాఖ్య' లను గ్రంథములు రచింపఁబడినవి. ఇట్టి స్వర
వర్ణోచ్చారణ రీతులను దెలుపు భాగమునకు 'శిక్షాధ్యాయ'
మని బ్రాహ్మణములలోఁ బేరుపెట్టబడినది. "అథ శిక్షాం
వ్యాఖ్యాస్యామః,వర్ణః స్వరఃమాత్రాబలం, సామ సంతానః,
ఇత్యుక్తశ్శిక్షాధ్యాయః" అని తైత్తిరీయారణ్యకము. ఇచ్చట

వర్ణములు (*letters*), స్వరము(*accent*), మాత్ర (*quantity*)- హ్రస్వదీర్ఘ ప్లుతములు, బలం (*organs af pronunciation*)- వర్ణోత్పత్తిక్రమము, సామ (*delivery*)-ఉచ్చారణరీతి. సంతానము (*euphonic laws*)-వర్ణముల కలయిక అందువలన గలుగు మార్పులు, వీనినిగూర్చి యీ శిక్షాధ్యాయము చెప్పుచున్నది. ఆధునిక భాషాశాస్త్రమం దివి యన్నియు ధ్వని శాస్త్రము (*phonetics*) అను శాఖలోఁ జేరుచున్నవి. ప్రాతిశాఖ్యల నాటికే విభక్తులు సప్తసంఖ్యాకములని నిరూపింపఁబడినది. యాస్కాచార్యుఁడు 'నామాఖ్యాతోపసర్గనిపాత' లను భాషాభాగములను బేర్కొనియున్నాడు. ఈతడు రచించిన నిరుక్తగ్రంథము మూలముగా నాకాలముననే భాషాతత్త్వపరిశీలన మీ దేశమున నెంత యభివృద్ధి గాంచినదో వ్యక్తమగుచున్నది. ఈతడు క్రీ. పూ. ౭౦౦ సం.ల నాటివాడు. అంతకుఁబూర్వమే యెన్నో మతములు భాషాతత్త్వపరిశీలకులలోనున్నట్లీతడు వారి ననువదించుటవలనఁ దెలియవచ్చుచున్నది. "నైఘంటువులు, నైరుక్తులు, వైయాకరణులు ఐతిహాసికులు, కాల్పనికులు, నైదానులు" మొదలగు వారి యభిప్రాయముల నీతఁ డనువదించినాడు. వేదములయందలి ప్రతి శాఖనుగూర్చి, అందలి వాక్యములు, పదములు, అక్షరములు, ధ్వనులు మొదలగువానిని వ్యాకరించి రచింపబడిన ప్రాతిశాఖ్యలే ఆ కాలమందు జరిగిన భాషాపరిశ్రమకు నిదర్శనములు. యాస్కాచార్యులు ధాతువులనుండి శబ్దముల వ్యుత్పత్తిని దెలుపుచు నందు గలుగు ధ్వనిపరిణామముల నాధునిక శబ్దశాస్త్రజ్ఞులరీతినే వ్యక్తపరచినాడు. 'గమ్' ధాతువు

నుండి 'జగ్ముః' అను రూపమేర్పడినప్పుడు పదమధ్యాజ్లోప మును గుర్తించినాడు. ఇది ఇప్పుడు *Syncope* అను పేరఁ బరగుచున్నది. వర్ణ వ్యత్యయము (*Metathesis*) మూలముగా నేర్పడిన శబ్దముల కుదాహరణముగా 'శ్చ్యుత్' ధాతువునుండి 'స్తోకా'; 'సృజ్' ధాతువునుండి 'రజ్జూః ; 'కృత్'—నుండి 'తర్కుః' (*a knife*) అనువాని నిచ్చినాఁడు. సర్వాభక్తి (*Anaptyxis*) కుదాహరణముగా 'వృ' ధాతువు (=*to cover*) నుండి ద్వారః, 'భ్రస్జ' ధాతువు (=*to fry*) నుండి-'భరూ జాః' ఏర్పడినవన్నాడు. 'తృచ' శబ్దములో త్రి+ఋచ (=*three stanzas*) సమానాక్షరములు సన్నిహితములైనపు డొక దానికి లోపము; దీనినే ఇప్పుడు *Haplology* అనుచున్నారు. ప్రాచ్యపాశ్చాత్య దేశము లన్నిటిలో యాస్కుఁడే మొదటి నిరుక్తకారుఁడు. ఈనిరుక్త రచనాసందర్భముననే యాతఁడు భాషాతత్త్వమునుగూర్చి తన ముఖ్యభావములను ప్రకటించి నాడు. భాషలోని పదము లన్నియుఁ గొన్ని మూలధాతువుల నుండి నిష్పన్నములై యుండును. పదముల వ్యుత్పత్త్యర్థమును దెలుపునపుడు శబ్దమునకు, మూలధాతువునకుఁ గల సంబంధము వ్యక్తముకావలెను. మార్పులు గలిగినచో నవి స్వర సూత్రానుగుణములై యుండవలెను. సంజ్ఞారూపకమగు భాష కంటె ధ్వనిరూపమగు భాషకుఁ బ్రయోజకత్వ మెక్కుడు. గ్రీకుతత్త్వవేత్తల కాలమునఁగూడ శబ్దములకు ధాతు ప్రత్యయములమూలముగా వ్యుత్పత్తి గల్పించుట తెలియదు.

భాష యనున దెట్లు పుట్టినది అను విషయమునఁగూడ యాస్కుని కాలమున విశేషచర్చ జరిగినట్లు తెలియుచున్నది.

శబ్దములన్నియుఁ గొన్ని మూలధాతువులనుండి పుట్టిన వను నైరుక్తుల వాదమునకుఁ జెందినవాఁడు యాస్కాచార్యుఁడు. గార్గ్యుడు మొదలగువారు దీని నొప్పుకోలేదు. భాషలో ధ్వన్యనుకరణశబ్దములకుఁ దావు లేదను వాదములోనివాడు ఔపమన్యవుడు. అనఁగా నీకాలమునందలి '*Onomatopoeia*' వాదమునకు ప్రతికక్షి అన్నమాట. ఇటీవల మాక్సుముల్లరు మొదలగువారు దీనినే '*Bow-vow theory*' అని పేర్కొని నారు. '*Bow-vow*' వాదమును యాస్కాచార్యుఁ డొప్పుకొనక పోయినను భాషలో 'దుందుభి, కితవ, కృకవాక' మొదలగు ధ్వన్యనుకరణశబ్దములు కొన్ని లేకపోలేదని చెప్పినాఁడు. ఇట్లే యాస్కుని కాలము దేశమున విశేషమగు భాషాసాహిత్య సంచలనము, శబ్దతత్త్వాన్వేషణపరత్వము కలిగిన కాలముగాఁ గనఁబడుచున్నది.

ఆయా పదముల కర్థము స్వాభావికమా, సాంకేతికమా యను విషయమునుగూర్చియు విచారణ జరిగినది. దీని నీకాలమున '*Semantics*' అని యందురు. నామవాచకపదములకు వాని గుణములనుబట్టియా, లేదా కర్మనుబట్టియా ఆ పేరువచ్చుట అనువిషయములు చర్చింపఁబడినవి. తక్షకుడు- అనఁగా వ్రడంగి-అనేకములగు పనులు చేయుచున్నను అతని కాపేరు వ్రడంగముపని చేయుటచేతనే వచ్చినది. అతఁడు చేయు పనులన్నిటినిబట్టి చెప్పవలసినచో నాతని కనేకమైన పేర్లు పెట్టవలసియుండును.

శబ్దార్థములకుఁ గల సంబంధము స్వాభావికమా, సాంకేతికమా యను విషయమును పతంజలి విమర్శించినాఁడు.

శబ్దార్థముల సంబంధము నిత్యమేమైనను, ఈశబ్దమునకీయర్థ మనునది లోకప్రయుక్తమే అని యాతఁడు తెలిపినాడు. ఇది తార్కికుల వాదమునకు భిన్నము. ఈశ్వరసంకేతమూలమున నే యీయర్థబోధ కలుగుచున్నదని వారు చెప్పుదురు. "అస్మాత్పదా దయమర్థో బోద్ధవ్య ఇతి ఈశ్వరసంకేతశ్శక్తిః -శక్తంపదం"-ఈశ్వరుఁడే యీశబ్దమునకీయర్థమని నిర్ణయించి పెట్టినాడని వారి మతము, గ్రీసు దేశమునఁగూడ నీ వాదము బయలుదేరినది. క్రేటిలస్ పదపదార్థసంబంధము స్వాభావికమేయని చెప్పగా, హెర్మోగెనిస్ అను నాతఁడు సాంకేతికమని, కాలభేదముచే మారవచ్చునని చెప్పినాడు. కాని సోక్రటీసు నామముల పేళ్లు స్వాభావికముగనే వచ్చినవైనను 'సంకేతము' కూడ కొంత లేకపోలేదను భావమును వ్యక్తము చేసినాఁడు.

ఇట్లు ప్రాచీనకాలమున నీ దేశమున భాషాతత్త్వపరిశీలనము, విచారము విశేషముగా జరిగియుండెను గాని, తరువాతికాలమున వ్యాకరణశాస్త్రాభ్యాసము సుశబ్దాపశబ్దపరిజ్ఞానమునకును, శబ్దప్రక్రియనుగూర్చిన వివాదములకు, పూర్వపక్ష సిద్ధాంతములకుఁ బ్రధానముగా మూలమగుచువచ్చినది. కాని భాషాశాస్త్రాభివృద్ధికిఁ దోడ్పడలేదు. పతంజలి చెప్పినట్లుగా వ్యాకరణశాస్త్రప్రయోజనము "రక్షోహాగమలఘ్వసందేహాః ప్రయోజనం-వేదానాం రక్షార్థమధ్యేయం వ్యాకరణం"-వేదములను వైదికకలాపమును రక్షించుటకే యను దృష్టి ప్రబలి, తత్కర్మకలాపమునందు, తద్విజ్ఞాన ప్రచారమునందునే పండితులు నిమగ్నులై యుండిరి. ఇది దేవతల

భాషయను భావము ప్రబలుటచే నితర దేశభాషలతోఁబోల్చి పరిశీలింపవలయు ననుదృష్టియు వారికిఁ గలుగలేదు. కావుననే ౧౯ వ శతాబ్ది నీ శాస్త్రము యూరోపు దేశమున వృద్ధినొంద వలసిన స్థితి యేర్పడినది.

యూరపుదేశమున ప్రాచీనకాలమున భాషాతత్త్వమునుగూర్చి విచారింపఁగడగినవారు గ్రీసుదేశీయులు. తరువాత రోమనులు వారిని కొంత యనుసరించిరి. గ్రీకుదేశీయులితరదేశీయులను '*Barbarians*'-అనాగరకులని తూలనాడుచుండు స్వభావము కలవారగుటచేత, వారి భాషల నభ్యసించెడువారు కారు. కావున స్వీయభాషాసహాయముననే భాషాతత్త్వపరిశీలకుఁ గడంగినవారగుటచేత వారి పరిశీలనము సక్రమమార్గమునఁ బడలేదు. తత్త్వపరిశీలనమునకుఁ దారతమ్య పరీక్ష యత్యావశ్యకము. ఆధునికశాస్త్రజ్ఞానాభివృద్ధి కంతకు నీ తారతమ్య పరిశీలనాదృష్టియే మూలాధారమని చెప్పవచ్చును. భాషావిషయమునఁగూడ నీ దృష్టి ప్రబలుట చేతనే యాధునిక భాషాశాస్త్ర మభివృద్ధి గాంచినది. ౧౯ వ శతాబ్దిలోఁగూడ రోమనుదేశములో కార్డినల్ ముజఫాంటీ అను నొక మతగురు వా దేశమును జూడవచ్చిన ప్రతి విదేశీయునితోడను అ విదేశీయుని భాషలోనే సంభాషించుచుండెడివాఁడఁట, అనఁగా నాతని కన్ని భాషలు వచ్చునన్నమాట. కాని తద్భాషాజ్ఞాన మాతనిని భాషాతత్త్వ పరిశీలనమున కేమాత్రము పురికొల్పలేదు. తారతమ్య పరిశీలనాదృష్టి లేకపోవుటచేతనే కావచ్చును. మన దేశమున రాజరాజ నరేంద్రుని యాస్థానమున "యః సంస్కృతకర్ణాట

ప్రాకృతపైశాచి కాంధ్రభాషాసు కవి రాజశేఖరు''డని బిరుదొందిన నారాయణభట్టుకలడు. అతనికిఁగాని, అతనిమిత్రుడు నన్నయకుగాని కర్ణాటాంధ్రములకుగాని, వీటికిని సంస్కృత ప్రాకృత పైశాచీలకుగాని గల సంబంధమునుగూర్చి విచారింపవలయునను తలంపు కలిగినట్లగపడదు. భాషల విషయమున తారతమ్య పరిశీలనదృష్టి ఆ కాలమునఁ గలుగలేదు.

ఆ కాలములో గ్రీకు, రోమన్ దేశములలో భాషయీశ్వరకల్పితమే యను భావ ముండెడిది. గ్రీకుభాష ప్రాచీనమైన దనుటచే తక్కినవన్నియు తజ్జన్యములేయని నమ్మెడివారు. క్రీస్తుమతము బయలుదేరిన తరువాత హీబ్రూ భాషయే మతభాష యగుటచేత నదియే దైవదత్తమగు భాష యని, దానినుండియే ప్రపంచ మందలి భాషలన్నియుఁ బుట్టిన వని చెప్పెడివారు. ఇతరభాషాపదములను యత్కించి ద్వర్ణసామ్యముచే హీబ్రూపదములనుండి పుట్టినట్లు నిరూపించెడువారు. ఇంతేగాక పదముల వ్యుత్పత్తిని గిట్టించుటకు హీబ్రూ భాష కుడివైపునుండి ఎడమవైపునకు వ్రాయఁబడుటనుబట్టి, యాశబ్దములలోని యక్షరములను తిరుగవేసి చదివి వ్యుత్పత్తులను, పోలికలను సూచించెడివారు. పదముల సామ్యమునుబట్టి వాని జన్యజనకభావమును నిరూపించుటెగాని వాని నిష్పత్తి క్రమమునుగూర్చిన పరిశీలనదృష్టి వారికి గలుగలేదు. ధాతువు, ప్రత్యయము మొదలగు విభాగమే వారికి తెలియదు. పదవ్యుత్పత్తులనుగూర్చి చమత్కార భావములు ప్రబలినవి. ఒక వస్తువు సహజ గుణమునుబట్టిగాక దాని విరుద్ధగుణమునుబట్టికూడ వ్యుత్పత్తులు కల్పించెడివారు.

Bellumoth అనఁగా యుద్ధము. ఇది అందమైన అనునర్థముగల *'bellus'* అనుదాని నుండి వచ్చినదట. ఏలయనఁగా, యుద్ధము అందమైనది కాదుగనుక. *Feodus*–అనఁగా శాంతి, సంధి అని అర్థము. ఇది వికారమైన అనునర్థముగల *'Fedus'* అనుదాని నుండి వచ్చినది. కారణము సంధి, శాంతి వికారమైనది కాదు గనుక. ఇట్టి వ్యుత్పత్తులను గల్పించినందుకే ప్లేటోకు 'నిరుక్తాచార్యుడు' అను బిరుదముకూడ వచ్చినదట! చర్చిలో లాటిన్ భాషకుఁ గల ప్రాముఖ్యమునుబట్టి యా భాషావాఙ్మయమున విశేష పరిశ్రమ జరిగినది. దాని వ్యాకరణము బాగుగా నభ్యసింపఁబడుచువచ్చినది. దానివలనను సుశబ్దాప శబ్దజ్ఞానమును సంపాదించి యా భాషలో సిసిరో మొదలగు మహావక్తలవలె తప్పులులేకుండ వ్రాయవలె ననుదృష్టియే ప్రబలముగ నుండెడిది. ౧౬ వ శతాబ్ది ప్రాంతమున ముద్రణ పద్ధతి కనుగొనఁబడినపిదప నితరభాషల నభ్యసించుటకు సౌకర్య మేర్పడినది. భిన్నభాషలలోని పదములు ప్రోవుజేయ బడినవి. కాని లాటిన్ మొదలగు యూరపు భాషాపదము లకుఁగూడ దేవభాషయని, స్వర్గమున (*paradise*) మాట్లాడఁ బడు భాష యని తలఁపబడినదగుటచే హీబ్రూ భాషా పద ములనుండియే నిష్పత్తిని గల్పింప యత్నించుచుండిరి. ౧౮ వ శతాబ్దమున భాషల సంబంధమునుగూర్చిన విచారణ బయలు దేరినది. భిన్న భాషలలోని సమానార్థక పదములు ప్రోగు చేయబడినవి. లీబ్నిజ్ (*Leibnitz*) అను తత్త్వవేత్త ప్రోత్సా హము మూలముగా, పీటర్ ది గ్రేట్, కాథరైను రాణియు వారి రాజ్యములోని సుమారు ౨౦౦ భాషలనుగూర్చిన విష

యములు సంగ్రహింపఁబడునట్లు చేసిరి. లీబ్నిజ్ హీబ్రూభాష తక్కిన భాషలకు మూలమను వాదమును ఖండించి, యూరపు ఆసియా దేశములలోని భాషలన్నియు నొక వర్గమునకుఁ జెందినవే యని సూచించినాఁడు. ఇండో యూరోపియన్ భాషా కుటుంబమును తొలుత నేర్పరచినవాఁడు 'అడెలంగ్' అనునాతఁడు. హెర్వాస్ (Hervas) అనునతఁడు పదములపట్టి కంటె భాషలసంబంధమును నిర్ణయించుటకు వ్యాకరణమునే ప్రధానముగా గ్రహింపవలయునని సూచించినాఁడు. ఏమైనను ఈ కాలమున యూరపు దేశములలో లాటిన్ భాషావ్యాకరణముల యభ్యాసమునకే ప్రాధాన్యము కలదు. మన దేశమున సంస్కృత భాషకుఁ గలిగిన స్థానము నేయది యా దేశమున నాక్రమించినది. ఇతర భాషాలక్షణమంతయు— విభక్తులు, క్రియరూపములు మొదలగునవి—లాటిన్ వ్యాకరణ సంప్రదాయములనుబట్టి యేర్పడవలసినదే. కోశములలో—ఫ్రెంచి, ఇటాలియన్ పరిషత్తులు ప్రకటించిన కోశములలో—ఉత్తములు, శిష్టులు ప్రయోగింపఁదగిన శబ్దములకే స్థానము. ఇట్టి పరిస్థితి భాషాతత్త్వపరిశీలనము విశేషముగా జరిగిన మన దేశముననే యిప్పటివరకు నట్లేయుండగా నా కాలమున యూరపులో నట్లుండుట కాశ్చర్యమేమి?

క్రీ. శ. ౧౯వ శతాబ్దితో భాషాశాస్త్రాభివృద్ధి విషయమున నొక నూతనయుగము ప్రారంభమైనది. ఇంత కాలమునుండి లాటిన్ భాషా వ్యాకరణముల యభ్యాసము వలనఁ గలుగని విశేష ప్రయోజనము నూతనముగా గలిగిన సంస్కృత భాషాజ్ఞానమువలనఁ గలిగినది. వ్యాకరణము

నభ్యసించుటేకాక భాషల నిర్మాణక్రమమును బరిశీలించుట, నూతనభాషలతోఁ బోల్చిచూచుట యందలి శ్రద్ధ, భాషల పరస్పర సంబంధబాంధవ్యముల నారయుట, వాని వర్గీకరణము, భాషారూపములను వ్యాకరించుటయేకాక, వాని ప్రాచీనచరిత్ర నన్వేషించి మూలరూపములను గనుగొనుట, భాషలలో కాల గతిని గలుగు మార్పులకుఁ గారణముల నారయుట—మొదలగునవి యీ యుగమునందలి భాషాపరిశీలనమునఁ బ్రధానవిషయములైనవి. చారిత్రకపద్ధతి యనునది చరిత్రకే కాక, భాషాపరిణామము విషయమునఁగూడ నన్వయింపఁబడఁజొచ్చినది. తక్కినవానిచరిత్రలవలెనే భాషాచరిత్ర మనున దొకటికూడ కలదని గుర్తింపఁబడినది. దీని కంతకు యూరపు దేశమునఁ బ్రబలిన సంస్కృత భాషాజ్ఞానమే ముఖ్యకారణ మనవచ్చును.

యూరోపు దేశీయులకు ఇండియానుగూర్చి అలెగ్జాండరు దండయాత్ర చేసినప్పటినుండియుఁ దెలియును. కాని వారితర దేశములవారిని బార్బేరియ న్లని, వీరు వారిని మ్లేచ్ఛు లని, తలచియుండుటచేత నొకరి భాషయం దొకరి కాదరము లేకపోయియుండును. కాని పిక నేమాది శబ్దములు కొన్ని వైదికభాషలోనే చేరకపోలేదు. 'పిక' శబ్దము గ్రీకు భాషలోని '*pecus*' అనుదానినుండి వచ్చినదే యైనను, దీనికి సంస్కృత ధాతువునుండి వ్యుత్పత్తి కల్పింపఁ జూచినారు సంస్కృత వైయాకరణులు— ''అపిహితం కాయతీతి పికః,' అని. ఇట్టి వ్యుత్పత్తి కల్పనమునే కుమారిభట్టు గట్టిగా వారించినాఁడు.

తరువాత నింగ్లీషువారు, ఫ్రెంచివారు నీదేశమునాక్రమించుటకై పోరు సాగించునంతవరకు నీదేశమును గూర్చి యూరపుదేశీయుల కేమియుఁ దెలియదు. లాటిన్,సంస్కృతములకుఁ గల సంబంధమునుగూర్చి ఫ్రెంచివారికి తొలుదొల్త యథార్థజ్ఞానము కలిగించినవాడు ఫ్రెంచిమిషనరీ 'కోర్డో' అనునాతఁడు. సంస్కృతభాష-దాని ప్రాచీనత, గ్రీకులాటిన్లతో దీనికిగలసన్నిహితసంబంధము, పదముల విషయముననే గాక వ్యాకరణవిషయమునను వీనికిఁగల సామ్యము ఈ మూడుభాషలు నేకమాతృకములే, అను నీ మొదలగు విషయముల నాంగ్లేయులకుఁ దెలిపినవాఁడు సర్ విలియంజోన్సు (౧౭౯౬). ఈతడే కాళిదాసుశాకుంతలాది గ్రంథముల నాంగ్లములోని కనువదించినాఁడు. సంస్కృతమునకు నితర యూరపియన్ భాషలకును గల సాజాత్యమును జూపుటయేగాక, యితర దేశభాషలనుగూడఁ బరిశీలించి ప్రాపంచికభాషలను సంస్కృతభాషావర్గమని, ఇతరభాషావర్గమని విభజించినవాఁడు 'ష్లెగెల్' అను జర్మను పండితుఁడు. ఏక్కడోదూరస్థమగు హిందూదేశములోని సంస్కృతభాషకును, యూరపులోని ప్రాచీన భాషలగు గ్రీకు లాటినులకును సన్నిహితసంబంధము కలదని తెలియుటతోడనే, యూరపుదేశములలోని విశ్వవిద్యాలయములు పెక్కింటిలోసంస్కృతభాషాపరిశీలన, పరిశోధనములకై ప్రత్యేకపండితస్థానము (*Professorships*) లేర్పాటు చేయఁబడినవి. భిన్నప్రదేశములం దొక్కసారిగా సంస్కృతభాషాపరిశీలనము ప్రారంభింపఁబడినది.

డెన్మార్కు దేశములో నీ పని బూనినవాఁడు రాస్కు పండితుఁడు. బాల్యమునుండియు వ్యాకరణతత్త్వవేత్త. ఐస్లెం

డిక్ భాష నితరభాషలతోఁ బోల్చి విమర్శించినవాఁడు. ఒక భాషనుబట్టి దానినివ్యవహరించినజాతియొక్క ప్రాచీనచరిత్ర నన్వేషింపవచ్చును. వారి మతము, సాంఘికమర్యాదలు మారినను వారు వ్యవహరించు భాషలోని పదములనుబట్టి వారి పూర్వచరిత్ర గ్రహింపనగును. పదము లొకభాష నుండి మరియొక భాషలోనికి సంక్రమింపవచ్చును గాని వ్యాకరణ సంప్రదాయము లట్లు రావు. కావున వ్యాకరణ పద్ధతియే భాషల సంబంధమును నిర్ణయించుటకుముఖ్యసాధనము. ఇదిగాక అత్యావశ్యకములగు వస్తువులను దెలుపు శబ్దములు, సర్వనామములు, సంఖ్యావాచకములు-ధాతువులు మొదలగువానిలో సామ్యము గలిగినచో నాభాష లొక్క కుటుంబమునకుఁ జెందినవే యని నిర్ణయింపవచ్చును. ఈశబ్దములనుబట్టి యాభాషలలోని ధ్వనులమార్పులను గనిపట్టిస్వర సూత్రములను గల్పించవచ్చును. ఈ పద్ధతి ననుసరించి యూరపుభాషల సంబంధములను నిర్ణయించి భిన్నశాఖలను విడదీసిచూపినవాఁడు రాస్కు పండితుఁడు. ఇండియాదేశమునకు వచ్చి హిందూదేశభాషలనుగూర్చియు, పరిషియన్—జెండుభాషా లక్షణములను గూర్చియు దెలిసికొనినాఁడు. ఈ దేశమునందలి 'మలబారిక్' భాషలు-అనగానిప్పుడు ద్రావిడ భాషలనఁబడుచున్నవి-సంస్కృతముకంటె భిన్నవర్గమునకుఁ జెందిన వని కనిపెట్టి ప్రకటించినవారిలో 'రాస్కు' పండితుఁడే ప్రథముఁడు.

తరువాత 'జేకబ్ గ్రిమ్' అను జర్మను పండితుఁడు జర్మానిక్ భాషలకు చారిత్రకవ్యాకరణమును రచించెను.

భాషాశాస్త్రములో చారిత్రకపద్ధతిని ప్రవేశపెట్టినవాఁడీతఁడే ఈతని చారిత్రకపద్ధతిలో తారతమ్యపరీక్షకూడ లేకపోలేదు. ఒక భాషయొక్క భిన్నావస్థలనుగాని, అతిసన్నిహితములగు భాషలలోని రూపములగాని సరిపోల్చి వాని సంబంధమును గనిపట్టుట మూలముగా వాని చరిత్ర నన్వేషింపవలయునని యాతని యభిప్రాయము. సన్నిహితభాషల తారతమ్య పరీక్షయే భాషాచరిత్రముగూడ నగుచున్నది. జర్మానిక్ భాషలలో నిట్టి తారతమ్య పరీక్షమూలముగా నొక ధ్వని పరివర్తన మీతడు కనిపెట్టెను. ఇతర ఇండోయూరపియన్ భాషలోని ప, త, క అను ధ్వనులు జర్మానిక్ భాషలలో (*f, th, h,*) ఫ, థ, హ-గా మార్పుచెందిన ట్లీతఁడు నిరూపించెను. సం-పితా. లాటిన్-పెటేర్ శబ్దములు గాథిక్ లో '*Father*' అని మారుటచేతనే తరువాతి ఇంగ్లీషులో '*Father*' అనే శబ్ద మేర్పడినది. ఈ ధ్వనిసూత్రములలోఁ గొన్ని లోపములు తరువాత కనఁబడినను, ధ్వనిసూత్రములను(*Phonetic laws*) కనుఁగొనుట యనునదే భాషాశాస్త్రాభివృద్ధి మార్గమున నొక క్రొత్త మెట్టుగా గ్రహింపఁబడినది.

భాషాశాస్త్రప్రవర్తకత్రయములో మూడవవాఁడుగా గ్రహింపఁబడిన 'ఫ్రాంజ్ బాప్' (*Frans Bopp*) అనునాతఁడుకూడ జర్మను దేశీయుఁడే. ఈతఁడు ఇండోయూరపియన్ భాషల కన్నిటికిని మొట్టమొదట సమగ్రవ్యాకరణము వ్రాసినవాఁడగుటచే నీతని గ్రంథముతోడనే భాషాశాస్త్రము పుట్టినదని జర్మన్ దేశీయులు తలంతురు. ధ్వనిసూత్రములవిషయముననంతగా నీతఁడు పరిశ్రమ చేయలేదుగాని, పదవాక్య

నిర్మాణపద్ధతిని నిరూపించుటలో నీతని కభిమాన మెక్కువ. సంస్కృతభాషాసామ్యముచే నీభాషలలోని విభక్త్యాది వ్యాకరణ రూపముల మూలరూపముల నన్వేషించి, గ్రీకు లాటిన్ మొదలగు భాషలు సంస్కృతమునుండి పుట్టినవి కావనియు, దీనితోపా టన్నియుఁగూడ వేరొక మూలభాషనుండి పుట్టినవనియు, సంస్కృత మితర సోదరభాషలకంటె మూలభాషాలక్షణముల నెక్కువగా నిలుపుకొనియున్నదనియు నాతని యభిప్రాయము. సంస్కృతభాషాలక్షణములలో గ్రీకు లాటిన్ భాషాలక్షణములను బట్టి సమన్వయించుకొనవలసినవి గూడ కొన్ని గలవు. ఈభాషలలోని విభక్తిప్రత్యయము లనఁబడినవి ప్రత్యేకార్థములు గల స్వతంత్ర శబ్దములనుండి యేర్పడిన వే యని బాప్ పండితుఁడు నిశ్చయించెను. భాషల నీతఁడు మూఁడు వర్గములుగాఁ జేసెను. (౧) ధాతుసంయోగము, వ్యాకరణము లేని చీనాభాష (౨) ఏకాక్షరధాతువులు, ధాతుసంయోగము, వ్యాకరణముకలవి-ఇండోయూరపియన్ భాషలు, (3) ద్వ్యక్షరధాతువులు—మూఁడేసి హల్లులతోఁ గూడిన ధాతువులు గలవి-సెమిటిక్ భాషలు.

జర్మానిక్ భాషలకు 'గ్రిమ్' ధ్వనిసూత్రముల నేర్పరచినట్లే, ఇండోయూరపియన్ భాషల కన్నిటికి నన్వయించు ధ్వనిసూత్రములను పాట్ (*Pott*) అను నాతఁడు ప్రతిపాదించినాఁడు. భాషల సాజాత్యసంబంధములను నిర్ణయించుటలో నీ సూత్రముల ప్రాముఖ్యము నీతఁడు నొక్కి చెప్పినాఁడు. కేవల ధ్వని సాదృశ్యమునుబట్టి సంబంధమును నిర్ణయింపఁ గూడదు. ఇంగ్లీషు '*bad*' శబ్దమునకు పరిషియన్ '*bad*' అనుదానికి

సారూప్యము గలదుగాని సాజాత్యము లేదు. (*cf. Eng. prop-Tel.* ప్రాపు, *mouth*-మూతి, *gauls*-గొల్లలు, *etc.*) అది ధ్వని సూత్రములనుబట్టినిరూపింపఁదగియుండును. ఇక నీతఁడుధాతు రూపముల పట్టికలను తయారుచేసి పదవ్యుత్పత్తులను దెలుపు ధాతుకోశమును రచించెను.

ష్లైచర్ (*Schleicher*) అనునాతఁడు సర్వసూత్రముల సహాయముచే ఇండోయూరపియన్ మూలభాషా స్వరూప మును కనిపెట్టవలయు నని యత్నించినవారిలోఁ బ్రథముఁడు. దానినిబట్టి భిన్న భాషలలోఁ గలిగిన మార్పులను, వాని పర స్పర సంబంధమును దెలిసికొనవచ్చునని, ఆమూభాషల చారి త్రక వ్యాకరణరచన కిది తోడ్పడునని యాతని భావము. అట్టి మూలభాషలో నొక కథను వ్రాసి యీతఁడు చూపెను. ఈ కుటుంబమందలి భాషలకుఁ గల సంబంధమును జూపుచు నొక వంశవృక్షమునుగూడ నాతఁడు సిద్ధముచేసియున్నాఁడు. ఈ మూలరూపము లనునవి యూహాకల్పితము లేయని తరువాతి వారీ వాదము నొప్పుకొనలేదు. మూలభాషలోని యచ్చులు, హల్లులు నల్పసంఖ్యాకములే యని, పదనిర్మాణ మొక్క-తీరుననే జరిగిన దని, సంస్కృతమునందలి వర్ణములే మూల భాషకు చేరువగా నుండునని యాతఁడు తలఁచెనుగాని, తరు వాతికాలపు పరిశోధన లీ విషయమును ప్రత్యాఖ్యానముచేసి నవి. సంస్కృతమునందలి అచ్చులకంటెను, హల్లులకంటెను హెచ్చువర్ణములే మూలభాషలోఁగలవని, అఇ, ఎఇ, ఒఇ, ఆఉ, ఏఉ, ఓఉ-అనుసంధ్యక్షరములు, హ్రస్వతర 'అ' కారము, అజ్ఞక్షణమే గలిగిన *l, m, n, r* అను హల్లులు, మూడురకము

లైన కంఠ్యములు మొదలగునవి ఇండోయూరపియన్ మూల భాషలో నుండెనని వెర్నర్, బ్రుగ్మన్ మొదలగు పండితుల తరువాతి పరిశోధనలవలన వ్యక్తమైనది.

ష్లైచర్ యొక్క భావముల ననుసరించి ఇండో యూరోపియన్ కుటుంబభాషలకు సంబంధించిన పదజాలమును పోగు చేసిపెట్టినవాఁడు 'అగస్టుఫిక్కు' అనువాతఁడు. ఈకోశమునందీ భాషలు ఇండో ఐరేనియన్ అని, యూరపియన్ అని రెండు వర్గములుగాఁ జేయబడినవి. మూలరూపములను కనిపెట్టుటలోఁ గొన్ని లోపము లున్నను ఇండో యూరపియన్ భాషలకన్నిటికిని సంబంధించిన సజాతీయపదముల కోశమును తయారుచేయుటలో నీఁతడుముందంజ వేసెనని చెప్పవచ్చును. ఇప్పటికి ఇండోయూరపియన్ శాఖాభాషల కన్నిటిని చక్కని వ్యాకరణములు బయలు దేరినవి. లాటిన్ నుండి బయలుదేరిన 7, 8 శాఖాభాషలకు (*Romance languages*) పరస్పర సంబంధము, క్రమపరిణామము నిరూపింపఁబడినది. ఈపరిశోధన ఫలితములను సులభముగ బోధపడునట్లు చేసినవాఁడు మాక్సుముల్లరు పండితుఁడు. ఆయన 'భాషాశాస్త్రోపన్యాసములు' సామాన్యునకుఁగూడ భాషాశాస్త్రమునం దభిరుచి కల్పించుటకుఁదోడ్పడినవి. ఎన్నియో ముద్రణ లందినవి. ఇక ధ్వనిపరిణామసూత్రముల ప్రాధాన్యమును గుర్తించి వాని సమన్వయమునఁ గలుగు చిక్కులకు సమాధానము నారయుట, శబ్దముల వ్యుత్పత్తి విషయమున నూహాగానమున కవకాశము తగ్గించి వాని పూర్వచరిత్ర నన్వేషించి నిర్ణయించుటలోఁ దగు శ్రద్ధవహించుట, ప్రాచీనభాషల పరిణామమునుగుర్తించు

విషయమున నాధునిక భాషాపరిశీలనావశ్యకతను గుర్తించుట మొదలగు విషయములందు పరిశ్రమ విశేషముగా సాగఁ జొచ్చినది. ఇట్లు బాప్, ష్లైచర్ లు ప్రారంభించిన పనిని సమర్థతతో బ్రుగ్‌మన్ కొనసాగించి యొక స్థిరరూపము నొందించినాఁ డని మాక్సుముల్లరు పండితుఁడు ౧౯ వ శతాబ్ద్యంతమున ప్రకటించిన భాషాశాస్త్రగ్రంథముయొక్క ఉపోద్ఘాతములోఁ జెప్పినాఁడు.

ఈ పనియంతయు—నీ భాషాశాస్త్రవిషయక జ్ఞానాభివృద్ధి యంతయు-నింతవరకు ఇండోయూరపియన్ భాషాపరిశీలనమునకు సంబంధించినదిగా నేర్పడినదగుట యేగాక విదేశములందు జరిగినదిగానే యున్నది. మన దేశమునందలి సంస్కృత భాషాజ్ఞానమే దీనికి మూలమైనది గనుక తదభివృద్ధి యంతయు మన దే యనుకొన్నను ఈయాధునిక భాషాశాస్త్ర పద్ధతు లీదేశమందలి యితరభాషల పరిశీలన కెంతవర కుపయోగించినవో,మన దేశీయు లెంతవర కీయభివృద్ధియందు పాల్గొనిరో యను విషయము ముఖ్యముగా గమనింపఁదగి యున్నది.

ఇటీవల జరిగిన భాషాశాస్త్రాభివృద్ధి

హిందూదేశమున నిటీవలి కాలమున ఇండోయూరపియన్ కుటుంబభాషలఁ గూర్చిగాని, ప్రత్యేకము సంస్కృతమును గూర్చిగాని భాషాతత్త్వదృష్టితోఁ బరిశీలించినవారు చాల తక్కువ. కాని ఈ దేశభాషలను గూర్చిన పరిశీలనము మాత్రము కొంత జరిగినది. ఆధునికములగు నుత్తర

హిందూస్థాన భాషలనుగూర్చి బీమ్స్ (*Beams*) అనునాతఁడొక "తులనాత్మకవ్యాకరణము" (*Comparative grammar of the Modern Aryan Languages of India*) అనుదానిని రచించినాఁడు. డాక్టరు హార్న్లె అనునాతఁడు గౌడభాషల కట్టి వ్యాకరణమునే రచించినాఁడు. ఇక బాప్ ఇండోయూరపియన్ భాషలవిషయమున పరిశ్రమచేసి వ్రాసిన రీతిగనే ఈ దేశమందలి ద్రావిడభాషాకుటుంబమునకుఁ జెందిన భాషలను గూర్చి "ద్రావిడభాషాతులనాత్మకవ్యాకరణము"ను వ్రాసినవాఁడు దక్షిణహిందూదేశమున మిషనరీగా నుండిన డాక్టర్ కాల్డ్వెల్ అను నాతఁడు. ఈ దక్షిణహిందూదేశమునందలి తమిళము, తెలుఁగు, కన్నడము, మళయాళము, తుళు మొదలగు భాష లుత్తర దేశమునందలి కురుక్, మాల్తో, కుయి, గాండ్, బ్రాహుయి మొదలగువానితోఁగూడి సంస్కృతాది ఇండోయూరపియన్ భాషలకంటె భిన్నము, ప్రత్యేకమునగు నొక కుటుంబమునకుఁ జెందినవని ఇంతకుఁబూర్వము రాస్కు పండితుఁడే తెలిపినాఁడు. కాని వాని నీతఁడు 'మలబారిక్' భాష లని చెప్పినాఁడు. మాక్సుముల్లర్ తన 'భాషాశాస్త్రము'న ప్రపంచమునందలి భాషావర్గములనుగూర్చి వ్రాయుచు వీనిని 'తములిక్' భాషలని పేర్కొనినాఁడు. ఈ భాషలకు సమగ్రవ్యాకరణమును రచించుచు వీనికి ద్రావిడభాషలని పేరుపెట్టినవాఁడు కాల్డ్వెల్ పండితుఁడే. ఈతఁ డీ గ్రంథమును తొలుత క్రీ. శ. ౧౮౫౬ లోనే ప్రకటించినాఁడు. కాని యిది యీ దేశీయపండితులనుగాని, విద్యాధికులనుగాని విశేషముగా నాకర్షించినట్లగపడదు.

మొట్టమొదట నీదక్షిణదేశమున నిండోయూరపియన్ భాషలనుగూర్చిన బాప్ పండితుని వ్యాకరణముచేతను, కాల్డ్వెల్ పండితుని దక్షిణదేశ భాషావ్యాకరణముచేతను యాకర్షింపఁబడి, వానియందు వారివలెనే విశేషపరిశ్రమ చేసి యొక నూతనమార్గమును ద్రొక్కవలయునని ప్రయత్నించిన వారిలో మొదటివాఁడు శేషగిరిశాస్త్రిగారే. ఆయన చిన్న ప్పుడే మహారాష్ట్రము, అరవము, తెలుఁగు, కన్నడము మొదలగుభాషల నభ్యసించినవాఁడగుటచే, మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో నాంగ్లవిద్య నభ్యసించి పట్టభద్రుడగునప్పటికే ఆయనకు భాషాతత్త్వజిజ్ఞాసయం దాదరము ప్రబలినది. పిదప మళయాళము, హిందుస్థాని, బెంగాలి, ఓఢ్రభాషల నభ్యసించి, అప్పటి కాలేజి ప్రిన్సిపాలగు 'థాంప్సన్' దొరగారి ప్రోత్సాహమున లాటిన్ గ్రీకుభాషల జ్ఞానమునుగూఁడ సంపాదించి భాషాతత్త్వపరిశీలనకార్యమున నిమగ్నుఁడయ్యెను. ౧౮౮౪ సం. మందే '*Notes on Aryan and Dravidian Philology* అనే గ్రంథమును బ్రకటించియున్నాఁడు. అప్పటికీయన ప్రెసిడెన్సీ కాలేజీలో దేశభాషాశాఖకు పర్యవేక్షకుఁడుగ నుండిరి ద్రావిడభాషలు తురేనియన్ కుటుంబమునకుఁ జెందినవని తలఁచిన యప్పటి ద్రావిడభాషాపండితుల యభిప్రాయమునకు భిన్నముగా, నీ భాష లార్యభాషా కుటుంబమునకు జెందినవేయని తా నభిప్రాయపడినట్లువ్యక్తముచేసి. యందలి శబ్దముల కార్యభాషాశబ్దములతోడను, వ్యాకరణపద్ధతుల కార్యభాషావ్యాకరణరీతులతోడను సంబంధము కల్పించి వీనినుండి నిష్పన్నమైనవనియే చూపుటకు యత్నించినారు

ఇందు కుపబలకముగాఁ దాను రచించుచున్న కోశములు, తులనాత్మక వ్యాకరణము లేతన భావములను స్థిరీకరింపఁగల వని యాశించినారు. కాని యివి ప్రకటితములైనట్లగపడదు. ఆంధ్రశబ్దతత్త్వమునకు సంబంధించిన 'క్రియారూపములు,' అర్థానుస్వారతత్త్వము, తమిళశబ్దతత్త్వము అను గ్రంథములు మాత్రమే ప్రకటితములై యున్నవి. ద్రావిడ భాషలగు తమిళాంధ్ర కన్నడ మళయాళములకుఁగల పరస్పరసంబంధమును, సాజాత్యమును గుర్తించి, యా భాషారూపములను బరస్పరము పోల్చి పరిశీలించుటచేఁగలుగు విశేషలాభమును గుణములను ఆయన బాగుగా గమనించి వ్యక్తముచేసినవాఁడే యయ్యెను. కాని వీని నార్యభాషలతోడను, సంస్కృతముతోడను ముడిపెట్టి చూపనిష్పత్తిని కల్పించుటలో స్వరసూత్రకల్పనము చేయక తన కిచ్చవచ్చిన స్వాతంత్రపథమును ద్రొక్కయత్నించినవాఁ డగుటచే, నీతనిమార్గము తరువాతి వారి కంత యాదరపాత్ర మగుటగాని, అదియొక శాస్త్రీయ పద్ధతిగా నాదరింపఁబడుటగాని తటస్థింపలేదు. భిన్నదేశీయములైన యనేక భాషలనుగూర్చి చక్కనిజ్ఞానము సంపాదించుటే గాక అంతకుఁబూర్వమునుండి వానిలో విశేషపరిశ్రమ చేసిన పాశ్చాత్యభాషావేత్తలవ్రాతలను పద్ధతులనుగూడ బాగుగ దెలిసికొనినవాఁడే యైనను, స్వానుభవమునుబట్టి వారు చూపినదానికంటె భిన్నమైన పద్ధతిని ఈభాషలకుఁ గల సంబంధమును, శబ్దనిష్పత్తిని, అర్థపరిణామమును, వ్యాకరణ విశేషములను సాధింపవలెనని యత్నించినవాఁడగుటచే, నీయన ప్రయత్నమంతయు నిష్ఫలమైనది.

వీరి తరువాత వీరిమార్గము ననుసరింప యత్నించి, తెలుఁగు ఆర్యద్రావిడభాషలలో నతిప్రాచీనమైన దనితలఁచి, ట్యూటానిక్ భాషావర్గమునకుఁ జెందిన ఆంగ్లోసాక్సన్ మొదలగు భాషలలోని పదములకును, తెలుఁగు పదములకునుగల సామ్యమును జూపుచు నట్టి సామ్యముః గల పదముల పట్టికలను తయారుచేసి ప్రకటించినవారు శ్రీ ఓకుమళ్ళ రాజగోపాలరావుగారు. వీరు మద్రాసు క్రిస్టియను కాలేజీలో నాంధ్రోపన్యాసకులుగ నుండి '*South Indian Research*' అను మాసపత్రికకు సంపాదకులుగ నుండి యనేక భాషావిషయకవ్యాసములను ప్రకటించుచుండెడివారు. శ్రీ శేషగిరిశాస్త్రిలవారి వలెనే వీరును ఆంధ్రముయొక్కయు, ద్రావిడభాషల యొక్కయు ప్రాచీనతనుగూర్చియు, వాని కార్యభాషలతోఁ గల సజాతీయతను గూర్చి నిశ్చయభావము కలవారై, దానిని ప్రతిపాదించుట కనేకవిధముల యత్నము సలిపిరి. కాని వీరి ప్రయత్నములును విశేషముగా ఫలించిన ట్లగపడదు.

పై యిద్దరివలె ద్రావిడభాష లనునవి యార్యభాషాజన్యములే యను వాదమును పురస్కరించుకొని శాస్త్రీయ పద్ధతి నాభాషారూపముల నివ్పత్తిక్రమమును నిరూపింప నిటీవల యత్నించినవారిలో శ్రీ డాక్టరు చిలుకూరి నారాయణరావుగారు ప్రధానులు. వీరు పై వారివలె ద్రావిడభాషల ప్రాచీనత నొప్పుకొనరు. ఉత్తరహిందూస్థానము నందలి యాధుని కార్యభాషలవలెనే యివియు ప్రాకృతాపభ్రంశములనుండి క్రీ. శ. ౮, ౧౦ శతాబ్దముల ప్రాంతముననే బయలుదేరినవని వీరు వాదింతురు.

బీమ్సు, హార్న్లె పండితు లుత్తరహిందూస్థాన భాషలను గూర్చియు, కాల్డ్వెల్ పండితుఁడు దక్షిణదేశమందలి ద్రావిడభాషలనుగూర్చియు తారతమ్యపరిశీలనతోఁగూడిన తమ వ్యాకరణగ్రంథములను ప్రకటించిన తరువాత నీ దేశములోఁగూడ దేశభాషాతత్త్వపరిశీలనము విషయమై కొంత సంచలనము కలిగినది. ప్రత్యేకభాషలనుగూర్చిన పరిశీలనము, వాని కితర భాషలతోఁ గల సంబంధము, వాని ప్రాచీనత, చరిత్ర మొదలగువానిని గూర్చిన పరిశోధనము ప్రారంభింపఁబడినది. మరాటీభాషకు బ్లాక్ పండితునిచేతను బంగాళీభాషకు సునీతికుమార ఛటర్జీ పండితునిచేతను ఆధునిక భాషాశాస్త్ర పద్ధతుల ననుసరించి చారిత్రక వ్యాకరణములు రచింపఁబడినవి. దక్షిణదేశమున తమిళభాషావిషయమున 'పోప్' పండితుఁడును, కన్నడ భాషావిషయమున కిట్టెల్, రైసు పండితులును, మళయాళమున గండర్ట్ పండితుఁడును, తెలుఁగున బ్రౌన్ దొరగారును విశేషపరిశ్రమ చేసి, ఆయా భాషలకు వ్యాకరణములు, కోశములు, విమర్శగ్రంథములు రచించి ఆయా దేశముల భాషాసాహిత్యముల కొక నూతనోత్తేజమును గలిగించిరి. సంస్కృతభాషాజ్ఞానము కలిగినపిదప యూరపు దేశమున కొనసాగింపబడిన ఇండో యూరపియన్ భాషాతత్త్వ పరిశీలనము మూలముగా బయలుదేరి నిర్ణయింపఁబడిన భాషాశాస్త్ర పద్ధతుల ననుసరించి దేశీయభాషల పుట్టుపూర్వోత్తరములను, వాని సహజలక్షణములను, తత్త్వమునుగూర్చి పరిశీలించుటయే యిటీవల మన దేశమునఁ గలిగిన భాషాశాస్త్రాభివృద్ధి మార్గమని మనము గమనింపవలసియున్నది.

ఈసందర్భమున హిందూదేశ మంతటికిని సంబంధించినదిగా బయలుదేరిన భాషావిషయకమగు మహోద్యమ మొకటి కలదు. అది గ్రియర్సన్ (*Sir George Grierson*) పండితుని యాధ్వర్యమున కొనసాగింపఁబడిన (*Linguistic Survey of India*) హిందూదేశ భాషాసమీక్షణ మనునది. ఇది కాశ్మీరము మొదలుకొని కన్యాకుమారివరకుఁ గల మన దేశమునందు వ్యవహారములో నున్న భాషల స్వరూపలక్షణములు, సంబంధ బాంధవ్యములు, ప్రాచీనత, చరిత్ర, వర్గీకరణము మొదలగువానినిగూర్చి విపులముగాఁ జర్చించి వ్రాయబడిన ౧౯ పెద్ద సంపుటముల యుద్గ్రంథము. ఇందు హింద్వార్యభాషలు, దార్దికు-లేక పిశాచభాషలు, ముండాభాషలు, ద్రావిడభాషలు-ఈ మొదలగు భిన్నవర్గములకుఁ జెందినవై హిందూదేశమున చిరకాలమునుండి వ్యవహరింపఁబడుచున్న భాషలను గూర్చి సమవిమర్శముగ సోదాహరణముగఁ జర్చింపఁబడినది.

ద్రావిడ భాషావర్గమునకు హిందూదేశము నందలి సంస్కృతాద్యార్యభాషా కుటుంబముతోకంటె పూర్వాసియా భాగమునందలి సిథియన్-లేదా తురేనియన్ భాషా కుటుంబముతోనే సన్నిహితసంబంధము కల దని నిరూపింప యత్నించిన కాల్డ్వెల్ పండితుని వాదమును ఖండించి, సిథియన్ లేదా తురేనియన్ కుటుంబమనునదే యొక ప్రత్యేక భాషాకుటుంబముగాఁ జెప్పుటకు వీలులేదనియు, నందుఁజేర్పబడిన భిన్నవర్గముల భాషలకు సజాతీయసంబంధమే కానరాదనియు, నట్టి సందర్భములో నీ ద్రావిడభాషల నా కుటుంబ

మునఁ జేర్చుట యేమాత్రము యుక్తముకాదు గావున, నీ ద్రావిడభాషల నొక ప్రత్యేకకుటుంబముగా గ్రహించుటయే న్యాయ మను నభిప్రాయమును గ్రియర్సన్ పర్యవేక్షణమున ద్రావిడభాషలను గూర్చిన ర వ సంపుటమును సిద్ధముచేసిన 'స్టెన్ కోనో' పండితుఁడు వ్యక్తముచేసినాఁడు. అప్పటినుండియు నీ ద్రావిడభాషలకు సంస్కృత ప్రాకృతములతోఁ గూడ సంసర్గజమగు సంబంధ మేగాని సాజాత్యసంబంధము లేదని, యవి యీ దేశములలో బహుశః ఆర్యజను లీ దేశమునకు వచ్చుటకుఁబూర్వమునుండియు నెలకొనియున్న దేశీయ భాష లే గాని, యిటీవలి ప్రాకృతాపభ్రంశములనుండి విజాతీయ భాషాసంసర్గముచే నేర్పడియుండునని తలంపఁబడుచుండిన ఉత్తర హిందూస్థానభాషలవంటివి కావనియుఁ బలువురు భాషాతత్త్వపరిశీలకులు తలఁచుచున్నారు. తమిళభాషలో విశేషపరిశ్రమ చేసిన 'పోప్' పండితుఁ డీ భాషలకు సంస్కృతముతోనే సన్నిహితసంబంధ మున్నదని తలచినను, కాల్డ్వెల్లే యాతని వాదమును ప్రత్యాఖ్యానము చేసి, సిథియన్ భాషా సంబంధమును జూప యత్నించినాఁడు. తరువాత సిథియను సంబంధవాదముకూడ ప్రత్యాఖ్యాతమైనది. కన్నడభాషలో విశేషపరిశ్రమ చేసిన కిట్టెల్ పండితుఁడు, మలయాళకోశము రచించిన గండర్టుకూడ తద్భవరూపములనువ్యక్తముచేయుచు దేశీయశబ్దజాలమును ప్రత్యేకముగా నెత్తిచూపుటయే కాక, భిన్నభాషలలోఁ గల సజాతీయరూపములతో వానిని బోల్చి మూలధాతుస్వరూపమును గుర్తించు మార్గముల నన్వేషించి వ్యక్తపరచియున్నారు. వారి మార్గము ననుసరించి యీ

కన్నడ మలయాళ భాషాతత్త్వపరిశీలనకుఁ గడగి, కన్నడ మలయాళ భాషాచరిత్ర నన్వేషింప యత్నించిన దేశీయపండిత ప్రముఖులగు ఆర్. నరసింహాచార్యులు, యస్. నరసింహయ్యగారలు, ఉళ్లూర్ పరమేశ్వరయ్యర్, ఎల్. వి. రామస్వామయ్యరు మొదలగువారుకూడ నా భాషలు సంస్కృతభాషా సాహాయ్యము నెంత పొందినను, తజ్జన్యములుమాత్రము కావనియు, తెలుఁగుతమిళాదులతో సజాతీయములైన స్వతంత్ర భాషలే యనియుఁ దలఁచినారు. పోప్ తరువాతి తమిళభాషా పరిశోధకులుగూడ నీ భావమునే యనువదించుచున్నారు. ఇటీవల నుత్తరహిందూస్థానభాషలలో నొకటియగు బంగాళీ భాషయొక్క ఉత్పత్తివికాసములగూర్చి యగాధమగు పరిశ్రమను సలిపి, రెండు సంపుటముల యుద్గ్రంథమును రచించిన సునీతికుమారఛటర్జీ పండితుఁడుకూడ వంగదేశమున కార్యభాషాసంసర్గము కలుగుటకుఁ బూర్వ మనార్యజనులు, అనార్యభాషయు నా దేశమున నెలకొనియున్నట్లు నిదర్శనములగపడుచున్న వనియు, నార్యభాషలగు ప్రాకృతాపభ్రంశములలోను, అంతకంటె నెక్కుడుగ తరువాతి హిందూస్థాన భాషలలోను గానవచ్చెడు అనార్యభాషాసంప్రదాయములను నవి యీ ద్రావిడ భాషాలక్షణములతో దగ్గరపోలిక గలవై యుండుటచేత నా దేశ మొకప్పుడు ద్రావిడజనాకీర్ణమైయుండి యుండుననియు, తద్భాషాసంప్రదాయములే యార్యభాషను ప్రాకృతములుగను, తరువాతి వ్యావహారిక భాషలుగను మార్చియుండు ననియు, కావుననే ద్రావిడభాషా సంప్రదాయము లనేకము లీభాషలలోఁ గానవచ్చుచున్న వనియుఁ

దెలిపి, యార్యభాషలలోని ద్రావిడ లక్షణముల పట్టీ నొక దాని నిచ్చియున్నాఁడు. దీనినిబట్టి ద్రావిడభాష లొకప్పుడీ దేశమునం దంతటను వ్యాప్తిఁజెందియుండిన వని, అవికొన్ని సహజలక్షణములతోఁ గూడిన స్వతంత్రభాష లని యాతని యభిప్రాయమైన ట్లా గ్రంథమువలనఁ దెలియుచున్నది.

ఆంధ్రదేశమున మాత్రము పెక్కుఁరు పండితులలో నీయాంధ్రభాషను గూర్చియు, దీనితోపాటు తక్కిన దక్షిణ దేశభాషలనుగూర్చియుభిన్నాభిప్రాయముప్రబలినది. "జనని సమస్తభాషలకు సంస్కృతభాష ధరాతలంబునన్" అను సంస్కృత భాషాభిమానులగు వైయాకరణుల భావమే నిలిచి తెలుఁగు సంస్కృత ప్రాకృతభవమే యను వాదము ప్రబలి నది. లాక్షణికులలో మొదటివాఁడగు కేతన-

"తల్లి సంస్కృతంబె యెల్లభాషలకును
దానివలన గొంతఁ గానఁబడియె
గొంత తానగలిగె నంతయు నేకమై
తెనుఁగు బాసనాగ వినుతి కెక్కె"

నని తెనుఁగు సహజముగ గొంత యున్నదనియే చెప్పినాఁడు. కాని తరువాతి పరిశోధకు లీ భాషయంతయు ప్రాకృతభవమే యనియు, తక్కిన యాధునికార్య భాషలవలెప్రత్యేకముగఁ దెనుఁగు, దక్షిణదేశభాషలును పైశాచీ ప్రాకృత పరిణామరూపములే యనియు, నివియు పై యార్యభాషల వలెనే క్రీ. శ. ౧౦ వ శతాబ్దినో, లేదా ౭, ౮ శతాబ్ది ప్రాంతముననో స్వతంత్రభాషలుగ మారినవిగాని యంతకుఁ బూర్వము వీని స్వరూపమే కానరాదనియుఁ జెప్పి, తెనుఁగు

నందలి దేశ్యాదిశబ్దములనే కాక, యందలి ధాతువులను, వ్యాకరణరూపములనుగూడ సంస్కృత ప్రాకృతరూపముల నుండి నిష్పన్నములైనట్లు నిరూపించుటకు విశేషప్రయత్నము చేసినారు. ఇట్టివారిలో సిద్ధహస్తులు డాక్టరు చిలుకూరి నారాయణరావుగారు. వీరి *'Dravidian Philology'* అను గ్రంథ మాంగ్లమునఁ బ్రకటింపఁబడినది. ఆంధ్రభాషాచరిత్ర మను రెండు సంపుటముల గ్రంథ మాంధ్రవిశ్వవిద్యాలయము వారు ప్రకటించినారు. ఈ యాంధ్రభాషాచరిత్రరచనలోనే ద్రావిడభాష లార్యభాషాజన్యము లను వాదమును వీరు బల పరచినారు.

ప్రాకృతవైయాకరణులలోఁ గొందరు దాక్షిణాత్య, ద్రావిడి, కాంచీదేశీయ మొదలగునవి దక్షిణదేశభాగము నందువ్యాపించిన పైశాచీప్రాకృతరూపములని చెప్పియుండుట చేత, దానిని పురస్కరించుకొని వీరీ దక్షిణదేశభాషలన్నియు పైశాచీపాకృతభవములని తలంచినట్లగపడును. పైశాచీ ప్రాకృతము లనువాని స్వరూపలక్షణములనుగూర్చి విశేష ముగాఁ దెలియనే తెలియదు. ద్రావిడభాషాలక్షణములతో బోల్పఁదగియున్న స్వల్పవిశేషములనుమాత్రమే లాక్షణికులు వాని ప్రత్యేకలక్షణములుగా నుదహరించియున్నారు. గుణా ఢ్యుని రచన పైశాచిలో నుండిన దన్నమాటయేగాని అది యెట్టిదో లోకమునకుఁ దెలియదు. ప్రాకృత భాషాలక్షణము లనేకములను విచారించిచూచినచో నవి విజాతీయ భాషా సంప్రదాయములవారు సంస్కృతభాషను నేర్చుకొను సందర్భ మున నా శబ్దములను స్వీయ సంప్రదాయానుగుణముగాఁ

బలుకుచుండుటవలనఁ గలిగిన మార్పుల మూలముగా నేర్ప డిన వికారములే యని వ్యక్తము కాకపోదు. కావున నార్య భాషలు ప్రాకృతములుగా మారుటకు ముఖ్యకారణము వానిపైఁ గలిగిన విజాతీయ భాషాసంప్రదాయ ప్రాభవమే (*influence*) అనక తప్పదు. ఆర్యు లీ దేశమునకు వచ్చునప్పటి కీ దేశము నిర్జనారణ్యము కాదు. ద్రావిడభాషలు మాట్లాడిన వారు, కోలులు మొదలగువారు, నీయార్యులచే దస్యులని, వ్రాత్యులని, మ్లేచ్ఛులని పిలువఁబడినవా రెవరెవరో కలరు గదా! వారిని వీరణగద్రొక్కి సంఘములోఁ జేర్చికొనినను, చేర్చుకొనకపోయినను వీరి భాషను వారు నేర్చుకొనునప్పు డైనను, వారి యుచ్చారణ సంప్రదాయముల ననుసరించి యార్యభాష మారిపోక తప్పదు. క్రొత్తభాష లేర్పడక మానవు. "ఈ పిశాచజాతులవారు అంతకు బూర్వ మిచట నుండిన జాతులతో సఖ్యము నెఱపి వారిని తమలోఁ గలుపు కొనుచుండిన కాలముననే" (ఆతరువాతనే) ఆర్యు లిందు బ్రవేశింపఁజొచ్చిరి. (సం. I-౫౫ పేజీ) అని పిశాచజాతుల వారు, అంతకుఁ బూర్వముండిన జనులు వారి భాషలతో నీ దేశములో నార్యులు ప్రవేశించుటకుఁ బూర్వమే యున్నా రని శ్రీ నారాయణరావుగారే చెప్పుచున్నారు. వేదముల కాలమునుండియు నీ యాదిమజను లార్యభాషను నేర్చుకొని భాషించుసందర్భమున నాభాష వీరి యుచ్చారణసంప్రదాయ ముల ప్రభావముచే, దేశభేదమునుబట్టి భిన్నవిధములగు ప్రాకృతములుగా మారిన దనుటకు సంశయ మేమి? ఈ ఆదిములగు ననార్యజనులలో ద్రావిడ భాషలను మాట్లాడిన

జనులుకూడ నుండవచ్చు నని యొప్పుకొన్నప్పుడును, ప్రాకృత భాషలలోఁ గానవచ్చెడి యనార్యభాషాసంప్రదాయము లనఁ బడునవి ద్రావిడభాషాప్రసిద్ధములుగనే కనఁబడుచున్నప్పుడును, ఆ ప్రాకృతములయొక్కయు, తరువాతి యార్యభాషలయొక్కయు ప్రాదుర్భావమునకు ద్రావిడభాషాసంప్రదాయ ప్రాభవమే కారణమని చెప్పుటకు వెనుదీయవలసిన పనియేమి? సునీతికుమార ఛటర్జీ పండితుఁడు తానురచించిన బంగాళీభాషా చరిత్రలో నాధునికార్యభాషలపై ద్రావిడభాషాసంప్రదాయ ప్రాబల్యమును నిరూపింపగల పట్టులను ప్రత్యేకించిచూపియే యున్నాఁడు. వాని నన్నిటిని ఆంధ్రభాషాచరిత్రకారు లనువదించి తమ గ్రంథములో(*I*-౬౭ పేజీ) తెలుపుచు "ద్రావిడ భాషలు ప్రాకృతములు కావనుకొనుటచే, నార్యభాషలు వేరనియు, ద్రావిడభాషల ప్రోద్బలమువలన నార్యభాషలు ప్రాకృతములుగాను, నేటి యార్యభాషలుగాను బరిణమించినవనియు చెప్పుట సంభవించినది" అని ఛటర్జీ పండితునెత్తిపొడిచినారు. వీరి గ్రంథము తెలుఁగులో రచింపఁబడుటచే ఛటర్జీగారికి తెలియలేదుగాని-ఇది తెలిసి యున్నట్లయితే- "అయ్యా, నేనుద్రావిడభాషలు ప్రాకృతములు కావనుకొన్న మాటనిజమే. కావుననే వాని ప్రభావమువలన నివి బయలుదేరినవని చెప్పినాను. మీరును ద్రావిడ భాషలు ప్రాకృత జన్యములని, యేవిధముగానైన చూపవలెనని యనుకొనుట చేత నేగదా వానికి సూటిగ సమాధానము చెప్ప కుదరక, ఈ పరిణామము సహజముగనే కలిగియుండవచ్చునని, లేదా ఇతరభాషల ప్రోద్బలము చేతనైనను గలిగియుండ వచ్చు

ననియు, ఇంక నేమేమో చెప్పి ద్రావిడభాషలు ఆధుని కార్యభాషలవలెనే క్రీ. శ. ౧౦ వ శతాబ్ది కిటీవలనే యేర్పడిన వని చెప్పవలసిన స్థితి యేర్పడినది'' అని వారు బదులు చెప్పి యుండేవారేగదా. ప్రాకృతములలోఁగనఁబడు ద్రావిడభాషా సంప్రదాయము లనఁబడునవి ఇతర భాషా ప్రోద్బలము వలనఁ గలిగినచో వానిని ద్రావిడసంప్రదాయములనవలసిన పనియేమి? ఇవి యే యితర భాషలలోఁ గనబడుచున్నవి? ఈ ప్రశ్న రాకుండ చేయుటకే ప్రాచీనప్రాకృతములకాలమున ద్రావిడభాషలు నేటిరూపమున నున్నవని చూపించవలెనని వారడుగుచున్నారు. ప్రాచీనప్రాకృతముల కాలమున ద్రావిడ భాషలుమాత్రము ప్రాచీనరూపముననే యుండును గాని నేటి రూపమున నెట్లుండగలవు? అనార్యసంప్రదాయము లనఁబడు నవి మాత్ర మాకాలపు ద్రావిడ భాషలలోఁ గూడ నిప్పుడు వలెనే యుండకపోవు. అప్పుడు లేనివి యాభాషలలో నిప్పుడు కారణము లేకయే రావుగదా. ఆ కాలములోను వీనిలో నున్న యనార్యసంప్రదాయములే, వేదభాషలోగాని, సంస్కృత ములోఁ గాని కనఁబడక సామాన్యజనులు వ్యవహరించునార్య ప్రాకృతములలో మాత్రమే కనఁబడుటచేత, అనార్యజనసం పర్కము గలిగిన భాషలలో నవి సంక్రమించియుండు నని తలఁచుటకవకాశము కలిగినది. అసలు ప్రాచీనప్రాకృతముల రూపమే యెట్టిదో నిర్ణయింప సుసాధ్యము కానప్పుడు ఆ కాలపు ద్రావిడభాష లిట్లుండెనని చూపవలసిన పని యేమి? చూపుటకు నిదర్శనము లెట్లు వచ్చును? వాస్తవముగా పైశాచీ ప్రాకృత భాషాస్వరూపమే యెట్లుండెనో ఎవరికి

తెలుసును ? ఏవో నాలుగైదు వాక్యములనుబట్టి తరువాతి వైయాకరణులు చెప్పిన లక్షణపు ముక్కలుతప్ప. ద్రావిడీ, దాక్షిణాత్య, కాంచీదేశీయ మొదలగువానిని పేర్కొనిన వారు కేవలముఅర్వాచీనప్రాకృతభాషావైయాకరణులుగాని ప్రాచీను లెవ్వరును గారు. వీరి కాలమునకు 'జనని సమస్త భాషలకు సంస్కృత'మను భావము స్థిరపడినది. ప్రాకృత వైయాకరణులు ద్రావిడము పైశాచీ పాకృతవికారమన్నారు గనుక, దానినిబట్టి వీరును ద్రావిడభాషలన్నియు పైశాచీ పరిణామరూపములే యని నిరూపింప యత్నించినట్లున్నారు.

ఆధునికార్యభాషలన్నియు ౧౧ వ శతాబ్ది కిటీవల బయలుదేరినవే. వీనిలో ప్రాకృతములలోకంటె ద్రావిడ సంప్రదాయచిహ్నములు విశేషముగాఁ గనఁబడుచున్నవి. ద్రావిడభాషలలోవలెనే వీనిలోను నీ యనార్యసంప్రదాయములు బయలుదేరినవని గదా వీరివాదము. కావుననే ద్రావిడ భాషలపుట్టుకనుగూడ ౧౦ వ శతాబ్దికే తీసికొని రావలసి వచ్చినది. ఇవి యంతకుఁబూర్వ ముండెనని చెప్పుటకుఁదగిన నిదర్శనములు లేవని వీరిభావము. అయినను "తమిళములో ౫ లేక ౬ వ శతాబ్దినుండి గ్రంథములు కాన్పించుచున్నవి. తమిళము తరువాత లిఖితమైనది కన్నడము, ౭వ శతాబ్దము. తరువాత లిఖితమైనది తెనుగు ౯వ శతాబ్దము" అని వారే చెప్పియున్నారు. క్రీ. శ. ౫ వ శతాబ్దమువరకు భారతదేశమున ప్రాకృతభాషలు ప్రచారమం దుండినవి. నాటినుండి ౬, ౭ శతాబ్దములవరకు దక్షిణదేశమున ప్రచారమందుండిన భాషల స్వరూప మెట్లుండెనో తెలిసికొనుట కాధారమే

లేదట! కావున ద్రావిడభాషలమూలమున ప్రాకృతభాషలు, నేటి యార్యభాషలును గలిగిన వనుట సమంజసము కాదని వారి వాదము.

౯ వ శతాబ్దికి పూర్వమునందలి యాంధ్ర దేశమును పాలించిన రాజుల ప్రాకృతసంస్కృత శాసనములలోని తెలుగు దేశపు గ్రామనామములలో ద్రావిడభాషా సహజములగు శకటరేఫ, 'ఱ' కారములు కనబడుచున్నవే-ఇంకను అనేక దేశీయశబ్దములు కనఁబడుచున్నవే ఇవి యా దేశమున సంస్కృత ప్రాకృతములకంటెభిన్నమైన భాష యుండుటను సూచింపవా ?

తమిళములో క్రీ.శ. ౫,౬ శతాబ్దములనాటికే గ్రంథములే కాన్పించుచున్న వన్నప్పుడు, ఆకాలములోనే కాని, అంతకుఁబూర్వమునఁగాని యా భాషకూడ ప్రచారములో నుండెననుట యసమంజసమగునా? ఉత్తర దేశమున ౫వ శతాబ్దమువరకు ప్రాకృతము ప్రచారమందుండినను ౫, ౬ శతాబ్దముల నాటికే తమిళభాషలో గ్రంథములు బయలుదేరినట్లు తెలియుచుండఁగా, ౬, ౭ శతాబ్దముల నీదక్షిణదేశమున ప్రచారములో నుండిన భాషాస్వరూపమెట్లుండెనో తెలిసికొనుట కాధారములు లేకపోవుటేమి? ఆయా కాలములందలి గ్రంథము లప్పుడు ప్రచారములో నున్న భాషా స్వరూపమును దెలుపలేవా? కన్నడము ౭ వ శతాబ్దివరకును, తెలుఁగు ౯వ శతాబ్దివరకును లిఖితము కాలేదని ప్రాచీనశాసనపరిశోధకులగు వీరే వక్కాణించినచో కేవలస్వీయవాదసమర్థనార్థమే అని అనుకోకతప్పదు గదా!

ఈభాషలలో ౬, ౭ శతాబ్దములవరకు శాసనములు కనబడలేదు గనుక. శాసననిదర్శనము లేదు గనుక, భాషలుకూడనా కాలమున లేవనియే వీరు మరొకచోట ప్రతిపాదించిరి. ఒక భాషలో రచింపఁబడిన శాసనములు లేనిచో నాభాషయే లేదనగలమా? ౫, ౬ శతాబ్దములనాటికి గలవన్న గ్రంథములంతకుఁ బూర్వమా భాష కలదని చూపలేవా? 'తిరునాథకున్రు' తమిళ శాసనము, కన్నడమున 'హాలిమిడి' శాసనము, తెనుఁగున చిక్కుళ్ల శాసనములోని 'విజయరాజ్యసంవత్సరంబుళ్' అను పదము ఆయాభాషలు ౪, ౫, ౬ శతాబ్దములలోఁ గలవని చూపఁగలవన్నచో–నవి దొంగ (*Spurious*) శాసనములందురుగాబోలు. క్రీస్తుశకారంభమునను, బూర్వమునను ప్రాకృతశాసనములుమాత్రమే కనఁబడినంతమాత్రమున ద్రావిడభాషలు వ్యవహారముననే లేవన్నచో సంస్కృతభాషయు వ్యవహారమున లేదనవలసియుండును. సంస్కృతమునను శాసనములు లేవుగదా. ఇంతకు నీ హేతువాదమంతయు హిందూదేశభాషలన్నియు ప్రాకృతజన్యములను తమ వాదమును సమర్థించుటకేగాని వేరుగాదనుట నిర్వివాదము.

ఇక నీవాదసమర్థనార్థమే యీ ద్రావిడభాషా ధాతువులు శబ్దజాలమును, వ్యాకరణరూపములును ప్రాకృతజన్యములని నిరూపింప యత్నించిరి. ఈయత్నములలో దెలుఁగు రూపములను మాత్రమే ప్రధానముగా గ్రహించిరి. గాని ఇతర ద్రావిడభాషారూపములతోఁ బోల్చి మూలరూపముల నన్వేషింప లేదు. వీలునుబట్టిమాత్రమే యితర భాషారూపములను గ్రహించిరి. ఉన్న ఆధారము శబ్దరత్నాకరము. దానినే

వీరు గాలించి ౨౫౦-౩౦౦ మించని దేశ్యధాతువులను గ్రహించిరి. వాని యంతములనుబట్టి కు, గు, చు, జు, టు, తు, డు వర్ణము లంతముగలవిగా విభాగించిరి. సంస్కృతధాతు పార మతివిపుల మైనది. ఒక్కొక్క ధాతువనేక రూపములఁ గనఁబడును. ఒక్క గత్యర్థమున-ఉఖ, ఉఖి, నఖ, నఖి, మఖ, మఖి......ఈరీతిగా వందలు. ఈధాతువులోని కు, గు, టు, డు ఇత్యాదివర్ణములను నిష్పత్తిచేయుటకు వీలైన మరి యొక ధాతువునో, ప్రత్యయమునో, లేదా మొదట ఉపసర్గనో చేర్చి, సామ్యము కనఁబఱచుట వీరవలంబించిన పద్ధతి. ధూఙ్ + కృ>దూఁకు, కృశ్ + కృ = కెలకు; భీత + కృ = వడకు, ఏధ్ + కృ> ఎక్కు నర్మ + ఇష్య = వచ్చు; పక్వ = వండు, విధృత = వెళ్లు; కర్మిత = క్రుళ్లు. పాణినీయ ధాతు కోశములోని ధాతువులు సరాసరిగా తెలుఁగు లోనికి వచ్చినవి చాల గలవట! అగ్ - తె. అగు, అణ్ - అను, ఇల్ - ఏలు, కాశ్ - కాయు, పుష్ - పూచు, కృ- కొను ఇత్యాదులు. (*Mouth* - మూతి, *Prop*- ప్రాపు, *eaten*- తినెను మొదలగువానినిబట్టి తెలుఁగు ఇంగ్లీషునుండి వచ్చిన దన్న వారును గలరు.)

ఇక ద్రావిడభాషలలోని ప్రత్యేకవర్ణము లనబడు ఱ, ఴ అనునవి. ఉత్తర హిందూస్థాన భాషలలోఁ గూడ, అనఁగా ౧౨వ శతాబ్దినుండి వ్రాతలోనికి వచ్చినవానిలో గూడ నీ 'ఱ' లేకపోలేదట. ఇది సంస్కృత ప్రాకృతములలో లేకపోయినను, క్రీ. శ. ౮వ శతాబ్దినుండియు శాసనములలో ననేక దేశీయశబ్దములలోఁగానవచ్చుచుండినను, నీశబ్దము

అలో నీవర్ణము సంస్కృతశబ్దమునుండిపుట్టినదనియే నమ్మవలె నట. దీనికి ౧౩ శతాబ్దిని శబ్దమణిదర్పణకారుఁడు 'ఘటికా' 'కుక్కుట' వంటి సంస్కృతశబ్దములనుండి కన్నడమున గటిగె, కోటి మొదలగు శబ్దము లేర్పడినవని చెప్పుటయే యొక నిదర్శనమనియు వారు వాదింతురు. ఇవి సంస్కృత శబ్దముల నుచ్చరింపలేని ద్రావిడ జనులు తమ కలవాటైన 'ఱ' ను జేర్చి పలికిరేమోఅన్నచో ''ద్రావిడులు భారతవర్షమంతయు వ్యాపించియుండిరని (శాసన) ప్రమాణము చిక్కువరకు'' (సం. I-౨౩౭ పేజీ) మాటాడకూడదట. 'ఱ' ౧౧శతాబ్దికే తెలుగులో నంతరించినది. ఱ ఇప్పటికి వ్రాతలో నిలిచియున్నది. ''ద్రావిడ భాషలందిది అనాదినుండియు ప్రత్యేక చిహ్నముతోఁ గాన్పించుచున్న''దట (సం. I-౨౭౯). ద్రావిడభాషలు ప్రాకృత భాషావికారములైనచో నీశకట రేఫమార్య భాషాశబ్దములతో సంబంధము కలిగియుండ (డితీర)వలెనట. వికారములనియే వారు నిశ్చయించినారు గాన, సంబంధము కనబడకతీరునా? కాష్ఠమునుండి కఱ్ఱు, పృష్ఠ-పిఱ్ఱు, అర్వాత్-ఏఱు, ఆరుహ్-తమి-ఏఱ్, తె-ఎక్కు. ఇట్లే శకట రేఫము సంస్కృతమునుండి తెలుఁగునకు వచ్చినదని వారి నిశ్చితాభిప్రాయము.

ఇక 'సంధి' విషయమున ''సంస్కృతమం దనేక విధములుగా నుండిన సంధి విధాన మంతయు ప్రాకృతము లందే అచ్చులు ప్రత్యేకముగా నిలిచి వాని నడుమ నొక యాగమాక్షరము చేరుట, పరరూప సంధి గలుగుట—అను రెండు విధానములు మాత్రమే నిలిచిన''వట.

సంస్కృతమునుండియే వచ్చిన యీ సంధిలో నింత మార్పు గలుగుటకుఁగారణమేమో? అది సహజమనియే నారాయణ రావుగారి భావము. కాని ఈ సహజ ధోరణి ద్రావిడభాషల లోని ధోరణినే యనుసరించుటకు కారణమేమో? "ద్రావిడ భాషలలోని సంధిగూడ నార్యభాషాసంప్రదాయానురోధియే కానివేఱుకాదు" (1. 3 3 3) అని వారి సమాధానము. కాని ఆచ్ఛిక శబ్దజాలమునుగాని, ధాతువులనుగాని యితర భాషారూపములతోఁ బోల్చిచూడనక్కఱలేకయే, 'మూల ధాతువుల వైకృతత్వమునుగూర్చి యిదివరకే వివరింపఁ బడిన'దని తృప్తిఁజెందినారు. ఈ తెలుఁగు ధాతురూపములే ప్రాచీన ద్రావిడ భాషామూలరూపములని కూడ వారు తలఁచిరి కాఁబోలును.

సంధి లక్షణమును గూర్చివలెనే సమాసలక్షణమును గూర్చియు సంస్కృత వ్యాకరణమునకు సంబంధించిన దంతయుఁ దెలిపి సంస్కృత సమాస విధానము తెనుఁగునకు "కొంతవరకు మాత్రమే పొసగు" ననియు వ్యక్తము చేసినారు. కాని పొసగని ఆ విశేష లక్షణములైనను ఎచ్చటి నుండి వచ్చినవి? ఆర్యభాషలనుండి వచ్చినవేనా యను విషయమును బరిశీలింపఁ దలచుకొననైనలేదు.

సంస్కృతమున లింగము శబ్దగతము. శబ్దముల యంతములను బట్టి చూచినచో అనియతస్థితి కనఁబడవచ్చు. "ప్రాకృతమున లింగ విషయమున వ్యత్యయము గలిగినది. ద్వివచనము లోపించినది. విభక్తి ప్రత్యయములు సమసిపోయినవి" (సం. *II*- ౮౩౨). ఆధునికార్యభాషలలో నిదివ

రకే యస్తవ్యస్తమైన శాబ్దిక లింగము మరింత వ్యత్యయ మంది విడనాడబడి జాతినిబట్టి లింగమేర్పడఁజొచ్చినది. ఈ విధానము చాలవరకు ద్రావిడభాషామార్గము ననుసరించినది.(*II*- ౮౩౮). ఈద్రావిడభాషలు ప్రాకృత జన్యములే యని చూపుటకే గదా వీరి ప్రయత్నమంతయు. ఆధునికార్య భాషలతోపాటు ఇవియు ప్రాకృతములనుండి పుట్టినవే. అట్టి సందర్భములో జాతినిబట్టి లింగమేర్పడుట యీద్రావిడభాషలకు మాత్ర మెట్లు వచ్చును? వీనితో సజాతీయములే యని చెప్పఁబడుచున్న యితరార్యభాషలు "ద్రావిడ భాషామార్గమునను సరించుటయు" నెట్లు పొసగును? ద్రావిడ విశిష్ట లక్షణము లనఁబడున వన్నియు ప్రాకృతములనుండి వచ్చినవనియే కదా వీరి వాదము. సంస్కృతముననే జాతి లింగము కలదని తరువాత చెప్పియేయున్నారు. అప్పుడు కోల్ భాషల సంపర్కము వలన నీమార్పు రావచ్చునను ఛటర్జీగారి వాదముతోనే పని లేదు. కాని పైని ఆర్యభాష లీ లింగవిషయమున ద్రావిడ భాషా సంపర్కము మూలముననే కలిగినదని ఛటర్జీగారు తెలిపిరి. కాని యీ విషయమున వారి భావనాశక్తియే మూలము" అని నారాయణరావుగారు చెప్పుదురు. తాము పైని చెప్పిన విషయమే ఛటర్జీగారన్నప్పుడు అది వారి భావనాశక్తి మూలమైన దనుట యేల? "ఆనాటి ద్రావిడభాషలనగా నేవో? వాని స్వరూపమెట్టిదో?" సమాధానము ఛటర్జీగారు చెప్పవలెనట (II- ౮౫౯) ఇతరార్యభాషలు ద్రావిడభాషాలక్షణముననే యెందుకనుసరించినవి? ప్రాచీన ప్రాకృతమున లింగమస్తవ్యస్తమగుటకుఁ గారణ

మేమి? క్రీ. శ. ౫, ౬ శతాబ్దములనాడు గ్రంథస్థములై యున్నవని తామే చెప్పిన ద్రావిడభాషలు అంతకుఁబూర్వము ప్రాకృతములనాడు లేవా? దీనికి వారు సమాధానము చెప్ప వలదా?

వచనము విషయమై కాల్డ్వెల్ చూపిన ద్రావిడార్య భాషలకు గల భేద మొక్క తమిళమునకే వర్తించునట (*II*-౮౬౪). అన్ని విషయములలోనుగూడ నీ భాషలకుగల సామ్యభేదములుచూచి, మూల లక్షణములను కనిపట్టవలసి యుండునుగదా! తెలుఁగునఁగూడ నట్టి వాడుక లేకపోలేదని వారే అన్నారు. కాల్డ్వెల్ చూపిన తక్కిన భేదములను వీరు కాదనలేకపోయిరి. విభక్తివచనముల కొకే ప్రత్యయ మార్య భాషలలో నుండుట కాదందురా? అట్టివి ద్రావిడ భాషలలో గలవందురా? విభక్తి విధానమే విభిన్నము. క్రియా విభక్తి పద్ధతియు నట్టిదే.

"సంఖ్యావాచక పదములకు ప్రాకృతములందుగాని ఇతరార్యభాషలయందుగాని పోలికలు చిక్కుట లేదట" (*II*-౧౧౮౪). యూరపియున్ భాషలలోఁగూడ సామ్యము కనఁ బడుటలేదు. కావున దీనికిఁ గారణ మొక్కటే యైయుండును. దీనికి మూలమైన పైశాచీభాష ప్రచారమునుండి తొలగి యుండవలయుననుట. లేదా ఏ ఐరేనియన్ భాషాపదముల తోనో ముడిపెట్టవలయు నన్నచో నీ భాషలలోని పదముల రూపములను పోల్చి చూడవలసియుండును. 'ఒక' ఏకశబ్ద భవమే కావచ్చును. కాదనుటకు కాల్డ్వెల్ అనవసరముగా బాధపడినాఁడు. రెండు = రొండు. ఇది దొండు, ద్వంద్వ-

నుండి వచ్చినది; మూడు, నాలుగు శబ్దములకు మూలము లేమియుఁ గనఁబడ లేదనిమాత్రము నిశ్చయించినారు. ఏను, అయిదు మొదలగు ద్రావిడ రూపముల కన్నిటికి 'పంచన్' అనునదే మూలము. 'షష్'- ప్రాచీన ప్రాకృతములందే 'హార్ - హోర్' లుగ మారి "ఐరేనియన్ భాషలకు సంబంధించిన పైశాచీభాషలద్వారా ద్రావిడభాషలయందు మొదటినుండియు నెలకొనియున్నదని చెప్పవచ్చునట(II-౧౧౭౭). ఐరేనియన్ భాషలకు సంబంధించి యిదివరకెప్పుడో బహుశః అంతరించిపోయి యుండిన. పైశాచీభాషలలోనే తక్కిన ద్రావిడ భాషాలక్షణము లనుకొనుచున్న వన్నియుఁ గూడ మొదటినుండియు, క్రీస్తుశకము మొదటినుండియు నుండినవని ఏల తలంపగూడదు? అంతరించిపోయిన యా భాషలతో పాటు ద్రావిడభాషలు నా కాలముననే యుండియుండును.

విశేషణములు విశేష్యముల లింగ, విభక్తి, వచనములను బట్టి మారుచుండుట సంస్కృతములో నుండుటచే కాల్డ్వెల్ ఈ భాషలకు సంబంధము లేదన్నాఁడు. సంస్కృతములో నా మార్పు విధియేమైనను దానికి సంబంధించిన యనే కార్యభాషలలో ద్రావిడభాషలయందువలెనే అట్లు మారనక్కర లేదట. కావున నా యార్యభాషలవలెనే ద్రావిడ భాషలును సంస్కృత భాషాజన్యములు కావలె నని వీరి భావము. ఈ భావమును సమర్థించుకొనుటకుగా తెలుఁగులో తత్సమ విశేషణముల లింగము మారుచున్నదని తెలుపుదురు. భాషయొక్క సహజలక్షణమును గుర్తించుటకు ఇతర భాషలనుండి యెరువు తెచ్చికొనిన సొమ్ములనా పరిశీలించుట!

ఉదా : సుగుణాభిరాముఁడు రాముఁడు, భక్తవత్సల సీత కాపాడుగాత, అని తత్సమభాషలో నుదాహరించిరి. ఇట్టివనేకములు సంస్కృతభాషావ్యాకరణముల ప్రభావముచే నీ భాషలోనికి వచ్చినవి కలవు. వానినిబట్టియా యీ భాష సహజలక్షణములను కనిపెట్టుట? శ. ర. లోని తత్సమశబ్ద జాలమునుబట్టియే ఈ భాష సంస్కృతజన్యమని చెప్పఁదలచి నట్లే యుండును. తరతమభావమును సంస్కృతము నందుఁ కంటె భిన్నముగఁ దెలుఁపుట ప్రాకృతభాషలందే బయలు దేరినదట. కావున తెలుఁగునకు, సంస్కృతమునకు సంబంధము లేదని చెప్పఁగూడదట. ప్రాకృతములద్వారా సంబంధమట. క్రియల నిర్మాణవిషయమునఁగూడ నాధుని కార్య భాషలకును ద్రావిడభాషలకు నెంతో సామ్యము కలదట. కాని యీ చాయల నార్యభాషలు ద్రావిడభాషలనుండి యెరువు, తెచ్చుకొన్నవందురు, వారీ రెండువర్గములకుఁ గల భేదములనుగూర్చియే యెక్కువగ నూది చెప్పుదురు'' అని వారి వాదము. సంస్కృతమునుండి వచ్చిన భాష లగుటచే సంస్కృతభాషా సంప్రదాయము లనేకములు వీనిలో సంక్రమించియుండుట సహజము. ఆ నిలిచియున్న సంస్కృత సంప్రదాయములు ద్రావిడభాషాసంప్రదాయములకు భిన్నములు కాకమానవు. ద్రావిడభాషా సంపర్కప్రభావముచేత ననార్యసంప్రదాయములు మరికొన్ని వానిలోఁ జేరినవుడవి ద్రావిడభాషలతోఁ బోలికను కల్పింపక మానవు. కావున నీ భేదము దృష్టిభేదమునుబట్టి యేర్పడినదిగాఁ గనఁబడకపోదు. 'సరళదృష్టి' యనున దేది యనునదే విచార్యము.

ఈ దేశములోఁగాని, ఇతర దేశములలోఁగాని భాషాతత్త్వజ్ఞులగు వారనేకు లీ ద్రావిడ భాష లార్యభాషా జన్యములను వాదమును బలపరచువారుగాఁగనఁబడరు. పలువురు ద్రావిడ భాషా విశేషలక్షణములను గూర్చియు, నందలిధ్వని సంప్రదాయములను, ధ్వని పరిణామ రీతులను గూర్చియు, నీ కుటుంబమునందలి ప్రత్యేక భాషల ప్రాచీన చరిత్రాన్వేషణము, ఆధునిక మాండలిక భాషలలోని పరిణామ విశేష పరిశీలనము మొదలగువానిని గూర్చియే విశేష పరిశ్రమ చేయుచున్నారు. ద్రావిడ భాషలలోని ధ్వని పరిణామరీతులను గూర్చి "*London School of Oriental Studies*" అను సంస్థలోని బరోస్, ఆల్ఫ్రెడ్ మాష్టరు, టర్నర్ మొదలగు పండితులు కడు శ్రద్ధతోపనిచేయుచున్నారు. ఫ్రాన్సు దేశమున *Jules Bloch* పండితుఁడు ద్రావిడభాషా నిర్మాణలక్షణములనుగూర్చి యిటీవలనే ఫ్రెంచిభాషలో నొక యుద్గ్రంథమును ప్రకటించినాఁడు. అమెరికాలోగూడ 'భాషాతత్త్వశాస్త్రపత్రిక' (*Philological Journal*) లో ద్రావిడ భాషాతత్త్వమును గూర్చిన వ్యాసములు ప్రకటితము లగుచున్నవి. ద్రావిడ భాషల ప్రత్యేకతను, వాని విశేష లక్షణములను గూర్చి యీ దేశముననే గాక యితర దేశములలోఁ గూడ విశేష పరిశ్రమ జరుగుచున్నది. మన దేశమునందలి యువకులును భాషాతత్త్వ శాస్త్రము నందును, ద్రావిడభాషాతత్త్వపరిశీలనమందును నిత్యోధిక శ్రద్ధవహించి, తెలుఁగుభాష పుట్టుపూర్వోత్తరములను సరిగా దెలిసికొని ప్రాచీనకాలమున నీభాషాశాస్త్రమునకు మన దేశమునఁగల గౌరవమును, ప్రాధాన్యమును నిలువఁబెట్టుదురుగాక !

2

ఆంధ్రభాషాభ్యుదయము*

ఆంధ్రభాషాభ్యుదయసాధనము విషయమున కాకినాడ విద్యార్థిబృందము వ్యగ్రోత్సాహముగలవారై యున్నదనుట ప్రతి యాంధ్రునకు నత్యంత సంతోషకరమైన విషయము. ఇప్పటి విద్యార్థులే భావి పౌరులుగదా. కావున నిప్పటినుండియు వారు చూపుచున్న యుత్సాహము ఆంధ్రుల యచిరాభ్యుదయమునకు శుభచిహ్నమనుటకు సందేహములేదు. ఈ యుత్సాహముతో నాంధ్రరాష్ట్రమునేగాక సర్వతోముఖమగు నాంధ్రాభ్యుదయమును వీరు సాధింపఁగలరు. వస్తుపరిశోధనా వ్యగ్రుఁడగు ప్రతివాఁడును విద్యార్థియే. నేను నట్టివాఁడనే కావున నీసమయమున నేఁ జేయదగిన దేమనఁగా నెచ్చటెచ్చటనున్న యాంధ్రులనైనను ఒక్క సంఘముగాఁ జేర్చి బంధించు ప్రేమపాశంబనఁ దగిన యీ మాతృభాష స్వరూపసౌందర్యములనుగూర్చియు, తదభ్యుదయక్రమమును గూర్చియు నాకుఁ గలిగిన భావములను వెల్లడించి యీ భాషామతల్లి పూజ సేయుటయే.

కాని భాషాపరిశీలనము సారస్వత విమర్శనమువలె నంత రసప్రసారములతోఁగూడినది కాదు. కొంతవఱకు చప్పిడి విషయమనవచ్చును. కవితామృతమన్ననో ఆ యా కవుల భావనాపటిమానుసారముగా ననేకరుచులతో నత్యంతాస్వాద్యమై యుండునుగదా—

* కాకినాడ కాలేజీ విద్యార్థులు సలిపిన ఆంధ్రాభ్యుదయోత్సవ సందర్భమునఁ జెప్పిన యుపన్యాసము.

"చటులకవిత్వతత్త్వపటుసంపద యొక్కరిసామ్ముగాదు భా
రతిదయ సౌధవార్ధి కవిరాజులమానసముల్ ఘటమ్ములా
యతముకొలంది లబ్ధమగు నయ్యమృతమ్ము"

అని అబ్బయామాత్యుఁడు చెప్పియేయున్నాఁడు.

కాని సారత్వముకూడ వాఙ్మయమే. అదియు భాషా స్వరూపమే. ఈ వాఙ్మయాదర్శము నాశ్రయించియే, అనఁగా సారస్వతస్వరూపము దానియందు ప్రతిఫలించినది గనుకనే ఆయా మహాపురుషులయొక్కయు, జాతులయొక్కయు జీవిత చరిత్రములు చిరస్థాయులగుచున్నవి. దీనినే దండ్యాచార్యులిట్లు చెప్పినాఁడు.

"ఆదిరాజయశోబింబమాదర్శం ప్రాప్య వాఙ్మయం
తేషామసన్నిధానేపి న స్వయది పశ్య నశ్యతి" అని.

అనఁగా అదిరాజుల యశోబింబము వాఙ్మయాదర్శమున నొకసారి ప్రతిఫలించెనా, అది కాలగతమై యెదుట లేకున్నను ఈకాలమునందలి ఛాయాప్రతిబింబమువలె(*Photograph*) స్థిరమైయుండునేగాని నశింపదనుట. కావున నీ వాఙ్మయాదర్శము సామాన్యపుటద్దమువంటిది గాక నేఁటి కాలపు ఛాయాబింబ గ్రహణయంత్రమువంటిదని చెప్పినాఁడన్నమాట. ఆతని కాలమున వాస్తవముగా ఛాయాబింబ గ్రహణసాధనములు లేవుగాని యున్నచో నా శ్లోకభావము నింతగా మనమానందింపలేక పోయెడివారము. వాస్తవముగా నాయాకాలములందలి రాజుల యశోబింబమేకాదు,

ఆయా జనులయొక్కయు, జాతులయొక్కయు జీవిత చరిత్రము గూడ నా భాషావాఙ్మయాదర్శమునఁ బ్రతిఫలించి యన శ్వరంబై యుండునని యాతఁడు చెప్పియుండవలసినది. పరిశీలించినచో వాఙ్మయమనునది ఆయా సంఘముయొక్క, జాతులయొక్క జీవితమునకు, జీవితాదర్శములకుఁ బ్రతిబింబముగాక మరేమి? చరిత్ర-చరిత్రగ్రంథములును ఆయా దేశములందప్పుడప్పుడు సంభవించు బాహ్యాసంఘటన (*Events*) లను గూర్చి చెప్పుచుండ వాఙ్మయ మనున దాయాసంఘటనలకు మూలకారణంబైన ఆయాకాలపు జనుల భావప్రవాహమునే వ్యక్తీకరింపఁగలదని చెప్పవలసియున్నది. ఛాసర్ కాలమునాటి ఆంగ్లవాఙ్మయము, ఎలిజబెత్ కాలమునాటి ఆంగ్లవాఙ్మయము, పోప్ జాన్సన్ కవులనాటి వాఙ్మయము, బైరన్, షెల్లీ మొదలగు కవులనాటి వాఙ్మయము, ప్రకృతిశాస్త్రయుగమని చెప్పెడి యిటీవలి టెనిసిన్ తరువాతి కాలపు టాంగ్ల వాఙ్మయము, ఆయా కాలపు టాంగ్ల జీవిత చరిత్రను తేలుపుటలేదా? షేక్స్పియర్, స్కాట్ల చరిత్రాత్మక నాటకములు నవలలు అప్పటి చరిత్ర నెంత రమ్యతరముగాఁ జేసినవి? ఆంధ్రజాతిచరిత్రము మాత్ర మాంధ్రవాఙ్మయమునఁ బ్రతిఫలింపలేదా? అయితే యీ జాతియొక్క తొలియుగములందలి రమ్యచరిత్రమంతయుఁ శిల్పకళాదర్శము ననేగాని వాఙ్మయాదర్శమునఁ బ్రతిఫలింపకుండుట దాని చరిత్రలో నొక పెద్ద విషాదఘట్ట మనకతప్పదు. హైందవ సామ్రాజ్యపట్టభద్రులగు నాంధ్రమహారాజుల చరిత్రము వాగ్గేయరూపమున మన చెవులను గింగురుమనిపించి మనలో

నూతనచైతన్యమును బురికొల్పుటకు బదులుగా నాపావన కృష్ణవేణీతటంబున నమరావతి, జగ్గయ్యపేట, నాగార్జునకొండ మొదలగు ప్రదేశములందు శిల్పకళారూపమున స్తంభించి పోయి బూజుపట్టియున్నది. అయినను మన యదృష్టవశమున దీనినిగూడ కాలప్రవాహము కృష్ణానదీ ప్రవాహములోఁ గలిపివేయకుండ, ఆంధ్రజాతి కధిష్ఠాన దేవతయగు శ్రీకాకుళ వల్లభుఁడు ఆంధ్రనాథుఁడునగు నాంధ్రవిష్ణువు

"అరవిందాక్షుడు, చక్రి, సంతతముముత్ప్వధ్యక్షు సంసేవ్యుఁ
దరుఁడై క్రమజనానురాగఫలసంతానప్రదుండై నిరం
తరకారుణ్య సుధాంబురాశియగుచున్ నానామునిస్తోమమం
త్రరహస్యార్చిత దివ్యవైభవములన్ రాజిల్లుచు న్నుండుటన్"

ఆ ప్రాచీనకళావైభవమంతయు నిప్పటికిని గాపాడఁబడి యున్నది. కావుననే ఆనాటి యాంధ్రుల శిల్పకళావైభవమునైనను గాంచి అందుఁ బ్రతిబింబించిన వారి జీవితచరిత్రను స్మరించుకొనఁ గలుగుచున్నాము. మన దురదృష్టమేమో కాని పదిహేనువందల సంవత్సరముల తరువాత విజయనగ రాంధ్రసామ్రాజ్యాధీశ్వరుని స్వప్నమున సాక్షాత్కరించి

పలికి తుత్త్రేత్క్షోపమల జాతిపెంపెక్క రసికులానన
మదాలసచరిత్ర
భావధ్వనివ్యంగ్య సేవధిగాఁగ జెప్పితివి సత్యావధూప్రీణనంబు
శ్రుతి పురాణోపసంహితలేర్చి కూర్చితి సకలకథాసార
సంగ్రహంబు
శ్రోత్రఘుచ్ఛటలు విచ్చుగరచించితినూక్తి నైపుణి జ్ఞానచింతా
మణికృతి,

మరియు రసమంజరీముఖ్యమధుర కావ్య
రచన మొప్పించుకొంటి గీర్వాణభాష
నంధ్రభాష యసాధ్యంబె యందునొక్క
కృతివినిర్మింపుమిఁక మాకుఁ బ్రియముగాఁగ.

"తెలుఁ గదేల ? యన్న దేశంబు దెలుఁ గేను
తెలుఁగువల్లభుండ, దెలుఁ గొకండ
యెల్లనృపులు గొలువ నెఱుఁగ వే బాసాడి
దేశభాషలందుఁ దెలుఁగులెస్స."

(ఆముక్తమాల్యద)

అని తెలుఁగుభాష నింతగాఁ బ్రశంసించి ఎప్పుడో 'మునుదాల్చిన మాల్యమిచ్చు నప్పిన్నది రంగమంచయిన పెండిలి'నిగూర్చి చెప్పుమని బ్రతిమాలి బలవంతము చేసి ఒక కావ్యము చెప్పించుకొనిన మనయాంధ్రవల్లభుఁడు, ఆతొలి కాలమునఁగూడ స్వప్నమున నొకపారి సాక్షాత్కరించి, ఆంధ్రజాతివాండ్రయియుండియు, ఏమిట్లు మీరు వ్రాయించిన కావ్యములను బృహత్కధలను ఏల పిశాచభాషలో వ్రాయించుచున్నారు, "దేశభాషలందుఁదెలుఁగులెస్సగదా" తెలుఁగుననొక్క శాసనమునైనను వ్రాయించి, మీయాంధ్రత్వమును, నా తెలుఁగువల్లభత్వమును నిలువఁబెట్టకూడదా యని యుద్బోధింపలేక పోయినాఁడు, ఇది యాంధ్రులపాలిటి గొప్ప దురదృష్టముగదా! అట్లేచేసియున్నచో నీ యాంధ్రభాషకు వాఙ్మయమునకు నెట్టి ప్రాచీనత అబ్బియుండును.

దాని పుట్టు పూర్వోత్తరములనుగూర్చి తెలిసికొనుట కింత మనము బాధపడవలసివచ్చునా? ఈయాంధ్ర రాజుల శాసనము లందలి ప్రాకృతమే ఆంధ్రభాషకుఁదొలి రూపమనేవారు. తద్భవమే యిది యనేవారు–లేదు–ఇది దక్షిణ దేశ భాషలలోఁ జేరిన స్వతంత్ర భాష అనేవారు–ఇన్ని వాదములకు కారణ ముండునా? ఆంధ్రజాతీయ వైభవము తొలికాలమునుండి ఆంధ్ర భాషలో నెట్లు ప్రతిఫలించియుండేది? అయితే మనతో పాటే మన దేవతలకుఁ గూడ ననేక బాధలుతప్పవుగాఁబోలు. వారును కాలానికి బద్ధులే–కాలమే సర్వాధారముగదా. ఈ యాంధ్రనాథుఁడే గలియుగమురాగా నిచ్చట నుండక యుత్తర దేశమునకుఁబోయి కొంత కాలమునకు మరలివచ్చి యొక బ్రాహ్మణుని యింట కాకరపాదులో దాగియుండుటయు దటస్థించినదట. పిమ్మట 13–వ శతాబ్ది ప్రాంతమున అనంత పాలుఁడను కళింగదేశాధీశ్వరుని దండనాథుఁ డొకఁడు వచ్చి ప్రతిష్ఠాపన చేసినాఁడట–ఈయాంధ్రవిష్ణువును గూర్చి శ్రీకాకుళక్షేత్రమహాత్మ్యములో నిట్టియైతిహ్యములున్నవి. శ్రీకాకుళాంధ్ర నాథునిచరిత్రమును 'వల్లభాభ్యుదయము'ను పేరుతో భట్లపెనుమర్తి కోదండరామకవి యొక ప్రబంధ ముగా రచించినాఁడు. దీని మూలమున నీ యాంధ్రనాథుని గూర్చిన చరిత్రను సూచించు కొన్ని ప్రాచినకథలైనను నిలిచి యున్నవి. ఆంధ్రవాఙ్మయమున ప్రాచీనాంధ్రుల కథలను గూర్చి తెలిపెడి గ్రంథ మిదియొక్కటే కనఁబడుచున్నది. ఇది మద్రాసు యూనివర్సిటీ ఆంధ్రశాఖవారిచే వారి యాంధ్ర గ్రంథమాలలోఁ బ్రకటింపఁబడుచున్నది.

తరువాతి యాంధ్రదేశపురాజులగు-చోళచాళుక్యాదులనుగూర్చి కొన్ని తెలుఁగు శాసనములు కావ్యములుగూడ దెలుపుచున్నవి. జపహోమతత్పరుఁడైనను లోకజ్ఞుఁడగు నన్నపార్యుఁడు తత్కాలానుగుణముగ భారతసంహితను మహాగంగా ప్రవాహమునుబోలు నాంధ్రవాణిని వెలయించి యాకాలపుటాంధ్రజీవితమును వ్యక్తము చేసియేయున్నాఁడు. ఆంధ్రావళి మోదముంబొరయునట్లుగ భారత శేషమును రచియింపఁ దొడఁగిన తిక్కనార్యుడు తెలుఁగుతల్లి తేట మెఱుగులతోపాటు, తెలుఁగు జనుల దేశాచార వ్యవహారములను తన భారతరచనలో నచ్చటచ్చట వెలయించి తన్మహనీయస్థితికి మూలమై నిలిచినాఁడు. నన్నపార్యుఁడాంధ్ర వాఙ్మయ మహాసౌధమునకు మూల స్తంభమనుట నెవరు కాదనగలరు. ఆంధ్రభాషను, వాఙ్మయమును అతఁడేసృజించెనని నమ్మెడు వారింకను కొందఱు ఉండవచ్చును. అది నిరాధార మనుటకు నిదర్శనములగు నంతకుఁ బూర్వశాసనములను, శాసనపద్యములను వీరు కనులఁదెఱచి చూచినచో నప్పటి కవితాసంప్రదాయములు గోచరింపక పోవు. తన్మహనీయస్థితికి తిక్కనార్యుఁడు మూలమై నిలిచె ననుటకునుగూడ నెవ్వరును సందేహింప నక్కరలేదుగదా. కాని ముదిరిన పాండిత్యముగల కొందఱు పండిత విమర్శలకు దృష్టిలో నీతని కవితలోని మహనీయత్వము మంటిగడ్డలై పోయినది. తిక్కనార్యుని కవిత్వములో వారికన్నియు అమంగళములు, అశ్లీలములు, అనౌచిత్యములు, అనవసరకల్పనలుమాత్రమే కనఁబడఁజొచ్చినవి. ఆట నేర్చు గురువున కొప్పుచెప్పు సందర్భ

మున తండ్రియగు విరటునిచే బుజ్జగింపఁబడు నుత్తర, గర్భాధానపు పెండ్లికూతురువలె వీరికండ్లకుఁ బొడగట్టినది-అట్టి విమర్శకుల రసగ్రహణ పారీణతను, సహృదయతను నే మన వలెః ఉత్తరావివాహ శుభకార్య సందర్భమునఁగూడ నీ పండితులకు తద్దినపు బ్రాహ్మణార్థ సందర్భమున నీయఁబడు కాని డబ్బేకనఁబడినది. తిగఁబోఁడిలోని "బోఁడి" శబ్దసాస్వ మును శబ్దరత్నాకరములోనిచ్చిన "ముండిత" మనునర్థమునుబట్టి గ్రహించిన రసజ్ఞులువీరు. కాని ఎవరిదృష్టివారిది. ఉత్తరవివాహసందర్భమున మూలములో వర్ణింపఁబడియుండని దేశీయాచారములను గొన్నిటిని తిక్కనార్యుఁడుతనయాంధ్రీకరణమున సందర్భానుకూలముగాఁ జేర్చి వర్ణించియున్నాఁడు. పురంబున నుత్సవమును జాటఁబంచుట, ఉత్తర నలంకరింపఁ జేయుట, ధర్మతనయుఁడు అభిమన్యువి శృంగారంబు సేయించి గజారూఢుం జేసికొని తరలి వచ్చుట, క్రంత నడచుట, వరు నెదుర్కొని సేసలుచల్లి యెదురు సన్నాహము చేయుట, తెర యెత్తుట, తలంబ్రాలు, వధూవరు లేకాసనమున నుండుట, వివాహమైన పిదప కట్టనిచ్చుట (అంపకములు), బంధువుల కర్పూసత్కారములు, అల్లున కరణంబు నిచ్చుట మొదలగు విషయములు ఉత్తరా వివాహసందర్భమున తిక్కన వర్ణించినవి ద్రౌపదీ వివాహసందర్భమున నన్నయచే వర్ణింపఁబడియుండలేదు. మూలములో వీని ప్రశంసయే లేదు. "ప్రతిగృహ్యాచ తాంపార్థః పురస్కృత్యజనార్దనం, వివాహం కారయామాస సౌభద్రస్యమహాత్మనః" అనిమాత్రమే కలదు. తిక్కన ఆంధ్రజనుల జీవిత విశేషములను సందర్భానుకూల

ముగా వాఙ్మయమునఁ జొనుపనెంచియే పై విషయము లను వర్ణించినాఁడనుటకు సందేహము లేదు.

తిక్కనకాలముననుఅటుపిమ్మటను ఆంధ్రదేశము నొక ఊపుఊపిన శైవమతోజ్జృంభణము పాల్కురికి సోమనాథుని వాఙ్మయ తరంగముల నిప్పటికిని మనల నూపుచునే యున్నదిగాదా! కాకతీయులనాటి యోరుగంటి వైభవము నిప్పటికిని క్రీడాభిరామము మనకనులకుఁ గట్టుటలేదా? రెడ్డిరాజులనాటి యాంధ్రుల దొడ్డవైభవము, వారియొద్ద శ్రీనాథుఁడు నడపిన విద్యాధికారిత్వము, ఆంధ్రపల్నాటి వీరుల వీరచరిత్రము, రెడ్డిరాజు లనుభవించిన పునుగు జవ్వాదులతో తెలుంగురాయఁడు చేసిన కస్తూరికా భిక్షాదానములతోఁగూడ శ్రీనాథాదుల కవితయందిప్పటికి గుమగుమ లాడుచున్నదే! విజయనగర సామ్రాజ్య వైభవమును, రాయలనాటి యాంధ్రుల రాసికతను అష్టదిగ్గజము లేచాటుచున్నవిగదా? నాయకరాజుల కాలమునందలి నారీమణుల నాట్యాభినయవైదుష్యములతోపాటు ఆంధ్ర దేశముననేగాక దక్షిణదేశమునఁగూడ తెలుఁగుతల్లి యెట్లు తాండవించినదో, తెలుఁగువారి జీవితచరిత్ర మాకాలపు వాఙ్మయాదర్శమునందెట్లు ప్రతిఫలించినదో సరస్వతీభాండారమిప్పటికిని జూపుచునే యున్నది.

ఇఁక నీ కాలమునందలి నవ్యసాహిత్యములు, ఖండకావ్యములు, విమర్శనలు, నవలలు, నాటకములు, కథలు సాంఘిక రాజకీయ భాషావిషయక సమస్యలు, వాదములు, జాతీయగీతములు, రాష్ట్రగానములు, మొదలగునవి పాశ్చాత్య

సంసర్గసంజాత నూతన సంస్కారచిహ్నితమైన యొక సంధి యుగ మనఁదగిన యీకాలపు టాంధ్రుల జాతీయజీవిత మును ప్రతిఫలింపఁజేయుచునే యున్నవిగదా? మఱియు నాదినుండియు సామాన్యజన జీవితమును దెలుపు పదకవిత్వ మును, పాటలు, గీతలు మొదలగు వానిని సంగ్రహించి శిష్ట వాఙ్మయమునఁజేర్చికొన నుపేక్ష చేయుచున్నామే కాని, అవి లేనిది ఆంధ్రజాతి జీవితచరిత్రము సంపూర్ణముకాదని యింకను గ్రహింపలేకున్నాము. నవనాగరకతావశులగునాధునికస్త్రీల యుపేక్షమూలముగా నంతరించుచున్న స్త్రీల పాతపాటలను, యక్షగానాదులనుగూడ సేకరించినఁగాని ఆంధ్రవాఙ్మయము సర్వాంగసుందరము కానేరదు.

ఇట్లాయా జాతుల జీవితచరిత్రము వారివారి భాష లలోఁ బ్రతిఫలించుచుండుట సహజమే. కావున మన భాషా స్వరూప చరిత్రలనుగూడ మనము తెలిసికొనినచో జాతి చరిత్రగూడఁ దెలియఁగలదు. ఒక్కొక్క భాషలోని సారస్వ తము, కళలు, శాసనములు మొదలగునవి ఆయా కాల ములయందలి జనుల చరిత్రమును మాత్రమే తెలుపుచుండ, భాషయనునది పై వానివలన సూచింపఁబడు చరిత్రకుఁగూడ నతీతమైన, అనఁగా దీనికిఁగూడ నందని ప్రాచీనకాలము లోని ఆయాజనుల జీవితచరిత్రనుగూర్చి మనకుఁ దెలుపఁ గలుగుచున్నది. అనఁగా సామాన్యముగా దేశచరిత్రమను డానికందని బూర్వచరిత్రగూడ భాషారూపముల వలన మనము దెలిసికొనఁగలుగుచున్నామనుట. అట్లేకానిచో నెన్ని వేల సంవత్సరముల క్రితమో మధ్యఆసియాలోనో, యూరపు

ఖండ ప్రాంతముననో, కొందరన్నట్లు హిందూదేశములోనో నివసించియున్న ప్రాచీన ఇండో యూరపియనుల మూల సంఘముయొక్క జీవితపరిస్థితులనుగూర్చి తెలిసికొనుటకు మనకు వేఱు ఆధారమేమున్నది? మన సంస్కృత భాషకు దోడఁబుట్టిన భాషలుగా గ్రహింపఁబడుచున్న గ్రీకు, లాటిన్ జర్మానిక్, ట్యూటానిక్, స్లావోనిక్, అవెస్థా మొదలగు భాషలలోని సమానార్థక పదజాలము నేరి, ఆయా భాషలకుఁ బ్రత్యేక లక్షణములై యున్న స్వర సంప్రదాయములను గ్రహించి వాని మూల రూపములను, తన్మూలమున ప్రాచీన ఇండోయూరపియన్ భాషాస్వరూపమునుగూడ కనిపట్టి, ఆమూలభాషాపదముల మూలార్థమునుబట్టి యా కాలమున నామూల భాషను వ్యవహరించిన ప్రాచీనార్యజనుల జీవిత చరిత్ర మిట్టిదై యుండునని భాషాతత్త్వవేత్తలు నిర్ణయించు చున్నారు గదా! నూఱు నూటయేబది సంవత్సరములనుండి జరుగుచున్న ఆర్యభాషాతత్త్వ పరిశీలనమే దీనికి సాధన మైనది. దక్షిణదేశ భాషావర్గము ను గూర్చియు నిట్టి పరి శీలనము జరుగవలసి యున్నది.

ఆయా పదములనుబట్టి ప్రాచీనార్యుల జీవితపద్ధతి యెట్టిదిగాఁ గనుఁగొనిరో యించుక చూపెదను. ప్రాచీ నార్యులు ద్వారములు, స్తంభములుగల యిళ్ళలో నివసించెడి వారని యీ భాషలన్నిటిలోను గనంబడు నీపదములే నిదర్శన ములు—సం. దమ, గ్రీక్—డొమోస్ (*Domos*), లాటిన్— డోముస్ (*Domus*); సం. ద్వార్; గ్రీక్—థూరా: లాటిన్— ఫోరెస్ (*Fores*), గాథిక్—దఉర్ (*Daur*); జర్మానిక్—తూర్

(*Tur*) ఇంగ్లీషు—డోర్ (*Door*). ప్రాచీనార్యుల పానీయము మధువు. సం. మధువు ; గ్రీకు—మెథు ; జర్మన్—మెతు; ఇంగ్లీషు—మీడ్ (*Mead*). హిందూదేశమునందలి యార్యులు యజ్ఞాదులలోఁజేయు సోమపానము ప్రాచీనార్యుల కాలమున నున్నట్లుగాఁ గనఁబడదు, ఎలయనగా నీ శబ్దము—సం. సోమ—యనియు, అవెస్టాలో హోమయనియుఁ గనఁబడు చున్నదేగాని, ఇతరములగు నార్యభాషలలోఁ గానరాదు. కావున నిది వీరు హిందూదేశమునకో, పరిసియాప్రాంతము నకో వచ్చినపిదప నవలంబించినదని యే తలఁపఁబడుచున్నది. ప్రాచీనార్యులకుఁ బరిచితముఁలగు జంతువులు—సం. వృకః గ్రీకు—లూకోస్ (*Lukos*), జర్మానిక్—వుల్ఫ్, (*Wolf*); సం, గౌః-గ్రీకు—బోఉస్ (*Bous*) ఇంగ్లీషు—కౌ (*Cow*); పశువులే వారికి ధనము. పశువులను ధనమనియు, సొమ్ములని మన దేశమున విజయనగర ప్రాంతమునను-ఇప్పటికిని వాడుకొను నాచారముకలదు. లాటిన్—పెకుస్, గాథిక్—ఫెహ్యు(*Faihu*) గ్రీకు—వెయిహ్ (*Vieh*), ఇంగ్లీషు-ఫీ (*Fee*). విద్యార్థులు బడు లలో చెల్లించు “స్కూలుఫీ” అనునది ప్రాచీనార్యుల-పశు శబ్దమునకు సంబంధించిన శబ్దమే యని గ్రహింపనగును. లాటిన్ భాషలో—పికున్యాయా (*Pecunia*) అనఁగా ధనము— దీనినుండియే ఇంగ్లీషులో '*Pecuniary*' అనుశబ్ద మేర్పడినది. వేదములో “గవేషణ” శబ్దమునకు ధనముకొఱకై వెదకు లాడుట, ధనసంపాదనమునకై యత్నించుట—దానికొఱకై సలుపు యుద్ధములు—అని యర్థముకలదు. కాని తరువాతి కాలమున నందలి గోశబ్దార్థ మంతరించి, కేవలము వెదకుట

యను నర్థమున నది రూఢిఁజెందినది, ప్రాచీనకాలమున గుఱు దక్షిణగా గోవులనే యిచ్చు నాచారము కలదు. జనకుఁడు గోవులను దక్షిణగాఁబెట్టి బ్రహ్మిష్ఠులగు బ్రాహ్మణులను గ్రహింపమని "బ్రాహ్మణాభగవన్తోయవో బ్రహిష్ఠః స ఏతా గా ఉదజతాం" అని చెప్పినట్లు బృహదారణ్యకోపనిషత్కథను బట్టి తెలియవచ్చుచున్నది. ఇఁక ప్రాచీనార్యులకు ఉన్ని-దానితో నేయుట, తెలియును సం, ఊర్ణా-ఉన్ని, లాటిన్-వెల్లిస్ (*Vellus*), గాథిక్-వుల్ల (*Wulla*), జర్మ-వొల్లె (*Wolle*) ఇంగ్లీషు-వుల్ (*Wool*). నేయుట-గ్రీక్-ఉథైనో (*Wthaino*) జర్మన్-విబెన్ (*Weben*), ఇంగ్లీ-వీవ్ (*Weave*). ఇదిసంస్కృతమున "ఊర్ణనాభ" (సాలీఁడు) అను శబ్దమునఁగాననగును, "ఉర్ణ వాభ" అను నదే-ఉర్ణనాభ యయియుండును. వీరి దేవతలు-సం. ద్యాఃపితా, లాటిన్-జూపిటర్, గ్రీకు-జెఉస్ పెటర్ (*Zeuspeter*), సం. ఉషస్, గ్రీకు-ఇయోస్ (*Eos*); లాటిన్-అరోరా (*Aurora*) సం, వరుణ, గ్రీ-ఔరేనోస్-(*Ouranos*) ఇట్టివనేకములు కలవు, ఇట్టి చరిత్రాధారమున కందని ప్రాచీనార్యజన సంఘముయొక్క స్థితిగతులనుగూర్చి మనకుఁ దెలుఁపంగలశక్తి భాషాపదములకుమాత్రమే కలదని సూచించుటకే పై శబ్దములనుగూర్చి యింతగాఁ జెప్పవలసి వచ్చినది.

ఇట్లే మనయాంధ్రభాషను సన్నిహితములగు సోదర భాషలతోఁ బోల్చి చూచి, సజాతీయపదజాలము నేరి, ఆయాభాషలలోని స్వరసంప్రదాయములనుబట్టి తత్తచ్ఛబ్ద పరిణామక్రమము నన్వేషించి, వాని మూలరూపములను

కనిపట్టి, ప్రాచీనాంధ్రభాషా స్వరూప పరిణామములను గుర్తించినగాని, ఆంధ్రుల ప్రాచీన చరిత్రమెట్టిదో గోచరింపదు. ఆ ప్రాచీన భాషనుండి దీని సక్రమపరిణామము నన్వేషించి తెలిసికొనఁగాని మనము ఆంధ్రభాషాభ్యుదయ క్రమము తెలిసికొన్నవారము కాలేము.

అభ్యుదయ మెల్లపుడు మార్పుతోఁగూడినదే. ఏవిధమైన యభ్యుదయమునకును మార్పే, పరిణామమే, కారణము. ప్రపంచధర్మమే మార్పు. కాలానుగుణముగ ప్రపంచమునందలి ప్రతివిషయము, వస్తువు–పరమాణువునుండి బ్రహ్మాండము వరకు–ననవతరము పరిణామమును బొందుచునే యున్నది. కాని యెన్నిమార్పులు గలిగినను నిత్యావ్యవహారమున బ్రవాహానిత్యత్వము వ్యవహార సాధనమగుచునే యున్నది. కాలానుగుణముగ విధినిషేధములకు, గుణదోషములకుఁగూడ మార్పుగలుగుచునేయుండును. అట్లే మన ఆంధ్రత్వము, మనభాష కాలానుగుణమగు పరిణామమునకు లోనగుచునేయున్నవి. ఆ పరిణామక్రమముచుబట్టి ఆంధ్ర జాతీయచరిత్రము, భాష, వాఙ్మయము, కళలు, రాజకీయార్థిక సాంఘిక జీవితపరిస్థితులు మొదలగువానిని సమన్వయించి, పరిశీలించినగాని యాంధ్రాభ్యుదయక్రమము మనకు సువ్యక్తంబుగాదు. కావుననే యీ కాలమున చారిత్రకదృష్టితో సలుపఁబడిన తారతమ్యపరీక్ష (*Historical and comparative study*) ప్రాధాన్యము వహించుచున్నది. సారస్వత విషయమును దీసికొందము. ఒక గ్రంథమునుగాని, సారస్వతశాఖనుగాని పరిశీలించునపుడు, ఆయా రచనల కర్థము, అందలి సారస్యము

చమత్కృతి, గుణదోషములు మొదలగువానిని మాత్రమే గ్రహించి యూరకొనక, వానితోఁ బోలికగల యితరకవుల రచనలతోఁ బోల్చిచూచి, వాని తారతమ్యములనారసి, అందలి విశేషలక్షణములకును నాయాకవుల జీవితములకు నాదేశకాల పరిస్థితులకుగల సంబంధంబెట్టిదో, ఆయాయుగములందలిరచనలాయా జనుల భావముల నెట్లు సూచించుచున్నవో, అంతకుఁ బూర్వయుగమునందలివానికి వీనికిఁగల సామ్యభేదములెట్టివో సకారణముగ నిరూపింప యత్నించుటయే యీకాలమందలి సాహిత్య పరిశీలనమునకుఁ బ్రధానలక్షణముగా గ్రహింపంబడుచున్నది. అంతేకాని యాయా గ్రంధములందలి గుణదోషాలంకార నిరూపణముమాత్రమే కావ్యానుశీలనమునకు ఫలము కాఁబోదు. ఇది మంచిది అది చెడ్డది యని చెప్పుట మాత్రమేకాదు. ఆయాకవులయెడలను, భాషా వాఙ్మయశాఖలయెడలను దత్తద్దేశ కాలసంస్కారప్రభావము యొక్క బలమెట్టిదో పరిశీలించి సమన్వయింపఁగలిగినచో విమర్శనమునకొక విధమగు గౌరవము, ఉత్తేజకత్వము అబ్బును. మహాకవులగు తిక్కన పోతనాదులకుఁగూడ తత్తర పాటులను, అశ్లీలాదిదోషములను నంటఁగట్టవలసిన యవసరముండకపోవచ్చును. "రేఫమ్ములు తాలునుంగదిసి ప్రాసములైన కతంబునంగదా నిమ్ముల నాదిలాక్షణికు లెల్లనుమాని రుదాహరింపగన్" అని అప్పకవి యాదిలాక్షణికుల పాఠమునే యొప్పఁజెప్పినను, బమ్మెరపోతరాజ కృతభాగవతమ్ము జగద్ధితమ్ముగాకుండఁగపో లేదు. రేఫ ఱకారనిర్ణయము విషయమున నాధారబల మీ కాలమునకు సడలుటచే నాతఁ

డద్దానిని పాటించియుండక పోవచ్చును. లాక్షణికుల రేఫ ఉకారనిర్ణయము మాత్రము సరిగ నున్నదా? ఆదికవులకాలముల నానియమము పాటింపఁబడియుండవచ్చును. దానికైనను ప్రామాణ్యంబేమి? సంస్కృత ప్రాకృతములలో శకట రేఫము లేకుండుటచే నితరసన్నిహిత ద్రావిడభాషారూపములను బట్టి నిర్ణయింపవలసిన దేగదా! అట్లు చూచినను దానికొక దారి తెన్ను లేకుండుట ఆయా భాషారూపములను బరిశీలించినవారికిఁ దెలియకపోదు.

ఇట్లు వాఙ్మయ విషయమునవలెనే భాషావిషయమునను "శాస్త్రప్రయోగ వచసోః శాస్త్రంబలవదుచ్యతే" యను వాదమునే పరమప్రమాణముగాఁ జేయక, వ్యాకరణము ప్రయోగ శరణమను విషయమును గ్రహించి, తక్కినవానివలెనే భాషకు గూడఁ గాలక్రమమున జనవ్యవహారమూలకమగు మార్పు సహజమనియు, దాని పరిణామక్రమము నన్వేషించి పూర్వోత్తర రూపములకు సమన్వయముఁ గుదుర్చుకొనవలయుననియు గ్రహించినగాని తద్భాషా చరిత్రమును మనము తెలిసికొనలేము

"శూరుల జన్మంబు సురల జన్మము
నేరుల జన్మంబు నెఱుగంగనగునె"

అని తిక్కనార్యుఁడు చెప్పినట్లుగా నాంధ్రభాషాస్రవంతి పుట్టుకనుగూర్చి తెలిసికొనుట దర్ఘటముగానే యున్నది. నన్నయకుంబూర్వకాలపు టాంధ్రభాషాస్థితిని దెలిసికొనుటకుఁ దగిన చారిత్రక నిదర్శనములు వెనుకటికాలమున నంతగా లభింపకపోవుటచే "మహిమున్ వాగనుశాసనుండు

సృజియించె" నని యా కాలపువా రనుకొనుటలో నాశ్చ ర్యము లేదు; కాని యిటీవలికాలమున నాతనికిఁ బూర్వము నాలుగైదు శతాబ్దులవఱకు శిలాక్షరముగానున్న శాసననిదర్శ నములు కానవచ్చుచుండుటచే, నాచారిత్రక నిదర్శనము లనుబట్టి తెలుంగు భాషయొక్క ప్రాచీనత క్రీస్తుశకము 6, 7 శతాబ్దప్రాంతమువఱకును బోవునని దృఢపడుచున్నది. అంతకుఁ బూర్వమున నీభాషలో రచింపఁబడిన శాసనము లేమియుఁగానరాకుండుటేగాక, యా కాలమున నీ యాంధ్ర దేశమున బయలుదేరిన శాసనములన్నియు సంస్కృతము ననో, ప్రాకృతముననో రచింపఁబడి యుండుటచే, వీనినుండి గా తెలుఁగుభాష యేర్పడినదనియు, వాని వికృతరూపమే యిది యనియుఁ దరువాతి సంస్కృత భాషాభిమానులగు లక్షణ కర్తలు తలంచుట తటస్థించినది. క్రీస్తుశకారంభ కాలమున మహాసామ్రాజ్యము నేలిన యాంధ్ర రాజుల శాసనము లన్నియు నాంధ్ర దేశమున దొరికినవికూడ ప్రాకృత భాషలోనే యుండుటనుబట్టి, ఆ యాంధ్రుల ప్రాకృతభాషయే యిప్పటి మన తెలుగునకుఁ దొలిరూపమనియు, కాలక్రమమునఁ గలిగిన పరిణామముచే నది నేఁ డీరూపు నొందినదనియు, కొందరు ఆధునిక భాషాతత్త్వవేత్తలుకూడఁ దలంచుచున్నారు. ఆంధ్రరాజుల శాసనములు అమరావతీ, జగ్గయ్యపేట, నాగా ర్జునకొండ మొదలుగాఁగల స్థలములలో దొరికినవి క్రీస్తు శకము రెండు, మూడు శతాబ్దులనాటివి కలవు. వీనిని సుమారు నాలుగైదు శతాబ్దుల యనంతరము లభించిన తెలుఁగు శాసనములతో సరిపోల్చిచూచినచో వాని కెంత

భేదముకలదో, మొకటివాని పరిణతరూపమే మనమెఱింగిన యీ తెలుఁగనుట యెంత యసంభవముగాఁగనఁబడునో మీఁకే సువ్యక్తముకాఁగలదు. ఆశాసనములివి.

నాసిక యందలి శిలాశాసనము-వాశిష్ఠీపుత్ర పులుమాయికాలము నాటిది.

సిద్ధం రఞోవాసిఠీపుతస, సిరిపుళుమాయిస సవిచ్ఛరె ఎకున వీసె 19 గింహాణ పఖె బితీయె దివసె. తెరసె రాజస, గోతమీపుతస-హిమవతమేరు మదర పవత సమసారస... ......సెలుగిరి చకోర పవతపతిస సవ రాజలోక మడలపతి గహీతసాసనస,.........సకయవన పల్హవ నిసూదనస... ......సాతవాహనకుల యస పతిథాపనకరస,.........

సిరిసాతకనిని సమాతుయ మహాదేవియ గోతమియ బలసిరీయ సచవచనదాన ఖమాహింసానిరతాయతే పదమనియ మోపవాసత పరాయరాజ రిసివధుసదం అఖిలం అనువిధీయమానాయ, తిరణ్హు 'పర్వాతా' పవత సిఖరే మహాదేవీ మహారాజామాతా మహారాజపితామహిఁదదాతి నికాయస భదావనీయానం భిఖుక సఘస. ఏతసచ వెణాస చితణనిమత, మహాదేవియ అయకాయ సేవ కామా పియకామోచ,......... పితుపతియేథమ సెతుస దదాతిగామ-తిరణ్హుపవతస అపర దఖిణపసె పిసాజి పదకం సవజాతభోగనిరతి

కడపజిల్లాలోని తెలుఁగు చోళశాసనము. *

1. స్వస్తి(శ్రీ) చోటమ

2. [హా] రాజాధిరాజ ప

* *Ep. Ind. vol XI-Page* 345.

3. రమేశ్వర విక్రమాది
4. త్యశ క్తికొమరవి
5. క్రమాది(త్యు)లకొడు(కు)
6. [ళ్]కాశ్యపగోత్రు
7. (న్రు)శత్యదిను్రు శిద్ధి
8. [వేయు] రేనాణ్డు ఏళు [వే]
9. [ల]ఏళుచున్రి.కొ[ము]
10. [అి]పాఅ రేవశ
11. [మఁ] కాశ్యపగో
12. త్రినికి ఇచ్చిన
13. ...... చిఱుంబూరి ఉ త్త
14. ......శ. తూపుఁనదిశ
15. దు జుగ్గి పొల గ [రు]
16. సు ద [క్షి]ణ [దిశ]
17. ...... పాఅ [ము]
18. ఏను మఱుత్రుగా
19. నుతాగిరి దేని
20. సల్పినవాికి
21. వేగు(ళ్) ళువు వేసె
22. ఉువుళు వేవాన్రు
23. ఉ్కు నిల్పినంపుణ్యం
24. బు దీనికి వక్రంబు
25. వచ్చువన్రు పుత్రవ
26. ద్యస్త్రీవద్య [గోవ]

27. ద్య పఞ్చమ [హా]
28. [పా] తకఞ్చేసి [న]
29. వానిలోక [ం] [బు]
30. నున్తు వాన్తు.

వీనిని బట్టి చూడఁగా నిందలి క్రియారూపములు విభక్తిరూపములు మొదలగునవేగాక రచనా పద్ధతులందు భాషాతత్త్వమునందుగూడ భేదమగపడుచుండుటచే నాంధ్ర రాజుల భాష మనమెఱిఁగిన ఆంధ్రమే కాదేమో యను సందేహము కలుగకమానదు. వారి శాసనభాష మనకుఁ బరిచితమగు నాంధ్రము కాదనుట స్పష్టమే, కాని యీ రెంటికిని ముడిపెట్టుట కొఱకే దాని వికృతరూపము-లేదా పరిణత రూపము-ఇది యని కొందఱు వాదించుట. ఆ బౌద్ధ యుగమున ప్రాకృత భాషకుఁగల ప్రాబల్యమును బట్టి యాంధ్రరాజులు ప్రాకృతమునే రాజభాషగా గ్రహించి శాసనముల నందే రచింపించినను, ఈ దేశమున వారి నిత్య వ్యవహారమున మన మిప్పు డెఱింగినయాంధ్రభాషనే వాడుకొనియుందురు. కాని యీవిషయమును నిర్ణయించుటకుఁ దగిన యాధారములు మాత్రము లేవు. అయినను, ఆ కాలపు టాంధ్ర దేశీయుల వ్యవహారమందున్న భాష పై శాసన భాష యగు ప్రాకృతముకంటె భిన్నమని మాత్ర మూహించుటకు భరతాదుల వాక్యములే నిదర్శనములగు చున్నవి. భరతుఁడు నాట్యశాస్త్రమున ఆంధ్రులభాష ప్రాకృతముకంటె భిన్నమగు భాషగాఁ బేర్కొని యున్నాఁడు.

"సబర్బర కిరాతాంధ్ర ద్రవిడాద్యాసు జాతిషు
నాట్యప్రయోగే కర్తవ్యం కావ్యం భాషాసమాశ్రయం"

అని చెప్పిన పిదప ప్రాకృతభాషల ప్రయోగపద్ధతిని గూర్చి తెలుపుచు,

"జాతి ష్వేతాసు సర్వాసు శుద్ధాముచ ద్విజోత్తమాః
శౌరసేనీం సమాశ్రిత్య భాషాకార్యాతు నాటకే
అథవా ఛందతః కార్యా దేశభాషాప్రయోక్తృభిః
గవాశ్వాజావిరోష్ట్రాది ఘోషస్థాన నివాసినాం
అభీరోక్తిః, శాబరీవా, ద్రావిడీ ద్రావిడాదిషు"

దీనిబట్టి ఆ కాలమునకు ఆంధ్రము, ద్రావిడము అనునవి భిన్న భాషలుగాఁ బరిగణింపఁబడుచున్నవనియు, వీనికిబదులు శౌరసేనీ ప్రాకృత మొకప్పుడు ప్రయోగింపఁబడఁదగి యుండుటచే నివి దానికంటె భిన్నములనియు స్పష్టమగు చున్నది.

7-వ శతాబ్దమువాఁడగు కుమారిలభట్టు వైదిక భాషలో సంక్రమించిన మ్లేచ్ఛభాషాపదముల కర్థనిర్ణయము చేయు పట్ల సంస్కృత వైయ్యాకరణులా మ్లేచ్ఛ పదములకు సంస్కృతవ్యుత్పత్తులను గల్పించి వానియర్థము నెట్లు సమర్థించు చున్నారో చూపుటకుఁగా ద్రావిడభాషాశబ్దములగు 'చోర్' పాంబు, వయిర్, అతర్, మొదలగువాని నుదాహరణముగా జూపియున్నాఁడు, "చోర్" అను తమిళ శబ్దమునకు "చోర" శబ్దముతో నభేదమును గల్పించియు, పన్థానము-మార్గము అను నర్థముగల "అతర్" శబ్దము త్యా-తరణౌ యనుధాతువు నుండి నిష్పన్నంబైనట్లుగాఁ దలంచి తరింపశక్యముగానిది

గనుక-మార్గమును "అతర్" అనుట యుక్తమేయని యా నిష్పత్తిని సమర్థించియు, సర్పవాచియగు "పాప్" (తె-పాము) శబ్దమును-"పాపః" అను శబ్దముతో నభేదము చేసి-వాస్తవముగా పాము-పాపియేగావున నా వ్యుత్పత్తి సరియైనదేయని చెప్పుచు నిట్లు ద్రావిడాది మ్లేచ్ఛభాషాపదములకుఁగూడ స్వభాషానురూపములగు నర్థములను వ్యుత్పత్తులను గల్పించుచున్నారని తంత్రవార్తికమునఁ జెప్పియున్నాఁడు.

దీనినిబట్టి ద్రావిడము నాతఁడు ప్రాకృతభేదముగాఁ గాక మ్లేచ్ఛభాషగా గ్రహించినట్లు స్పష్టము. ఈతఁడే ఆంధ్రభాషలో రాజన్ శబ్దమునకు పాలకుడను నర్థమేగాక క్షత్రియ పరమగు నర్థముకూడ వ్యవహారమునఁ గలదని చెప్పుటచే నాంధ్రభాష ద్రావిడ ప్రాకృతములకంటె భిన్నమైనట్లు వ్యక్తము చేసినట్లైనది. ఈతని కాలమునకుఁ దెలుఁగు భాష శాసనములలోనికి యెక్క నారంభించినది. కావున నేడవ శతాబ్ది ప్రాంతమున శాసనములలోఁ గనంబడు తెలుఁగు భాష అంతకుఁ బూర్వము-ఆంధ్రరాజుల కాలమునుండియు గూడఁ దెలుఁగు దేశమున వ్యవహారములో లేదని చెప్పుట యెంతమాత్రము యుక్తిసహము కాదుగదా. అనఁగా నాంధ్ర జాతివారు వింధ్యదక్షిణ ప్రాంతమునుండి దక్షిణాపథమునకు వచ్చి కృష్ణాగోదావరీ మధ్యదేశము నాక్రమించి యచ్చటి జనులతోఁ గలిసిపోయి మహాసామ్రాజ్య స్థాపకులై ప్రఖ్యాతి గడించిన వారగుటచే, నీ దేశమునకు, దేశీయులకు, తెలుఁగు భాషకు నాంధ్రనామ మబ్బినదేగాని, యీ దేశము నిర్జనారణ్యం బగుట కాని, యచ్చట దేశీయంబగు భాషయే

లేకపోవుటగాని తటస్థింపలేదు. కాని యీ కాలములోనే తెలుఁగులో ననేకములగు ప్రాకృతపదములు చేరియుండుటచే నది దీనికి ద్వితీయప్రకృతియని తరువాతి వారు తలంచుటకుఁ దగినస్థితి యేర్పడియుండును. అటు పిదప ప్రాకృతములు వెనుకఁబడి సంస్కృతభాషకు ప్రాముఖ్యముగలిగిన కాలమున, "తల్లి సంస్కృతంబె యెల్లభాషలకును" అనువాదము బయలు దేరినదిగాని, యీలాక్షణికులును, తరువాతి కవులలో పాల్కురికి సోమన, నన్నెచోడాది కవులునుగూడ జాను దెనుఁగు, దేశి అనునదే సర్వసామాన్యముగ దేశము నకు స్వతస్సిదమగు భాషయని యుద్ఘోషించుచునే యుండిరి. కావున నీ దేశీస్వరూపనిరూపణమే మన యాంధ్రభాషా చరిత్రాన్వేషణమునకు మూలసూత్రంబగునని మనము తలంప వలయును. ఈ తెనుగు దేశియొక్క నిజస్వరూపము తత్సమతద్భవ రూపమగు సంస్కృత ప్రాకృతగంగాప్రవాహ ములోఁ బ్రతిఫలింపదువుగావున దక్షిణదేశమునందలి ద్రావిడ భాషాప్రవాహినిలో నెంతవఱకుఁ బ్రతిఫలించియున్నదో పరిశీ లించి తెలిసికొనవలసియున్నది. మలయాళభాషలోని కేరళ కౌముదీకర్త యీ భాషాస్వరూపము నిట్లు స్మరించినాఁడు.

"సంస్కృతహిమగిరి గళితా, ద్రావిడభాషాకళిందజామిళితా
కేరళభాషాగంగా విహరతు మే హృత్సరసదా సంగా"

మన వాగనుశాసనుఁడగు నన్నపార్యుడుకూడ నిట్టి గంగాయమునల సంగమము వలన నేర్పడిన యాంధ్రభాషా రూప దక్షిణగంగాప్రవాహమునే దక్షిణాపథమున పాఱించి ఆంధ్రవాఙ్మయ స్వాదు ఫలములతో మనకు సంతర్పణచేసి

నాఁడు. ఆంధ్రరాజులు విశాల సామ్రాజ్యమును నెలకొల్పి ఆంధ్రకళలను పోషించి ఆంధ్రాభ్యుదయమునకుఁ దోడ్పడినను, ప్రాకృతభాషను చేపట్టినవారగుటచే నాటి తెలుఁగు భాషకు వన్నెయు, వాసియు లేకపోయినది. తెలుఁగు భాషలోని సహజములగు దేశిలక్షణములు మరుగువడి సంస్కృతముతో వేసిన పైపూత మెఱుఁగులఁ జిమ్మ మొదలుపెట్టినది. అయినను తిక్కన సోమనాథులు దేశి తెనుఁగు తేఁటనిగ్గుల తియ్యదంనమును గొంత చవిచూపుటచే, దాని స్వరూపమన్వేషించుటకు మార్గమేరపడినది. మఱియు ద్రావిడభాషా కళిందజ సంస్కృత గంగాప్రవాహముతోఁ గలిసి ప్రవహించుచున్నను, ఆప్రవాహమునఁగూడఁ దన ప్రత్యేకతకుఁ జిహ్నమగు స్వీయ వర్ణము (ల)ను నిలుపుకొని చూపఱులకు నిజ స్వరూపము వ్యక్తము చేయుచునే యున్నట్లున్నది. దీని ప్రత్యేక వర్ణము ఱ ఱాత్మకమగుటను బట్టి దీనిని మనము గుర్తింపవచ్చును.

నన్నయకుఁబూర్వకాలమునందలి తెలుఁగు శాసనములను బరిశీలించినచో నందు ద్రావిడభాషల ప్రత్యేకతకు చిహ్నములగు వర్ణములందు తెలుగు దేశిస్వరూపమేగాక దాని పరిణామ క్రమముకూడఁ గొంత వ్యక్తము కాకమానదు వెనుకఁ జూపిన తెలుఁగు శాసనమును బరికించినచో నందు ముఖ్యముగా సంస్కృత ప్రాకృతములలో లేని రెండు వర్ణములు ఱ, ఴకారములు కానవచ్చుచుండుట స్పష్టము. ఇవియే (ఎ. ఒ లుకూడను) సంస్కృత గంగాప్రవాహముతోఁ గలి ప్రవహించుచున్న దేశీయంబగు ద్రావిడభాషాప్రవాహముని

గుర్తించుటకుఁ దోడ్పడు ముఖ్యవర్ణము లనవచ్చును. ఈ భాషాప్రవాహము నన్నయకుఁబూర్వము కొంత కాలము వఱకు నందలి గంగా యమునల ప్రత్యేకస్వరూపమును వ్యక్తము చేయుచునే ప్రవహించినను, ఆతనికాలమునాటికి రెండును గలిసిపోయి వానినిఁ గుర్తించుటకు వీలులేకుండు స్థితి యేర్పడినది. కావున నన్నయకుఁ బూర్వగాలపు శాసనములలోనే యీ ప్రవాహమును మనము గుర్తింపవలెను. ఈకాలపు తెలుఁగు శాసనములలోనేగాక నాగరలిపిలో వ్రాయఁబడిన సంస్కృతశాసనములలోఁ గూడ ఆంధ్ర దేశీయ గ్రామనామములను వాని సరిహద్దులను జేర్కొను సందర్భములలో నాభాషలో నీ వర్ణములు గాని, వాని లిపిగాని లేకుండుటచే నందీద్రావిడభాషావర్ణములను ద్రావిడ లిపిలోనే వ్రాయవలసిన యావశ్యకత యేర్పడినది.

విషమసిద్ధియను నామాంతరముగల మొదటి విష్ణువర్ధనుని తిమ్మాపురం శాసనమునను, చీపురుపల్లి శాసనమునను —"విష్ణుశర్మమాధవ శర్మాభ్యాం పటకి విషయె చెఱుపూర గ్రామోయం దత్తః" అనియు "పటకి విషయె కుములూరం నామగ్రామం" అనియు వ్రాయబడియున్నది. 7–వశతాబ్ది ప్రారంభమునందలి రెండవపులికేశి అను చాళుక్యరాజు యొక్క కొప్పరపు తామ్రశాసనమున కర్మరాష్ట్రమునందలి ఇబుఱలి గ్రామక్షేత్రమున కెల్లలు చెప్పుటలో "కొణ్డవేఱు పూవఱధా దక్షిణతః" "నివఱుఱుధా ఉత్తరతః" అని శకట రేఫమే వ్రాయబడినది.

విష్ణుకుండిన వంశీయుఁడగు రెండవ విక్రమేంద్రవర్మ చిక్కుళ్ల శాసనమందు "తెందులూర" వాసకాత్...... రేగోన్నమ్ నామగ్రామం దత్తం" అనికలదు. ఈ తెందులూరే ఏలూరు సమీపమునందలి యిప్పటి "దెందులూ" రని తెలియవచ్చుచున్నది. ప్రాచీన భాషలోని "ఱ" కారము సామాన్యముగాఁ దరువాతి తెలుఁగున "డ" కారముగాను, అర్వాచీన కన్నడమున "ళ" కారముగాను మాఱుట కలదు. కాని ఈ "ఱ" కారము కాల క్రమమున "ద" కారముగాఁ గూడ మాఱినదన్నందుల కిదియొక నిదర్శన మనవచ్చును.

7-వ శతాబ్దిమధ్యభాగమునందలి మొదటి విక్రమాదిత్యుని తలమంచి శాసనములో ఱ, ళ, ఱ, కారములు మూఁడును గానవచ్చుచున్నవి. "శ్రీ మేఘాచార్యాయ స్వకీయగురవే కొఱచుంకొ(న్న) గ్రామస్యోత్తర పార్శ్వే ఏళసత్తిర్నామగ్రామః దత్తం." ఈ శాసనము నాగరలిపిలోనే కలదు. రెండవఅమ్మరాజు మలియవూండి శాసనములో "ఆగ్నేయతః రావియ పెరియ 'చెఱువు'-పశ్చిమతః మల్కపట్టు, కోఱబోయు తటాకంచ" అని కలదు.

5-వ శతాబ్దమునాటి (క్రీ, శ. 436) పల్లవరాజగు రెండవ శివస్కందవర్మయొక్క ఒంగోడు శాసనములో "కర్మరాష్ట్రే ఒంగోడు గ్రామః-నఱాచడు గ్రామోదక్షిణతః పెఱుకపట్టుగ్రామ ఉత్తరతః" అని కలదు. 10-వ శతాబ్ది ప్రారంభమునందలి ప్రథమచాళుక్యభీముని అత్తిలి తామ్రశాసనమును వ్రాసినవాఁడు "చామకుట్ఱాచార్యుడు"

ఇట్లు చోళ చాళుక్యరాజుల తెలుఁగు శాసనములలో నీ వర్ణములతోఁ గూడిన పదము లనేకములు గానవచ్చుచునే యున్నవి.

పై నుదాహరించిన శాసనములలో "చోఱ" మహారాజ, 'ఏఱు (వేల)' అనియు. యుద్ధమల్లుని బెజవాడ శాసనములో 'ఱస్సి, అఱిపుట,' అనియు నిట్లు ఱకారముతోఁ గూడిన శబ్దము లనేకములుగలవు. ఈ శబ్దములే తరువాతి కాలమున చోడ, ఏడువేల. డస్సి, అడచుట మొదలగు రూపములను బొందియున్నవి.

ఇట్లు నన్నయకుఁ బూర్వపుశాసనములలో ననేక పదములలో గనంబడుచున్న యీధ్వని తరువాతి కాలమున మార్పు జెందిన దగుటచే రూపుమాసి యంతరించినట్లగపడు చున్న దేగాని యీ భాషలో నొకప్పుడది లేకపోలేదు. కన్నడ భాషలోని "ఱ" కారము 13-వ శతాబ్దివఱకు నిలిచి యున్నది. దక్షిణదేశభాషలకు విశేష చిహ్నమనదగు నీ "ఱ" కారము ఇటీవలికొన్ని యుత్తరహిందూస్థాన భాషలలో అనఁగా బెంగాలి మొదలగు వానిలోను, ఉఱియా, మార్వాడీ మొదలగు భాషానామములలోను గనబడుచున్నది గావున, నార్యప్రాకృత భవములగు నీభాషలలోవలెనే, తమిళ కన్నడాది దక్షిణదేశభాషలలోఁగూడ నిటీవల కాలమున నార్యభాషాశబ్దముల యుచ్చారణములో గలిగిన మార్పువలన నేర్పడినదేగాని ద్రావిడ భాషల కిది ప్రత్యేక చిహ్నమనుట తగదను వాదమొకటి బయలుదేరినది. కాని

ప్రాచీన ప్రాకృతములలో నీ వింతర్ణము లేదనుట నిశ్చయమే గదా? ఇది క్రీస్తుశకము 10-వ శతాబ్ది ప్రాంతమున బయలు దేరిన వనందగిన యుత్తరహిందూస్థానభాషలలో దేశీయము లగు ద్రావిడభాషల సంసర్గముచేఁ బొడ సూపినదనియే చెప్ప వలయును. క్రీస్తుశకాదినుండి ప్రసిద్ధవాఙ్మయముతో నలరారు తమిళములోను, తరువాతి కాలమున కన్నడాంధ్రములలోని శాసనములలోను, ఇంక ననేకములగు సమానార్థక పదముల లోను ధాతువులలోనుకూడ నీవర్ణము ప్రత్యేకముగాఁ గాన వచ్చుచునేయున్నది. ఈపదజాలము, అందలి యీవింత వర్ణము, అదియంతయు ఈ ఉత్తర హిందూస్థాన భాషలలో వలెనే యర్వాచీన కాలమున సంస్కృత ప్రాకృత శబ్దము లలోఁ గలిగిన సహజ పరిణామఫలితమే యనుట కేవల హాస్యాస్పదము. ఈ యొక్క-ధ్వనియే యీ ద్రావిడభాషా పదములలో నెన్నిమార్పులకు లోనై తెలుఁగులో నెట్టి రూపములను బొందియున్నదో, దీనిమూలమున నీదక్షిణదేశ భాషలసాజాత్యము, అనేకము లగుసాంధ్రాభాషాపదములయు, ధాతువులయు ప్రాచీనస్వరూపము, చరిత్రము ఎట్లువ్యక్తము కాఁగలదో, ఈక్రిందిపదముల పట్టికనుబట్టి మీరు గ్రహింపఁ గలరు. కన్నడమున శబ్దమణిదర్పణమను వ్యాకరణమును రచించిన కేశిరాజను నాతఁడాభాషలో నీ వర్ణముతోఁ గూడిన కన్నడశబ్దముల పట్టిక నిచ్చినాఁడు. దానినిబట్టి వానిలో నేవి తెలుఁగులో నెట్లు పొడసూపుచున్నవో కొంత వఱకుఁ దెలిపెదను.

కన్నడము.	తెలుంగు.	అఱవము
ఴకారాంత ధాతువులు		
కుఴి, ఖననే, *to dig*	గ్రొయ్యు, - గ్రొచ్చు, త్రవ్వు *cf.* గొయ్యి (*a pit*)	కుఴి
ఇఴి=నిమ్నావతరణే *to come down, descend*	ఎఱఁగు(నమస్కరించు) (ఇళిగు>)డిగు > దిగు	ఇఴంగు
ఉఴి=అవశిష్టే, విమోచనేచ, *to remain*	ఉడుగు = మాను	
అఴి=వినాశే, (*to be ruined*)	అడఁచు; అఱు (పెం అఴి పఱు)	
కఴి=నిధనాతిదూరయోః *to end, to die, to go or be removed, very far.*	కడచు	
బఴి=సమ్మార్జన, మార్గ వంశేషు=*to sweep, road, race.*	వడి (మార్గము *cf.* వడి-ప్రాస,) బరి(గిఱి) వలయాకారపు రేఖ "పర్ణశాలకు జుట్టు బరు లేడు వ్రాసి." శ.ర.	వఴి-మార్గము
పఴి=నిన్దాయాం.	పడు, పఱచు	
సుఴి=భ్రమణె *to turn round, a whirlpool.*	సుడియు, సుడిగుండము.	సుఴి
"తుఴి"=పాదసంఘట్టనె *to trample on*	త్రొక్కు	
పీఴి=నిర్ద్రవకరణె (=పిళి) *to squeeze out*	పిడుచు	
కొఴె=జీర్ణె *to decay, to rot*	కుళ్లు	

ఎళి=ఆక్రమణాకర్షణె, *to draw with power, to pull, drag.*	ఈడు, ఈడ్చు,	
ఉళి=హాల విలేఖనె *to plough, make furrows.*	దున్ను, దూకుచు	
అళి=రోదనె. *weep*	అడలు	
అగళ్ = ఖననె = *to dig*	*cf.* అగడ్త దీనికి నామవాచకరూపమేగాని క్రియారూపమీ భాషలోనంతరించినది	
తెగళ్ = నిందాయాం *-to rebuke, blame*	తెగడు.	తిగళ్
పొగళ్ =సంస్తవనె *to praise*	పొగడు	పుగళ్
నెగళ్ = ఉద్యోగఖ్యాతయోః, *to engage in, to be known or famous*	నెగడు	
మగుళ్ =నివర్తనె *to return*	మగుడు	
ఆళ్ =జలనిమజ్జనె *to dive, or sink in water*	ఆడు	
బాళ్ =జీవనె, *to live*	బ్రదుకు ళకారము డకారమైయున్న రూపము—	బళ్దు

“బాడుదల” పట్టు (= జీవగ్రాహం గృహీత్వా) అను పదబంధములో నిలిచియున్నది.

పోఴ్ = విదారణె, *to cleave assunder, split*	పొడుచు	
పూఴ్ = ఆచ్ఛాదనె, *to cover*	పూడు, పూడుచు	
బీఴ్ = పతనె = *to fall*	పడు	
ఏఱ్ = ఉత్థానె = *to raise*	ఎక్కు = ఏర్ + కు = ఏర్కు > ఎక్కు. *cf.* ఏతాము, ఎగుమతి	ఏఱు
ఏఴు = సప్త = *seven.*	ఏడు	ఏఴ్
ఊఴిగ = *work, seruise*	ఊడిగము	ఉఴ = *to toil*
ఒఴుకు = నదీప్రవాహే, *to flow*	ఒలుకు, ఓడు	ఒఴుగు.
కళి = *sour gruel.*	కలి (ఆంబలి)	కళి
కఴి = గర్భం.	గాడిద	కఴుతె
కఴి = *a bamboo pole.*	గడ	కఴై
కాఴు = *forest.*	కాడు	కాడు
కీఴ్ = *the state of being low*	క్రిందు	కీఴ్ కీఴుక్కు
కూఴ్ = *boiled rice*	కూడు	కూళ్
కుఴ్గు = *to contract, shrink*	క్రుంగు.	
కూళ్ = *a stupid, vile man*	కూళ	కూళై
కోఴవె = *tube*	కుళాయి, కొళాయి. *cf.* గ్రోవి.	కుళాయ్

కోటి=*A cock, hen*	కోడి	కోటి
తల్లటం=భయం	తల్లడము_తల్లడిల్లు	
తాటి=*palmyra*	తాడి (చెట్టు)	తాటి
తుప్పాటు=పక్షిరోమం	త్రుప్పాడు=గోర్జెబొచ్చు	
తేళ్=వృశ్చికం	తేలు.	
నిటల్=*shade.*	నీడ	
పటియాగ=కేతనం	పడగ (*cf* గాలిపడగ) (పగడ)	
పటుకై=*bed*	పడక	పడుక్కె
పఴి=*to abuse, to rebuke*	ప్రయి *cf.* ప్రయిపెట్టు	పళి
పాటిల్=*A dwelling place, a town.*	ప్రోలు ఇది "ట" కారముతో కూడిన పదముగావు నని కొన్ని ప్రాచీన తెలుగు శాసనములలో "పుటోలు" అనురూపమున గనబడుచున్నది. పుటోలు ప్రోలు అయినది	పాటిల్=*a country*
ముఱ్గు=*to sink under water*	మునుగు, ములుగు ముడుగు	ముళ్ గు
మొఱం=*cubit*	మూర	మొఱమ్
మొఱగు=*to bend, to bow*	మ్రొక్కు	
వాత్తి=ప్రయోజనం	బ్రాతి. (*cf.* బ్రాతియొ=ఒక తెక్కు)	
బోటతర=*bald*	బోడితల.	
మొఱగు=*to sound as an instrument* వాద్యం *cf* (కుక్క మొఱుగు)	మ్రోగు.	

హాఱుదు=*old* =పళదు,	ప్రాఁత cf పండు=*fruit.*	పట పళమ్=పండు
హాళ్ <పాళ్ *ruins, destruction*	పాడు	పాళ్
హుఱు>పుళు *A worm* హుఱుకు.	పురుగు cf. పుచ్చు= పుర్+ఉచు పుర్చు> పుచ్చు.	
హాట్ >పేళ్, పేళ్	ప్రేలు	పేచు

ఇట్లే శకట రేఫముతోఁగూడిన శబ్దములుకూడ సమానార్థకములై సజాతీయములై యీ భాషలన్నిటిలో సమానముగఁ గనఁబడుచున్నవి అనేకములు కలవు. కొన్నిటిని మాత్రమే యిచ్చుటఁ దెల్పెదను. క. మెఱె-విడంబె-తె మెఱయు, తెఱె—అనావరణె-తెఱచు, నెఱె-సమగ్రత్వే, నెఱ, మఱె-విస్మరణె, మఱచు, తోఱె-విసర్జనె, తొఱగు, అఱె=జ్ఞానే, ఎఱుఁగు; పఱె=విచ్ఛిత్తౌ, cf. పఱియ (వాపంగ etc);ముఱి-మోటనే ఖండేచ, ముఱియ, తఱె=ఛేదే,తఱుగు, నుఱె-సంచూర్ణె, నుఱుము; మీఱు-అతిక్రమణె; మీఱు, కేఱు - శూత్కరణె, చెఱుగు, తోఱు - దర్శనే - (తోర్చు)=తోచు cf. త్రోవ, కాఱు-వమనే, క్రక్కు; కెదఱు —కీర్ణె, చెదరు; బెదఱు-వ్యస్తే, బెదరు; కిఱు-వ్యవధానే, క్రిక్కిఱియు, కొఱె - ఖండనె, కొఱత; ఆఱు - నిర్ద్రవే, (తడి) ఆఱు.

ఈ శకటరేఫము ద్విత్వమైనచో నది టకార రేఫ సంయోగమువలె పలుకఁబడుచుండుట ద్రావిడభాషాసంప్రదాయ సిద్ధము. అది యిప్పటికిని తమళమునఁగలదు. ఈ

సంప్రదాయమునుబట్టి యాంధ్రమున ద్విరుక్తటకారముతోఁ గూడిన రూపములుకొన్ని బయలుదేరినవి. వైయాకరణులు చారిత్రక దృష్టితోఁ బరిశీలించినవారు కాకపోవుటచే దీని తత్త్వమును గ్రహింపక ఆయా సందర్భముల దిరుక్త టకార విధానము మాత్రముచేసిరి. చిఱు+ఎలుక = చిఱ్ఱు > చిట్ఱు > చిట్టు+ ఎలుక = చిట్టెలుక-అయినది మాఱు—మాఱ్ఱు = మాట—అనఁగా మాఱుబలుకుట. ఊఱు నుండి, ఊఱ్ఱు-ఊట్టు(*to flow, to leak*) ఊట, మొదలగున వేర్పడినవి.

ఉఱి-నుండి-ఉట్టి.

కఱ్ఱ-కట్టె.

త. కుఱ్ఱు (*to pound, strike*) కొట్టు

త. చుఱ్ఱు—తె. చుట్టు, చుట్ట.

త. కున్ఱు = తె. కొండ, గుట్ట.

త. పుఱ్ఱు = తె. పుట్ట, కన్న. = పుత్తు.

తె. మిఱ్ఱు-మిట్ట. కఱచు-నుండి-కాటు, గీఱు నుండి గీఁటు, చిఱునుండి చిట్టి, తేఱు నుండి తేట. ఇట్లు ట, ట్టలతోఁ గూడిన యనేక శబ్దములకుఁ బూర్వ రూపములు శకట రేఫముతోఁ గూడినవేయని తెలియవచ్చుచున్నది. ఈ పూర్వరూపమునకు సన్నిహిత ద్రావిడభాషలలో వెదుక వలసినదేగాని సంస్కృతప్రాకృతములలోగాని, ఇటీవలి ఉత్తరహిందూస్థానార్యభాషలలోగాని వెదకిన లాభము లేదు.

ఇట్లే కొన్ని సూత్రములనుబట్టి ఆంధ్రభాషాశబ్దముల పూర్వస్వరూపమును, చరిత్రను, కాలక్రమమున నవిమాఱుచు వచ్చిన విధమును ఇతర ద్రావిడభాషలలోని ధాతువులతోను

రూపములతోను సరిపోల్చి కనిపట్టవలసియున్నది. మచ్చుకు మఱియు రెండు విధానములను దెలిపెదను.

తాలవ్యీకరణవిధానము—దీనినే '*Law of palatalisation*' అని చెప్పుదురు. అకారమునకు క వర్గకు స్థానము కంఠముగదా! కావున వీనిని కంఠ్యములందురు. ఇకారమునకు, చవర్గమునకు, యకారమునకు స్థానము తాలువు—కావున వీనిని తాలవ్యములందురు. పలుకుబడిలో కకారము పై అకారమున్నచో రెండును కంఠ్యములే కావున కకారము కంఠ్యముగనే నిలుచును. కాని కకారముపై తాలవ్యమగు ఇకారముగాని ఎ. ఏలుగాని, యకారముగాని నిలిచినచో నా కకారము కొంతవఱకు తన కంఠ్యత్వమును బోఁగొట్టుకొని తాలవ్యంబగు "చ" కారమువలె పలుకఁబడుట తటస్థించును.

కావుననే కొన్ని ప్రాచీన శబ్దములందలి కి, కీ, కె, కే, వర్ణములు కాలక్రమమున పలుకుబడిలో చి, చీ, చె, చే, వర్ణములతోఁ గూడినవిగా మాఱిపోయినవి. తెలుఁగు భాషలో నీవర్ణములతోఁ గూడియున్న శబ్దములలో ననేకము లిట్టి మార్పులవలన నేర్పడినవే. కొన్నిటిలో రెండురూపములు మనభాషలోనే గానవచ్చును. కొన్నిటి విషయములో కకారసహిత రూపము లితరభాషలలో మాత్రమే నిలిచి యుండుట తటస్థించును. అట్టివానిని వెదకి, సరిపోల్చి, గ్రహింపవలసియుండును. ఇట్లు ఇతర సన్నిహిత భాషారూపములతోఁ బోల్చి పరిశీలించినగాని యొక భాషలోని పదములచరిత్రము వాని పుట్టుక పూర్వోత్తరములు బయలువడ వన్నమాట.

మన తెలుఁగులోని చకారాది శబ్దముల నేకములీ తాలవ్యీకరణ విధానము మూలముగా నేర్పడిన ట్లేయున్నవి. చూడుడు.

చిలుక—దీని తమిళ కన్నడరూపములు కివర్ణములతోఁ కూడియున్నవి. త. క.—కిళి—గిళి=చిలుక యనియే యర్థము. ఈ రెండు నొకశబ్దముయొక్క విభిన్నరూపములే. ఇందు మఱియొక విశేషమేమనగా— తెలుగులోవలె తుదిని కకారము లేదు. ఈ కకారమెట్లువచ్చినది ముందు తెలిపెదను. *

చెయి, చేయి—కై!, కేలు మొదలగు రూపములు తెనుఁగున నే గలవుగదా! కన్నడమున కెయ్, గెయ్—ధాతువు, తెనుగున "చేయు" ధాతువు. ఇందలి కకారమునకు తాలవ్యాచ్చు అగు ఎ కారము పరమగుట చేతనే, దీని సాహచర్య బలముచే కకారముకూడ తాలవ్యమై చకారముగామారినది. కావుననే మన భాషలో ప్రాచీనంబులగు కై, కయి, కేలు మొదలగు కకారాదిరూపములతోఁబాటు, అర్వాచీనంబులగు చకార సహిత రూపములుకూడ వాడుకలోనికి వచ్చియున్నవి. కకారరూప మొకప్పు డీ భాషలో నంతరించి పోవచ్చును. చకార సహితరూపమే మిగిలియుండవచ్చును. అప్పుడితర సన్నిహిత భాషలలో దీనికి సమానార్థకమైన కకారసహితరూపమును కనిపట్టినచో నీ భాషల సాజాత్యము. సన్నిహితత్వము, అయాపదముల ప్రాచీనచరిత్ర మొదలగు వానిని మనము తెలిసికొనుట కవకాశ మేర్పడును.

చేను—cf. కయ్య—కయ్యలు=మడి. (కైయ—ప్రాచీన రూపమై యుండును.)

*ఇది బహువచనప్రత్యయమగు "కళ్" అను దాని యవశిష్ట భాగము.

చేదు—cf. త. కన్న. కయ=to be bitter, astringent
చెన్ను—(చెందొవ—కెందమ్మి) కెం, కెంపు శబ్దములు కకార సహితము లీ భాషలోనే గలవు.
చెవి—కన్న. కివి, కివి, (ear) cf. కేళ్—ధాతువు—వినుట అను నర్థము కలదు. త. కేళ్వి= (ear, hearing)
చెవుడు— cf. కన్న—కివడు, కివుడు.
చెడు, చెడ్డ. కన్న.—కిడు (to go to ruin) త. కెడు, కెట్టు—(to perish, to be destroyed, to decay, rot)నశించు, క్రుళ్లు.
త—కెడుదల్ (ruin) కెడుది—తె—చెడుగు.
త—కెడుకాలం—చెడ్డకాలము.
చిచ్చు—అగ్ని,కన్న.—కిచ్చు (Fire), కాళ్ కిచ్చు=కాఱుచిచ్చు wild fire.
చిఱుగు—cf. త—కిఱి to be torn, rent into shreds, burst out.
చింపుట—cf. త. కిఱి త్తల్
చీలిక—త. కిఱి, a piece of cloth torn of.
చిలుము— కన్న.—కిలిబు, కిలుబు, త—కిళిమ్బు
చీము } కన్న.—కీ—(రక్తపక్వ త. చీఙ్, మ—చీ
చివుకు—చీకు } to become pus
చెక్కిలి, చెక్కు. కన్న.—కెక్కె, త. కన్న
చెఱువు—కన్న. కెఱె; త. చెఱ్ఱె—tank.
చెలిమి— } కన్న. కెళె, త. కెళి—friendship
చెలువుడు— } త. కెఱువు—to unite, to embrace. కెఱువు—friendship.

చెదురు– క. గెదరు, త. చెదఱు
చెట్టు– కన్న. గిడ, త. చెడి (*a tree.*
చెక్కు–– కన్న. కెత్తు; త. చెదుక్కు––(*to chip*)
చెఱుగు }
చేట } –(*to winnow*)–కన్న. కేఱు–(శూర్పకరణే)
చెనకు–(*to provoke*)–కన్న. కెణకు.
చెదరు– *to scatter*–కన్న. కెదఱు, త. చెదఱు
జేన–(*a span*)–కన్న. గేణ్, గెణ, త. చాణ్, శాణ్
చీఱు–కన్న. కీరు, గీఱు– తె. గీఱు, గీఱు. గీయు *to scratch*
చెదలు. కన్న. గెదలు, మ. చిదల్, త. చిదలై, చిఱుక–కన్న.

కాని క కారము తాలవ్యాచ్ఛరకముగానిచో నీ మార్పు కనఁబడుటలేదు.

కన్న–తమి; తెలుగు.
కణ్–కన్ను, *eye*
కడల్–కడలి, *sea*
కట్టు–కట్టు, *to bind*
కన్దు–కన్దు, *a calf.*
కరె–కరి, *bank, shore.*
కల్–కల్లు, *stone.*
కాడు–కాడు, *forest.*
కాల్–కాలు, *foot.*
కొట్టు–కొట్టు, *to beat.*
కురుడ–గ్రుడ్డి, *blind.*
కుటి–గొయ్యి, *a pit.*

కొమ్ము-కొమ్ము, *a horn*
కొళ్-కొను, *to take*

తాలవ్యాచ్చరకములగు కకారగకారములు తాలవ్యములుగ మాఱకుండ నిలిపికొనిన శబ్దములు కన్నడభాషయందు హెచ్చుగాఁ గనఁబడుచున్నవి. కావున నాభాష యీ విషయమునఁ బ్రాచీన శబ్దములను నిలిపికొనియున్నదని తలంపనగును.

వర్ణవ్యత్యయము—ఉచ్చారణమునందలి వేగము కారణముగాఁ గొన్ని పదములందలి వర్ణములస్థానములు తాఱుమాఱగుటంజేసి భాషాపదముల స్వరూపమునం దొకప్పుడు మార్పులు గలుగుచుండును. ఇట్టి మార్పునే "వర్ణవ్యత్యయము" (*Metathesis or euphonic displacement*) అని యందురు. దీని మూలమున నొక్క-భాషలోనే గాని పేదా సజాతీయ భాషలలో గాని యొక్కొ-క్క- పదమెట్టి మార్పులను బొందుచుండునో తెలిసికొనవచ్చును.

అలవు-బలము, పరిమాణము>లావు
అఱగు } తాచు, తాపిడి, తాపు
అఱుగదీయు- } రాచు, రాపిడి, రాయిడి

త. అవన్->తె. అవన్డు>వాన్డు>వాణ్డు>వాణ్డు>వాఁడు;
త.ఇళ్లై, తె. ఎల(*cf.* ఎలదోఁట>లేఁదోఁట, లేఁత;
ఇళంగొంబు > లేఁగొమ్మ; అది-అదిని > దాని;
ఇవన్ > వీఁడు.

త. ఇల్ -> తె. లో, లోపల, లోఁతు, లోవ, లోయ.
త. ఉరైక్కల్, క. ఒరంగల్ > తె. రోఁకలి.

తెలుఁగులోని "ఉంట-ఉండ"-శబ్దము ఉరల్ > ఉర్లు, ఉరలు, ఉరలఁబడు, ఊరలబాఱు, అనువానికి సంబంధించినవే.

త. క. ఏరు-(*to rise*) = పైకెగయుట. ఎక్కు, ఎగయు, మొదలగు రూపములు తెలుఁగున గలవు-కాని వీనిలో మూలధాతువునందలి "ర" కారమగుపడుటలేదు. ఎక్కు అనునది-ఏర్ కు, రూపమునుండి యేర్పడినదే. కాని వర్ణవ్యత్యయముచే నేర్పడిన "రేగు" అను దానిలో మాత్రము రకారము నిలిచియున్నది లే-లేచు" ధాతువులుకూడ నీమూల ధాతువునుండి కాలక్రమమున నేర్పడినవే.

త. తె. ఇరు-రెండు. త. ఇరట్టు—రెట్టింపు.

కన్న-ఎలర్-(గాలి, వాయువు)-ఎరల్, తెంబెలర్-దక్షిణ వాయువు.

ఇది తెలుఁగున "తెమ్మెరల్"అయినది. ఎరల్ శబ్దముతోఁ గూడిన యీ పదము బహువచనరూప మనుకొని, నిత్య బహువచనాంతమని వైయాకరణులు చెప్పిరి. అంతేకాక "తెమ్మెర" అను నేకవచనరూపముకూడ పైదానినుండి యేర్పడినది తమిళమునఁ "తెన్రల్"—అనఁగా చల్లని వాయువు. తెన్నెరల్-అనుదానియందలి ఎరల్ శబ్దములోని అకారము లోపించుటచే "తెన్రలు" అనురూపమేర్పడి యుండును.

త. క. ఉగిర్, ఉగిరు, (*nail*) > తె. గోరు

తె. అడఁగు > డాఁగు

తె-"అగు" ధాతువు—అగఁ-కాఁ, అగుటన్ > కావుటన్
కావుటఁ రూపము భూతకాలముననే యేర్పడి యుండినది. కావునన్ రూపముకూడ నట్లే వర్ణవ్యత్యయముచేతనే యేర్పడియుండవచ్చును. ఇది సంస్కృతమునందలి క్త్వార్థకమున వచ్చు "ఊన" ప్రత్యయముతోఁ గూడిన "కాతూణ" మొదలగు ప్రాకృతరూపముల మూలముగా నుత్తర హిందూస్థానభాషలలో నేర్పడిన "కాఊణ" అనుదానినుండి యేర్పడినదని తలంప నవసరము కనఁబడదు.

తె-గులిమి (కర్ణమలము), గులివి > గుబిలి-గుమిలి శబ్దములు కూడ కలవు.

తె. చిప్పిలు (ఒడ్డగిల్లు) > పిచ్చిలు

తె. గుబులుకొను > బుగులుకొను

తె. కుతకుత > తుకతుక. ఈ రూపాంతములకు వర్ణవ్యత్యయమే కారణము.

ద్రావిడభాషలలోఁ బదాదియందు సంయుక్తాక్షరము వచ్చు సంప్రదాయములేదు. కాని తెలుఁగులో ననేక ధాతువులలోను పదములలోను రేఫసంయుక్తవర్ణము కనఁబడుచున్నది. దీనికిఁ గారణము వర్ణవ్యత్యయమే యనఁదగి యున్నది.

తుఱి > త్రొక్కు

ముఱుంగు > మ్రోగు-మోగు

కుఱి > గ్రొచ్చు-గ్రొయ్యి

పుఱు > ప్రుచ్చు-ప్రువ్వు-*cf.* తె-పురుగు-పుచ్చు

పేల్ > ప్రేలు-పేలుట
వరై-బరె > వ్రాయు
కురుడు > గ్రుడ్డి-గుడ్డి

ఇట్లు మన యాంధ్రభాషాపదములను సంప్రదాయములను సన్నిహితములగు దక్షిణదేశ భాషారూపముల తోడను, సంప్రదాయముల తోడను బోల్చి చూచినచో, దీని ప్రాచీన చరిత్రయు, నభ్యుదయక్రమమును గోచరింపక పోవు. మన భాష కిప్పటి చారిత్రక నిదర్శనములను బట్టి యాంధ్రమను పేరుగల్గుటకుఁ బూర్వము చిరకాలము క్రిందటినుండియు నీదేశమున వ్యవహారమున నుండెననియు, నిది యాంధ్రరాజులు వారికాలపు స్థితిగతులబట్టి రాజభాషగా గ్రహించి శాసనాదులందు వాడిన ప్రాకృత భాషనుండి యేర్పడినదికాక, వారి దేశమున నిత్యవ్యవహారమున నింటిభాషగా వాడుకొనియుండునట్టియు, నిప్పటి దక్షిణదేశ భాషలతో సాజాత్యముకలిగినదై యాకాలమున కే మూలద్రావిడమునుండి విడివడిన స్వతంత్రభాషగా నేర్పడియున్న దనియు మనము దీనిని బట్టి గ్రహింపవలయును. ఇట్టి మన భాష యభ్యుదయ క్రమమునుగూర్చి, చరిత్రమునుగూర్చి బరిశీలించి తెలిసికొనవలసిన విషయము లపారముగాఁ గలవు. ఆంధ్ర విద్యార్థులును, విద్యాధికులును భాషాతత్త్వ పరిశీలన విషయమున వ్యగ్రోత్సాహులు, నాదరాయత్తచిత్తులునై యుందురుగాక. ఆంధ్రాభ్యుదయోత్సవముల విషయమున జూఁపబడుచున్న యీ యుత్సాహమే యీ భాషను వ్యవహరించు నాంధ్రుల నందఱ నేకకుటుంబముగను, సంఘముగను జేసి, వారి యుత్తరోత్తరాభివృద్ధికి సాధన భూతమగు గాక!

3

ఆంధ్రదేశ్యము - అన్యదేశ్యము

ఇప్పుడు ప్రపంచమున వ్యవహారమం దున్న భాషల వేలసంఖ్యచే లెక్కపెట్టవలసియుండునుగదా! కాని వీనిలో నే యొక్కటిగాని యే యితరభాషతోను ఎట్టి సంబంధము లేక స్వతంత్రముగ నిలిచియున్నదని చెప్పుటకుమాత్ర మవకాశము లేదు. కాలగతిని మానవ సంఘములలోఁ బరస్పరము కలుగు సంబంధములవలెనే వారిచే వ్యవహరింపఁబడుభాషలకును బరస్పర సంసర్గము కలుగుచుండుటయు, నొకటి మఱియొక దానినుండి పదములను, పదబంధములను, రచనారీతులను మొదలగువానిని సంగ్రహించుచుండుటయు ననవరతము తటస్థించుచునేయుండును. కాని మానవసంఘమునందు వలెనే యీ సంసర్గఫలము భాషావిషయములోఁగూడ సులభముగ గుర్తింపఁబడకపోవచ్చును. అట్లైనను మానవసంఘమును గూర్చియుఁ జరిత్రకందని విశేషవిషయములను భాషాచరిత్ర సూచింపగలుగుచుండు ననుటకు సందేహము లేదు.

ఒక భాషలోని శబ్దములను, అభాషాతత్త్వమునుగూర్చి విచారించి వాని నితరభాషలతోఁ బోల్చి చూచినచో, నా భాషకు సహజములైన మూలపదము లేవో, అం దే యే పదము లే యే కాలములం దే యే భాషలతో గలిగిన సంసర్గముచే నందు జేరియున్నవో తెలిసికొను నవకాశము లీ కాలమునఁగలుగుచున్నవి. ఇప్పటి ఇంగ్లీషుభాషలలో ననేకములగు నితరదేశభాషాపదములు చేరినవని చెప్పఁబడుచున్నది. అట్లన్యదేశీయపదములను విరివిగాఁ దీసికొనుటవల

ననే యీ భాష యంతగా నభివృద్ధి నొందినదనియు దలంపఁ బడుచున్నది. ఇప్పుడది ప్రపంచమం దంతటను ప్రసిద్ధినొందిన భాషలలో ముఖ్యమైనదిగా నున్నది. దీని కాభాషను వ్యవహరించువారు భూభాగమునం గనేక దేశముల ప్రబలులై యుండుటయేకాక, అ భాషలో నాధునిక ప్రాపంచిక విజ్ఞానమంతయు నెలకొని యుండుటగూడ నొక కారణమని చెప్పవచ్చును. మొన్న మొన్నటివరకు హిందూదేశమున సంస్కృతభాష కట్టి స్థానమే కలదు. అది హైందవవిజ్ఞానమున కంతకు నాకరమై యుండుటచే హైందవుల నిత్యవ్యవహారమునుండి తొలగినను, ఈ దేశమున దాని కట్టి స్థానమే లభించినది. కావుననే అప్పకవి యిట్లు చెప్పియున్నాడు.

"తమతమ బాసల కవితలు
దమతమ దేశముల నొప్పిదములగుఁబర దే
శములకుఁ గూడ నొకింతయు
నమరోక్తులు సకలభూములందును వెలయున్.
తలఁపగ సంస్కృతకావ్యం
బులు తమ యర్థములు సకలభూజనములకున్
దెలిసినను దెలియకున్నను
బొలుపొందఁగనిచ్చు నాల్గుపురుషార్థములన్."

దేశీయ విజ్ఞానమున కాకరమగుటచేత నే యీ భాష నిత్యవ్యవహారమందు లేకున్నను, సర్వజనులకు దానియర్థము తెలిసినను, దెలియకున్నను పురుషార్థప్రదాయినిగా గ్రహింపఁ బడుచున్నది. ఈ దేశభాష అనుదానిలోఁగూడ ననేకములగు విదేశీయపదములు చేరియేయున్నవి. కాని తరువాతి వై యీ

కరణులు వాని యర్థములకుఁ దగినట్లు ధాతువులనుండి వ్యుత్పత్తులను గల్పించుటచే నవి యన్యదేశీయములుగాఁ బరిగణింపఁ బడుటలేదు. పిక, కాకశబ్దములు రెండును కై, గై శబ్దే అను ధాతువునుండి నిష్పన్నములైనట్లు లింగాభట్టీయము చెప్పుచున్నది. కాని 'పిక' శబ్దము లాటిన్ భాషలోని '*Pecus*' అను శబ్దమునకు సంబంధించినది. ఇట్లే 'దీనార' శబ్దము గ్రీకుభాషలోని '*Dinarious*' అను శబ్దమునుండి వచ్చినది. ఇట్లే యీభాషలోనింక పారసీక, యవన, రోమక, బర్బరాద్యన్యదేశ భాషాపదము లున్నచో నట్టివానికి వైయాకరణులేవో సంస్కృత ధాతువులనుండి వ్యుత్పత్తులను గల్పింపఁ బూనుట యుక్తము కాదని, కుమారిల భట్టాచార్యు లన్యదేశ్యపదముల కర్థనిర్ణయము చేయు టెట్లు అను విచారణాసందర్భములోఁ దనతంత్రవార్తికమున హెచ్చరించి యున్నాడు.* సంస్కృతభాషకు లాటిన్, గ్రీకు మొదలగు భాషలతోఁ గల సజాతీయతను సం. పితా, లా. పెటర్, సం. సప్త-గ్రీ. సెప్టెం, లా. హెప్త, సం. భరామి-లా. ఫెరో, ఫెరో మొదలగు శబ్దములయు, వ్యాకరణ రూపములయు సామ్యమే వ్యక్తము చేయుచున్నది. కాని పిక, నేమ, దీనారాది శబ్దము లాయా భాషలలోనుండి యర్వాచీనకాలమున వచ్చి యిందు కలిసినవి. కాని వీనికన్నిటికిని సమానముగనే వైయాకరణులు వ్యుత్పత్తులను గల్పించినచో నేవి సజాతీయ

* "తద్యథా ద్రావిడభాషా స్వీదృశీ స్వచ్ఛందకల్పనా లదా పారసీకబర్బరయవన రౌమకాదిభాషాసు కిం వికల్ప్య కిం ప్రతిపత్స్యన్త ఇతి నవిద్మః"

ములో (*Cognate words*), ఏవి ఎరువుగా వచ్చి కలిసినవో (*Borrowings*) తరువాతఁ దెలిసికొనుట కవకాశమే లేకపోవు నని యాతని యభిప్రాయము.

ఇట్లు ఆర్యులు హిందూదేశమున నెలకొన్న తరువాత వారి భాషలో దేశీయములగు శబ్దము లెన్నియైనను చేరి యుండునుగదా! కాని యట్లార్యభాషలో జేరిన శబ్దములను గనిపట్టి వానిని దేశీయములుగనో, లేదా విదేశీయములు గనో వైయాకరణులు పరిగణించినట్లగపడదు. క్రీ. శ. 8-వ శతాబ్దిని కుమారిలభట్టు విదేశీయపదములకు వైయాకరణులు సంస్కృత ధాతువులనుండియే వ్యుత్పత్తులను గల్పింపజూతు రని చూపుటకు గొన్ని కొన్ని ద్రావిడ భాషాశబ్దములను గ్రహించినాఁడు. అట్టి పాప్, వైర్, అతర్ మొదలగునవి కూడ నుదాహరణమునకు మాత్రమే యతనిచే గ్రహింపఁబడి నవిగాని, ఆజదము లార్యభాషలోఁ జేరినవనికాదు. తరువాతి ప్రాకృతవైయాకరణులైనను ప్రాకృతభాషలలో జేరిన దేశీయ శబ్దములను 'దేశీనామమాల'లమాలమునఁ బ్రత్యేకించిచెప్ప దొడంగిరి. కాని సంస్కృతవైయాకరణు లట్టి పదములను ప్రత్యేకింప లేదు. వానికి కొన్ని ధాతువులను గల్పించి సంస్కృత పదములుగనే గ్రహించియుందురు. కావుననే దేశి, అన్యదేశి అను ప్రత్యేకపరిగణమునకు కవకాశమే లేకపోయినది. ఆర్యు లీ దేశమునకు వచ్చి నెలకొనిన తరువాత వారికిఁ దెలియని దేశీయములగు క్రొత్త వస్తువుల పేళ్లనైనను గ్రహింపక తప్పదుగదా! దేశీయులతోడి సంసర్గము పెరిగినకొలఁది తా మెంత నాగరకులైనను వారి భావములను, ఆచారములను

కొంతవరకైన గ్రహింపక యుండలేరు. ఆధునిక హైందవ నాగరకతయనునది ప్రాచీనమగునార్య నాగరకతయొక్క-యు, దేశీయమగు ననార్యనాగరకతయొక్క-యు సహజసమ్మేళనముచే నేర్పడినదే యని తత్త్వజ్ఞులు తలంతురు. అట్లె ప్రాచీనార్యభాషలో వేదకాలమునందే-అనగా ఋగ్వేదభాష సజాతీయములగు తక్కి-న ఇండోయూరపియన్ భాషలనుండి విశేషముగ మార్పునందలేదని చెప్పఁదగిన కాలముననే దేశీయపదము లనేకము లాభాషలోఁ జేరినట్లువిమర్శకులు చెప్పుచున్నారు. అట్టివానిలో ద్రావిడభాషలకు సంబంధించినవిగా నీ క్రింది శబ్దములు తలంపబడుచున్నవి. అణు, అరణి, కటుక, కపి, కర్మార, కలా, కాల, కితవ, కుట, కుండ, గణ, నానా, నీల, నీహార, పుష్కర, పుష్ప, పూజన, ఫల, బిల, బీజ, మయూర, సాయం. వల్గు మొదలగునవి. కాలక్రమమున నీ భాషలోఁ బ్రవేశించిన యనార్యశబ్దము లింకను పెరుగుచువచ్చినవి. బ్రాహ్మణములు రచింపఁబడిన కాలమునకీ క్రింది దేశీయపదములు కూడ నా భాషలోఁ జేరినవి. ఆటవ, ఆడంబర, కులాల, తండుల, తిల, మర్కట. వలక్ష, వల్లి, వ్రీహి, శవ మొదలగునవి.† కాలము గడచినకొలది కేవల వస్తుద్యోతకశబ్దములేకాక, భావావిష్కరణ రీతులుకూడ నీ భాషలలోనికి సంక్రమింపదొడగినవి. కృ, భు, అస్ వంటి ధాతువుల సహాయమున నేర్పడిన భూతభవిష్యదర్థక రూప

† *Origin and Development of the Bengali Language by S. K. Chatterji.*

ములు (ఏధాంచక్రే, పాతియామాస, గన్మా, గన్తాస్మి మొదలగునవి) పాణినికిఁ బూర్వమే సంస్కృతభాషలోఁబొడసూపినవి. సంపూర్ణ క్రియరూపములకు బదులు క్తాంతరూపముల ప్రయోగముకూడ వాడుకలోనికి వచ్చినది. ఇంకను తరువాతి కాలమున నార్యజన సంఘమునకు దేశీయులతోడిసంబంధము, కలయిక పెరిగినకొలది, దేశీయు లార్యజనసంఘములోఁ జేరి వారి భాషను నేర్చికొని వ్యవహరింపఁదొడగినకొలది ఆర్య భాషలో దేశీయభాషా సంప్రదాయానుకోధముగ ధ్వనుల యందు మార్పులు, లింగవిభక్తివచనాదులందు మార్పులు, క్రియారూపములందు, వాక్యనిర్మాణ పద్ధతులందు గూడ మార్పులు కలుగఁజొచ్చినవి. తొలి కాలమున నీ మార్పు లుచ్చారణ రీతులలో మాత్రమే పొడసూపినపుడు ప్రాచీనార్యభాష తత్తద్దేశభేదమునుబట్టి శౌరసేని మాగధి, మహారాష్ట్రి మొదలగు ప్రాకృతముల రూపమును బొందినది. ఈ ప్రాకృతావస్థయందు భాషారూపములలో మార్పులు గలుగుట, దేశీయపదజాలము విశేషముగాఁ జేరుట సంభవించినను, తరువాతి యాధునికార్యభాషలలోవలె వ్యాకరణ పద్ధతులందును, వాక్యరచనారీతులందును విశేషములగు మార్పులు కలుగలేదు. ఈ మార్పులు సహజపరిణామము వలననే కలిగినవని తలఁచువారు కలరు. కాని యివి చాలవరకు దేశీయములగు ద్రావిడభాషాలక్షణ సామాన్యములగుటచే, తద్భాషాప్రభావమే ప్రాచీనార్యభాషపై ప్రసరించి తత్తద్దేశ కాలానుగుణములగు మార్పులను గల్పించి, యాప్రాచీనార్య భాష తొలుత ప్రాకృత భాషలుగను, తరువాత తదపభ్రంశ

ములుగను తుద కుత్తర హిందూస్థానమున నిపుడు వ్యవహారింపఁబడుచున్న యాధునికార్యభాషలుగను, పరిణామమును బొందుటకు ప్రధాన కారణమైనదని తలంచుట యుక్తియుక్తముగఁ దోచకపోదు. పైనుండి వచ్చిన విదేశీయు లెంత నాగరకులైనను, దేశీయులను వారు మూలముట్టుగ నశింపఁ జేయగలిగిననేమోగాని, వారితోఁ గలిసి దేశమున నివసింప దొరకొనినపుడు వారిభాషావిజ్ఞానముల ప్రభావము వీరిపై నొకకొంతయైనను బ్రసరింపక మానదుగదా!

ఇట్లుత్తర హిందూస్థానమందు వ్యవహారములోనున్న ప్రాచీన ప్రాకృతములు, ఆధునికార్య భాషలును గూడ ప్రాచీనార్యభాషాభవములే యగుటచేత ఇటీవల కొంతవిజాతీయ సంస్కారము గలిగినను, మొత్తముపై నందలిశబ్దజాలము వ్యాకరణరీతులు నార్యభాషా సంబద్ధములే యనుట సుప్రసిద్ధమే. అట్లే యైనను ప్రాకృతవైయాకరణులగు హేమచంద్రాదులు ఆ భాషలకు లక్షణము చెప్పినపుడు వానిని తత్సమము, తద్భవము, దేశి అని మూఁడు భాగములుగ జేసిరి. ఆ భాషలోని నామాన్య శబ్దజాలమేగాక యందలి వ్యాకరణరీతులు, సుప్తిఙంతములైన పదములు మొదలగున వన్నియుఁ జూడ ప్రాచీనాభాషాభవములే యగుటచే నా భాషలు తద్భవములగుటలో విప్రతిపత్తిలేదు. ఇందలి శబ్దజాలములో నెరువు తెచ్చుకొనిన దేశీయశబ్దములు కొన్ని గలుగుటచే అట్టివానిని వైయాకరణులు 'దేశి' యనువిభాగమునఁ జేర్చి చెప్పవలసి వచ్చినది. పైనుండివచ్చి కలసిన యీ 'దేశి' వర్గ మీ భాషలనుండి తొలగించినను, వానిస్వతంత్ర

స్థితి కెట్టి లోపము కలుగదు. ఈ దేశివర్గములో వస్తుద్యోతకములగు శబ్దములు మాత్రమే గాని వ్యవహారమునకు, వాక్య నిర్మాణమునకు నావశ్యకములగు సుప్తిజాది పరికరమేమియు నీ వర్గములోఁ జేరలేదు. కేవల శబ్దమాత్రము చేతనే వాక్యనిర్మాణము కాదుగదా! శబ్దము, లేదా ప్రాతిపదికము సుప్తిజాదులతోఁ గూడికాని పదముగాదు. పదముగాని సాకాంక్షితమగు వాక్యములో జేరదు. ఆకాంక్షాది రహితము వాక్యముకాదు గావున అన్వయములేని కేవల శబ్దములచే వాక్యమెట్లేర్పడును? శబ్దము లొక భాషలోనివి మఱియొక భాషలోఁ జేరవచ్చునుగాని అన్వయరీతి వ్యాకరణ పద్ధతి ఎరువుసొమ్ముగా మారునది కాదు, ఏ భాషాపద్ధతి ఆ భాషదే. రామ, ధర్మ, గురు మొదలగు శబ్దములు సంస్కృత భాషా సంప్రదాయమున రామః, ధర్మః గురుః అనురూపములను బొంది వాక్యమునఁ బ్రయోగింపఁబడుచున్నవి. ఇవే ప్రాకృతమున రామో. ధమ్మో, గురు అనియు. ఆంగ్ల భాషలో రామ, ధర్మ, గురు అనియు, తెలుగులో రాముడు, ధర్మము, గురువు అనియు తత్తద్భాషావ్యాకరణ సంప్రదాయానుసారముగ మారుచున్నవి. ఇట్లా శబ్దము లీ భాషలలోనికి సంక్రమించినను, వానిని వాక్యమునఁ బ్రయోగించునపుడవి పొందు మార్పులు తత్తద్భాషాసంప్రదాయానుసారములై యుండక మానవు. ఈ సంప్రదాయములను బట్టియే ప్రధానముగా భాషల ప్రత్యేకత యేర్పడుచుండును. "రామం పూజయంతి-రాముని పూజించుచున్నారు." ఇచ్చట శబ్దములు సమానమే యైనను పదములు భిన్నరూపములఁ దాల్చినవి.

They worship Rama అనుచోట వాక్యనిర్మాణమే మారినది. కావున శబ్దములు సమానమే యైనను వానిని వాక్యమునఁ బ్రయోగించు రీతినిబట్టి భాషలు భిన్నము లగుచున్నవి. కావున దేశీయశబ్దములు ఇతర దేశభాషలలోఁ జేరినను అవి తద్భాషాసంప్రదాయముల కనుకూలములగు మార్పులతోనే వాక్యమునఁ బ్రయోగింపఁబడుచున్నవి. ఇట్టివి దేశ్య శబ్దములు గావున 'దేశి' శబ్దవాచ్యములైనను యూరోపునందలి భాషలతో సజాతీయములగు సంస్కృతాద్యార్య భాషలకివి సహజముగ విదేశీయులే గావున నా దృష్టితోఁ జూచినపుడు వీనిని అన్య దేశ్యము లనియే చెప్పవలసి యుండును. కాని ప్రాకృత భాషలు సంస్కృతభవము లగుటచే. వైయాకరణులు స్వరముల మార్పులవలన సందుండి గలిగిన శబ్దములను 'దేశి' యను పేరనే విభాగించినారు. ఇది ఉత్తర హిందూస్థాన భాషల స్థితి.

తొలుత వైదిక సంస్కృత భాషలలోను, పిదప ప్రాకృతాదులలోను చేరిన యీ దేశిశబ్దము లనునవి ఆర్యులీ దేశము చేరునప్పటి కీ దేశమున నివసించుచున్న కోలులు, ద్రావిడులు మొదలగు జాతులవారి భాషలలోనివై యే యుండవలయును గదా! అట్లుగాక ఇప్పటి భారతీయభాష లన్నియు సంస్కృత భవములో, ప్రాచీనార్య భాషాభవములో యగు నన్నచో నార్యులీ దేశమునఁ బ్రవేశించునప్పటి కీ దేశము నిర్జనమై యుండెననికాని, లేదా వారీ దేశమువారిని సంపూర్ణముగ రూపుమాపిరనిగాని చెప్పవలసి యుండును. అట్టి నిదర్శనములు లేకుండుటయే కాక మతసాంఘిక సంస్కారాది విషయము

లందు వలెనే భాషా విషయమునను జరిగినట్లు తెలియవచ్చు చున్నది. ఆర్యులీ దేశమునకు వచ్చునప్పటికి అనార్యజనులు (దస్యులు, వ్రాత్యులు, మ్లేచ్ఛులు మొదలగువా రనేకులు) ఈ దేశమున నెలకొనియుండి వారి నడుగడుగునకుఁ బ్రతిఘటించుచు వచ్చి రనుటకు ఋగ్వేదాది వైదికవాఙ్మయము నందలి నిదర్శనములే చాలును. ఈ యనార్య జనములో నిప్పుడు దక్షిణదేశమున వ్యవహరింపఁబడు ద్రావిడభాషలన బడువానితో సజాతీయములని చెప్పదగిన భాషలనే మాట్లాడిన వారుకూడ ఆ కాలమున నుత్తర దేశమున నెలకొనియుండి క్రమముగఁ దూర్పు దేశము నాక్రమించుచుండిన యార్యులను ప్రతిఘటించినవారిలో నుండిరనుటకు నిప్పటికిని పశ్చిమోత్తర భాగమున వ్యవహారమున నిలిచియుండి ద్రావిడభాషా కుటుంబములోఁ జేరిన బ్రాహూయీ భాషయే నిదర్శనము. అతి ప్రాచీనమగు మొహెంజోదారో నాగరికతయంతయు దేశీయులగు ననార్యజాతులకు సంబంధించిన దే యనికూడ తలంపబడు చున్నదిగదా? ఇది గాక ఆర్యులు వాయవ్యదిక్కునుండి తూర్పుదక్షిణభాగము లాక్రమించుచు వచ్చినకొలది యార్య సంఘములోఁ జేరని యనార్యజాతులవారు వారిముందు నిలువ లేక క్రమముగ భారత దేశమధ్యభాగమును,దక్షిణదేశమును అక్రమింపజొచ్చిరి. తరువాతికాలమున వీరిపై నార్యభాషా ప్రభావమెంత ప్రబలినను,సహజమగు దేశీయత వీరిభాషలలో రూపుమాసిపోవుట తటస్థింపలేదు. ఉత్తరహిందూస్థానమందు వలె నిచ్చట అనార్యభాషలను రూపుమాపి యార్యభాషలు

వాని స్థానము నాక్రమింపలేక పోయినవి. ఆర్యభాషనుండి పదపరికరమును విశేషముగా గ్రహించినను ఇచ్చటి దేశీయములగు ననార్యభాషలు తమ సహజతత్త్వమును గోలుపోలేదు. కావుననే ఇప్పటికిని భారతదేశ మధ్యభాగము నాక్రమించి యున్న కొండజాతివారు మాట్లాడు ఖాండ్, మాల్తో, కుయి మొదలగు భాషలు ఇటు దక్షిణ దేశభాషలగు తెలుగు, తమిళము మొదలగు భాషలతోను, అటు బ్రాహూయీ భాషతోను సోదరభావమును వహించి యేకకుటుంబమునకుఁ జెందినవిగానే యున్నవి. దీనినిబట్టి యొక కాలమున నిప్పుడు బ్రాహూయీ భాష మాట్లాడువారు నివసించు పశ్చిమోత్తర దిగ్భాగమునుండి హిందూదేశ మధ్యభాగమునను, దక్షిణ దేశమునను గూడ-అనఁగా దాదాపు హిందూదేశ మంతటను గూడ నిప్పుడు ద్రావిడ కుటుంబ మనఁబడు దానిలోఁ జేరిన భాషలను మాట్లాడిన జనమే యాక్రమించియుండెనని యూహించుట కవకాశ మేర్పడుచున్నది. ఆర్యులీ దేశమును క్రమక్రమముగా నాక్రమించుకొని వచ్చుచుండి రనుటకు వైదిక వాఙ్మయమున గానవచ్చు బ్రహ్మావర్త, ఆర్యావర్తాది విభాగమే నిదర్శనమగుచున్నది. భాషావిషయమునఁ గూడ ప్రాచ్యదేశమునందలి వానికంటె ఉదీచీ దేశమునందలి భాషయే పరిశుద్ధమైనదని, ప్రాచ్యభాగమునకు వచ్చినకొలది ఆర్యభాష సాంకర్యమును జెందుచుండినదని ఆకాలపువారు తలంచినట్లు స్పష్టము. "తస్మాద్ ఉదీచ్యాం దిశి ప్రజ్ఞాతతరా వా గుద్యతా. ఉదంచ, ఉ, ఏవ, యంతి వాచం శిక్షితుం,

యోవా తత ఆగచ్ఛతి తస్యవా శుశ్రూషంత. ఇతి"* (శత పథ బ్రాహ్మణము). బ్రహ్మావర్త మనునది-ఇదియే మధ్య దేశమనికూడ చెప్పబడును-సరస్వతీ దృషద్వతుల నడుమగల దేశము. అనగా వింధ్యహిమాలయముల మధ్యను, తూర్పున గంగాయమునల సంగమము గల ప్రయాగయే సరిహద్దుగా గలది. ఒక కాలమున దీనికితూర్పున గల దేశములు, కోసల. మగధ, వంగ, రాఢ మొదలగునవి. అనగా నిప్పటి బిహారు, బెంగాలు దేశభాగములు ఆర్యనివాసయోగ్యభూములు కాక పోవుటచే నచ్చటికిఁ బోగూడదను నిషేధము, వెళ్ళినవారికి ప్రాయశ్చిత్తముకూడ ధర్మశాస్త్రములలో విధింపఁ బడినది.

"అవంతయోఽంగమగధాః సురాష్ట్రోదక్షిణాపథాః
ఉపావృత్సింధుసౌవీరాః ఏతే సంకీర్ణ యోనయః.

ఆరట్టాన్, కారస్కరాన్, పుండ్రాన్, సౌవీరాన్, వంగాన్, కళింగాన్, ప్రానూనా నితిచగత్వా పునస్తోమేన యజేత 'సర్వపృష్టయావా.

పద్భ్యాం స కురుతే పాపం యః కళింగాన్ ప్రపద్యతే." (బోధా. ధర్మ. సూ. ౧-౧-౩౦)

వంగదేశము నాశ్రయించియున్న వంగ, పుండ్ర. రాఢ మొదలగు జనులు మ్లేచ్ఛజనులుగాఁ బరిగణింపఁబడి యున్నారు. ఐతరేయ బ్రాహ్మణమున నీ పుండ్రులతోఁ జేర్చి

"*In the Northern quarters is speech utterd with more discernment, and North ward go men to learn speech; he who comes whence, to him men hearken."

ఆంధ్రులు కూడ మ్లేచ్ఛులుగనే గ్రహింపఁబడియున్నారు. "ఏత ఏతే ఆంధ్రాః పుండ్రాః పుళిందాః మూతిబాః." దీనిని బట్టి అవంతి, మగధ, అంగ, వంగ మొదలగు ప్రాచ్య దేశము లన్నియు నొకకాలమున బ్రహ్మావర్తమునఁ జేరక, అనఁగా నార్యులకు నివాస భూములు కాక, అనార్యులు, మ్లేచ్ఛులు ననఁబడు దేశీయులచే నాశ్రయింపఁబడియున్న వనియు, కాలక్రమమున నీ దేశములుకూడ నార్యులచే నాక్రమింపఁబడినవనియు దెలియుచున్నది.† వంగదేశము ఆర్యాక్రమణమునకుఁ బూర్వము అనార్యజనులకు నివాసమై యున్నదనియు, నచ్చటి ప్రాచీనభాష అనార్య భాషయే యనియు, మిథిల మగధదేశము లార్యవిజ్ఞానమునకు, భాషకు స్థానము లైన పిదపనే వంగదేశమున నార్య విజ్ఞానము, భాష వ్యాపించినదనియు నిశ్చయింపఁదగియున్నది. ఇది సుమారు క్రీస్తుశక ప్రారంభమున కావచ్చునని తద్భాషా చరిత్రకారుఁడగు సునీతికుమార ఛటర్జీగారి యభిప్రాయము. అంతకుఁబూర్వ మచ్చట నివసించియున్న జనులలో కోల్, ద్రావిడజాతులువారుకూడ నుండియుందు రనియు; ఆ కారణముచేతనే తరువాత గలిగిన ఆర్యభాషాప్రాబల్యమునుబట్టి బెంగాలీభాష ఇప్పు డార్యభాషాజన్యమే, లేదా ప్రాకృత జన్యమే యని తలంపఁబడుచున్నను ఆ భాషలో ద్రావిడ భాషాసంప్రదాయములు విశేషముగాఁ గనఁబడుచున్న వనియు నాతఁడు నిదర్శనపూర్వకముగాఁ దెలిపియున్నాఁడు. ఒక్క-

† ఈ దేశములలో నగ్ని ముందు ప్రవేశించి పవిత్రమైనవానినిగా జేసినట్లు కథలు గలవు.

బంగాళీభాషలోనేగాక ఇతరములగు అధునికార్య భాషలలోఁ గూడ నీ ద్రావిడభాషా సంప్రదాయములు కనఁబడుచునే యున్నవి. కావుననే అర్యు లీ దేశము నాక్రమించుటకుఁ బూర్వ మీదేశ మంతటిలోనుగూడ ననార్యులగు ద్రావిడ జను లచ్చటచ్చట నివసించియేయుందురని, ఆర్యజనులు యాక్రమణమును తొలికాలమున ఆఫ్ఘనిస్థానము, పంజాబు ప్రాంతముల నుండి ప్రతిఘటించినవారిలో నీ ద్రావిడభాష లను వ్యవహరించిన జనులుకూడ నుండియుందురనియు నిశ్చ యింపఁదగియున్నది. ఉత్తర దేశము క్రమముగా నార్యుల వశము కాజొచ్చినపిదప వీరిలోఁ గొంద రచ్చట నిలిచిపోయి యార్యజనసంఘములోఁ గలిసి వారి భాష నభ్యసింపఁగా, మరికొందరు దక్షిణాభిముఖులై స్వీయభాషను వ్యవహరించు జనులఁతో గలిసిపోయియుందురు. ఇట్టివారినే యార్యులు ద్రావిడులని చెప్పియుందురు. తొలుత జాతివాచకముగా వెలసియుండిన 'తెలంగు' శబ్దము తరువాతి కాలమున 'త్రిలింగ' శబ్దభవముగా పండితులచే సమర్థింపఁబడుచుండి నట్లుగానే 'తమిళ్' శబ్దముకూడ తరువాతి కాలమున 'ద్రావిడ' శబ్దభవముగనో, లేదా దానికి ప్రకృతిగనో సాధింపఁబడుట తటస్థించినది. ఎట్లైనను దక్షిణ దేశీయములు, ద్రావిడ శబ్దసంకేతములు నగు తెలుగు తమిళ కన్నడాదు లును, వీనికి సంబంధించిన బ్రాహుయీ, గోండు, మాల్తో, కుయి మొదలగు నాటవికభాషలును ఆర్యు లీ దేశమునకు వచ్చుటకుఁ బూర్వమే యీ దేశమున వ్యవహారములో నుండిన వనుటకు సందేహము లేదు. కావున నార్యభాష

లనుబట్టి చూచినపు డివి దేశీయములే. వీనిలో నార్యభాషా శబ్దములు చేరినవు డవి అన్యదేశీయములే యగును గాని వేరు కావుగదా! హిందూస్తానీ, ఇంగ్లీషు మొదలగు భాషలలోని తాసిల్ దారు, ఆసుపత్రి, లాంతరు, రోడ్డు మొదలగు శబ్దములు తెలుఁగున జేరినట్లే పుడమి, సిరి, వాక్కు మొదలగునవి సంస్కృతమునుండి వచ్చి చేరినవి. మరికొన్ని అకారాంత శబ్దములు రాముఁడు. వనము మొదలగునవి తెలుగు ప్రత్యయములను గ్రహించినవి. అట్లే దీర్ఘ సమాసములును చేరినవి. ఇట్లీ భాషలో సంస్కృతభాషలోని శబ్దములే వచ్చి చేరినవి గాని యార్యభాషలే యగు ప్రాకృతములు, ఆధునికములగు నుత్తరహిందూస్థాన భాషలలోవలె సంస్కృతభాషలోని పదములు (అనగా సుప్తిజంతములగు పదములు) కూడ తద్భవములుగా చేరలేదే, "రాజ్ఞో వాశిష్ఠిపుత్రస్య మహాదేవీ అజ్ఞాయపతి" అను సంస్కృతశబ్దములను అట్లే "రణ్ణోవాసిఠీ పుతస్స మహాదేవీ ఆణవేది" అని ప్రాకృతముగా చెప్పుటకవకాశము కలదు. కావుననే యీ భాషలు సంస్కృత భాషాజన్యములనియో, లేదా ప్రాచీనార్యభాషాజన్యము లనియో చెప్పగలుగుట. పై పదములను తెలుగుభాషలో చెప్పవలెనన్నచో, ఆశబ్దములనే గ్రహించి చెప్పినను అన్వయము, పద్ధతి అంతయు మార్చక తప్పదుగదా! "రాజుఅయిన వాసిష్ఠి పుత్రునియొక్క...మహాదేవి...ఆజ్ఞాపించుచున్నది." ఈ అన్వయపద్ధతి, రూపనిష్పత్తి సంస్కృత ప్రాకృతములకంటె భిన్నమేగదా. సంస్కృతము మొదలగు ఇతరభాషలలోని ప్రాతిపదికలు, ధాతువులు నెన్ని యీ భాషలో చేరినను,

వాక్య నిర్మాణపద్ధతిమాత్రము (*Syntactical form*) దక్షిణ దేశీయమేయై, ద్రావిడ భాషాసామాన్యపద్ధతి ననుసరించిన దే గాని ఆర్యభాషాపద్ధతి ననుసరించినది గాదు. ఆధునికార్య భాషలలో దక్షిణదేశీయ వ్యాకరణ పద్ధతి సంక్రమింపక పో లేదు. దేశభాషల లక్షణరచనాపద్ధతి మాత్రము పాణిన్యాదుల సంస్కృతభాషావ్యాకరణప్రణాళిక ననుసరించి రచింపఁబడుట తటస్థించినది. అదియు నేతద్భాషా సంప్రదాయ దృష్టితోఁ జూచినపుడు కొంత యనర్థహేతువేయైనదని చెప్పకతప్పదు. ఏమైనను, తొలికాలమునుండియు, శబ్దజాలము మాత్రమే వచ్చిచేరినదిగాని నిర్మాణపద్ధతి, వ్యాకరణరీతులు ఇందుచేర లేదు. ఇట్టివానిని లాక్షణికులు మొదటినుండియు వారి గ్రంథములలో వారించుచునే యుండి రనుటయే యిందుకు నిదర్శనము. తెలుగుభాషకుఁ దొలుత లక్షణము చెప్పిన కేతన ఈ విషయము నీ క్రిందిరీతిని సువ్యక్తమే చేసినాఁడు. సంస్కృతములను తెలుగు గావించు తెరంగును గూర్చి చెప్పుచు—

వృక్షేణదత్తాయ పక్షిభిః పుత్రస్య
యను విభక్తులు దెనుంగునకుఁ జొరవు
అస్తిప్రయాతి గాయంతిభుంక్తే సంతి
నయతి స్మరతి యను క్రియలు సొరవు
గత్వా హసిత్వా ప్రకాశ్య సంత్యజ్య నా
దనరు త్వాంతల్యబంతములు సొరవు
గంతుం పురీం రిపుం హంతుం సుతం పాతు
మను తుమున్నంతంబు లరయఁజొరవు

అపిచ తుహి వై న నా సను లనఁగ బెక్కు-
లవ్యయంబులు చొరవెందు నాంధ్రకవిత
బెరపదంబులతోడను దొరలినిల్చు
నవి తెనుంగులు గావింతు నభిమతముగ."

అని చెప్పినాఁడు. అనఁగా సంస్కృతప్రాదిపదికములు ధాతువులేగాని వాక్యనిర్మాణమున కావశ్యకములగు విభక్తి ప్రత్యయములతోఁ గూడినరూపములుగాని, అవ్యయాదులుగాని యిందు ప్రయోగింపఁబడవని నిషేధించినట్లయినది.* ప్రాకృత వ్యాకరణ విషయ మట్లుకాదు. ప్రాకృత వ్యాకరణ కర్తయగు హేమచంద్రుఁడు "అథ ప్రాకృతం" అను ప్రాకృత వ్యాకరణ ప్రారంభసూత్ర వ్యాఖ్యానసందర్భమున

* అట్లు అవ్యయముల ప్రయోగము నిషేధింపఁబడినను దేశమున సంస్కృతమునకుఁ గల ప్రాబల్యమువలన వ్యవహారములలో సదా, వృథా సర్వత్ర, మొదలగునవి కొన్ని చేరినవి. కవులును ప్రయోగించినారు. ఇవియు కేవల శబ్దములే. విభక్త్యంతములు గావు. అనంతుఁడు 'వృథ' యనుదాని ప్రయోగము నంగీకరించినాఁడు.

"వృథయను నవ్యయ మెంక్కుడు, ప్రథితంబై చెల్లు
కృతుల వృథసేయక" అట్లె-సర్వదా-
"ఒకదివసంబు నానందకాననమునందు సర్వదా
సిద్ధించున్." (శ్రీనాథుఁడు. కాశీ.)
"స్వస్తి జగత్త్రయీ భువనశాసనకర్తకు." (భాగవతము)
"నాకజ్ఞ గించిత్తయిన మనోధనవంచన
మిచ్చోటలేదు." (జై. భార.)

సంస్కృతానంతరమున ప్రాకృతాను శాసనము సిద్ధసాధ్య మాన భేదిము గల సంస్కృత జన్య భాషకే యీ లక్షణము గాని దేశ్యమునకుఁ గాదని జ్ఞాపకము కొరకని తెలుపుచు నీ ప్రాకృతమున ప్రకృతి ప్రత్యయ లింగ కారక సమాస సంజ్ఞా దులు సంస్కృతమందు వలెనే తెలిసికొనవలెననియు, లోకమునుండి కొంత తెలిసికొనవలసినది కూడ కలదనియు చెప్పినాఁడు. † ప్రాకృతాది భాషలవిషయమున నే ప్రకృతి ప్రత్యయ లింగ కారక సమాసాదులు సంస్కృతమునందు వలెనే తెలిసికొనవలసినట్లుగాఁ జెప్పఁబడినవో, అవే తెలుఁగు విషయమున భిన్నము లగుటచే "చొర వెందు నాంధ్ర కవిత" అని కేతన చెప్పవలసి వచ్చినది. కావుననే యితర భాషలనుండి శబ్దజాల మెంత వచ్చి చేరినను, తెలుఁగు ప్రాకృతాదులవలె సంస్కృతజన్య మగు 'వికృతి' భాష కాక ప్రత్యేక స్వతంత్రమగు భాషగా గ్రహింపఁ దగినదని దీనివలన వ్యక్తమగుచున్నది గదా. ఈ విషయమునే కేతనయు,

† "అథ ప్రాకృతం,, ప్రకృతిః సంస్కృతం. తత్ర భవం తత ఆగతం వా ప్రాకృతం. సంస్కృతానంతరం ప్రాకృతస్యాను శాసనం సిద్ధసాధ్యమాన భేద సంస్కృతయోనే రేవ తస్య లక్షణం న దేశస్య ఇతిజ్ఞాపనార్థం. సంస్కృత సమంతు సంస్కృత లక్షణేనైవగతార్థం. ప్రాకృతేచ ప్రకృతి ప్రత్యయ లింగ కారక సమాస సంజ్ఞాదయః సంస్కృతవ ద్వేదితవ్యాః. లోకాత్ ఇతి చ వర్తతే. అస్వర్వా, వ్యంజనం, ద్వివచనం, చతుర్థీ బహువచనం చ నభవతి.

(హేమచంద్ర ప్రా. వ్యాకరణం.)

> న్నలు నిలువవు తెనుఁగులలో
> నలవడగా బల్కుచోట నభినవదండీ''

ఇత్యాదులచే "తెలుఁగున సంస్కృత పదములు పలికెడి తెఱఁ గెఱిఁగినంత ప్రవ్యక్తముగాఁ దెలిపితి'' నని చెప్పినాఁడు కేతన.

ఇట్లే యీతని తరువాతి లాక్షణికుఁడగు పెద్దనయు నీతని మార్గమునే యనుసరించి

> "పరగ సంస్కృతంబుపైఁ దెనుంగువిభక్తు
> లునుపఁబడి పొసంగియుండెనేని
> తత్సమంబునాఁగఁ దగ సంద్రు సుకవులు
> తద్విహీనకావ్యతతియు లేదు''

అని శబ్దము సంస్కృతమైనను దానిపై విభక్తులు తెనుంగు విభక్తులు చేర్పబడినచో నది తత్సమ మగునని చెప్పి, యట్లు "వెలయు సంస్కృతంబు తెలిఁగించు తెఱగు'' ను-అనఁగా సంస్కృత శబ్దములను తెలుగులోనికి దెచ్చుకొను రీతులను ప్రత్యేక ప్రకరణములోఁ జెప్పినాఁడు.

ఇక నీతనికిఁ దరువాత లాక్షణికుఁడు, ఛందోదర్పణ కారుఁడు నగు ననంతామాత్యుఁడు ఛందో లక్షణమునే ప్రధానముగా దెలుప నెంచినవాఁడైనను, చతుర్థాశ్వాసమున దోషాధికారసందర్భమున అపశబ్దదోష ప్రసంగము నాధారముఁ జేసికొని కొంత భాషా లక్షణమునుగూడఁ జెప్పవలసిన వాఁడైనాఁడు.

యిద్దరు లాక్షణికులవలెనే వ్యక్తముచేసినాఁడు. కాని యీ శబ్దములలో గ్రామ్యమునుఁ జేర్చినవాఁడు కాఁడు. కారణ మీతఁడు కావ్యలక్షణములో దోషాధికారమునుఁ జెప్పి యుండుటయే కావచ్చును.

"సంస్కృతము తెనుఁగైనఁ దత్సమపదంబు
దానఁబుట్టి తెనుఁగైనఁ దద్భవంబు
దేశి తెనుఁగు దేశజ, మచ్చతెనుఁగు తెనుఁగు
నిర్మలుఁడు పెరి యొడయఁడు నిక్కమనఁగ"

కేతన, పెద్దన, అనంతులు ముగ్గురునుగూడ తెలుఁగైన సంస్కృతమే తత్సమమని వ్యక్తము చేసినారు. కాని యీ తొలిలాక్షణికులు ఆంధ్రభాషవికృతి యనువారుగా గనఁబడరు. అయితే సంస్కృతంబుపై తెనుఁగు విభక్తులను జేర్పగా నవి తెలుఁగుపదములైనవి గదా! కాగా వీనిని సంస్కృత సమములని–తత్సమములని చెప్పుటేల? తెలుఁగు పదములని, తెలుఁగు పదములతో సమానములైనవని చెప్పుటయే సమంజసముగా గనఁబడునుగదా!సంస్కృతంబునంబుట్టి తెనుఁగైనవి తద్భవములైనవి. అందుఁ బుట్టుట యనఁగా నేమో పెద్దన వ్యక్తముచేసినాఁడు. "సిద్ధాక్షరముల వర్గముల దూలిపోఁబలుకఁగ నర్థదమైప్రాకృతవిభ మగునది తద్భవ పదము" అని వర్ణములందు మార్పు గలిగి యేర్పడినది తద్భవముకాగా, అట్లు మార్పుమియులేక యేర్పడినచో నది ప్రాకృతములందువలె సంస్కృతసమము కావచ్చును. కావుననే హేమచంద్రుఁడు దానిని "సంస్కృతలక్ష్యైనవ కాల్పార్థం" అన్నాఁడు. కాని తెలుగునఁన తత్సమము లేర్పడు

రీతికూడ ఒక ప్రకరణముగాఁ జేసి చెప్పవలసి వచ్చినది. గౌరీ – గౌరి యయినది. వాణీ–వాణి యయినది. వానునకు వంతుఁడు, మానునకు మంతుఁడు, ఉజ్జ్ంతముపై పుజ్జు. అజ్జ్ంతముపై ముజ్జు, ద్విట్ పదమునకు ద్విషుఁడు, భుక్–భుజుఁడు, దిక్–దిక్కు, భూ–భువి, నౌకు–నావ ఇత్యాదులు మార్పు లనేకములు. ఈ మార్పు లన్నియు నా పదములను తెలుఁగు పదములుగాఁ జేయుటకై చేయబడినవే కాని సంస్కృత సమములుగాఁ జేయుటకుఁ గాదుగదా. కావున వీనిని సంస్కృతసమము లనుట యంత సమంజసముగా కనఁబడదు. కాని భాష నిట్లు విభాగించు సంప్రదాయము వీరి కెచ్చటినుండి వచ్చినది, వీ రెందు క ట్లీభాషను విభాగింప వలసివచ్చినది. ఒక భాషలోని కితర భాషలనుండి సంక్రమించిన పదము లన్నిటిని అన్యదేశ్యములుగాఁ బరిగణించిన చాలదా అని విచారించినచో వీరి కీసంప్రదాయము ప్రాకృతవ్యాకరణముల ఫక్కి ననుసరించుటవలన వచ్చినదని తెలియక పోదు. మొదట 'తత్సమతద్భవదేశి' విభాగము ప్రాకృతవ్యాకరణములలోఁ గనఁబడుచున్నది. ఆంధ్రవైయాకరణులును వాని మార్గమునే యనుసరించియుందు రనుటకు సందేహము లేదు. కేతన సూచన మాత్రముగ దెలిపినను పెద్దన యీ విషయమును వ్యక్తమే చేసినాఁడు. గీర్వాణ భాషా కావ్యలక్షణము లన్నిటిని దెచ్చికూర్చినను తెనుఁగు కావ్యమనగానే, తెలుగంచుఁ జెవినిఁ బెట్టక తెలుఁగు దేశ భాష, వ్యవహారమున దెలిసికొనవలసినదేగాని దీనికి వ్యాక

రణ మేమిటని యీాసడించువారికి సమాధానముగా విన్న కోట పెద్దన

"విశ్రుతులు హేమచంద్రత్రివిక్రమాదు
లొనరఁజూపిరి ప్రాకృతంబునకు త్రోవ
ఆంధ్రభాషయు ప్రాకృతాహ్వయముగాన
వలయు దల్లక్షణంబును వరుస దెలియ"

అని ఆంధ్రభాషను ప్రాకృతాకరలలోఁ జేర్చి తాను తెలుఁగునకుఁ జేయ తలపెట్టిన భాషాలక్షణరచనా కార్యమును సమర్థించుకొనినాఁడు. కేతనకూడ—

"సంస్కృతప్రాకృతాదిలక్షణముఁ జెప్పి
తెనుఁగునకు లక్షణముఁ జెప్పకునికి యెల్ల
గవిజనంబుల నేరమి గాదు నన్ను
ధన్యుఁ గావింపఁ దలఁచిన తలపుగాని."

అని సంస్కృత ప్రాకృత లక్షణములను స్మరించి యిప్పటికిఁ దెనుఁగున లక్షణ మేర్పడకుండుటను సూచించుచు తాను "క్రొత్తగ నాంధ్రభాషకును కొండొక లక్షణ మిట్లు చెప్ప" బూనుకొనినట్లు తెలిపియున్నాఁడు. కావున సంస్కృతభాషాలక్షణముకూడ వీరి దృష్టిపథమందున్నట్లు స్పష్టమగుచున్నది. కావున ప్రాకృతభాషా లాక్షణికులు చేసిన తత్సమతద్భవదేశ్యభాగమునే వీరు నవలంబించి యుందు రనుటకు సందేహములేదు, ఆ భాషలలో విభక్తి ప్రత్యయములతోఁ గూడిన పదములు సంస్కృతమునందు

వలెనే మార్పు లేకయుండుటచే సంస్కృతసమము లనుట యుక్తమేగాని. ఈ భాషలో క్రొత్తప్రత్యయములతోఁ గూడి ప్రాతిపదికములలోఁ గూడమార్పులు గలుగుచున్నపుడు తత్సమము లనుట యుక్తముగాఁ గనఁబడదు. కన్నడ వైయాకరణులుగూడ నీవిభాగక్రమమునే యవలంబించినారు. కాని వారు మార్పేమియు లేకయే కన్నడమునఁ జేరిన శబ్దములను సమసంస్కృతములనియు (అనగా రామ-రామం, భీమ-భీమం, నారద-నారదం ఇత్యాదులు) సంస్కృతమందును, కన్నడ మందును వ్యవహారములోనున్న శబ్దములను తత్సమములని ఒక విధమైన విభాగమును గల్పించినారు. సంస్కృత కన్నడములందు సమానముగా నున్న శబ్దములను తత్సమములని చెప్పి, అట్టి శబ్దముల నిరువదింటి నొకపట్టిగా 'శబ్దమణిదర్పణ' కారుఁ డిచ్చియున్నాఁడు. మణి, మంచం, తోరణం, కంకణం, గోణి. మాలె, అట్టం, గణం, గండం - ఇత్యాదులు. ఇవి రెండు భాషలకు సమానము లనుటలోఁ గలవిశేష మేమనగా నీ తత్సమ పట్టికలోని శబ్దములు సంస్కృతశబ్దములతోను, కన్నడ శబ్దములతోను గూడ సమాసమున నిలువగలిగియుండుటయే. సమసంస్కృతము లట్లు నిలుపఁగూడదఁట. తత్సమ శబ్దములకు సంస్కృత శబ్దములతోను, కన్నడ శబ్దములతోను సమాసములు కూడును. ఉదా:—దినమణి, ఉడెమణి, రత్నమంచం, తూగుమంచం, మరకత తోరణం, తళిర్దోరణం ఇత్యాదులు. సమసంస్కృతముతో దేశ్యశబ్దము సమసించినచో నది అరిసమాస మగును కావున ముఖతావరె, అరసకుమారం ఇత్యా

దులు నిషిద్ధములైనవి. మొత్తముమీఁద నీ కన్నడమున తత్సమ శబ్దమున కొక క్రొత్తయర్థము కల్పింపఁబడిన ట్లగపడుచున్నది గాని కేవలము తెలుఁగులోవలెగాదు. తొలుత నీ శబ్దమును వాడుకలోనికిఁ దెచ్చిన ప్రాకృతవైయాకరణులు దీనిని వర్ణములం దెట్టి మార్పులేక ప్రాకృతభాషలో నట్లే నిలిచిన సంస్కృతశబ్దముల పరముగా వాడిరనుటకు సందేహము లేదు. ఉదా:—కమల, తరల ఇత్యాదులు. ఇఁక జన్యభాషలలోఁ గొన్ని మార్పులకు లోనై చేరిన సంస్కృత శబ్దములు తద్భవములైనవి. ఈ తద్భవ శబ్దములలోఁ గలిగినమార్పును చాలవఱకు త్తరదేశభాషలలోను, దక్షిణ దేశ భాషలలోను సమానములుగనే యుండుట మనము గమనింపఁ దగిన విషయము. ఇట్లగుటకు దేశీయులగు అనార్య జనుల యుచ్చారణ రీతులు. సంప్రదాయములు మొదలగువాని ప్రభావముకూడ నొక కారణమై యుండునని తలంపనగును. ఎలయనఁగా—నీ ప్రాకృతభాషలలోఁ గలిగిన మార్పులు ద్రావిడభాషాసహజ సంప్రదాయముల కనుగుణములయి యున్నవి.

ఉదా: (౧) పదాదియందలి శ, షలు 'స' గా మారుట. ద్రావిడ భాషలలో ఊష్మములు లేవు. *cf*- శాణము. సాన, శ్రీ—సిరి *etc*.

(౨) పదమధ్యమున సంయుక్తాక్షరము నిలువదు. ద్విత్వాక్షరము నిలుచును. సం. పుత్ర—ప్రా. పుత్త: సం. ఆత్మపుత్ర— ప్రా. అజ్జఉత్త; *cf*. సం. ఋక్ష—తె., రిక్క.

(3) ప్రాకృతములలో భకారము హకారముగా మారును. ద్రావిడభాషలలో మహాప్రాణములు లేవు. సం. భవతి – ప్రా. హోది – హోఇ; భవిష్యతి – హావిస్సది; ఇట్లే సం. ముఖ – ముహ; (తె. మొహము) సం. మేఘ – మేహ, *etc.*

(४) పదమధ్యమునందలి క, త, ప వర్ణములు గ, ద, బ లుగా మారును. ఇదియు ద్రావిడభాషా సంప్రదాయమే. సం. అతిథి–(శౌ.) అదిధి; సం. పారితోషిక–శౌ. – పారిదోసియ; సం. లోక – (అర్ధ.) మా. లోగ; సం. అకాశ – ఆగాస; పట–పడ; కుటుంబ–ంకుడుబ.

(౫) పదాదియందు సంయుక్తాక్షర ముండదు. ద్రావిడ భాషలలోను అట్లే. స్నానము–తె. తానము; వ్యాపార–బేహార.

పదమధ్యమందలి సంయుక్తాక్షరము ద్విత్వమును జెందుటయో, లేదా సర్వభక్తిచే రెండక్షరము లగుటో తటస్థించును. ఇంద్ర–ఇందర; ద్వార–దువార; వర్ష–వరిస; హర్ష–హరిస; యుక్త–జుత్త; ఉత్పల–ఉప్పల; అగ్ని – అగ్గి; వింధ్య–వింఝ, వల్కల–వక్కల; పక్వ–పక్క; సత్య–సచ్చ; చక్ర–చక్క.

ఇట్టి మార్పులను బొంది సంస్కృతము ప్రాకృతముగా మారినది. దక్షిణదేశభాషలలోను సంస్కృత భవముల కిట్టి మార్పు లేకనఁబడుచున్నవి గదా. కాని సంస్కృత శబ్దములు దక్షిణదేశభాషలలో నెట్టి మార్పులను బొంది తద్భవములై ప్రవేశించినను అన్యభాషాశబ్దము లీ భాషలలో

ప్రవేశించినట్లే యగునుగదా. కావున నన్యదేశీయములే యని యెందుకనఁగూడదు ?

ఇఁక దేశ్యములను గూర్చి విచారింతము. సంస్కృతభాషకు సంబంధించినది గాని, దానినుండి నిష్పన్నమైనది గాని కాక దేశీయవ్యవహారములో ప్రాకృతభాషలలోనికిఁ జొచ్చిన శబ్దజాలము దేశి యని చెప్పఁబడుచున్నది. ఇట్టి దేశీయశబ్ద జాలమును హేమచంద్రాదులు 'దేశినామమాల' లను పట్టికలలోఁ జూపినారు. హేమచంద్రుని యీపట్టికలను బరిశీలించి వచో వనేకములు తద్భవశబ్దములుగూడ నందు చేరినట్లు కనఁబడుచున్నది. (తిందిసీ, గండీవం, మేఘుచ్చిరం, ధూమద్దారం మొదలగునవి దేశి శబ్దజాలములోఁ జేరినవి.) కాని దేశీయములగు అనార్య భాషాశబ్దములును పెక్కు గలవు. అందు ద్రావిడభాషా శబ్దములును గొన్ని లేకపోలేదు. ఉదా: ఊరం (ఊరో గ్రామః), చాణం, చాణో=గోమయ (cf. త. చాణి); చిల్లం=ఛిద్రం (cf. తె. చిల్లి), పసండి = కనకం (cf. తె పసిండి); దారో=కటిసూత్రం (cf. తె. దారము); మాడిఅం = గృహం (cf. తె. మేడ, క. మాడి, త. మాడం); మడో=కంఠః (cf. తె. మెడ); ఖడ్డ = శ్మశ్రు cf. తె. గడ్డము, క. గడ్డ); చిచ్చి = హుతాశనః) (cf. తె. చిచ్చు, క. కిచ్చు); ణేసరో=రవిః (cf. త. ఞాయర్)

దేశీయములగు నితరానార్య భాషాశబ్దములునుగొన్ని వీనిలోఁ జేరియుండును. కాని ఆంధ్ర దేశ్యములుకూడ కొన్ని యీ ప్రాకృతవైయాకరణులు 'దేశి' లోఁ జేరియుండుట యొక విశేషము.

ప్రాకృతవైయాకరణుల ననుకరించుటవల్లనే తెలుఁగు లాక్షణికులును తెలుఁగుభాషకు తత్సమ తద్భవము లనియే కాక, దేశ్యమను విభాగమునుగూడఁ గల్పించినారు. మూల భాష సహజముగ దేశ్యమే యైనపుడు మరల దేశ్య విభాగ మనున దెందులకు? ఇంతేకాక పీ రీ దేశ్యమున ఆంధ్ర దేశ్యము, అన్యదేశ్యము అను మరియొక విభాగమును గూడ చేసినారు. ఆంధ్ర దేశ్యమే అచ్చతెనుఁగనియుఁ జెప్పఁబడు చున్నది. ఇది ఆంధ్ర దేశ పురస్థాయులైన సకలజనులకు సుల భముగ దెలిసెడి శబ్దజాలము. 'విన్నవారికిన్ మనమునఁ దేటగా దెలియు మాటల యచ్చతెనుంగునాఁ జనున్' అని పెద్దన. ఇక దేశ్య లక్షణము—

"శ్రేయములై బహుదేశా
నేయములై చక్కఁదనము నెఱఁదనములునై
యాయా నెలవులఁ జెవులకు
దీయము లగు పలుకులెల్ల దేశ్యము లరయన్."
"కేశవ! యాంధ్రులు నానా
దేశంబులయందు నిలిచి తెలుఁగులె తత్త
ద్దేశోక్తు లంట బలికిన
నాశబ్దము లన్యదేశజాంధ్రము లయ్యెన్."

(అప్పకవి)

అనగా నా యా దేశభాగములయం దాంధ్రుల వాడు కలో వెలసిన శబ్దము లన్నమాట. వీనిని మాండలికశబ్దము (*Provincialisms*) లనియు చెప్పవచ్చును. ఇట్టి శబ్దము లాయా ప్రాంతములందలి కవులు వారి గ్రంథములలోఁ బ్రయో

గించినచో, నా గ్రంథవ్యాప్తిని బట్టి ఇతర కవుల గ్రంథముల లోని కెక్కి క్రమముగ దేశమునందంతటను వ్యాప్తిగాంచును. అట్టివి నిత్య వ్యవహారమునందు ప్రసిద్ధికంటె వాఙ్మయ ప్రసిద్ధి విశేషముగా గలవై (*Literary forms*) యుండును. ఎట్లైనను ఆంధ్ర భాషలోని ఆంధ్ర దేశ్యమునకుఁగల ప్రాచుర్య సహజత్వము ప్రాకృత భాషలోని 'దేశ్యము'నకుండదు గదా. ఎందుచేత ననగా, నీ భాషలో తత్సమ, తత్భవశబ్దజాల మెరువుసొమ్మయినట్లే ఆ భాషలలో నీ'దేశి' శబ్దజాలమును ఎరువు సొమ్మే. భాషకు ప్రాణమనదగిన వాక్య నిర్మాణ పద్ధతులు, వ్యాకరణసంప్రదాయములు నీ భాషకు 'దేశ్యము' అను భాగములోనే స్వతంత్రము లై యుండగా, ప్రాకృత భాషలకు 'తద్భవ' భాగములో సంస్కృతమూలములై యున్నవి. కావుననే తెలుఁగు భాష ప్రాకృత భాషల వలె తన జీవికకు సంస్కృతముపై నాధారపడి యుండ నావశ్యకత లేదు. దీనిని బట్టియే ప్రాకృతము లార్య భాషాజన్యములు, ఆంధ్ర మనార్యమగు స్వతంత్ర భాష యని చెప్పుట కవకాశము కలుగుచున్నది. కాని దీనికి సంస్కృత ప్రాకృతములతోఁ గలిగిన చిరకాల సంబంధముచే వానితో గాఢసమ్మేళనమును బొంది యది శరీర పుష్టిని గాంచుటను బట్టి సంస్కృతభాషాభిమానులగు వైయాకరణు లీ తెనుఁగును కూడ ప్రాకృతములవలెనే సంస్కృతజన్యమని, తద్వికృతి యని తలంపసాగిరి. కాని వారీ భాషను తత్సమ తద్భవ దేశ్య విభాగముచేసి వాని కుదాహరణములుగా శబ్దముల నిచ్చిరేగాని వాక్యముల నిచ్చియుండకపోవుటయే గాక

ఇందలి భాషారూపములనుగాని, విభక్తులనుగాని సంస్కృత ప్రాకృతములనుండి నిష్పన్నమైనవని సాధింప యత్నింపనైన లేదుగదా! అది సాధ్యమగునదియుఁ గాదు. కావుననే ఆంధ్ర మార్యభాషాజన్యము కాక భిన్న కుటుంబమునకుఁ జెందిన దగుచున్నది. ఇందలి విభక్త్యాదులు, వ్యాకరణ ప్రక్రియ దక్షిణ దేశ భాషాలక్షణమును బోలిన వగుటచే నిది దక్షిణ దేశభాషా కుటుంబమునకుఁ జేరినదని నిశ్చయింపవలసి యున్నది. ఇట్లీ భాష దేశీయమే యగుటచే మరల దేశి విభాగమున కావశ్యకతయే లేదు.

ఆంధ్ర మార్యభాషాజన్యముకాక దక్షిణ దేశభాష లతో సాజాత్యము కలిగినదన్నపుడు, ఈ భాషకు సహజ మనఁదగిన యీ 'దేశ్యము' తక్కిన దక్షిణ దేశభాషలతో సంబంధించినదై యుండవలయునుగదా. ఈ దేశ్యము, లేదా అచ్చ తెనుఁగనునది సంస్కృత సమ, సంస్కృతభవ భిన్నం బని వైయాకరణులు చెప్పినపుడే దీని నిష్పత్తిని గూర్చి సంస్కృత మెట్టి సహాయము చేయలేదని వారు చెప్పి నట్లయినది. కావున సన్నిహితములగు దక్షిణ దేశభాష లతోఁ బోల్చిచూచుటచేతనే దీని (ఈ దేశ్యముయొక్క) లక్షణమును, చరిత్రను మనము కనిపెట్టవలసియున్నది.

'ఎల్లవారికిఁ దేటతెల్లముగాఁ దెలిసెడిపలుకులు' అని కేతన పెద్దన లిచ్చిన శబ్దములు, వాని కితర ద్రావిడ భాష లతోఁ గల సంబంధమును గూర్చి పరిశీలింతము.

"తల నెల వేసవి గుడి మడి

పులి చలి మడు గూరు పేరు బూరుగు మగవా

డలుక . . .'' (అని కేతన)

తల—త. తలై; క తలె మళ. తల

నెల—త. నిలావు (*Moon*)

వేసవి—క. బేసగె. (బిసు = వేడి), త. వేనిల్

పులి—త. మళ. పులి; క. పులి, తు. పిలి

చలి—క. చళి, సళి; (కుళిర్) తుళు. చలి, చళి

మడుగు—క. మడు, మడువు; త. మడు

ఊరు—త. మ. క. ఊర్, తు. ఊరు

పేరు—త. మ. పెయర్, పేర్, క. పెసర్; హెసరు; తు. పుదర్

మగవాడు—త. మగన్ (*son*); క. మగ (*son, male*)

బూరుగు—క. బూరుగ, బూరుగె (*a silk cotton tree*); త. పూళై

అలుక—క. అలుగు (= *to be agitated, shake*); త. అలంగు

ఇంక పెద్దన అచ్చ తెనుఁగు శబ్దములు :—

ఎనుములు—క. ఎమ్మె; త. ఎరుమై, మళ. ఎరుమె; తు. ఎర్మె

గుఱ్ఱములు—త. కుదిరై; క, తు. కుదిరె

పండులు—క. పణ్ణు, హణ్ణు; త, మ. పఴమ్

బండులు—త. వండి

ఉప్పు—త. మ. క. తు. ఉప్పు

పప్పు—త మ. పరుప్పు

ఆకు—క. ఆకు (cf. ఆగు *a seedling, a sprout*).

నేయి—క. నెయ్. త. నెయ్. (*fat, grease*) (స్నేహః)

నూనె-(నూవు+నెయ్) cf. త ఎళ్+నెయ్=ఎణ్ణె

పాలు—త క. మ. పాల్

ఊరు—త. క. ఊరు > ఊరు.

అప్పకవి ఆంధ్రదేశ్యమని చెప్పినదాని కుదాహరణముగా పాలు, నేయి పెరుగు. ఊరు, ఉట్టి మొదలగు వానిని ఇచ్చియున్నాఁడు. ఈ ఆంధ్రదేశ్యమని అప్పకవి చెప్పిన దానినే కేతన పెద్దన లచ్చ తెనుఁగని చెప్పినారు. వీరు దేశ్యమని వ్యవహరించినదానినే అప్పకవి అన్యదేశ్య మన్నాఁడు. కేతన దేశ్యమునకు ప్రత్యేక లక్షణము చెప్పక యే "ఎఱుకువ నెత్తమ్ము" ఇత్యాది శబ్దముల నుదాహరించినాఁడు. కాని పెద్దన లక్షణముకూడ నిట్లు చెప్పియున్నాఁడు.

"శ్రేయములై బహుదేశా
నేయములై చక్కదనము నెఱదనములు నై
యాయా నెలవులఁ జెవులకు
దీయములగు పలుకులెల్ల దేశ్యము లరయన్"
దీనినే అప్పకవి యనువదించినాఁడు.

"కేశవ యాంధ్రులె నానా
దేశంబులయందు నిలిచి తెలుఁగులె తత్తద్
దేశోక్తు లంటఁబలికిన
నా శబ్దము లన్యదేశజాంధ్రము లయ్యెన్."

"బహుదేశానేయములై నవి" గాని, అనఁగా ఇతర దేశములనుండి వచ్చి యీ భాషలోఁ జేరినవిగాని, ఆంధ్రులే యితర దేశములందు నిలిచి తెలుఁగులే తత్తద్దేశోక్తు లంటఁ బలికిన పలుకులుగాని అన్యదేశ్యములగునని తెలియుచున్నది. కాని గ్రాహకుడు ఉదాహరించిన శబ్దములనుబట్టి యివి యెట్లన్యదేశ్యము లనదగునో. అనఁగా నేయే దేశభాగముల లోనివో ఇప్పుడు గ్రహించుట యంత సులభసాధ్యముగాఁ గనఁబడదు. వీనిలో పెక్కు కావ్యభాషయందే విశేషముగా గనంబడుటనుబట్టి పై దెలుపఁబడిన అచ్చతెనుగుశబ్దములవలె నంత విశేషముగా నిత్య వ్యవహారములోనుండి యందరికి సులభముగ దేటపడియెడు మాటలు కావనిమాత్రము చెప్ప వచ్చును ఇవి యిప్పుడు హైదరాబాదు, బళ్లారి, బరం పురము, మద్రాసు మొదలగు ప్రాంతములందు నివసించు వారు తత్తద్దేశోక్త లంటఁ బలుకుచుండిన పలుకుల రీతినే ఆ కాలమున నానా దేశములందు నిలిచిన యాంధ్రుల వ్యవహా రములోని మాటలై యుండును. అనగా నా కాలపుప్రాంతీ యాంధ్రశబ్దము (*Provincialisms*) లని తలంపవలసియున్నది కాని వీనిలో పెక్కు శబ్దములు సమాస పదములుగను, గ్రంథస్థములుగను కావ్యభాషా సామాన్యములుగనే యుండు టనుబట్టి నిత్యవ్యవహారములోనివిగాని గ్రాంధిక భాషారూప ములనే వీ రిట్లు గ్రహించిరాయనియు సందేహింపవలసి వచ్చుచున్నది.

"ఎఱుకువ, నెత్తమ్మి, ఎరగలి, ఎసకంబు
నొసలంటి, తేఁటి వెక్కసము, నెమ్మి

మక్కువ, చెచ్చెర, మచ్చిక, హెచ్చెము
కడిమి, వేడ్తెర. లగ్గు, కలవలంబు

ఎల్లికొఱలుట. పేచొప్పు, లుల్ల ముదిద
పీకకాఱయ, గ్రద్దలు. వేఁట. గ్రేణి
కోను పాలిండు లోగి మొగ్గసయనిట్టి
తెలుగుపలుకులు ధర దేశి మనుచు బావ్యో"
(ఆం. భా. భూ.)

వీనిలో 'గ్రద్ద' శబ్దము గృధ్రశబ్దభవ మను తలం పుతో కోశకారులు దీనిని తద్భవ మని చెప్పుటకలదు గాని తమిళమునందలి 'కఱు-కఱుద్దై' అనుదానికి సంబంధించిన దని తలంచినచో నిదియు దేశ్యమే కావచ్చును. ఇట్లు పై పదమున కేతన తెలిపిన శబ్దములన్నియు దేశ్యములేయగును గాని యేయేదేశభాగమునుండి వచ్చినవో చెప్పుట కవకాశము చాలదు. అందు పెక్కు శబ్దములు కావ్యభాషాప్రాచుర్యముమాత్రము కలవని చెప్పవచ్చును. ఇక తమ్మర, లేమావి, క్రొన్నన, రేఱేడు. వాలుగంటి. కెమ్మోవి. కెంజాయ, తామరకంటి, నలువ, చిగురుబోడి మొదలగునవి సమాసపదములు. పెద్దనయు కేతన చెప్పినవానిలో ఎల్లి, నెత్తమ్మి, క్రొన్నెల, హెచ్చెము అను శబ్దములను గ్రహించి ఇంక వాలాయము, ఆలము, వంగడము, అంగడి, వెన్ను, వాఖిరి, వాగెంబు, అక్కజము, అచ్చెరువు, వేసలి, వేనవేలు మొద

లగు మఱికొన్ని కావ్యభాషలోనే సాధారణముగాఁ గనఁబడు శబ్దములను ఇచ్చియున్నాను. ఇందు వంగడము. అక్కజము అచ్చెరువు తద్భవములుగా సంస్కృతాంధ్ర వైయాకరణులచే గ్రహింపఁబడుచున్నవి. వంగడము వంశ శబ్దభవమును. అక్కజము, ఆశ్చర్య శబ్దభవమును కావచ్చును. తక్కినవానిలో పెక్కు ఇతర దక్షిణదేశ భాషలకు సంబంధించినవియు గలవు.

ఎఱుకువ–త అఱి, అఱివు, అఱికెక్కు

మన్ను–త. మణ్. మణల్

ఇంతి–త ఇల్ తి

తెమ్మెర–క. తెమ్+ఎలర్ (< ఎరల్) = తెమ్మెలర్, తెంబెలర్

కసిలి–త కసల్ = అల.

నాన–త. క. నాణ్, నాణ

ప్రౌఢ–ప్రబద్ధ శబ్దభవ మనుకొనరుగాని త. క. పొఱుదు అనుదానికి సంబంధించినదై యుండును.

తనివి–(తనివు, తనుపు = తృప్తికలుగఁజేయు) తణ్ = తని = చల్లని, cf త. తణ్ణిన్

అంగడి–త, క. అంగాడి

కేలు–త. కై. క. కెయ్యి

పోరు–త. క పోర్.

అప్పకవియు అన్యదేశజాంధ్రములలో కేతన పెద్దన లిచ్చిన వాలాయము, ఆలంబు. ఎలనాగ, వెలది, నెలఁత, తొయ్యలి, బోటి, ఇంతి, పడఁతి, పొలుపు, వీనులు,

ఉల్లము. కేలు, నెమ్మి, సోయగము, చెచ్చెర, మున్నగు మొదలగువానినే చేర్చినాఁడు. కాని కేవిన అచ్చ తెలుఁగు లుగా నిచ్చిన నెల, వేసవి శబ్దముల నప్పకవి అన్యదేశజాంధ్ర ములుగా గ్రహించినాఁడు. కేతన పెదనలు తత్సమము, తద్భవము, అచ్చ తెనుగు (సహజాంధ్రదేశ్యము), దేశ్యము (దేశోద్భవము), గ్రామ్యంబు నాఁగ నలవైదు తెఱఁగులు "పంచవిధములై తెలుగు పలుకు ... పరఁగె" అని చెప్పి తెనుఁగున గల భేదమును మాత్రము చెప్పగా, అప్పకవి "తెలుఁగు మాటలు" "... " నను మరి రెండు వర్గములను గల్పించియున్నాఁడు. "అర్థముఖల కుదు యించినట్టి సీస" అనుటకు గ్రమముగా "కడలి మొలపాలె చేడియ గవిసి పడుచు" అని చెప్పినదో యది "తెలుగు మాటలు" అగుఁగట. ఇవగా తత్సమపదములను పరిహ రించి తదర్థమును దొంకఁబడుఁగుడు తెలుఁగు సమాసముల మూలముగాఁ జెప్పినచో నట్టి శబ్దములు తెలుఁగు మాటలు లగును. ఇవి భాషలో సహజముగ వ్యవహారములోనున్నవి గాని, ప్రాచీన కవుల రచనాపరిపాటిలోనివి గాని కాక, విశే షంబుగా తత్సమబహుళంబు గాఁజొచ్చిన ఆంధ్రభాషపైఁ గలిగిన యేవగింపును సూచించుటకో యన్నట్లు ౧౬-వ శతాబ్ది ప్రాంతమున గొంద రాంధ్రకవులు అచ్చ తెనుఁగు పేరున గల్పించిన యొకవిధమగు కృతక భాషారూపములని చెప్పవలసియున్నది. అప్పకవి పేర్కొనిన యీ తెలుఁగు మాటలు లనువానిని వెనుకటి లాక్షణికులు పేర్కొనక పోవు టచే నివి అప్పకవికి సమీప కాలముననె బయలుదేరిన వన

వచ్చెను. అందాక పూర్వపు లాక్షణికులు సంస్కృత విభక్తులు, క్రియారూపములు, అవ్యయములు, వైరి సమాసములు నీ భాషలోం జేరకూడదని శాసించి తత్సమ రూపములలోం గూడ గలుగు మార్పులను సూచించియు తెలుంగు దేశీయ సంప్రదాయమును నిలువబెట్ట యత్నించిరి. అల్ల ప్రాచీనకర్తలలో సోమనాథాదులు "ఆరూఢ గద్యాపద్యాది ప్రబంధ పూరిత సంస్కృత భూయిష్ఠ రచనను" ప్రోత్సహింప నారంభించిరి. అప్పటికిం దెనుగుమఱుంగులు భాషలో బయలు దేరలేదు. ఆ కాలమున తత్సమ బహుళమగు శిష్ట కవుల రచనను ప్రతిఘటించుటకొరకు బయలుదేరిన "జాను తెనుంగు" వాఙ్మయమే అప్పటి పండితకవుల యాదరమును బడయలేక దేశమున సంచారణానిగా ప్రవహించి మఱి కొంత కాలమునకు 'తెనుంగుమఱుంగు' లను మారురూపమును వహించి అచ్చతెనుగురచనమును చేరదీసి బయలువడ వచ్చినది. కాని యీ మఱుంగు జాను తెనుంగు జాణతనము నకు మరుగే యైనదిగాని సొబగు పెట్టజాలినది కాలేదు. సహజమగు దాని తియ్యదనము మరుగువడి కృత్రిమరుచులు పెరుగుటచే సహృదయుల హృదయము నాకర్షింపజాలక పోయినది. కావున నేయీ యచ్చతెనుగు రచనయు నచిర కాలములోనే యంతరించుటయు దటస్థించినది. దీనితోపాటు వెనుకటి "జాను తెనుంగు" మాటయు నడుగున బడిపోయినది.

అప్పకవి అచ్చతెనుంగున కీ తెలుంగుమఱుంగుల నేకాక "ప్రాంతెనుంగు" లనువానినిగూడ జేర్చినాడు. "తొల్లింటి

కవుల వాక్యము లెల్లను బ్రాఁదెనుఁగులనియు ''శ్రుతిచే యుంటి వారివారికిఁ జెల్లుబడియైన ప్రాఁదెనుఁగు లగునట. కాని యా చెల్లుబడి విషయమున నభిప్రాయభేదము లనేకము లుండక పోలేదు. అప్పకవియే ఆడు, ఈడు అనునవి గ్రామ్యోక్తు లన్నాఁడు. ఇవి తిక్కనాదుల ప్రయోగములందే గలవు. తిక్కనాదులే యీ ప్రాఁవడ్డమాటల ప్రయోగములను గూర్చి

''పలుకుల పొందులేక పద

భంగము సేయుచు ప్రాఁవడ్డ మా

టలు దమ కేర్చు గూర్చి''

ఇత్యాదిపద్యమున నెత్తిపొడిచినాఁడు. ఈ ప్రాఁవడ్డ మాటలు అప్పకవి చెప్పిన పూర్వకవుల ప్రయోగములే యని తలంపవచ్చునా? ప్రాఁవడ్డ మాటలతో పద కేర్పు చూపుచు, నట్టైనను హృదయ మలరింపలేని కుకవిని గూర్చి యనితో నోల్చుచు నిందించియున్నాఁడు తిక్కన. పూర్వకవి ప్రయోగములను గ్రహింపవలసినదా యాతనియుద్దేశము? గ్రహించినను హృదయ మలరించునట్టివిగా వానిని జేయవల యునని గాఁబోలు. కావచ్చును. పూర్వకవులలో నొకఁడగు నన్నిచోడుని కవితనుండి యాతఁడట్టివానిని కొన్నిటిని గ్రహింపకపోలేదు. కాని వానికి మెరుగు పెట్టినాఁడనియుఁ జెప్పవచ్చును. నన్నిచోడుడు కర్తిగొంటులయిన అత్తగారును–వేశ్యమాతలను గూర్చి వారి సామర్థ్యాతిశయమును గూర్చి వర్ణించు సందర్భమున వారు ''నేలయు వింగియు జాలముల్ వాయింప, నెండమావుల బట్టుబంపతలయు, బ్రమోకాలం

ముడిపెట్టు.." సేద్యగాల వారని వస్తుస్థితిని వర్ణించినాఁడు. ఈ "నేలయు నింగియుఁ దాలముల్ వాయించు"టను సోమనాథుఁడు. తిక్కనగూడ గ్రహించినారు. అందు తిక్కనార్యుఁడు దీనిని ప్రయోగించి రీతి గమనింపఁదగినది. కీచకునిచే కొంకకొస రించుకయు లేక కూఁదన్నఁబడిన ద్రౌపది భంగి పాటును విరటాని యాస్థానంబునఁ నుండి

"కనుఁగొని కోపవేగమున
కన్నుల నిప్పులురాల నాగము
లొనరఁగ సాంద్రఘర్మసలి
లంబులు గ్రమ్మ నితాంతదంతపీ
డనఘటితాస్యరంగవిక
టభ్రుకుటీచటుల ప్రవృత్తన
ర్తనఘటనాప్రకారభయ
దస్ఫురణాపరిణద్ధమూర్తియై" న

పవనతనయుని భయంకరాకారమును మన కనుల యెదుట నిలబెట్టుటకుగా తిక్కనార్యు డీ విషయమును గ్రహించినాఁడు. నన్నిచోడుని వేశ్యమాతల నేర్పరితన మను వస్తుస్థితి వర్ణనముకంటె తిక్కనార్యుని యీ భావస్ఫోరక వర్ణన సందర్భమున నా వాక్యమున కెట్టి మహత్తరశక్తి, ఔచితి కలిగినవో పరికింపుడు.

"నేలయు నింగియు దాలముల్ గావించి
యేపున రేగి వాయించియాడ
కులపర్వతంబులుగూర్చి యొంటొంటితో

పాకంగ వీకమై తన్నియాడ
నేడు నాగరములు నిక్కడక్కడ బెట్టి
పలుచని రొంపి మై నలదికొనగ
దిక్కులు నాలుగు నొక్కచోటికి దెచ్చి
పిసికి పిండలు సేసి పిడిచికొనగ
నింగి బ్రహ్మాండభాండంబు పగుల వ్రేయ
నప్పు డుదు ప్రళయకాలానలమున
గంపించిన రూపంబుకంటె భీము
డతి భయంకరాకారత నతిశయిల్లె.''
నన్నిచోడుడు —(కుమా. సం. ౧-౯)
''ధరణీచక్రము చిరిరిం
దిరుగ జలయోనిధులు గలగ దెసదప్పి భయా
తురులై సురకిన్నరగణ
నరవరు లని దూలిపాఱ నరకుడు దాకెన్''
తిక్కన -భీముడు ద్రౌపదితో-

''అవనీచక్రము సంచలింపగ దివం బల్లాడ నాశావయం
బవధూతంబుగ గోత్రశైల నికరంబాకంపముం బొంద న
ర్ణవముల్ ఘూర్ణన మొందఁ గ్రోధముగ్రకృతాంతత్వంబు
నొందించి చి
త్రవధప్రౌఢి వహించి సూతునకు రౌద్రం బేర్పడం
జూపెదన్'' (విరా. ౨-౨౮౫)

నన్నిచోడుడు - గుణాధ్వని—
''ధర గంపింప జలయోనిధుల్ గలగ ది

గ్రంతుల్ భయంబంద భూ
ధరముల్ డొల్ల వియత్తలం బద్రువ దై
త్యశ్రేణి భీతిల్ల భా
స్కరసద్మాంబులు బ్రుంగి మార్గబడ నా
శాచక్రముల్ మ్రోయ భీ
కరమై దారుణమై గుణధ్వనిమహో
గ్రంబై చెలంగెన్ వడిన్''
(కు. సం. ౧౨-౯౧౨)

తిక్కన - పార్థుడు శంఖమొత్తినన్ -
''కలగెన్ తోయధిసప్తకంబు గిరివ
ర్గం బెల్ల నూటాడె సం
చలతన్ బొందె వసుంధరావలయ మా
శాచక్ర మల్లాడె గొం
దల మందెన్ ద్రిదశేంద్రుపట్టణము పా
తాళంబు ఘూర్ణిల్లె నా
కులమయ్యెన్ గ్రహతారకాకులము సం
క్షోభించె నవ్యోమయున్'' (విరా. ౪-౧౭౨)

నన్నెచోడుడు - ''షణ్ముఖునురుభుజాస్తంభాగ్రమున
జయ శ్రీ బొందె నాలభంజిక విధమున'' (౧౨-౯౭౪)

ఈ భావము తిక్కనార్యుని నిర్వచనోత్తర రామాయణమున తొలి శ్లోకమునకే ఎట్లు విస్తరింపబడినదో చూడుడు

"శ్రీరాస్తాం మనుమక్షితీశ్వరభుజాస్తంభే జగన్మండల
ప్రాసాదస్థిరభారభాజి దధతీ శ్రీసాలభంజీశ్రియం"

ఇట్లు వెనుకటికవుల భావములను, మాటలను గ్రహించినను వానిమూలమునఁ జదువరుల హృదయ మలరించునట్లుగా రచింపఁగలిగిన వేఁకాని సుకవి కాఁడని యీతని భావమైయుండు నేమో.

"త ఏవ పదవిన్యాసాః తా ఏవార్థవిభూతయః
తథాపి నవ్యం భవతి కావ్యం గ్రథనకౌశలాత్"

అనిన యాలంకారికుల యభిప్రాయమునే యీతఁడనువదించుచున్నట్లున్నాఁడు. ఇట్లు నన్నిచోడుని భావములను గొన్నిటిని గ్రహించి వానికి మెఱుఁగుపెట్టి ప్రయోగించినను, ఈతని గొప్ప రచనగా ననఁదగిన నిర్వచనోత్తర రామాయణములో నితఁడు చేసిన [illegible]. చెప్పిన కవితాలక్షణవిశేషములు, సూచించిన పదప్రయోగపద్ధతి మొదలగునవి యీతఁడు నన్నిచోడుని రచననె మనమున నిడికొని చేసెనా యని తలఁచుట కవకాశము కలుగుచున్నది. భాషాసాహిత్యరచనా పద్ధతుల విషయమున నన్నపార్యుని పక్షమునందే యాదరముగలవాఁడగు తిక్కన యీ రీతికి భిన్నములగు పలుకుల నొందుటేమి. దానిమూలమున గలుగు రసభంగము, ప్రాఁతపడ్డ మాటలు, విశేషణవిశేష్యముల లింగవచనముల భేదము మొదలగు రచనావిషయములను గూర్చి ఖండింపవలసినవాఁ డగుటను బట్టియు, ఈ లక్షణములు కొన్ని నన్నిచోడుని రచనలోఁ గానవచ్చుటం జేసియు నన్నిచోడుని

రచనయే యాతని విమర్శకులు కారణమయి యుండుననుట యుక్తి యుక్తముగా గనబడకపోదు.

పలుకుల పొందు లేకపోవుట యను తిక్కనార్యుని యాక్షేపణమును నన్నెచోడుని రచన కన్వయించినచో, నన్నయాదుల రచనలో గానరాని యన్యదేశీయ పద, పద బంధముల ప్రయోగసరళి యొకటి యీరచనలో గానవచ్చు చుండుట మనము గమనింపదగిన విషయములలో నొకటి యగును. అయితే నన్నయకు పట్టువడని యీ క్రొత్తరీతి యీతనికిమాత్ర మెచ్చటినుండి వచ్చినది. ఏల రావలయును అను ప్రశ్న వెంటనే కలుగకమానదు. పరిశీలించినచో మన దేశమునందలి తక్కిన పెక్కు విషయములందువలెనే యంత దూరమేల, మన యాంధ్రుల జాతీయ చరిత్రమందువలెనే ఆంధ్రవాఙ్మయ చరిత్రలందును ఆర్యానార్య భాషాసాహిత్యపద్ధతుల సహజసమ్మేళనము చక్కగా సాధింపబడియున్నదని మనము గుర్తింపవలసియుండును. దీనిని మొదట చక్కగా సాగించుటలో ప్రోత్సాహకులై కీర్తిగన్న వారు చాళుక్యరాజులు-సత్యాశ్రయుని నాటి చాళుక్య నృపులే కావచ్చును. అట్టి దానిని తొలుదొలుత సాధించి పేరుగాంచినవాడు నన్నపార్యుడు. వీరికీ విషయమున గొంతవరకు మార్గదర్శకమైనది కర్ణాట భాషాసాహిత్యము. అందప్పటికి పూర్వమే యీ సమ్మేళన పద్ధతులు స్థిరపడి సాహిత్యము పెంపొందియున్నది. ఆ సాహిత్యరీతులనే తన దేశ కాలాదిపరిస్థితుల కనుకూలమగునట్లుగను, "అనఘమై శిష్టాగ్రహార భూయిష్ఠమై ధరణీసురోత్తమాధ్వర వితాన

పుణ్యసమృద్ధమై పొలుచు" వేగిదేశమండలి గోదావరితీరం బున నివసించు తన వైదికసంపత్తి కనుగుణమగు నట్లుగను గ్రహించి "తెనుంగునన్ మహాభారత సంహితా రచన బంధురుఁ" డై వాఁడు నన్నయ. కాని నన్నిచోడునకీ గోదావరీతీర వేంగిదేశపు వైదికసంపత్తి లేదు. ఆంధ్ర దేశ పశ్చిమ భాగమండలి అచ్చ తెలంగాణపు దేశీయాభిమానమునకుఁ జోడు తత్సామీపస్థములగు నన్యదేశీయ సంప్రదాయ ప్రవణత కూడ ప్రబలినట్లగపడుచున్నది కావుననే నన్నయ యవలంబించిన మార్గపద్ధతి నవలంబింపక, దేశిమార్గములను దేశీయములుగా జేసి కవిత నాగింపవలె నని తలచియుండును. ఆంధ్రదేశ పశ్చిమభాగము కన్నడదేశప్రాంత మగుటచే నప్పటి దేశిక కన్నడ భాషాసంపర్కము హెచ్చుగా నుండక మానదు. గద్యపద్యోభయ సమ్మిశ్రితమగు వాఙ్మయము కన్నడభాషలో నింతకుపూర్వమే వెలసి ప్రసిద్ధిగాంచియుండుటచే నా వాఙ్మయమే, అందును రత్నత్రయమని ప్రసిద్ధిగాంచిన కవిత్రయమే పెక్కు విషయముల నన్నిచోడునికి మేలుబంతి యగుటలో నాశ్చర్యము లేదు. ఈ కారణములచే నీతని రచనలో తమిళ కన్నడ భాషాపదములు, ప్రయోగములు. సంప్రదాయములు మొదలగునవి కొన్ని ప్రబలుట, అవి తరువాతివారికి నచ్చకపోవుట తటస్థించినది. కేవలము నన్నయ యవలంబించిన మార్గమునే యవలంబింపక నన్నిచోడునివలె దేశి పద్ధతికై ప్రాకులాడిన పాల్కురికి సోమన కూడ తరువాతి కవుల యాసడింపులకు గురియగుటను, తక్కిన వారి భాషకంటె వీ రిద్దరి భాషలోను, ప్రయోగపద్ధతిలోను

కొంత సామ్య మగపడుచుండుటకునుగూడ కారణము వీరిది పశ్చిమాంధ్రదేశీయ సంప్రదాయ మగుటయే కావచ్చును. కావున వీరి విశేష ప్రయోగములలోఁ గొన్నిటిని పశ్చిమాంధ్రదేశీయములుగను, కొన్నిటిని అన్యదేశీయములుగను మనము గ్రహింపవలసియుండును. కేశనాదులు చెప్పినట్లు తల, నెల గుడి, మడి, ఊరు, పేరు, పాలు, పెరుగు మొదలగు శబ్దములు దక్షిణదేశ భాషలన్నిటికిని మూల మగు తల్లి భాష నుండి వచ్చినవేయైనను, ఈ భాషలు వేరుపడి స్వతంత్రములైన పిదప అందలి సాహిత్యముల పరిచయమువలన గాని, ఆయా భాషలను వ్యవహరించువారి సాన్నిహిత్యము, కలయికలవలనగాని ఒక భాషలోని శబ్దములు మరియొక భాషలోనికి సంక్రమించుచుండును. అప్పుడవి యన్యదేశ్యములుగనే పరిగణింపఁబడునుగదా. ప్రాంతీయములగు నిట్టి శబ్దముల నాయా కవుల ప్రయోగచాతుర్యమును, బలమును బట్టి యితర కవులును శిరసావహించి గ్రహించినచో నవి యా భాషా సాహిత్యమున నిలిచిపోయి యా భాషలో నంతర్భాగమే యగును. లేనిచో నాయా ప్రాంతీయ కవుల రచనలలో మాత్రమే పొడసూపుచు భాషలో విశేషవ్యాప్తి గాంచవు. నన్నెచోడ సోమనాథుల రచనలలోని కొన్ని ప్రయోగముల కిట్టి స్థితియే కలిగినది. తిక్కనవంటి మహాకవి యట్టి యసాధారణాన్య దేశీయ ప్రయోగములను గూర్చి వెంటనే నిరసింప తటస్థించుట గూడ నట్టివి కాలక్రమమున నంతరించుటకు కారణమైయుండును. పలుకుల పొందులేక ఒకటన్ హృదయం బలరింపలేని కుకవులను నిందించుటతో పాటు

"తెలుఁగు కవిత్వము చెప్పందలచిన కవి యర్థమునకు దగి యుండెడు మాటల గొన" వలయునని చెప్పుచు తెలుఁగు కవిత్వము చెప్పదలచిన కవి యనుసరింపవలసిన విధాన మునుగూర్చిగూడ తిక్కన చేసిన సూచన నన్నిచోడాదుల విజాతీయ ప్రయోగముల నే లక్ష్యముగాఁ జేసికొన్నదిగా నేకన బడుచున్నది. అట్లన్యదేశీయములుగాఁ బరిగణింపఁ దగిన నన్నిచోడుని కొన్ని ప్రయోగములనుఁ బరిశీలింతము. ఇవి విజాతీయము లనఁ(?)కుట అప్పటి నన్నయాదుల మార్గ పద్ధతిని బట్టి చూచుటవలనను. ఆ మార్గము నవలంబించిన తరు వాతి కవులు వాని నంతగా గ్రహింపకపోవుటచేతను గలిగి నవే లేని-నో నిరియు అప్పకవి చెప్పిన ప్రాత తెనుఁగులలో జేరవలసినవే. నన్నిచోడుని రచనలో పలుకుల పొందిక లేక పోవుట విజాతీయములగు నన్యదేశపు పలుకుళ్లను ప్రయో గించుటచేతనే యనుదాని కుదాహరణముగా నీ తమిళభాషా ప్రయోగములనుఁ జూపవచ్చును.

నాయి దోర్ప నేర్చుగాక ఏమి సేర్ప నేర్చు-cf. త. నాయి=కుక్క.

ఈ వచ్చినపేళ్ళ యందు-cf, త. పేయర్, పేర్ = నామము. ఎత్తనిపేర్ = ఎంతమంది.

వేల. వేలగొని cf. త. వేలై = పని. ఉద్దిగము.

పురులు-ధనము. cf. త. పొరుల్ ముడి = కిరీటము. పొన్ముడి = బంగారు కిరీటము.

పొయిదల-cf. త. పొయి = అబద్ధము.

తన్నీరు-cf త. తణ్ణీర్. తన్ని=ఉదకము, చల్లని నీరు.

పద్మిని యొడమి యెల్ల నూఱగొని-cf. త. ఒడమె=ధనము.

కట్టాయము—cf. త. క. కట్టాయము=నిర్బంధము. నిశ్చయముగా.

నవ్వులకు మలరుల కిచ్చి-cf. త. క-మలర్=పువ్వు.
కుళిరు గొన-cf. త. క. కుళిర్=చల్లదనము.
కళియ-cf. త. కూழு=భోజనము, వంట.

తమిళభాషా పదములకంటె కన్నడభాషాపదములు, ప్రయోగములు, ఈశవిరచనయందు విశేషముగాఁ గానగును. అవి పంపాది కన్నడకవుల గ్రంధములం దీతనికి గల యాదరమును, పరిచయమునే విశేషముగా సూచింపఁగలవు.

భీతికి కండవడంబు సుట్టి (=కాండపటము=తెర), కేనము, కెలసము. అగుర్వు, విగుర్వించు, అబ్బిగింపక, ఎల్లిదించు, మేలివెంచలు, దేసి. పందల, ఉరి (=వహనే), తుంతుర్వని(తుంతుర్=*drizzling, spray*, పని=*drop,dew*) మేలిల్లు, జాలకి, జేటము. జేటంజేటము, కొలవేళులు, పీలితొంగళ్లు, పేర్బిందులు, ఎలర్. వఱడియలు, మేఘడంబరములు, కెడ్బరసు, ముట్టిమూదలించు. కునిసియాడు, అపమానము, బ్రోయు (=పీతెవాయించుటకు), క్రుక్కిదము మొదలగు శబ్దములును,

"అయవనీసురాసుర చయంబు దద్దణాధపులగాం చుచు మీదికి మీద జీవముల్ పోయిరి"

"తలచిరో-కాను-నిక్కము తపముసేయ వలచిరో."

"తడియూరదు నేనియు."

"సి ప్రాప్తయే."

"వచ్చు రాడవు గాక."

"ఛాపితి మీకు నింతతోఁ."

"కూళఁ గంతులు సవిన."

"గాదె ని వెంట చేల్లుపురులో"

"[illegible]"

ఈ మొదలగువాని విచిత్ర ప్రయోగము కన్నడ భాషాసంప్రదాయ సిద్ధమే యని తలంపవచ్చును. వీనిలోఁ గొన్ని పశ్చిమాంధ్ర దేశ భాగవ్యవహారములో నుండినను ఉండవచ్చును. కాని వాని ప్రసిద్ధి కన్నడదేశ వ్యవహారమునుబట్టియే యగుటచే, ఇవి యన్నియు నీ భాషలో నన్యదేశీయములుగనే పరిగణించవలసి యుండును. కాని యివి తరువాతి కవులకుఁ జెల్లుబడిఁ గాకపోవుటచేఁ గాబోలు ప్రాత తెనుఁగులోఁగూడఁ జేరినట్లు లేదు.

ఇట్లు సంస్కృతాద్యార్యభాషలలో మాతా, పితా, కరోతి, గచ్ఛతి మొదలగు శబ్దములు తక్కిన, గ్రీకు, లాటిన్ మొదలగు భాషలలో వలెనే మూలభాషనుండి వచ్చిన సజాతీయ శబ్దములే యైయుండ, నిటీవల నా భాషల నుండియే సంక్రమించిన పిక, దీనారాది శబ్దము లన్యదేశ్యము లైనట్లే దక్షిణ దేశీయము లగు అరవము, తెలుఁగు, కన్నడము మొదలగువానిలోఁగూడ తల, నెల, ఊరు, పేరు మొదలగు, మూలభాషలనుండి సంక్రమించిన సజాతీయ

శబ్దములు కేవల దేశ్యములుగాఁ గ్రహింపఁబడుచుండ, తరు వాతికాలమున పరిసర ప్రదేశము లందలి హిందూస్థానీ, మహారాష్ట్రి మొదలగు విజాతీయ భాషలనుండివలెనే సజాతీయ భాషలనుండియు సంక్రమించిన శబ్దములు అన్యదేశ్యములుగనే గ్రహింపఁబడవలసియుండును. కావున ఉత్తర హిందూస్థాన భాషలలోని 'దేశి' ఆ భాషలలో నన్యదేశ్యము కావలసినట్లే, దక్షిణదేశ భాషలలోని తత్సమ తద్భవములును అన్యదేశ్యములుగనే పరిగణింపఁబడవలసియున్నది. ద్రావిడభాషలు సహజముగ దేశీయములే యగుటచే నందు దేశి విభాగ మావశ్యకమే కాఁబోదు.

ద్రావిడభాషల పరస్పర సంబంధము.

హిందూదేశములో వ్యవహారమున నున్న భాషలుత్తర హిందూస్థాన భాషలు, దక్షిణ హిందూదేశభాషలు లేదా దాక్షిణాత్య భాషలు అని రెండుప్రధాన వర్గములుగా నేర్పడుచున్నవి. ఉత్తర హిందూస్థానభాషల నార్య భాషలనియు, దక్షిణదేశభాషలను ద్రావిడ భాషలనియుఁ జెప్పుట కలదు. ఉత్తరదేశభాష లార్యులకుఁ బ్రధాన భాషయగు సంస్కృతమునుండియో లేదా దానికి సంబంధించిన ప్రాచీనములగు ప్రాకృతముల నుండియో జనియించిన పంజాబి, గుజరాతి, మరాటి, బెంగాలి, ఉరియా, హిందీ మొదలగునవి. తెలుఁగు, తమిళము, కన్నడము, మళయాళము, తుళు, కొడగు, తుద, కోట, గోండి, కూయి మొదలగునవి దాక్షిణాత్య భాషలు. ఇవి యుత్తర హిందూదేశ భాషలతోడి సాజాత్యము కలవిగాఁ గనఁబడకుండుటచే నివి ద్రావిడ భాషావర్గమను నొక ప్రత్యేక వర్గమునకుఁ జెందినవని పలువురు భాషాతత్త్వజ్ఞులు తలంచుచున్నారు. ఇవి గాక హిందూదేశ మధ్యభాగమందలి కొన్ని ప్రదేశములలోని వ్యవహారమున ముండారి, సంతాలి మొదలగు మఱికొన్ని భాషలును కలవు. ఇవి "ముండా" భాషలనియు, కొలేరియన్ భాషలనియుఁ జెప్పఁబడుచు మఱియొక వర్గమునకుఁ జెందినవిగాఁ దలంపఁబడుచున్నవి. వీనికి హిందూదేశములందలి భాషావర్గములకంటె మలయా మొదలగు ప్రాచ్యద్వీపమునందలి భాషలతో నెక్కుడు సంబంధ మున్నట్లగపడుచున్నది.

ద్రావిడ భాషలకుఁ బ్రధానస్థానము దక్షిణ హిందూదేశమే యైనను, మధ్యదేశమునను. ప్రాచ్యదేశమునను గల కొండల మీఁదను వసియించు నా[illegible]కజాతులచే వ్యవహరింపఁబడు గోండు, కుయి, ఒరాయన్. రాజమహాల్ భాషలకును, హిందూదేశపు వాయవ్యదిశను బెలూచిస్థాన ప్రాంతమున వాడుకలో నున్న బ్రాహూయి భాషకును. నాయీదేశ భాగమునఁ బ్రబలవ్యాప్తిగాంచి యున్న యార్యభాషలతోడి సామ్యముకంటె. దక్షిణదేశమందలి ద్రావిడ భాషలతో సామ్య మెక్కుడుగా నుండుటచే నివియు ద్రావిడ భాషా వర్గములోఁ జేరినవేయగును. నొకానొకప్పుడు ద్రావిడ భాషలను వ్యవహరించు జనులీ యుత్తరదేశమున బెలూచిస్థానమువఱకు వ్యాపించి యుండురనియుఁ దలంపఁబడుచున్నది. వీరు వాయవ్య దిఙ్మార్గముననే హిందూదేశమునఁ బ్రవేశించిరని చెప్పుదురు. అట్లు ప్రవేశించిన వారిలోఁ గొందఱు దక్షిణదేశమునకు వచ్చి నెలకొని యచ్చటి యాదిమనివాసులతోఁ గలిసిపోయి యుందురు. ఉత్తరదేశముననె నిలిచినవారిలోఁ గొందఱు, తరువాతి కాలమున వచ్చి యాప్రదేశముల నాక్రమించుకొనిన యార్య జన సంఘముతోఁ గలిసి పోవుటచే వీరి భాష యనేక విధముల మార్పు నొందుటయే కాక యార్యుల భాషగూడ ననేకములగు మార్పులకు లోనగుట తటస్థించినది. దక్షిణ దేశమున నెలకొనిన ప్రాచీన జనసంఘము మా కాలమున నాక్రమించి కొనిన యాయాదేశభాగములనుబట్టి వారిలో వారికిఁ బరస్పర స[illegible]ములు తక్కువయగుటచే, కాల

క్రమముగ వారి భాషయునుఁ గొన్ని ప్రాంతీయ విశేష లక్షణములను బెంపొందించుకొని దేశభేదమును బట్టి భిన్నమై మఱికొంత కాలమునకు నా యా దేశములందు స్వతంత్రభాషలుగ నేర్పడుట తటస్థించియుండును. కాలగతిని వీనిలో సహజముగఁ గలిగిన మార్పులకుఁ దోడుగా నా యా ప్రదేశములందు దేశీయములు విదేశీయములు నగు నితర భాషలతోఁ గలిగిన సంపర్క విశేషము వీని నొకదానితో మఱియొక దానికి సంబంధమే లే దనిపించునంతగా మార్చివేసినది. కాని యీ భాషలలోని శబ్దములను, భాషా పద్ధతులను బోల్చి చూచితిమేని వీనిలోఁ బెక్కింటికి మూలరూపములు సమానములై యనియు. ప్రాచీనరూపములలోను ధాతువులలోను గల సామ్యమును బట్టి వీనికి సన్నిహిత సంబంధము కలదనియు స్ఫురింపక మానదు.

వీనిలోని ప్రధాన భాషలలో తమిళ మళయాళములకుఁ దక్కిన వానితోఁ కంటె నెక్కుడు సంబంధము కలదు. ఒకొక భాష మాటాడు వారికి రెండవ భాష సామాన్యముగా నర్థమగుచునే యుండును. ప్రాచీన మళయాళమునకును తమిళమునకును దాదాపుగా నభేదమే చెప్ప నచ్చునవియుఁ దలంపఁబడుచున్నది. ఇది తమిళమునుండి చిరకాలము క్రిందటనే విడివడిన భాషయై యుండును. తెలుఁగు కన్నడములట్లుగావు. ఇవి మూలభాషనుండియే తమిళముతోపాటు దేశభేదమునుబట్టి స్వతంత్రములై విడివడిన ప్రాంతీయ భాషలు. వీనిలో కన్నడము కంటెఁ దెలుఁగునకును తమిళమునకును విశేషభేద మగపడుచున్నది. లిపి మొదలగు కొన్ని విషయ

ములలో కన్నడము తెలుఁగును బోలియున్నను పెక్కు విష
యములలో నది తమిళమునకే చేరికగలదై యున్నది.
కన్నడభాషలో తమిళమునందువలెనే స్త్రీలింగ వివక్ష,
స్త్రీలింగద్యోతక ప్రత్యయములు గలవు. ఆంధ్రమున నపుం
సకలింగ సర్వనామ శబ్దములు. తత్ప్రయములే స్త్రీ లింగ
ద్యోతకములు గూడ నగుచున్నవి మహదమహద్బహువచ
ప్రత్యయములుకూడ నీ రెండు భాషలలోఁ దక్కిన సజా
తీయ భాషలలోని వానికంటె నేకీభావము కలిగియున్నవి.
ప్రథమేతర విభక్త్యంగరూపవిషయమునఁ గూడ నీ భాష
లలోఁ దక్కినవానికంటె నెక్కుడు సామ్యముకలదు. దీనిని
బట్టి యీ ద్రావిడ జనసంఘము తొలుత నెలకొనిన దేశము
నందలి భేదమునుబట్టి ప్రాచీనభాష వేఱుపడిన తరువాతఁ
గొంత కాలమువఱకుఁ దెలుఁగు కంటె తమిళకన్నడములకు
పరస్పరము సంసర్గ మెక్కుడుగా నుండెనని తలంపవలసి
యున్నది, ఈ రెండును కలిసి ద్రావిడభాషాస్రవంతి కొక
ప్రత్యేక మూలశాఖగా నేర్పడుచున్నవి. రెండవ మూలశాఖ
తెలుగు, మళయాళము తమిళమునుండి చీలిన యుపశాఖ.
తుళు, కొడగు, తుద. కోట అనునవి తమిళ కన్నడములకు
మూలమగు శాఖనుండి విడివడిన యల్పశాఖలుగాఁ గనఁబడు
చున్నవి. కురుఖ్. మాల్తో. గోండి, కుయి, కోలామి అను
నవి మూలభాషనుండి వీడి తెలుఁగు శాఖను జేరి ప్రవహిం
చిన స్వతంత్ర శాఖలుగా నున్నవి. బ్రాహుయి వీని యన్నిటి
కంటెఁ బ్రాచీనమైన యొక స్వతంత్రశాఖ. ఉత్తర భూము
లలోఁ బ్రవహించిన విశేషసాంకర్యమునకు లోనైనది. ఆంధ్ర

తమిళ మలయాళ కన్నడ భాషలకు ప్రత్యేక లిపులును ప్రత్యేక వాఙ్మయమును గలుగుటచే నవి నాగరక భాషలనం బడుచున్నవి. తుళు, కొడగులలోఁగల పదపదికరమును, భాషారూపములలోఁగల సమృద్ధిని జూచి కాల్డ్వెల్ పండితుఁడు వీనిలోఁ బ్రసిద్ధవాఙ్మయము లేకున్నను వీనిని గూడ నాగరకభాషలలోఁ జేర్చినాఁడు. ఈ తుళు, కొడగు తుద, కోట భాషలకు తమిళమునకంటెను గన్నడముతోడనే యెక్కువ చేరిక కలదు. కుయి, గోండి భాషలు తెనుఁగునకు గొన్ని విషయములలో మిక్కిలి చేరికగలదై యున్నను వీనిని తమిళ కన్నడ వర్గముతోఁ జేర్చెదరు. కావున నిట్టే కొలామి. నాయకి. వీని మొదలగు గుంపులు తమిళ కన్నడ వర్గము నకును తెనుఁగునకును నడుమ చేర్పదగినవిగా నున్నవి కుయి. గోండులు తెలుఁగునకు గాడి ప్రాచీనభాషనుండి తొలుత వేర్పడిన యొక ప్రాచీన శాఖ యుపశాఖగాఁ గన్పడు నట్లగపడుచున్నవి. ఇందునకు ముఖ్యమైన నిదర్శనములు —

1 ఉత్తమపురుష సర్వనామమునకు ప్రథమైకవచన విభక్త్యంగము తమిళకన్నడములలో హ్రస్వాచ్చుతో గూడి యుండ—వీనిలో తెనుగులో వలెనే 'నా' అని దీర్ఘాచ్చుతో గూడియుండుట. తె నాచేత–నావలన గో. నన్నాన్–ఎన్నోడు

2. స్త్రీలింగమును సూచించుటకు నపుంసక ప్రత్యయము వాడుకలో నుండుట (తె. అవి వంటిది తె. ఆమె వచ్చినది) ఇట్టి సామ్యలక్షణము లింకను గలవు.

*ఈపట్టి ననుసరించియే ద్రావిడభాషావంశవృక్షము తుదిని గనబడుచున్న రీతిని నిర్దేశింపఁబడియున్నది.

ఇట్లు చిరకాలము క్రిందటనే ప్రత్యేకముగా విడివడిన ప్రాఙ్మధ్యభాష యొక్క శాఖగాను, తెలుఁగు ప్రధానముగాఁ గలిగి గదబ, మాల్తో, గోండి, కుయి, కొలామి భాషలతోఁ గూడినది మఱియొక శాఖగాను కన్నడమును, తమిళ మలయాళములును ప్రధాన శాఖలుగాఁ గలిగి, తుళు, కొడగు, తోడ, కోట భాషలతోఁ గూడినది మఱియొక శాఖగాను కలిగి, ప్రాచీన ద్రావిడ భాషామహావృక్షము త్రిశాఖావృతమై చిలవలు పలవలు వెట్టి దక్షిణాపథమంతయు నావరించి గీర్వాణభాషా వాఙ్మయ విజ్ఞాన దోహదముచేఁ బెంపొంది యా యా శాఖల నాశ్రయించిన వారికి రమ్యములగు వాఙ్మయ నానాఫలములచేఁ దనియించుచున్నది.

ఇటీవలి కాలమున రాజ్యాంగ సంసర్గమూలమున నాంధ్ర భాషాపదములు కన్నడముననుఁ గన్నడపదము లాంధ్రమునను జేరియుండుటచేతనో, వీని లిపులు తమిళ లిపికంటెఁ గొంత భిన్నమైన యొక ప్రాచీనలిపినుండి బయలు దేఱినవగుటచేఁ నెక్కుడు సామ్యముగల వగుటచేతనో, ఆంధ్రకన్నడములకు తమిళముకంటె విశేష సన్నిహితత్వము న్నటు లగపడుచున్నది. కాని ప్రధానవిషయములలో కన్నడము తెలుఁగుకంటె తమిళమునకే చేరిక గలదై యుండె ననుటకు సందేహము లేదు. శ్రీనాథుఁ డాంధ్రమునకే కవిత్వము చెప్పుచు, రాజమహేంద్రవర కవులతోఁ దనభాష నిజముగా కర్ణాటకభాషయని చెప్పినాఁడన్న కథా విషయమును గూడఁ బరిహాస గర్భితముగనో రాజ్యాంగ సంబంధ పరముగనో గ్రహింపవలసినదేగాని యీ భాషల యభేద

మును సూచించుచుఁ జెప్పినదని తలంచుట కవకాశము లేదు. అప్పటి కేడువందల సంవత్సరముల క్రితమే. కుమారిల భట్టు తన రచించిన తంత్రవార్త్తిక గ్రంథమున దక్షిణ దేశ భాషలనుగూర్చి చేసిన ప్రశంసలో వీని "నాంధ్ర ద్రావిడభాష" యను పదముచేఁ పేర్కొనె నన్నప్పుడుకూడ నాంధ్రశబ్దము ఆంధ్ర కర్ణాటక పరముగుననియు, ద్రావిడపదము తమిళ మళయాళపరముగుననియు కాల్డ్వెల్ పండితుండూహించుట* కేవలము పొరపాటే. ఆంధ్రమునకుఁ దక్కిన ద్రావిడభాషల కంటె నొక విధమగు ప్రత్యేకత కలదనియు, కుమారిల భట్టాంధ్రపదముచేఁ దెనుఁగును, ద్రావిడ పదముచేఁ దక్కిన ద్రావిడభాషలన్నిటిని సూచింప నెంచెననియు నీ రెండు శాఖలును గలిసి యేకభాషగా గ్రహింపఁదగుననుభావమునే అతఁడు వ్యక్తముచేయఁ దలంచెననియు స్టెన్ కొనోపండితుఁడు చెప్పినదికూడ యుక్తి యుక్తమే గాని వాస్తవము కాదు. ఏలయనఁ బరిశీలింపఁగా తంత్రవార్త్తికమున నీ యాంధ్రశబ్దమే యా సందర్భమున కానవచ్చుట లేదు. ద్రావిడశబ్దము మాత్రమే వేదమునందలి మ్లేచ్ఛపదముల యర్థ నిర్ణయ విషయకమగు చర్చా సందర్భమున నొకటి

**One of the earliest terms used in Sanskrit to designate the family seems to have been that of Andhra-Dravida-bhasha, the Telugu-Tamil language used by Kumarila Bhatta. The term though vague is not badly chosen. Kanarese was probably supposed to be included in Telugu and Malayalam in Tamil and*

రెండు శ్లోకములం గానవచ్చుచున్నవి. వేదమునఁ గానంబడు మేచ్ఛ శబ్దముల యర్థ నిర్ణయమును గూర్చిన యీ సందర్భము నిచ్చట కొంచెము వివరించుట యప్రసక్తము కాఁబోదు దీనివలన నా కాలమునందలి భాషాతత్త్వ విచారణ మెట్టిదో ద్రావిడ భాషలనుగూర్చి వారికిఁగలజ్ఞాన మెట్టిదో కొంచెము తెలిసికొన నవకాశము కూడఁ గలుగఁ గలదు.

తంత్రవార్తికము ప్రథమాధ్యాయము తృతీయపాదమున నార్యమ్లేచ్ఛశబ్దముల యర్థ విషయమున వైదిక ప్రయో

yet both dialects together with any sub-dialects that might be included in them, were evidently regarded as forming but one Basha. Caldwell's Comparative Grammar

•*The word Dravida forms part of the denomination Andhra Dravidabhasha' the language of the Andhras (Telugu) and Dravidas (Tamilians) which Kumarila Bhatta (probably of 7th c. A. D.) employed to denote the Dravidian family ... Tamil and Malayalam are two sister dialects of the same language Kanarese is also closely related to Tamil and the two languages form together one of the principal groups of the Dravidian family. If Kumarila's denotation denotes a a difference of dialect, which is by no means certain, Kanarese and Tamil would be included in the Dravida Bhasha as against Telugu the Andhrabhasha.' -L.S.I., Vol IV, p 284*

గమునకును, శిష్టవ్యవహారమునకును విప్రతిపత్తి కలిగినపుడు దేనిని ప్రమాణముగా గ్రహింపవలయును-“కోర్థః స్యాత్ పారమార్థికః” అను ప్రశ్న బయలుదేఱఁగా, వేదమునఁ జెప్పఁబడిన యర్థమే యచ్చట ప్రమాణముగా గ్రహింపవలసినదనియు, లౌకికవ్యవహారము దానికి భిన్నమైనపుడు వ్యావహారికార్థము ప్రధానముగను, వైదికార్థము గౌణముగను గ్రహింపవలయుననియు సమాధానము చెప్పి* లౌకికవ్యవహారమున నాయా శబ్దార్థము లెట్లు నిశ్చయముగా గ్రహింపఁబడునో, అట్లే వైదిక వ్యవహారమున నాయా యర్థములు నిశ్చితములే యగును. కావున శాస్త్రాధారము గలిగిన యర్థజ్ఞానమే విప్రకృష్టము, సంకరము నగు సామాన్యవ్యవహారముపై నాధారపడిన యర్థజ్ఞానముకంటె బలవత్తరము అని సిద్ధాంతీకరింపఁబడినది.

“తస్మాత్ శాస్త్రస్థితైర్వైకా ప్రతిపత్తిర్బలీయసీ
న సమా ముక్తకాచారై ర్విప్రకృష్టై స్ససంకరై”రితి

ఇఁక నార్యావర్తనివాసులకు సుప్రసిద్ధములు కానట్టియు, వేదమునఁ బ్రయోగింపఁబడి యున్నట్టియు మ్లేచ్ఛశబ్దముల విషయమున నర్థనిర్ణయమెట్లు? వానికి సంస్కృతభాషా సంప్రదాయానుసారముగా వ్యుత్పత్తిని గల్పించి చెప్పఁబడిన యర్థము గ్రాహ్యమా, లేక మ్లేచ్ఛజన వ్యవహారమునఁగల

* “ యత్రతు సంఖ్యేయాన్తరవిషయత్వం తత్ర వైదికార్థో గౌణోగృహ్యతాం లౌకికో వా ముఖ్య ఇతి. తాదృశే విషయే ముఖ్యార్థత్వా ల్లౌకిక ప్రసిద్ధి రేవ గ్రహీతవ్యేతి ఉత్తర సూత్రే వక్ష్యామః”

సముదాయప్రసిద్ధియే గ్రాహ్యమా? యను ప్రశ్న గలిగినది.

"యేశబ్దా న ప్రసిద్ధాస్స్యు రార్యావర్త నివాసినామ్
తేషాం మ్లేచ్ఛప్రసిద్ధోర్థో గ్రాహ్యో నేతి విచింత్యతే
నిరుక్తవ్యాకరణద్వారా ప్రసిద్ధిః కా బలీయసీ
సముదాయప్రసిద్ధిర్వా మ్లేచ్ఛస్యైవాథవా భవేత్."

ప్రశ్నకును మ్లేచ్ఛ వ్యవహారమునందలి యర్థము గ్రహింపఁబడవలయుననుట మాత్ర మెట్లు పొసగును. మ్లేచ్ఛ వ్యవహారమున శబ్దమునకుఁ బ్రసిద్ధార్థ మిది యని నిర్ణయించుట యెట్లు? మ్లేచ్ఛదేశము లనేకములు. వానిలో నన్నిటఁ దిరిగి యా శబ్దార్థమును గ్రహింపవలెను. ఆయా భిన్న దేశములలో భిన్నముగా నున్నచో నిర్ణయము సాధ్యము కాదు గదా? మ్లేచ్ఛులకు శబ్దప్రయోగము విషయమున శాస్త్రదృష్టి లేకుండుటచే శబ్దస్వరూపమువలెనే శబ్దార్థము గూడఁ బాడు మాఱుచుండును. కావుననే మ్లేచ్ఛాప భాషణమున నొక్క సంస్కృత శబ్దము కూడ లేదు గదా? ఏవో కొన్ని యున్నను అవి యనార్యులచే గ్రహింపఁబడిన నాటికంటె భిన్నార్థములై ప్రత్యయాదుల భ్రష్టములై యుండుటచే నర్థబోధకములే కావని చెప్పవచ్చును. మ్లేచ్ఛ భాషలలో సంస్కృత శబ్దములను వెదకు నార్యులు చేయున దేమనఁగా నొక పదమున కితర పదములలోని యక్షరములను ముడిపెట్టి యేదో యొక సంస్కృత పదమును గల్పించుటయే యైయున్నది. అప్పుడు కూడ నొక దీర్ఘాక్షరము తక్కువగనో, ఒక హ్రస్వాక్షర మెక్కువగనో కనఁబడుచునే యుండును, అని

చెప్పి యిందుల కుదాహరణముగా ద్రావిడభాషలోని పద ములను గ్రహించి చూపుచున్నాఁడు.

* "తద్యథా ద్రావిడాది భాషాయామేవ తావత్"- అదెట్లనఁగా ద్రావిడాదిభాషలలోని వ్యంజనాంతపదములకు

* "తద్యథా ద్రావిడాది భాషాయామేవ తావద్వ్యంజనాన్త భాషా పదేషు స్వరాన్త విభక్తి స్త్రీ ప్రత్యయాది కల్పనాభిః స్వభాషాను రూపా నర్థాన్ ప్రతిపద్యమానా దృశ్యంతే. తద్యథోదనం చోరిత్యుక్తే చోరపదవాచ్యం కల్పయన్తి. పన్థానమతరిత్యుక్తే అతర ఇతి కల్ప యిత్వాహుః 'సత్యం దుస్తరత్వా దతర ఏవ పన్థా ఇతి' తథా పాప శబ్దం సకారాన్తం సర్పవచనం అకారాన్తం కల్పయిత్వా సత్యం పాప ఏవాసావితి వదన్తి. ఏవ మాల్ శబ్దం స్త్రీ వచనం మాలేతి కల్ప యిత్వా సత్యమిత్యాహుః, వయర్ శబ్దంచ రేఫాన్తం ఉదర వచనం వైరి శబ్దేన ప్రత్యామ్నాయం వదన్తి. సత్యం సర్వస్య క్షుధిత స్యాకా ర్యే ప్రవర్తనాదుదరం వైరికార్యే ప్రవర్తత ఇతి. తద్యథా ద్రావిడాది భాషాయా మీదృశీ స్వచ్ఛన్ద కల్పనా తదా పారసీక బర్బర యవన రౌమకాది భాషాసు కిం వికల్ప్య కిం ప్రతి పత్స్యన్త ఇతి న విద్మః."

తస్మాత్ మ్లేచ్ఛ ప్రసిద్ధం యత్పద మార్షైర్వికల్ప్యతే
నకశ్చిత్తత్ర విశ్వాసో యుక్తః పదపదార్థయోః
నిరుక్త వ్యాక్రియాద్వారా యస్త్వర్థః పరిగమ్యతే
పిక నేమాది శబ్దానాం స ఏవార్థో భవిష్యతి. ఇతి ప్రాప్తమ్,
ఏవం ప్రాప్తే వదామోఽత్ర పదం విపుల దృష్టిభిః
విజ్ఞాయే తావినష్టం యత్తదర్థం భవిష్యతి
యత్తు వేద తదంగేషు పదం దృష్ట మవిప్లుతం
మ్లేచ్ఛ భాషాసు తద్రూప మర్థే క్వచనచోదితం
తత్రైవ ప్రతీయేత ప్రమాణేనా విరోధతః

స్వరాన్త విభక్తి స్త్రీ ప్రత్యయాది కల్పనచేసి సంస్కృత భాషాపదముల కనువగు నర్థము కలవానినిగాఁ జేయుచున్నారు. "చోర్" అను పదము ద్రావిడ భాషలో "అన్నము" అను నర్థము కలదై యుండగా దానిని అకారాంతముగా నెంచి "చోర" పద వాచ్యముగా గ్రహించుచున్నారు. మార్గము అను నర్థము గల "అతర్" శబ్దమును "అతరః" అను దానిగా గ్రహించి తరింప శక్యము కానిది గనుక మార్గమును "అతరః" అనుట న్యాయమే యని దానికి వ్యుత్పత్త్యర్థమును గల్పించి సమర్థించుచున్నారు. పకారాంతమై సర్పము అను నర్థముగల "పాప్" శబ్దమును "పాప" అని అకారాంత శబ్దముగా గ్రహించి వాస్తవముగా నిది పాపియే గనుక దానికా పేరు వచ్చినదనుచున్నారు. స్త్రీ వాచకమగు 'మాల్' ఆళ్ శబ్దమును "మాలా" శబ్దముగా గ్రహించి యది యన్వర్థమే యని చెప్పుచున్నారు. ఉదరవాచకమైన రేఫాంత "వయిర్" శబ్దమును "వైరి" శబ్ద ప్రత్యామ్నాయముగాఁ జెప్పుచు క్షుధితుఁడైనవాఁడు అకార్యమునఁ బ్రవర్తించును గావున నుదరము వైరి కార్యమునఁ బ్రవర్తింపఁజేయున దగుటం జేసి మానవునకు వైరియే యగును. ఇట్లార్యావర్తభాగ

పిక నేమాది తద్వైవం నిపుణై రవధారితం
చోదితం హ్యుపదిష్టం వా ప్రయుక్తం వాక్రియాగతం
మ్లేచ్ఛై రవధృతం సశ్చా దార్యైర్ద్వైభాషికైః క్వచిత్
తాదృశం తు ప్రతీయేత ప్రామాణ్యే నేతి నిశ్చితమ్
నత ధర్మప్రమాణేన వేదాఖ్యేన విరుధ్యతే.

ముననే నివసించు ద్రావిడ జనుల వ్యవహారములోని శబ్దముల యర్థము విషయముననే యిట్టి స్వచ్ఛంద కల్పనలు చేయఁబడుచున్నపుడు ఇంకను దూరస్థులగు పారసీకులు, బర్బరులు, యవనులు, రోమకులు మొదలగు వారి వ్యవహారములోని పదములను సంస్కృత పదములుగాఁ జేయుట కింక నెన్ని మార్పులుచేసి, యెట్టి యర్థములనుఁ బడయుదురో చెప్ప నలవి కాదుగదా! కావున నార్యులచే గ్రహింపఁబడిన మ్లేచ్ఛశబ్దముల స్వరూపార్థము లనేకవిధములగు వికల్పనలకు లోనగుచుండును గావున నా పదపదార్థములను మన మెప్పుడు నమ్మకముతో స్వీకరింపరాదు. పిక నేమాది శబ్దములకువలెనే వ్యాకరణ నిర్వచన మూలముగా నిర్ణయింపఁబడిన యర్థమునే వాని యర్థముగా గ్రహింపఁదగును.

అను వాదము సంభవింపఁగా నిట్లు సిద్ధాంతము చేయఁబడినది. నిపుణులగువారు పరిశీలించి వినష్టము కాని పదమున కే యర్థము నిర్ణయింతురో అదే దాని యర్థముగా గ్రహింపనగును. వేద వేదాంగములయందుఁ జెప్పఁబడిన పిక నేమాది శబ్దములు మ్లేచ్ఛ భాషలయందు మార్పులేక యున్నపుడు ప్రామాణ్య విరోధము లేకపోయినచో మ్లేచ్ఛ భాషార్థమే గ్రహింపవచ్చును. అది వేదప్రమాణమునకు విరోధము కాఁబోదు.

ఈ మీమాంసవలన మన మీ క్రింది విషయములను గ్రహింపఁదగియున్నది. ఆర్యులచే మ్లేచ్ఛభాషలని పిలువఁబడిన యనార్యభాషలగు యవనరోమక ద్రావిడాది భాషల నుండి యనేకశబ్దములు వేదకాలమునుండియు వారి గ్రంథ

ములలోఁ బ్రవేశించినవి. ఆర్యులు వీనిని గ్రహించి నపు డాయా శబ్దముల కాయా భాషలలో నేయర్థము కలదో ఆ యర్థమునే గ్రహించియుందురు గాని వేఱు విధముగా నై యుండదు గదా? కొంతకాలమున కీ పదము లార్యభాషా పదములే యని సమర్థించుటకో, వానికున్న యర్థమును స్థిరపఱచుటకో నార్యభాషా ప్రత్యయాదులను గల్పించి దాని యర్థమున కనుకూలమైన యేదో యొక ధాతువునకు ముడిపెట్టి దానికి వ్యుత్పత్తులను కొందఱు వైయాకరణులు గల్పింప యత్నించిరి. కొన్ని సందర్భములలో నాయా యర్థ ములను సమర్థించుటకు విచిత్రమైన యితిహాసములను గూడఁ గల్పింప దొడంగిరనుటకు బ్రాహ్మణములలోఁగల యనేక ములగు కథలే మనకు నిదర్శనములు. ఒకప్పు డొక్కొక్క శబ్దమునకై యొక్కొక నూతన ధాతువు కూడ కల్పింపఁ బడియుండును. కాలక్రమమునఁ గొన్ని యార్య శబ్దము లకే వ్యవహారమునం దర్థము మాఱిపోవుట తటస్థించినపుడు ఏ యర్థము ప్రమాణముగా గ్రహింపఁదగినదను ప్రశ్నబయ లుదేరినది. ఇట్టివి త్రివృత్, చరు మొదలయినవి కొన్ని కలవు. వీనికి వేదములో తొమ్మిది పర్యాయములు వండ బడిన యన్నము అని యర్థము. వ్యవహారమున వీనికి మూఁడు పర్యాయములు, ఒక పాత్ర యనియు వరుసగా నర్థములు గలిగినది. ఏ యర్థమును ప్రమాణముగా గ్రహిం పవలెను? అనఁగా, వేదమున వైదికార్థము వ్యవహారమున వ్యావహారికార్థమును సందర్భానుసారముగా గ్రహింపఁదగిన దని చెప్పుచు ధర్మము విషయమున వైదికార్థమే బలవత్తర

మగునని సమాధానము చెప్పినారు. అనఁగా కాలక్రమమున శబ్దములకు రూపములతోఁ పాటు అర్థముగూడ మాఱుచుండుటవలన, ఆర్యులు ధర్మము కొఱకు శబ్దప్రయోగము చేయుదురు గావున శబ్దస్వరూపమును అర్థమును గూడ మార్పు నొందకుండఁ జేయుటకు విశేష ప్రయత్నము చేసిన వారైనను భాషకు సహజమగు మార్పు తప్పకుండుటచే నద్దానిని గుర్తించిన తరువాత వారు వైదిక ప్రామాణ్యమును నిలువఁబెట్టుటకు వైదికార్థమే ధర్మ విషయమున బలవత్తరమని చెప్పినను, వ్యావహారికార్థము గౌణమగుననియు, జెప్పవలసినవారైరి. ఆర్య శబ్దముల విషయ మిట్లగుచుండగా ననార్యులకు శబ్దప్రయోగవిషయమున ధర్మబుద్ధి లేకుండుటచే నవి విశేషముగ మార్పుల నొందుచుండును గావున మ్లేచ్ఛ వ్యవహారమును ప్రామాణ్యముగ గ్రహించుటలో గొప్ప చిక్కేయున్నను, ద్వైభాషికులగువారు పరిశీలించి నిర్ణయించినపుడును వైదికార్థమునకు విప్రతిపత్తిలేనపుడును మ్లేచ్ఛవ్యవహారమే ప్రమాణముగా గ్రహింపవచ్చునని చెప్పఁబడినది. కాని మ్లేచ్ఛశబ్దములను ఆర్యశబ్దములుగనే గ్రహించి కొందరు వానికి వ్యుత్పత్తులను జెప్పఁదొడంగిరనుటకు పిక నేమాది శబ్దములే నిదర్శనములు. ఈ శబ్దములిపుడు సామాన్యముగా నార్యశబ్దములుగనే గ్రహింపఁబడుచున్నవి. కాని కుమారిలుని కాలమునకుఁ బూర్వమే యవి మ్లేచ్ఛశబ్దములని గ్రహింపఁబడినట్లగపడును. పిక శబ్దమునకు లింగాభట్టీయమున అపిహితం కాయతీతి – పికః – కైగె

శబ్దే = కనిపించక పలుకునది. "అపిరంతర్ధా" కై, గై ధాతువులనుండి యేర్పడినట్లుగా వ్యుత్పత్తి చెప్పఁబడినది. ("కాకః" శబ్దమునకు కూడ నిట్లే "కా ఇతి కాయతీతి = కాకః అని వ్యుత్పత్తి) కాని యీ "పిక" శబ్దము రోమక భాషా శబ్దముగాఁ గనఁబడుచున్నది. (*cf. Latin-picas*) "పికస్" అను శబ్దము లాటిన్ భాషలోని యర్థముననే కలదు. ఇట్లే "దీనార" శబ్దము లాటిన్ భాషలోని "డెనేరియస్" (cf. *Latin-denarius*) అను దానినుండియు, "ద్రమ్మ" అనునది యవనభాషలోని "డ్రాక్మె" (cf. *Gk-drakhme*) అను శబ్దమునుండియు పరశు శబ్దము యవనభాషలోని "పెలెకస్" శబ్దమునుండియు వచ్చినవనియుఁ దెలియుచున్నది. ఆ కాలమున విదేశీయ భాషాశబ్దములే యార్యభాషలోఁ జేరినపుడు దేశీయములగు భాషలలోనిశబ్దములును పెక్కు చేరియుండుననుటకు సందేహము లేదుగదా! ఇట్లు ద్రావిడభాషా శబ్దములెన్ని చేరినవో! కుట, కుండ, నీల, పుష్కర, పుష్ప, పూజన, ఫల, బీజ, మయూర, రాత్రి, రూప మొదలగునవి ద్రావిడాది భాషలలోనుండి యార్య భాషలలోఁ జేరినవిగాఁ జెప్పుచున్నారు. నీర, మీన శబ్దములు కూడ నట్టివేయై యుండును. వీనికి నిఘంటువులలో నేదో యొక వ్యుత్పత్తి కల్పింపఁబడియే యుండును గాని అట్టి కల్పనమును మన మెల్లప్పుడును విశ్వసింప రాదనుటకే కుమారిల భట్టు ద్రావిడభాషాశబ్దముల నుదాహరణముగాఁ గైకొని చూపినాఁడు. కావున నాతని కాలమున ద్రావిడభాష మ్లేచ్ఛ భాషలలోఁ జేరినదేగాని ప్రాకృత భేదముగా గ్రహింపఁబడ

లేదనుట స్పష్టము. అప్పటికే దేశభాషలనుండి గ్రహింపఁబడిన శబ్దములకు యత్కించిత్ ధ్వని సామ్యమును బట్టి సంస్కృతశబ్దములుగా మారి వ్యుత్పత్తులు కల్పింపబడుచుండగా 'జనని సమస్తభాషలకు సంస్కృతభాష ధరాతలంబునఁ' అను భావము ప్రబలిన యిటీవలికాలమున దేశభాషలన్నియు దద్వికృతులే యనుటలో నాశ్చర్యమేమున్నది? దేశ్య (మ్లేచ్ఛ) పదములు సంస్కృత ప్రాకృతములలోఁజేరి మరల దేశ్య భాషలలో తత్సమ తద్భవములుగ నెన్నో చేరియుండు ననుటలోఁగూడ నాశ్చర్యము లేదు.

ఆర్యులు మ్లేచ్ఛశబ్దముల కర్థనిర్ణయము చేయునపుడు వానిని తాఱుమాఱుచేసి వ్యుత్పత్తి కల్పనము చేయుదురనుట కుదాహరణముగా కుమారిలభట్టు ఇచ్చిన ద్రావిడభాషా శబ్దములలోఁ గొన్నిటి స్వరూపమందే కొంత వ్యత్యాస మగపడుచున్నది. చోర్, పాప్ శబ్దములు కుట్రియలుకార మనఁబడు అర్థమాత్రతో కారాంతములుగా తమిళభాషలోఁ గనఁబడుచున్నవి. పలుకుబడిలో నిది సువ్యక్తము కాదు గావున వ్యవహారమును బట్టి వీనిని హలంతములుగనే యాతఁడు గ్రహించియుండును. ఇట్టి శబ్దములలోఁ గొన్ని కాలక్రమమున వ్యవహారమున ఉకారాంతములే యగుచు వచ్చినవిగాని, సంధిలో-అనఁగా వానికి మఱియొక అజాదిశబ్దము పరమైనపుడా యుకారము లోపించుచువచ్చినది. ద్రావిడభాషలలోని పాప్ శబ్దము నడుమ నొక ''మ'' కారము కూడ కలదు. త-పామ్పు, మళ-పామ్పు, తెలు-పాము కన్న. తు. పావు అను రూపములు ద్రావిడ భాషలలోఁ గలవు. కుమారిలభట్టు

మకార విరహితముగ గ్రహించిన రూపము ఆ కాలమున పామర వ్యవహారమునందలి భ్రష్టరూపమా, లేదా శిష్ట వ్యవహారమునఁగూడ నా కాలమున నది యట్లే యుండెనా? యను సందేహము కలిగినది. కన్నడములోని 'వ' కారము 'ప' కారస్థానమున వచ్చునదైనఁ గావచ్చును, లేదా "మ" కారస్థానమున వచ్చునదై నను గావచ్చును. పాపతేడు జనపనార, ఇనుపకోల మొదలగు తెలుఁగు సమాసములలో మరాంతములగు నీ శబ్దములు విశేషణములై నిలిచినపుడు పత్వమును బొందుచున్నవి తమిళమునఁగూడ పాప్పా క్కొడి, ఇరుప్పుకోల్ అనుపట్ల నిట్లే పకారము ద్విత్వ మును బొందినదై యున్నది. తమిళమునందలి పామ్పు ఇరుమ్పు మొదలగువానిలోని మకార ముచ్చారణ సౌక ర్యము కారణముగావచ్చి చేరినదని చెప్పినచో వానిపూర్వ రూపము కుమారిలభ ట్టుదాహరించినరీతిని పామ్ యనియే యుండియుండు ననవలసియున్నది. పామ్బు లోని మ్బు వు అయినదా? లేదా తొలి రూపము "పాప్" అని యుండుటచే విశేషణ సమాసములలో నా పకారమే పొడసూపినదా? యను విషయము పరిశీల నార్హము. మ్బు వర్ణముతోఁగూడిన తమిళ శబ్దము లనేక ములు–నామ్బు, శణమ్బు, వేమ్బు, ఎలుమ్బు మొదలగు నవి – తెలుఁగున నాము, జనుము, వేము, ఎము(క)—— ఎమ్ము అని మువర్ణాంతములైనవి. ఇవి విశేషణములైన పుడు పవర్ణమే పొడసూపుచున్నది–జనపనార, నాపచేను. కావుననే నామ్వాది కనుమ్వాదులకు పజ్ పవర్ణములను

విధించి వైయాకరణు లా రూపములను సాధించినారు. కాని భాషాశాస్త్రపద్ధతిని వీనిని సమర్థింపవలసివచ్చినపుడు ప్రాచీనరూపములందు గల పవర్ణ మే యా పదబంధములలో నిలిచియున్నదనియు, నామవాచకరూపములు కాలక్రమమున మార్పులనొందినవనియుఁ జెప్పవలసియుండును. కావున "పాప్" శబ్దమే "పాము్బ" కంటెఁగూడ ప్రాచీనమేమో!

ఇఁక "అతర్" శబ్దము తమిళభాషలోనే యిటీవల వ్యవహారమున నంతరించినది. అయినను కుమారిలుని కాలమున వ్యవహారమున నుండియుండును. తెలుఁగు కన్నడములలో మాత్ర మీ శబ్దము లేదు. ఇఁక "మాల్" శబ్దము స్త్రీ వాచకముగ ద్రావిడభాషలలో నెద్దానిలోను ఉన్నట్లగపడదు. ఇది 'మాల్' శబ్దము కాదు - "ఆళ్" శబ్దమేయై యుండును. "ఏవంఆల్ శబ్దం స్త్రీవచనం" అని కుమారిలుని పాఠమైయుండఁగా, తరువాత వ్రాతగాండ్రెవరో "ఏవమాల్ శబ్దం" అని తప్పు వ్రాత వ్రాసియుందురు. "తద్యథా ద్రావిడాది భాషాయాం" అన్నదానిని "తద్యథాంధ్ర ద్రావిడభాషాయాం" అను పాఠము కల్పించి "ఆంధ్ర ద్రావిడ భాష" అనునదొకటి కలదని కాల్డువెల్ మొదలగు వారికిగూడ మతిభ్రమ కల్పించినారు గదా!! ఇట్టి "మాల్" శబ్దమును లేదా ఆళ్ శబ్దమును "మాలా" శబ్దముగా గ్రహించి స్త్రీ మాలా శబ్దవాచ్యమే యగునని వ్యుత్పత్తి కల్పింతురఁట.

మఱియొక విశేష మేమనఁగా తంత్ర వార్తికము ముద్రిత గ్రంథమునను, శ్రీ మహామహోపాధ్యాయ గంగా

నాధ ఝాగారి యాంగ్ల భాషా పరివర్తనమునను, "తద్యథా ద్రావిడాది భాషాయాం" అనియే యుండఁగా నీ యాంగ్ల పరివర్తనమున కుపోద్ఘాతము వ్రాసిన గోపీనాధ కవిరాజు గారు పై ద్రావిడ శబ్దములలో తుది రెండిటిని "నడర్" "ఆళ్" అని గ్రహించియున్నారు. వా రుపోద్ఘాతము వ్రాయుచున్న ముద్రిత గ్రంథములో లేని రూపములు వీరి కెక్కడనుండి వచ్చినవో తెలుపలేదు. వేరుప్రతిలోని పాఠాంతరములై యుండునని మన మూహింపవలసియున్నది. అప్పుడు వారి మూలగ్రంథమున వీనియర్థము వ్యుత్పత్తి మొదలగు వానిని గూర్చిన పాఠముగూడ వేఱుగా నుండవల యుఁగదా! "అతర్" శబ్దమునకు బదులుగా "నడెర్"అను నది పాఠాంతరమనుకొనుట కట్టిశబ్ద మేద్రావిడ భాషలోను నున్నట్లగపడదు. "నడెర్" అను పాఠమును గ్రహించి యది ద్రావిడభాషలోని "నడై" అను శబ్దమే యని యా కవిరాజు గారు చెప్పుచున్నారు. కానిదీనికి"అతరః"అనుదాని వ్యుత్పత్తి యెట్లు పొసగును? ముద్రిత గ్రంథములోని "మాళ్"శబ్దము నకు బదులుగా "ఆళ్" అను పాఠమును గ్రహించి "ఒక వ్యక్తి" అని దాని కర్థము చెప్పినారు. మూలములో స్త్రీ వాచకమని యున్నది. "ఆళ్" శబ్దరూపమే యగు "ఆలు" శబ్దము తెలుఁగున స్త్రీ వాచకముగా నున్నది గాని,తమిళ మున "ఆళ్" అనునది స్త్రీ లింగద్యోతక ప్రత్యయముగా నున్నదేగాని స్త్రీ వాచక పదముగా లేదు. "ఏవంమాల్ శబ్దం స్త్రీ వచనం మాలేతి కల్పయిత్వా" అని "మాల్" అనుదానిని "మాలా" శబ్దముగా గ్రహించి వ్యుత్పత్త్యర్థము

సరిపెట్టుచున్నారనుట, "ఆళ్" అనుపాఠమును గ్రహించినచో పొసఁగనే పొసఁగదు. మఱియు నా యుపోద్ఘాతముననే ఆ కవిరాజు * కుమారిలు "డాంధ్రద్రావిడ" శబ్దమును తమిళ భాషాపదముగాఁ దెలియరాదనియుఁ దన యభిప్రాయమును వెలుపుచ్చుచున్నాఁడు. దీనినిబట్టి "ఆంధ్రద్రావిడ" శబ్దముతోఁగూడిన పాఠమును గ్రహించియే యీయన వ్రాయుచున్నారనుట స్థిరమగుచున్నది కావున ముద్రితమైన ప్రతికుపోద్ఘాతము వ్రాయుచు దానిలోని పాఠమును గూర్చియే యీయన ప్రశంసింపకుండుటకుఁ గారణము తెలియదు. ముద్రిత ప్రతిలోని "మాళ్" శబ్దమునుబట్టి చూడఁగా కుమారిలభట్టునకా ద్రావిడ భాషాశబ్దముల యథార్థజ్ఞానమే లేదన్నట్లు తోఁచునుకాని, కవిరాజుగారి పాఠాంతర శబ్దములను బట్టి చూడఁగా నామూల పాఠమున నర్థముకాని శబ్దములకు బదులుగా, సందర్భశుద్ధిలేకయే, సులభముగా నర్థమగు ద్రావిడభాషా శబ్దములను నడుమ నెవరో చేర్చినట్లూహింపఁదగియున్నది. కావున నేదో ప్రతిలో నీపాఠాంతరములున్నను వీనినిబట్టి దక్షిణదేశ భాషలకు "ఆంధ్ర ద్రావిడభాష" యను సంజ్ఞ యొక కాలములో నున్నదనిగాని, కుమారిల భట్టీపదము ప్రయోగించెననిగాని వాక్య సందర్భమునుబట్టి యేమాత్రము వాస్తవముగాఁ గనఁబడదు. ఈ యపపాఠములను బట్టి యా కాలమున నార్యులకు దక్షిణ

* *Kumarila's reference to Tamil loosely as* 'आन्ध्र-द्राविड' *is a further evidence in favour of general ingnorance of the Aryans about the South.*

దేశమును గూర్చియే విశేషముగా తెలియదని చెప్పుటయు సమంజసముగాఁ గనఁబడదు

మొత్తముమీఁద తంత్రవార్త్తికమునఁగల ద్రావిడ శబ్దముఁ గూర్చిన యీ వచనమూలముగా మ్లేచ్ఛభాషా పదములనేకములు వైదిక సంస్కృత భాషలో పూర్వ కాలము నుండియుఁ జేరుచు వచ్చెననియు, వానికర్థ నిర్ణయముచేయు పట్ల వైయాకరణులు వాని రూపములను తాఱుమాఱుచేసి వ్యుత్పత్తులను గల్పించుచుండిరనియు, వైదిక ప్రయోగమునకును వ్యవహారమునకును అర్థమున భేదముసంభవించినప్పుడు ధర్మప్రయోజనములనుబట్టి వేదమునందలి యర్థమునే ప్రమాణముగా గ్రహింపవలెనను సిద్ధాంతమున్నను మ్లేచ్ఛభాషల నుండి గ్రహింపఁబడిన పదముల విషయమున మాత్రము ఆయాభాషలలోని వ్యవహారమునే ప్రమాణముగా గ్రహింపవలెనను భావము లాకాలమునఁ బ్రబలియుండెననియుఁ దెలియుచున్నది. ఇంతేగాక కుమారిలాదు లాకాలమున ద్రావిడ భాషలను మ్లేచ్ఛ భాషలుగాఁ దలంచుటచే వీని నార్యభాషావర్గమునకుఁ జెందినవానిగాఁ గాని, సంస్కృతభవములో, ప్రాకృతజన్యములో యనిగాని తలంచిన జాడమాత్రము నగపడదు. తరువాతి కాలమునఁ గొందఱు వైయాకరణులే దేశమునందలి భాషలన్నియు సంస్కృతభాషాజన్యములే యను నభిప్రాయముకల వారగుట తటస్థించుటచే దక్షిణదేశ భాషల కన్నిటికి మూలమని వారు తలంచిన "ద్రావిడి" అనునది గూడ నొక ప్రాకృత భేదమని చెప్పియుందురు. కాని యింతమాత్రముచే వారి

కైనను ఈ దక్షిణదేశ భాషలను గూర్చిన యథార్థజ్ఞానము కలదనిగాని. సంస్కృతముతో నీనికిఁగల సాజాత్యమును పరిశీలించి నిర్ణయించిరే యట్లు వారు చెప్పిరని గాని మనము తెలియుటకు నవకాశము లేదు. మొత్తముమీఁద నీ కాలమున ద్రావిడ భాషలు అనార్య భాషలు—ఇతర ప్రాచ్య భాషలను పోలి ప్రత్యేకజాతియున్నదనియు. పాశ్చాత్యులకు విశదమైన నాగరి భాషలే కలవనియు నపుడు సామాన్యాభిప్రాయము నిశ్చయము.

ఇవి యనార్యభాషలన్నియు కేవలా ప్రత్యేకతను. తొలుదొల్తి కాలమున సంస్కృతభాషా వాఙ్మయముల సాహాయ్యమున స్వతంత్ర వాఙ్మయమును చేకొని నాగరిక భాషలని పించుకొనిన తెలుగు కన్నడ మళయాళాదులకంటెను. హిందూ దేశ మధ్యభాగమున నార్యభాషల నడుమనుండియు వింతను దమ సహజములగు ననార్యలక్షణములను చేసి ద్రావిడ సంబంధ లక్షణములను నిలుపుకొనియున్న గోండి, కుయి మొదలగు ననాగరిక భాషలే విశేషముగా సూచింపఁగలవని చెప్పవచ్చును.

ద్రావిడ సంబంధములోని యనాగరిక భాషలలో తుద, కోట భాషలు దక్షిణదేశ భాగమున నీలగిరి ప్రాంతమున వాడుకలో నున్నవి. ఇవి ప్రాచీన కన్నడ మునకు మిక్కిలి సన్నిహితములై యున్నవి. వీనిలో తుద భాష విశేషముగఁ బ్రత్యయాంత భాషగా మారి పడప నా ప్రత్యయాంతత్వమును గోల్పోయి నట్లగపడుచున్నది. కోట భాషలోని సర్వనామ రూపములు, క్రియా రూప ములు ప్రాచీన కన్నడములోని వానిని తమిళము నందలి


వానిని బోలియున్నవి భూతకాలికరూపము తెలుఁగులో వలెనే ఇకారాంత సమాప్తము ఉదా: హోగిగో=వాఁడు వెళ్లెను. హోగికో=వాఁడు వెళ్ళినాఁడు, ఉమున్నంత ప్రత్యయము ఆంక్. ఉ-అక్-తిఁడిరి. కన్న-తిన్న. తన్నలు, తిన్నలికే హిందూదేశ మధ్యభాగమున గోండ్వానమను ప్రదేశమున నున్నవారు గోండులు. ఒరిస్సా ప్రాంతమున నున్నవారు ఖోండులు. వీరినే కోయలు అనియు నందురు. తుద, కోట భాషలను మాటలాడువారు విరళులైరి. వీరి కార్యభాషా సంస్కృత మైనగాను నుండును ఆ భాషలలోనుండి కొంత శబ్దజాలమును మరికొన్ని వ్యాకరణములను గ్రహించినను, పెక్కు వ్యాకరణములలో నివి తక్కిన ద్రావిడ భాష లతో సన్నిహితసంబంధమును సూచించుచున్నవి కోయ భాష యనఁబడు గోండు భాషను మాటాడువారు తెలుఁగు దేశమునకు సమీపస్థులగుటచేఁ గాఁబోలు దానికి తెనుఁగు తో నెక్కువ పోలికలు గలవు. ఇట్టిది దూరస్థమగు తమిళ ముతోఁ గూడ కొన్ని పోలికలు లేకపోలేదు. మధ్యమ పురుషైకవచనములో [illegible] కన్న-నిమగె స్త్రీ వాచక సర్వనామరూప మీ భాషలో నేదు. తెలుఁగులో వలెనే నపుంసక రూపము స్త్రీ వాచక ముగ వ్యవహరింపఁ బడుచున్నది. ఇందలి ఉమున్నంత ప్రత్యయము ఆటే, ఈటే. ఇవి తెలుఁగు తమిళములకంటెను కన్నడ రూపమునకుఁ జేరికగల దై యున్నవి. కన్నడమందు వలెనే గోండు భాషలో కొన్ని శబ్దములలో ప్రాచీన కకా రము నిలిచియున్నది. తె-చెవి. త-సెవి, కన్న-కివి, గోండి-

కాడయి. తె-చేయు, త-శెయ్; కన్న - గెయ్; గోండి-కీ. గోండిలో బహువచన ప్రత్యయములు "ఓర్", "క" అని రెండు గలవు. "క" అనునది నపుంసక శబ్దములపై మాత్రము చేర్పఁబడును. తృతీయా ప్రత్యయము (తమిళము నందువలె) "ఆల్". "అది" అనుదాని ప్రథమేతర విభక్తి రూపము తెలుఁగునందువలె "దాని" అని కాక "అదెనా" అనియే కలదు. భవిష్యదర్థక క్రియా రూపమున ధాతువునకు "కా" అనునది చేర్పఁబడుచున్నది. కీ కా = నేనుచేయుదును. Cf. త. శెయ్గు, కన్న.-కెయ్గు. ఈ విషయములలో నిది ద్రావిడభాషలతో సాజాత్యము కనఁబఱుచుచున్నను ఉత్తర హిందూస్థాన భాషల ప్రభావము దీనిపై సోకక పోలేదు. క్రియా విశేషణమునకు బదులు సంబంధార్థక సర్వనామము (హిందీలోని "జో" అనునది) వాడుకలోనికి వచ్చినది. కర్మణ్యర్థక రూపములలోను వ్యతిరేకార్థక రూపములోను, క్రియారూపముల బాహుళ్యములోను ఇది ఉత్తర హిందూస్థానభాషలను బోలినది. మొత్తముమీఁదఁ జిరకాలమునుండి గలిగిన విజాతీయ భాషా సంసర్గముచే వ్యాకరణ విషయములలోఁ గూడఁ గొంత మార్పు గలిగిన దనవలసియున్నది.

"కుయి" భాష గోండి భాషకుఁ జాల సన్నిహితము. తుమున్నర్థకము గోండి భాషా రూపముకంటెను తమిళమునకు సన్నిహిత మనవచ్చును. గోండి - ఆయాలే, కన్న-ఆగల్, తమి-ఆగ, కుయి-ఆవ, తె-కా(న్) ఇవి యన్నియు "అల్" శబ్దము చేర్చుటచే నేర్పడినవే. కొన్ని భాషలలో

తుది "ల" కారము లోపించినది. కొన్నిటిలోఁ దుది లకారము 'న్'గా మారినది. వ్యతిరేకార్థకము ఈ కుయిలోఁ దక్షిణ ద్రావిడ భాషలలోవలెనే యేర్పడుచున్నది. తె-చేయను; త-శెయ్యేన్, క-గియేను. బహువచన రూపములలో మహత్తులకు "అరు-రు" అనునదియు, అమహత్తులకు 'క' అనునది చేర్పఁబడుచుండును. పుంలింగ శబ్దరూపములు తమిళ రూపములనే పోలియున్నవి. త-అవన్, కన్న.-అవను, కు.-అవాను. ఏకవచనమున స్త్రీలింగ ద్యోతకముగా నపుంసకలింగరూపమునే వాడుటలో కుయి తెలుఁగునకుఁ జేరిక గలదై యున్నది. ఉత్తమ మధ్యమ పురుష సర్వనామమున తృతీయాది విభక్త్యంత రూపములలోను, (నాచేత-నాయందు నీచేత-నీవలన) విభక్తి ప్రత్యయములలోను, అయ్యెడి-అయ్యేటి (కు-ఆటి) మొదలగు క్రియా విశేషణ రూపములలోను కుయి తెలుఁగును బోలియున్నది. వర్తమాన క్రియా విశేషణ రూపములు మొదలగు వానిలో నిది యుత్తర హిందూస్థాన భాషాసంపర్కమును గనఁబఱచుచున్నదనవలయును. బ్రాహుయి భాషాలక్షణము లనేకములు సిథియన్ వర్గమునందలి భాషలకు సన్నిహితములని చెప్పవలసియున్నది. సిథియన్ వర్గమనుదానికి ప్రత్యేక వ్యవస్థ కనఁబడకున్నను ద్రావిడ భాషాలక్షణములే కొన్నిటియందు గనఁబడుచున్నవనుటకు సందేహము లేదు. కాని బ్రాహుయి భాషలో ప్రత్యేక ద్రావిడభాషా లక్షణములునుఁ గొన్ని కనఁబడుచున్నవనుట మనము ముఖ్యముగా గమనింపఁదగినది. మధ్యమ పురుష సర్వనామము ఏకవచన బహువచన రూప

ములు నీ-నుమ్; ఆత్మార్థక సర్వనామరూపము (తాణ్); బహువచన ప్రత్యయమగు 'క'; రెండు మూఁడు అను సంఖ్యావాచక శబ్దములు ఇరత్, ముసిత్; నిర్దేశార్థక త్రికము దా, ఏ, ఓ, అనునవి, వ్యతిరేకార్థక క్రియలు, ఈ మొదలగు విషయములలో నిది ద్రావిడ భాషలకు సన్నిహిత సంబంధమునే కనఁబఱచుచున్నది. ఇట్లీ యనాగరక భాషలు త్తర హిందూస్థాన భాషల నడుమనుండి వాని ప్రభావమునకుఁ గొన్ని విషయములలో లొంగిపోయియున్నను దూరస్థ భాషలగు తమిళాదిద్రావిడభాషలలోని పెక్కు విషయములతో సన్నిహిత సంబంధము కలవిగాఁ గనఁబడుచుండుటచే ద్రావిడ భాష లొకకాలమున హిందూదేశ మందంతటను వ్యాపించి సంస్కృతాద్యార్య భాషలలోఁ గానరాని కొన్ని విశేష లక్షణములతోఁ గూడినవై యొక ప్రత్యేక కుటుంబముగా నేర్పడి యుండెనని నిశ్చయింపఁ దగియున్నది.


ప్రాచీన ద్రావిడభాష
తమిళము
మళయాళము
తుళు
కొడగు
తోడా
కోట
కన్నడము
కురుఖ్
మాల్తో
గోండు
కూయి
కోలామి, మొ॥
తెలుగు
బ్రాహుయి

5

అరవము తెలుఁగు వాని ప్రాచీనత

అఱవము, తెలుఁగు—ఈ భాషల ప్రాచీనతను గూర్చి రచియింపఁబడిన యొక విమర్శవ్యాసము ఆంధ్రపత్రిక వృష సంవత్సరాది సంచికలోఁ బ్రకటితమగుట తటస్థించినది. అందు ద్రావిడభాషలలో మిక్కిలి పురాతనమైన భాష యేది? తెనుఁగు అఱవమునుండి పుట్టినదా? అను విషయములు విమర్శింపఁబడినవి. మూల ద్రావిడభాషా స్వరూపము తక్కిన భాషలకంటె అఱవమున నెక్కుడుగాఁ గనఁబడుచున్నదను కాల్డ్వెల్ పండితుని యభిప్రాయముతో శ్రీ లక్ష్మణరావుగారేకీభవింపక, తద్రచయితలు గ్రియర్సన్ మొదలగువారు చెప్పినట్లుగా అఱవముకంటెను తెనుఁగు మొదలగు నితర ద్రావిడ భాషలలోనే ప్రాచీన భాషాసంప్రదాయము లెక్కువగా నిలిచియున్నవనియు, కాని గ్రియర్సన్ అట్టి నిదర్శనములను జూపలేదు గావున తామట్టివానిని గొన్ని చూపఁదలచితి మనియుఁ దెలిపియున్నారు. అందుకుగాను కొన్ని సజాతీయ పదములను గ్రహించి, తెనుఁగులో నిలిచియున్న యా పదముల రూపమే తక్కిన యఱవ కన్నడ భాషారూపములకంటె ప్రాచీనమని నిరూపింప యత్నించి యున్నారు. తెనుఁగుభాషలో మూల భాషయొక్క పురాతన స్వరూపమును సూచించు చిహ్నములు - అఱవ కన్నడములను బట్టికూడ గుర్తించుటకవకాశములేనివి—కొన్ని నిలిచియున్నవను మాట వాస్తవమే కాని, యా వ్యాసములోఁ జర్చింపఁబడిన తెలుగుపదముల స్వరూపము తమిళ కన్నడ పదములకంటె మూలభాషా

స్వరూపమునకు సన్నిహితమని, ఆ కారణముచే నవి ప్రాచీనము లని చెప్పుట కవకాశము గలదా యను విషయము మాత్రము పునఃపరిశీలనార్హ్యమని తోఁచుచున్నది.

దక్షిణ దేశమున వ్యవహారములో నున్న భాషల న్నియు నొక కుటుంబమునకుఁ జెందిన వనియు, ఆ కుటుంబము ద్రావిడభాషా కుటుంబ మనుపేర బరగుచున్న దనియు, తెనుఁగు, అఱవము, కన్నడము మొదలగు భాష లొక్క-కుటుంబమునకుఁ జెందిన సోదర భాషలని చెప్పఁబడినపుడు వానిలో నేది పురాతనము? దేనినుండి యేదిపుట్టినది' యను ప్రశ్నలకు తావు సందర్భము లేదనియు, మూలభాషా స్వరూపమునే తత్తద్దేశ కాలానుగతములగు మార్పులతో నాయా భాషలు వహించియుండుననియు నీ మొదలగు విషయములను శ్రీ కోమఱ్ఱాజు లక్ష్మణరావుగా రందు చక్క-ఁగ వ్యక్తీకరించియున్నారు.

అఱవము, తెనుఁగు నొక్క- కుటుంబమునకుఁ జెందిన సోదర భాషలు. వీనికి జన్యజనక భావసంబంధము లేదు. కాని తెనుఁగుభాష పుట్టు పూర్వోత్తరములను గూర్చి తెలిసికొనఁదలచినపుడు మాత్రము అఱవభాష యొక్క- సాహాయ్య మత్యావశ్యకముగాఁ గనఁబడును. ఒక్క- అఱవము తోడనే కాక తక్కి-న దక్షిణ దేశభాషలతోఁ గూడ పోల్చి పరిశీలించినగాని తెనుఁగుభాషయొక్క- ప్రాచీన చరిత్రలు దెలిసికొన సాధ్యముకాదు. ఈ విషయ మిటీవలనే దక్షిణదేశ భాషా తారతమ్య పరిశీలనకుఁ గడఁగిన కాల్డ్వెల్

పండితుఁడు మొదలగువారి పరిశ్రమల మూలముగాఁ గనిపట్టఁబడినది.

ఈ దక్షిణ దేశభాషలను ద్రావిడభాషా కుటుంబమని వాడుచుందురు. ఒక మూలభాషనుండి యేర్పడినవై కాల క్రమమునఁ గలిగిన మార్పుల మూలముగా భిన్నములు, స్వతంత్రములు నైన భాషలనే, వానికిఁ గల సజాతీయత్వ మునుబట్టి, యొక భాషా కుటుంబముగా భాషా తత్త్వ వేత్తలు పరిగణింతురు. ఇవి యన్నియు నొక కుటుంబము నకుఁ జెందినవని చెప్పఁబడినప్పుడు ఇవి యన్నియు నొక మూలభాషనుండి కాలక్రమమున బయలుదేరిన సోదరభాష లని తలఁపవలయునే కాని, వీనిలో నెద్దానినుండి యేది పుట్టి నదను ప్రశ్న కవకాశమే లేదు. కాని వీనిలో నొక్కొక్క దానినుండి ప్రాంతీయ భాషలు బయలుదేరి యవి మరల స్వతంత్రములైనపుడు ఆయా భాషలలో శాఖ లేర్పడుననుట కవకాశము లేకపోలేదు. ఒక మూలభాషనుండి యేర్పడిన సజాతీయ భాషలని చెప్పఁబడుచున్న అఱవము, కన్నడము, తెలుఁగు మొదలగువాని విషయములోమాత్ర మొకదాని నుండి మఱియొకటి పుట్టినదనికాని, ఒకటి పురాతనము, ఒకటి యర్వాచీనము అనికాని తలచుట కవకాశ ముండదు. కాని యీ ప్రశ్న తఱచుగా బయలుదేరుచునే యున్నది. అందు కొక కారణము ఎవరి భాషయందు వారికిఁగల యభి మానాతిశయము కావచ్చును. అది పాటింపదగినది కాదు గదా! ఒక భాషయందు లభించిన వాఙ్మయ మితర భాష లలోదానికంటె ప్రాచీనమై యగపడుచుండుటవలనఁ గూడ

నట్టి భావ మేర్పడవచ్చును. తెనుఁగు కన్నడములం దిప్ప టికి లభించిన వాఙ్మయముకంటె మిగుల ప్రాచీనమగు వాఙ్మ యము తమిళభాషలో గల దనుటకుఁ దగిన కారణము లగ పడుచున్నవి. కాని యొక భాషలో నితర సోదర భాషలందు కంటె ప్రాచీన మనదగిన వాఙ్మయము లభించినంత మాత్ర మున దానినుండి యితరములు పుట్టినవని నిరూపింప సాధ్య ముకాదు. ఇతర భాషలలోని వాఙ్మయ మేకారణములచే నంతరించినదో, వృద్ధినొందనేలేదో యను విషయములను చారిత్రక దృష్టితోఁ బరిశీలింపవలసి యుండును. తమిళ భాషలో ప్రాచీన వాఙ్మయ ముండుటయేకాక భాషా రూపములలోఁగూడ ననేకము లితర భాషారూపములకంటెఁ బ్రాచీనములుగఁ గనబడుటచేతనో, ఆభాషతో నితర దక్షిణ దేశభాషలతోడి పరిచయముకంటె నెక్కుడు పరిచయము కలుగుటచేతనో కాల్డ్వెల్ పండితుఁడు అఱవభాష యితర భాషలకంటె మూల ద్రావిడభాషకు సన్నిహితమై యుండు ననియు, మూలభాషా స్వరూపము ఈ భాషలో నెక్కుడు కనఁబడుచున్న దనియుఁ జెప్పినమాట వాస్తవమే. అది వాస్తవము కాదనియు, తెలుగు మొదలగు నితర ద్రావిడ భాషలలో నఱవమునందుకంటె నెక్కుడు పురాతనములైన విశేషరూపములు కనఁబడుచున్నవి గావున నఱవము కూడ నితర భాషలవలెనే యొక సోదర భాషయే కాని, దీనికంటె ప్రాచీనమని చెప్పుట కవకాశ మేమియు లేదనియు గ్రియ ర్సన్ పండితుఁడు మొదలగువారు చెప్పియున్నారు. విచా రింపఁగా నీ యిద్దరు పాశ్చాత్య పండితుల యభిప్రాయముల

లోను ప్రమాదకరమైన వైరుధ్యము వాస్తవముగా లేద
నియే చెప్పవచ్చును. ఏలయనంగా ప్రాచీనమగు మూల
ద్రావిడ భాషాస్వరూపమును మన మన్వేషించి గుర్తింపవల
సన్నచో నీ యుటువంటి కన్నడాంధ్రాది భాషలలోని పద
రూపముల నన్నిటిని సరిపోల్చి చూడాలి. వానిలో కాలక్రమ
మున కలిగిన మార్పులను గుర్తించాలి. వాని మూలమున
నాయా భాషల ప్రత్యేక లక్షణములను నిర్ణయించి వాని
మూలముగా నేనే మూలభాషా స్వరూపము తెల్పి సంప్రదాయ
ములకు లోనైన ఆయా భాషలలో కాలక్రమమున నానా
వికారములను పొందవలసి వచ్చిన పద్ధతినే, అట్టి మూల
భాషాస్వరూపమును మనము నిర్ణయింపగలిగెదము. నానా
భిన్నరూపములుగా పరిణతిచెందిన సామ్యములను అట్టి ఆ
మూలము. మనము నిర్ణయముచేయవలసియుండు. కావున నా
ప్రాచీన భాషా స్వరూపమును గుర్తించు విషయములో న
వియు నాకారు భాషలన్నియు మనకు సమానముగా తోడ్ప
డవలసినవే యున్నవి. కొన్ని సహజలక్షణము లొకభాషలో
మార్పునొందక నిలిచియుండ మరికొన్ని లక్షణములు మరి
కొన్ని భాషలలో నిలిచియుండవచ్చును. కావుననే వాఙ్మ
యముకూడ లేని తోడ భాషలోని లక్షణములు కొన్ని మిక్కిలి
ప్రాచీనములని తద్భాషాపరిశీలకులు చెప్పుచున్నారు. అట్లే మధ్య
పరగణాలలోని గోండు, కుయి, రాజమహల్ భాషలు,
బ్రాహుయిభాష మొదలైనవికూడ మూలభాషాస్వరూప
నిర్ణయమున చాల ప్రయోజనకరము లగునని తెలియవచ్చు
చున్నది. కాని యీ నడుమ పాశ్చాత్యులకు భాషావేత్త

వేత్తలు కొందరు ఈ మధ్యపరగణాలలోని యాటవిక జాతులు వ్యవహరించు గోండు మొదలగు ద్రావిడభాషలే ద్రావిడ భాషాతత్త్వ పరిశోధనము విషయమున తమిళభాష కంటెను గూడ నెక్కువగా తోడ్పడగల వనియు, నా కారణముచే నీ పరిశోధనము దక్షిణపు కొననున్న తమిళభాషతో ప్రారంభించుటకన్న మధ్యదేశమందలి యా యాటవికుల భాషల పరిశీలనముతోనే ప్రారంభించుట మిక్కిలి ప్రయోజనకారి కాగలదనియు చెప్పందొడగిరి.* ఈ పరిశోధనము విషయమున సంస్కారము గలిగిన తమిళాది భాషలకు గల ప్రాధాన్యమును సంస్కార హీనములగు గోండు మొదలగు వానికిని ఇవ్వవలసియుండునని చెప్పుట న్యాయమేమో కాని, తమిళాది

---

* *"If we want to understand the history of the languages of the South, we should begin from the Northern side"—E. Tuttle*

"The Dravidian language which has almost always been chosen for comparison is Tamil, which, in fact is best known of all the dialects for various reasons. Even if we admit that from the Vedic up to the present time, Tamil has changed very little, there still remains the fact that the domain of this Dravidian dialect is the further most off from the region of Vedic civilization. On this principle alone, it should have been the last one to be taken into consideration for the sake of comparative study. If we want to understand the history of the languages of the South we should begin from the Northern side."

(Pre-Aryan & Pre-Dravidian)

భాషలకు గల ప్రాధాన్యమును తగ్గింపఁ జూచుట సాహస మనక తప్పదు. ఒక భాషలో నెంత ప్రాచీనమగు వాఙ్మయము లభించిన నంత ప్రాచీన కాలమువరకు నా భాష యొక్క స్వరూప పరిణామము నన్వేషించుటకు సులభావకాశము దొరకును గదా! వాఙ్మయ శూన్యములగు భాషలలో గొన్ని యతి ప్రాచీన లక్షణములు నిలిచియున్నను. వాని ప్రాచీనత యిట్టిదని నిర్ణయించుటకు దగిన యాధార ముండదు కావున నితర విధముల జేసికొనిన నిర్ణయముల సరి చూచుకొనుటకుమాత్రమే యుపయోగించును. అవి సంస్కార హీనములగు భాష లగుటచే నా భాషా రూపములు తొందర తొందరగా పెక్కు మార్పులకు లోనగుచుండుటయుఁ దటస్థింపవచ్చును.

పైని జెప్పిన జూలిస్ బ్లాక్, టటిల్ పండితుల యభిప్రాయము దక్షిణ దేశీయములగు ద్రావిడభాషలకు ఉత్తర దేశీయములగు నార్యభాషలపై గల ప్రభావ మెట్టిది యను విషయమును గూర్చి చర్చించునపుడు తెలుపబడిన దేయైనను ద్రావిడభాషా విశేషలక్షణములను దెలిసికొనఁదలచినప్పుడు తమిళ భాషయొక్క ప్రాముఖ్యమును తగ్గించుట కే విధమగు నవకాశమును లేదనియే చెప్పవలసియున్నది. ప్రాచీన ద్రావిడ భాషాలక్షణములు దానినుండిబయలు దేరిన భాషలన్నిటిలోను గనబడుచుండుననుట సహజమేయైనను, తమిళ భాషకు దక్కిన వానికంటె ప్రాచీన కాలముననే సంస్కారమేర్పడుట చేతను, అందు వాఙ్మయము బయలుదేరుట చేతను, అవి మనకిప్పుడు లభ్యములై యుండుట చేతను వానినిబట్టి తక్కినభాషలలో

నే నే కాలమున నెట్టిమార్పులు గలిగినవో, వానిపరిణామక్రమ మెట్టిదో నరిపోల్చి తెలిసికొనుట కవకాశ మేర్పడుచున్నది. గ్రియర్సన్ పండితుండు ద్రావిడభాషయొక్క ప్రాముఖ్యమును గూర్చి కాల్డ్వెల్ చెప్పిన యభిప్రాయము నించుక యాక్షేపించుచు తక్కిన భాషల సముద్రభాగ్యమును గూర్చి నొక్కి చెప్పఁ బూనినవాఁడైనను. తెనుఁగు మొదలగు భాషలలోనుండి గ్రహింపఁబడిన ద్రావిడ లక్షణములను గుర్తించిన ప్రత్యేకసిద్ధాంతములను మనకు జ్ఞాపకముంచి విడిచిపెట్టవలసిన వాఁడైనాఁడు. కారణము బహుశః అది యంత సులభమైనపని కాకపోవుటయే యైయుండును. ఈ విషయమును గుర్తించి ప్రొ॥ లక్ష్మణస్వామిగారు తమ వ్యాసమునఁ జెప్పియున్నారు. ఇటీవల గ్రియర్సన్ పండితుఁడు వెలువరించిన నిఘంటువుల తెలుఁగుపదములలో ప్రాచీనమైన తెలుఁగు ద్రావిడ లక్షణములను మనము గుర్తించి చేయఁగలదని చూపఁదలచినప్పుడు ఆ భాషలోని లక్షణములను నిర్ధారణముగా గ్రహించుటలో శాస్త్రీయ నాణ్యతను జూపవలసిన అగత్యము. ఆలోచింపఁ బోవుటయుం గాదు. ఒకే విధమగు క్రమము లోనైయుండదు. దానికిఁ గారణ మప్పటికి మనవారికి సంస్కృత ప్రాకృత భాషాలక్షణములు, సంప్రదాయములు తెలిసినట్లుగా ద్రావిడ భాషా సంప్రదాయములు బాగుగా తెలియకపోవుట యై యుండవచ్చును. ఆ యప్పటి కంటె విశేషముగా పరిశీలింపఁబడలేదు ఇప్పుడుమాత్రము తెలిసి మార్పు చెందినదని చెప్పవచ్చునా? యను ప్రశ్న రావచ్చును గాని, ఏదో కొంత పరిశ్రమ జరుగుచున్నదనిమాత్రము చెప్పక తప్పదు.

ఏమైనను గాని తెలుఁగుయొక్క ప్రాచీనత్వమును జెప్పుటకు నిదర్శనముగా గ్రహింపదగిన శాసనములు, తెనుఁగు నందలి వాని రూపములు సంయుక్తాక్షరయుతము లైనచో నవి వాని ప్రాచీనత్వమును జూపి చున్నవి. తెనుఁగుపదము ములు విడిపోయిన సంయుక్తాక్షరములు గలిగి గావున నవ్యాపిత సూత్రై యున్నవని యు వారు చెప్పుచున్నారు. గాని యిది నగా సంయుక్తాక్షరములు గల పదములు మొదటిగా నుండెననియు, తరువాత నందుండి విశ్లేషము వలన ప్రస్తు తస్థితి వచ్చినది సకర్మకమై సంయుక్తాక్షరములు విడి పోయి యీ పదములు యేర్పడినవనియు చెప్పుచున్నారు. ఇట్టి వాదము దర్శనము సరియగునని వ్యాకరణములను బట్టి నడయుండి వాని వాదము ఈ వాదమున యుక్తియుక్త ముగానే యున్నట్లగపడును గాని వాస్తవము తెలుపు చున్నదా యను మాత్రము పరిశీలింపవలసియున్నది. నవ్య ముగాను అంతకు ప్రధానముగ ద్రావిడ భాషలందును, ప్రాకృత భాషలలోను గూడ సంయుక్తాక్షరములతోఁ గూడిన సంస్కృతాదార్య భాషా పదములు స్వీకరింపఁబడునప్పుడు వానియందలి సంయుక్తాక్షరములు విడదీయఁబడి నడుమ నొక యొక అచ్చు చేర్పఁబడుచుండు నాచారముండిన నుండవచ్చును గాని, యీ పద్ధతి, ఆచారము నిండ ప్రబల ముగా తమిళ కన్నడాది ద్రావిడభాషలందును, ప్రాకృతముల లోను మాత్రమే కనబడుచుండుటకుఁ గల కారణమేమి యని మనము విచారింపవలసియున్నది. సంస్కృత భాషలోను, ఆంగ్లము మొదలగు భాషలలోను సంయుక్తాక్షరములతోఁ

గూడిన పదము లనేకము లున్నవి. కాని యా భాషలలో నవి యుచ్చారణ సౌకర్యార్థమై ఆ భాషను వ్యవహరించు జనులచే, నా సంయుక్తాక్షరములు విడదీయఁబడి పలికినట్లుగాని, ఆ భాషలో నట్టి శబ్దములకు ద్వైరూప్యము కలిగినట్లుగాని కనఁబడదు. కాని ఆ పదములు ద్రావిడ భాషలను వ్యవహరించు జనులచే నుచ్చరింపఁబడినప్పుడు అందలిసంయుక్తాక్షరములు తరచుగా విడదీయఁబడియేపలుకబడుచున్నవి. ఒకవేళ విడదీయఁబడి నడుమ అచ్చు చేర్పఁబడనిచో నా సంయుక్తాక్షరములోని యొక వర్ణము రెండవదానితో సావర్ణ్యమును బొంది, అది ద్విత్వాక్షరముగా నేర్పడుచున్నది. తమిళాంధ్ర కర్ణాటకాది భాషలలో నే నిఘంటువును తెఱచిచూచినను పెక్కుపదము లిట్టివి మనకు వెంటనే గోచరింపగలవు.

సం. శ్రీ.	తె. సిరి.	త. తిరు.
అగ్ని	తె. అగ్గి	ఆగిని
ఉద్యోగ		ఉత్తియోగం
యుక్తి	జుత్తి	ఉత్తి
బుక్షు	రిక్క	
బ్రాహ్మణ	బాపడు	పిరమిన
శుక్ర	చుక్క	
ఇంగ్లీ. *Hospital*	ఆసుపత్తిరి.	

సంస్కృతాది భాషాశబ్దము లీ ద్రావిడ భాషలలోఁ బొందిన మార్పులను బట్టి చూడగా నందలి భిన్నాక్షర

సంయోగము నుచ్చరించుట కలవాటుపడని వా రాపదముల నుచ్చరింపవలసి వచ్చినపుడు స్వోచ్చారణ సంప్రదాయముల కనుగుణముగాఁ జేసికొన యత్నించియుండుటచే నట్లేర్పడి యుండునేగాని కేవల ముచ్చారణ సౌలభ్యము కొరకు మాత్రమే యేర్పడినట్లు గపడదు. ఏలయనఁగా సంయుక్తాక్షరములతోఁగూడిన సంస్కృతశబ్దములు తద్భవములై దక్షిణ దేశభాషలలో నెద్దానఁ బ్రవేశించినను ఒక్కరీతినే యాయక్షరముల సంయుక్తత్వము విశ్లేషతను బొందుచున్నది. తెనుఁగున తత్సమరూపమునఁ బ్రవేశించినవానిలో మార్పు లేకున్నను, తద్భవరూపము లన్నిటిలోను తమిళమునందువలెనే సంయుక్తవర్ణత్వము సహింపఁబడుటలేదు. దీనిని బట్టి పదములందు సంయుక్తవర్ణాసహిష్ణుత్వము ద్రావిడభాషా ముఖ్యలక్షణములలో నొకటిగా గ్రహింపవలసియున్నది. పదములయందు అనునాసికలతో తప్ప నితరవర్ణములకు సంయుక్తత్వము సహింపకుండుట, మహాప్రాణములను వ్యవహరింపలేకుండుట, రెండు మూడు పదములకు మించిన దీర్ఘ సమాసములు లేకుండుట మొదలగునవి యీభాషలకుసహజ లక్షణములు. ఇట్టి యుచ్చారణ సంప్రదాయముల కలవాటుపడినవారు గనుకనే తొలుత సంస్కృతభాషతో వీరికి సంసర్గము గలిగి యా పదములను వీరు వ్యవహరింపవలసివచ్చినపుడు అందలి సంయుక్తాక్షరములను విడదీసి పలికియు, మహాప్రాణముల నల్పప్రాణములను జేసియు నాయాపదములను తమ భాషలోనికిఁ దెచ్చుకొనిరి. ఇది ఈ భాషలకు సహజసంప్ర

దాయస్థితి పుట్టుటచేతనే కాని కేవల తాత్కాలిక సౌకర్యము మాత్రమే కారణముగా జరిగిన పనికాదు. అట్లయినచో సంస్కృతమును వ్యవహరించువారిలోఁగూడ నిట్టిమార్పు గలిగి సంస్కృతమునఁ గూడ భాషాపదములకు ద్వైరూప్యము సిద్ధించియుండునుగదా.

ఇక సంస్కృతజన్యములనఁబడిన ప్రాకృతములలో నట్టిమార్పు కలిగినదని చెప్పిన అను ప్రశ్న కలదు. ప్రాకృత భాషలలో నట్టిమార్పు కలుగుటకుఁ బ్రధానకారణము సంస్కృతభాషను నతిప్రాచీనకాలముననే యవలంబించి వ్యవహరింపఁజాలిన ద్రావిడజనులు ముందటి క్రిందితరగతులవారై నావారాన్య ప్రాకృతభాషలలో సైతము ద్రావిడ భాషాసంప్రదాయముల కలవడినవారై విశేషముగా నుండి యుండుటచే యని చెప్పవలసియున్నది. హిందూదేశపు వాయవ్యదిగ్భాగమున నిలిచియున్న బ్రాహుయీ భాషను బట్టియు, మధ్యపరగణాలలో నిప్పటికిని వ్యవహరింపఁబడు చున్న గోండి, కూయి, రాజమహల్ మొదలగు భాషలను బట్టియు, నింక ననేక కారణములనుబట్టియు నొకకాలమున నుత్తర హిందూదేశమునఁగూడ ద్రావిడభాషలను వ్యవహరించు జనులు నివసించియుండిరని యూహింపకతప్పదు. ఈ ద్రావిడభాషా సంప్రదాయముల కలవడిన యుత్తరహిందూస్థానమునందలి ప్రాకృతజనుల మూలముననే క్రమముగా వీరా దేశమున వ్యాప్తిలోనున్న యార్యభాషను స్వీయోచ్చారణ సంప్రదాయానుసారముగా వ్యవహరించుటఁ జేసియే హిందూ

దేశమునందలి ప్రాచీనార్యుల వైదికభాష కాలక్రమమున ప్రాకృతభాషగా మారిపోయియుండును. కావుననే దక్షిణ దేశమున నెలవుకొనిన ద్రావిడభాషల సంప్రదాయములు కొన్ని యుత్తరహిందూస్థానమునందలి ప్రాకృతభాషలలోను విశేషముగాఁ దత్ప్రాకృతభవములగు నాధునికార్యభాషల లోను గానవచ్చుచుండుట. అట్టి లక్షణములలో సంయుక్తా క్షరములను విడదీసికాని, లేదా సావర్ణ్యమును బొందించికాని పలుకుటయనున దొకటి. కావుననే యీలక్షణము దక్షిణము నందలి ద్రావిడభాషలకును, ఉత్తరదేశమునందలి ప్రాకృతా ద్యార్యభాషలకును సమానమై యుండుట తటస్థించినది.

ఇదియే ద్రావిడభాషలకు సహజ లక్షణమైనచో తెలుఁగు కన్నడ మలయాళములలో ననేక పదములలో సం యుక్తవర్ణములు కనఁబడుచున్నవే యను ప్రశ్న కలుగును. దీనికి ప్రధానకారణ మాభాషలపై సంస్కృతభాషకుఁగలిగిన ప్రబలప్రభావమే. అదియైనను సంస్కృతసమశబ్దములలోఁ గానచ్చునేకాని దేశ్యశబ్దములలో విశేషముగఁ గానరాదు. సంస్కృతసమ మీభాషలలోఁగలిసినట్లుగాఁ దమిళభాషలోఁ గలిసియుండలేదు. ద్రావిడభాషా సంప్రదాయానుసారముగా వర్ణసంస్కారమును బొందని సంస్కృత శబ్దమునకు తమిళ భాషలోఁ బ్రవేశమే లేకపోయినది. కావుననే యాభాషలో తక్కిన తెలుఁగు కన్నడములందువలె ననునాసికాదులతో తప్పభిన్నవర్ణసంయోగముతోఁగూడినశబ్దము లేకనఁబడవు.

ఇట్టిది ద్రావిడభాషా సహజమగు సంప్రదాయమే యయినట్లయినచో, తెలుఁగునమాత్రము అందులో పదాదిని

సంయుక్తవర్ణముతోఁ గూడిన యిన్ని పదము లెట్లువచ్చిన వన్న ప్రశ్న నిలిచియున్నది. దీనిని గురించి మఱియొక విశేషము గమనింపఁదగియున్నది. తెనుఁగున పదాదిని సంయుక్తాక్షరము గల పదములలో ననేకములు—బహుశః సర్వమును గూడ-రేఫసంయోగముతోఁ గూడినవే కాని మఱియొకటి కావు. ద్రావిడభాషా సంప్రదాయమునుబట్టి పదమధ్యమున నైన ద్విత్వరూపాక్షరసంయోగ మొప్పునుగాని పదాది నదియు రాఁగూడదు; రాదు. అట్టి సందర్భములో తెనుఁగున నైనను పదాదియందు రేఫసంయోగము వచ్చుట వింతగా కనఁబడకమానదు. ఇట్టిపదము లితర ద్రావిడభాషలలో నెచ్చటను గానరావు గదా! కావున నాంధ్రమున నిదియొక వికృత లక్షణ మనక తప్పదు. ఇది సంస్కృతభాషా సంసర్గ బలముచే వచ్చినదై యుండిన నుండవచ్చును. ఈ భాషలో ప్రత్యేకముగ వెలసినదని చెప్పినను చెప్పవచ్చును. ఇది యితర ద్రావిడభాషలలో నెచ్చటను గానరాకుండుటచేతను, విదేశీయ భాషలనుండి సంగ్రహించిన,సంగ్రహింపఁబడుచున్న పదములలో నిప్పటికి నీ భాషలన్నిటిలోఁగూడ నట్టి సంయుక్తత్వము తొలగింపబడుచునే యుండుటచేతను ఇది తెనుఁగునకు మాత్రమే యొకకాలమున గలిగిన విశేషలక్షణమనియు, సామాన్య ద్రావిడభాషా సంప్రదాయసిద్ధము కాదనియు చెప్పవలసివచ్చుచున్నది.

తెలుఁగులోని యీ విశేషరూపములు ‘వర్ణప్లుతి’ యను స్వరసూత్రము ననుసరించి యేర్పడినవై యున్నవి. దీనినే *Metathesis* అని శబ్దతత్త్వశాస్త్రవేత్తలు చెప్పుదురు.

వర్ణప్లుతి యనగా నొక పదమునందలి సమీపాక్షరములలోని యొకవర్ణము తన స్థానమునుండి యెగిరిపోయి ప్రక్క వర్ణముపై నిలుచుట. 'విరల్' శబ్దములోని రేఫము తనకు సన్నిహితమునందున్న వి' అనువానిలోని ఇకార వ్యవధానమును తప్పించుకొని వకారముపై నెగిరిపడగా వ్ + ఇ + ర్ + అ + ల్ > వ్ + ర్ + ఇ + అ + ల్ = ౖవిఅల్ - ౖవేల్ - ౖవేలు అని వకార రేఫసంయోగము ప్రాప్తించి తరువాత నున్న ఇకార అకార సంయోగముచే ఏత్వసిద్ధిగలిగి ౖవేల్ > ౖవేలు రూపము సిద్ధించుచున్నది. ఇది యథాస్థితియొక్క వర్ణనముమాత్రమే. భాషలోనిట్టిమార్పు లనేకస్థలములఁ గలుగుటను జూచి, అది యాభాష కొక ప్రత్యేక లక్షణముగా గ్రహించి, యిట్టివి యితర భాషలలో నెచ్చటనైన నున్నచో వానికిఁగల కారణముల నారసి భాషాతత్త్వవేత్తలు కొన్ని సామాన్యస్వరసూత్రముల (*General phonetic laws*) నేర్పాటు చేయుదురు. ఈ వర్ణప్లుతి యనునదియు నట్టివానిలో నొకటి. ఇట్టిది గలుగుటకు మూలకారణ మేమి యని విచారించినచో నొక పదములోని వర్ణముల నుచ్చరించుటలో గలుగు త్వరయే యయియుండును. ఆ త్వరితోచ్చారణమును బట్టి వర్ణములు తారుమారగుచుండును. ఇట్లొక రేఫమే కాక ఒక పదమందలి యక్షరములే మాఱుచుండుటయు గలదు. అప్పుడా పదములకు ఒక్క భాషలోనే ద్వైరూప్యమును సిద్ధించును. చూడుడు :

అరల్-అలర్-అలరు = పుష్పము. cf. క. అరళ్- *to expand, to open*.

గులివి_గుబిలి
ఎలర్-ఎరళ్ cf. తె. తెమ్మెరలు. కన్న. తెంబెలర్.
అగప-అబక
చమురు-చరుము
పాడగము-పాగడము
పిచ్చిలు-చిప్పిలుఁ cf. తమి. పిచిర్-*to drizzle*
దబ్బ-బద్ద cf. త. తప్పై=*Split bamboo*
కుతకుత-తుకతుక
పొక్కిలి-క. పొక్కుళ్ ; త. కొప్పుళ్
పిగులు-క. పిళిగు, cf. త పిళ = *to be rent*

సం. ఆత్మ శబ్దమునుండి (ఆత్ప మూలముగా) అ_ప్త శబ్ద మేర్పడుటకు గారణ మా వర్ణప్లుతియే యని పిషెల్ పండితుని యభిప్రాయము. 'వారాణసీ' శబ్దమునుండి వర్ణప్లుతిచేత 'వాణారసి' యను రూపము గలుగుటచేతనే ఇంగ్లీషులో 'బెనారస్' (*Benares*) అను శబ్దమేర్పడినది. ఇట్టి వనేక ములు కలవు.

దీనినిబట్టి యుచ్చారణమందలి త్వరనుబట్టి పలుకు నప్పుడొక పదమునందలి వర్ణములు తడబడుచుండును, లేదా తారుమారగుచుండును అని తెలియుచున్నదిగదా. ఈ కార ణముచేతనే తెలుఁగుభాష మూలద్రావిడభాషనుండి విడివడి ప్రత్యేకభాషగా నేర్పడిన పిదప నెప్పుడో కొంతకాలమునకు ద్వితీయాక్షరము రేఫగా గలిగిన మూలభాషాపదముల

యుచ్చారణమున గొంతమార్పు గలిగి యందలి రేఫము తొలి వర్ణముమీఁదికి దూకివచ్చి దానితోఁ గలియుటచేఁ బదాదియందు రేఫసంయుక్త వర్ణములు గలుగుట తటస్థించినది. పదాదియందలి రేఫసంయుక్త వర్ణముతోఁ గూడిన రూపమే ప్రాచీనము. ఉచ్చారణ సౌకర్యమునకై నడుమ నచ్చు చేరుటచేతనే తక్కినరూపము లేర్పడిన వనరాదా యన్నచో, పదాదియందు సంయుక్తాక్షరము గలుగుట యీ భాషలకు సహజలక్షణము కాదనియు, పదాదియందే కాక పదమధ్యమందైనను ద్విత్వాక్షరములు తక్క స్పర్శవర్ణములకు పరస్పర సంయోగము పొసగదనియు నిదివరకే సూచింపఁబడినది గదా! ఇదియే సహజ లక్షణమని చెప్పగలుగుట యెట్లన్నచో నీ భాషలలోని పదజాలముయొక్క వైఖరిని పరిశీలింపుఁడనియే చెప్పవలసియుండును. ఇతర ద్రావిడభాషలలోనేకాదు. తెనుఁగునందలి కోశములను బరీక్షించినను దేశ్యపదములలో నీ రేఫసంయోగముతక్క సంయుక్తాక్షరమాదియందుగల శబ్దము లేమియు గానరావు. ఇంతేకాక సజాతీయములగు భాషలన్నిటిలో నీ శబ్దములు సంయుక్త వర్ణ రహితములై కనఁబడుచుండగా నొక్క తెనుఁగుననే యిట్లుండుటనుబట్టి యిది యీ భాషకు విలక్షణమని తలపవలసినదేకాని యొక్క భాషలోమాత్రమే కనఁబడు విశేషలక్షణమును సజాతీయభాషల కన్నిటికి సహజలక్షణమనికాని యది దాని ప్రాచీనతకు చిహ్నమనికాని గ్రహించుటయెంత మాత్రమును యుక్తముకాదు, ఈ భాషలలోని శబ్దములు సామాన్యముగా రెండు మూడక్షరములకు మించినవిగా

నుండవు. సంస్కృతమందువలె దీర్ఘసమాసములు లేవు. భావ భేదములను సూచించుటకుగా నొక ధాతువునకు, లేదా శబ్దమునకు నొకటొక ధాతువును, లేదా శబ్దమును జేర్చుటయే వీని సంప్రదాయము. అట్లుగా 'శబ్దపల్లవము'లను కల్పించుటయె యీ భాషలకు సహజలక్షణముగాని దీర్ఘసమాసములను గూర్చుటకాదు.

'కొను' ధాతువు సహాయమువలన ఎత్తికొను, మార్కొను. మూర్కొను, చేకొను మొదలైన వెన్నో కలవు. అట్లు పడు-కలపడు, నిలబడు. విడిపడు, ఒడబడు మొ. తెంచు-పఱదెంచు, తోతెంచు. అరుదెంచు, నేతెంచు మొ. అడు-మాటాడు, వేటాడు, కొల్లాడు, పోలనాడు, పెనగాడు, చెరలాడు మొ. ఇట్టే యనేకములు

ఇప్పటి భాషలో సంయుక్తాక్షరములతో కూడిన పదములు కొన్ని కానవచ్చినను అవి సామాన్యముగా ఉచ్చారణ వేగమునుబట్టి కలిగిన యల్లోపముచే ఏర్పడిన అర్వాచీనరూపములు. ఉదా కలికి-కల్కి, ముల్కి, కోర్కి, చెలువు-చెల్వు, గెల్వు, కల్వ, కుసురుదు-కుసుర్చు, అమర్చు, కూర్చు, చేర్చు మొ. తరుగు-తర్గు (తగ్గు), మాఱుమాట మార్మాట, నీరువాయి-నీర్వాయి మొ

పదాదియందు రేఫ సంయుక్తాక్షరము గలిగిన పదములిట్టి యల్లోపముచే నేర్పడినవి కావు. కాని యవి ద్వితీయాక్ష

రము రేఫగానున్న ప్రాచీన పదములలో గలిగిన రేఫప్లుతి వలన నేర్పడిన యర్వాచీన రూపము లనుటకు సందేహము లేదు. ఇది తెలుఁగుననే విశేషముగాఁ గానవచ్చుటచే నిది దీని కొక విశేషలక్షణ మనవలసి వచ్చినది. ఇదియొక కాలమున భాషలో బయలుదేరినను ఇది సామాన్యముగా ద్రావిడ భాషా సంప్రదాయమునకు విరుద్ధమగుటచేతనే కాఁబోలు నిటీవల నిది యీ భాషలోకూడ నిలువక మరల మార్పు నొందుట తటస్థించినది. కావుననే పదాది రేఫసంయోగ మీ భాషలో నిటీవలి కాలమున నంతరించినది. అనఁగా మరం-మ్రాన్రై, మరల మ్రానైనది. విరల్-వ్రేలై, మరల వ్రేలైనది. ఇట్లే భాషలోని పదాద్యక్షరములోని రేఫము లోపించుటచే నా పదము లన్నిటికిని ద్వైరూప్య మిప్పుడు సిద్ధించినది. పదాదియందు సంయుక్తాక్షరము నిలుచుట యీ ద్రావిడభాషా సంప్రదాయ మేమాత్రమును కాదని చెప్పఁదగియుండుటచేతను-అందుకు నిదర్శనముగా నే యితర భాషలోకాని, యీ తెలుఁగులోనే కాని మఱి యే పదములోని ఆదిని సంయుక్తాక్షరము కనఁబడక పోవుటచేతను కొన్ని తెనుఁగుపదముల మొదట చేరిన యీ రేఫసంయోగము మధ్యకాలమున నెప్పుడో వచ్చి, సహజ సంప్రదాయ సిద్ధము కాకపోవుటచే మరల నంతరించినదని తలపవలసినదే కాని యది యీ తెనుఁగుపదముల పురాతనత్వమునకు చిహ్నముగా గ్రహింపఁగూడదు. ఆ పదముల పరిణామక్రమము నించుక పరిశీలింతము :

త.	మ.	క.	తు.	తె.		ధాతువు.
మరమ్	మరమ్	మర		⌊మాను	మాను	మర్
విరల్	విరల్	బెరల్	బెరల్	⌊వేలు	వేలు	విఱు = *to expand*
పొటుదు	పొట్ దు	పొట్టు		⌊పొద్దు	పొద్దు	పొట్ = *to shine, shoot*
తిరుప్పు	తిరుప్పు	తిరుపు		⌊తిప్పు	తిప్పు	తిర్ = *to turn*
పరు త్తి	పరు త్తి	పత్తి		⌊ప త్తి	ప త్తి	పర = *to spread*
పొటిల్		పొటిల్		⌊పోలు	పోలు-వోలు	——
పరమ్బు	పడరు	పబ్బు		⌊పమ్ము	పంబు	పర = *to spread, extend*
పమ్బు		పర్బు		పంబు		*etc.*
				పర్వు		
ముటంగు	ముటఙ్ఙు	మొటగు		⌊మోగు	మోగు	ముట
				⌊మోయు		
				మొరయు		
				మొరుగు		
కురుడర్	కుర్డర్	కొర్డ	కురుడ	⌊గుడ్డి	గుడ్డి	——

కుఱుంగు		కుఱ్ఱు కుఱుగు కుగ్గు కుంగు	క్రుంగు	కుంగు	కుఱు = *to bend, shrink*
కొఴు కొఴుప్పు	కొఴు కొఴుప్పు	కొబ్బు కొవ్వు కొబ్బు	క్రొవ్వు క్రొవ్వు	కొవ్వు	కొఴు = *to grow fat*
	కఱుగఱు	కర = *on imitative word for some harsh grating sound*	క్రంగు		(ధ్వని విశేషము)
కరై	కరకు-	కరంగు, కరగు = *to be dissolved, to melt*	క్రాఁగు = కాఁగు తపనము		కర = *to melt*
తరువు		తరువు = *grating, scraping*	త్రుప్పు	తుప్పు	తుఱు = *to grate, scrape*

వికృతి యెప్పుడును శబ్దోచ్చారణమును సులభము చేయునేకాని కఠినపఱచదను సిద్ధాంతము చాలవరకు సంగంజసమైనదే. ఆ సిద్ధాంతమునుబట్టి 'గ్రామ్' నుండి 'మరిమ్' 'గ్రేవెల్' నుండి 'విరల్' పుట్టిన వచులు యుక్తియుక్తముగనే కనఁబడుచున్నగాని. వాస్తవస్థితిని తెలిసికొనుటకొకప్పుడింకను లోతుగాఁ బరిశీలింపవలసి వచ్చుచుండును. అనఁగా నానాపదములయొక్క పూర్వచరిత్రను. వాని నిర్మాణక్రమము, మూలధాతు స్వరూపము మొదలగు వానిని గ్రహించి తత్పరిణామక్రమము నన్వేషించినగాని యిదమిత్థమని నిర్ణయింప వీలుపడదు. వీనికి దోడుగా నానాభాషల సహజలక్షణములను గూడ గమనించి పరిశీలింపవలసి యుండును. పదాదియందు సంయుక్తాక్షరము పలుకుట ఈ భాషలలో స్వభావ విరుద్ధము, కష్టతరమునైనను పొఱుదు, పుఱోలు, ముంఱుగు, కొఱుప్పు మొదలగు శబ్దములు ద్రుతతరోచ్చారణముతో వ్యవహరింపఁబడినప్పుడు ఆ ద్వ్యక్షర నడిమి యచ్చు లోపించుట, లేక వర్ణములు తారుమారగుట మొదలగు మార్పులు జరుగుటచే ప్రొద్దు, ప్రోలు, మ్రోగు, క్రొవ్వు మొదలగు రూపము లేర్పడినవి. అట్లేర్పడినప్పుడు పదాది సంయుక్త వర్ణోచ్చారణమందలి కాఠిన్యము పాటింపఁబడదు. కాని యీ భాషను వ్యవహరించువారి కది పరిపాటిలోనిది కాకపోవుటచేతనే కాఁబోలు కాలక్రమమున దేశము మరల జారవిడువఁబడుట తటస్థించినది.

మఱియొక విశేషము : పై శబ్దములందుఁ గొన్నిటిలో ద్రావిడభాషలలో వింతయక్కర మనఁబడు 'ఱ' కారమొకటి

కనఁబడుచున్నది. ఇది తమిళ కన్నడ మలయాళములలో ప్రధానముగ మూలధాతువులందుఁ గానవచ్చుచున్నది. ప్రాచీనభాషలో నీ 'ఱ'కారము రెండవ యక్షరముగా గూడిన శబ్దములలో నిది రేఫముగ మారుట వర్ణములచే పదాదిసంయోగమునకుఁ గారణమైనది. ప్రాఁకు. ప్రోలు ప్రాఁగు. క్రొవ్వు మొదలగు తెలుఁగు శబ్దములు మూలద్రావిడభాషారూపము లైనవో, నందలి తొలి సంయుక్తాక్షరము విడఁదీయఁబడి నప్పుడు పొరుదు, పురోలు, మురగు - మొరగు. కొరవు మొదలగు రూపము లేర్పడును. కాని వీనిలోని రకారస్థానమున నెప్పుడో యిదివఱకాలమున 'ఱ' కారము వచ్చియుండెననుట సమంజసముకాదు. ఒక్క తెలుఁగులో తక్క తక్కిన ద్రావిడ భాషలలో-ముఖ్యముగా తమిళ కన్నడ మలయాళములలో పాటు. పుట్టోలు, మాట్, కట్టి మొదలగునవి మూలరూపములుగాఁ గనఁబడుచున్నవి వీనిపైని ను. అను మొదలగు ప్రత్యయములను, పదములను చేర్చినగాని పై రూపము లేర్పడుటలేదు. ఈ కారణములచే తమిళ కన్నడరూపముల కంటె తెనుఁగు రూపములు ప్రాచీనములనికాని, మూలభాషకు సన్నిహితములనికాని చెప్పుటకు వీలులేదు. ప్రాకృత భాషలలోని యీ సంప్రదాయములు సంస్కృతమునుండి వచ్చినవికావు, ద్రావిడభాషాసంసర్గముచే వచ్చినవియే కావున నీ విచారణలో వాని సామ్యము ప్రయోజనకారి కాదు.

ప్రాయిల్లు, క్రీగాలు మొదలగు సమాస పదములలో గూడ ప్ర, క్రీ రూపములు ప్రాచీనము లనుటకు వీలులేదు. వీని తమిళ కన్నడ రూపములు పట, కీఱ్ (పఱయిల్

కీఱ్ (క్కాల్) అనునవి ద్రావిడ వింతయక్కరమగు 'ఱ' కార
ముతోఁ గూడియున్నవి. ఈ 'ఱ' కారము సామాన్యముగా
'డ' కారముగా తెలుఁగులో మాఱుచున్నది. పఱం = పండు,
కీఱ్ = కేడు. ఈ దృష్టిచేతనే వెనుక వచ్చిన పట్టికలో
'కొఱుప్పు' అను దానిని 'కొడుప్పు' అనియు. 'పొఱును'
అను దానిని 'పొడును' అనియు శ్రీ లక్ష్మణరావుగారు
వ్రాసియుందురు. ప్రొద్దుపొడిచిన దన్నప్పుడు, 'పొడుచు'
లోని డకారమునకు 'పొఱుదు' లోని. లేదా 'పొఱు'లోని
'ఱు' కారమునకు సంబంధించినదే 'అప్పుడు' లోని 'డు'
వర్ణముకూడ 'అ + పొఱుదు' = 'ఆపొఱుదు' లోని 'ఱ'
కారమునకు సంబంధించినదే. కొన్ని శబ్దములలోని 'ఱ'
కారము తరువాతి కాలమున రేఫముగఁగూడ మాఱియున్నను
రేఫము 'ఱ' కారముగ మాఱినదని చెప్పుటకు తెనుఁగుభాష
లోని యీ రూపములు తక్క తక్కిన భాషలనుండి నిదర్శ
నము లగపడవు. కొన్ని సంస్కృత శబ్దములు కన్నడమున
జేరినప్పుడా శబ్దములలోని ట, డ, త, ర కారములకు బదు
లుగా కన్నడమున 'ఱ' కారము వచ్చినట్లు (అట్లు వచ్చినదని
కేశిరాజు శబ్దమణిదర్పణమునఁ జెప్పియున్నాఁడు)
తెలుఁగునందలి యీ పదాద్యక్షరమందలి రేఫము తమిళ
కన్నడములలో 'ఱ' కారముగా మాఱియుండకూడదాయను
వాదము యుక్తియుక్తముగాఁ గనఁబడినను సమంజసము కాదు.
దేశ్యశబ్దములలోను, అందును పెక్కు భాషలలోను 'ఱ'
కారముతోఁ గూడిన శబ్దము కనఁబడినప్పుడది యే దాని
ప్రాచీనరూపముగాఁ గ్రహించుట న్యాయముగాని, ఒక

భాషలలో గొన్నిరూపములలో మాత్రమే కనఁబడు రకార డకార, ళకారాదుల స్థానమున నీ 'ఱ' కార మిటీవల వెలసిన దనుట యుక్తముగా లేదు. శకట రేఫమునుగూర్చిన ప్రతివాదమే దీని కుపలక్షణము.

ఈ ఱకారముతోఁబాటే యీద్రావిడభాషలకుఁ బ్రత్యేక వర్ణమని చెప్పఁదగిన శకటరేఫమనునది మఱియొకటి కలదు. దీనికి పూర్వకాలమున స్వతంత్రోచ్చారణ ముండి, యది క్రమముగ నశించి రేఫముయొక్క యుచ్చారణమును. దీని యుచ్చారణమును సమము లగుటచేఁ బూర్వము బండిరాగ బలుకఁ బడిన శబ్దములు క్రమముగ రేఫయుతముగ బలుకఁ బడ జొచ్చెననియు, నా కారణముచే బండి 'ఱ' యుతరూపములు ప్రాచీనములుగ నిశ్చయింప వలయుననియు వారు చెప్పియున్నారు. తెనుఁగున రేఫ శకట రేఫముల భేదమంతగా నిటీవల పాటింపఁబడక పోయినను, అప్పకవి మొదలగు లాక్షణికులు రేఫ శకట రేఫములతోఁ గూడిన పదముల పట్టికను తయారుచేసి వాని భేదమును నిలువఁ బెట్టఁజూచి యున్నారు. యతిప్రాసములలో వీని భేదమును పాటింపని వారిని లాక్షణికులు కవులుగా గ్రహింపక తూలనాడినారు. అట్లు యైనను యతిప్రాసములలో సంకరము గలిగినప్పుడట్టివానికి వైరూప్యమును సాధించి సరిపెట్టుకొనినారు. ఈ రీతిగా తెనుఁగుపదములలోని రేఫ శకట రేఫములను నిర్ణయించుటకు నిష్కృష్టమైన సాధనము లేదు. వాని నితర ద్రావిడ భాషా పదములతోఁ బోల్చిచూచుటయే కొంతవరకైన నిశ్చయించుటకు సాధనము కాగలదు. అట్టిసందర్భములలోఁ గూడ తెనుఁగు

రూపములలో శకట రేఫము కనఁబడినంత మాత్రమున వానిని ఇతర భాషా రూపములకంటెఁ బురాతనములుగా గ్రహింపవలెనని వాదించుచు. తెనుఁగులో నన్నయ్యాదుఁ బూర్వకాలమునందే యంతరించిన 'ఱ' కార మితర భాషాపదములలోను, మూల ధాతువులలోను గూడ గనఁబడినప్పుడు, ఆపదములనే ప్రాచీనములుగా గ్రహింపక, తత్స్థానమున వచ్చిన రేఫయుక్త పదములనే ప్రాచీనములుగా గ్రహింపవలెననుట యెట్లు పొసగును? ఇచ్చట నుచ్చారణసౌకర్యమును స్వరసంప్రదాయమునకుఁ బ్రాధాన్య మిచ్చితిమని వారు వాదింపవచ్చునుగాని యది యితర సంప్రదాయ విరుద్ధము కాకుండిననే సమంజసము కాగలదు. కాని అట్లు గానిచో గ్రాహ్య మెట్లగును? ఇక శకటరేఫము విషయమున గూడ తెనుఁగుననే యనేక పదములకు ద్వైరూప్యము గలుగుటచేతను ఇతర భాషా రూపములతోఁ బోల్చి నిర్ణయింపవలసియుండునేకాని, యీ భాషారూపములను బట్టి యేది రేఫమో నిర్ణయింప వీలు లేదు. పెక్కు భాషలందు శకటరేఫమున్నప్పుడుగాని, లేదా యితర కారణములను బట్టి యిది శకటరేఫమని నిర్ణయింపఁ దగినపుడు గాని యా రూపము ఏ భాషలో నున్నను ప్రాచీనమే యగును. మేర యను నర్థముగల 'వఱపు' అనునది వారు గ్రహించిన వానిలో నొకపదము. దీని విషయముననే యీ చిక్కు విశేషముగా గనఁబడుచున్నది. దీనికి ద్వైరూప్యము కలదని లక్ష్మీనారాయణీయ నిఘంటువు ఆంధ్రపద పారిజాతమును బట్టి తెలియుచున్నది. కావున నిది మొదట సందేహమునకుఁ గారణము. ఈ సందేహమును దీర్చుకొనుట

కితర భాషారూపములను బరిశీలించినచో, తమిళమునందలి వరై, వరైప్పు, వరమ్బు లనువానిలోను, కన్నడమందలి వరె, బరె, వరెగం (*Limit, boundary, until, upto, as far as*) అను పదములలోనుగూడ రేఫమే కానవచ్చుచున్నది. ఇంతేకాక కన్నడ నిఘంటుకారుఁడగు కిటెల్ వరె-వరెగం అనుపదమును దేశ్యముగాఁగూడ గ్రహింపలేదు ; తద్భవ శబ్దముల క్రిందఁ జేర్చినాఁడు. ఇంతేకాక దీనికి "నీళ్లు వచ్చుటకేర్పరచిన కాలువ, లేక పొలములోని కట్టవ" అను నర్థముగల 'వరవ' అను శబ్దముతో సంబంధము కల్పించినాఁడు, ఇట్టి సందర్భములో తెనుఁగుననే ద్వైరూప్యము గలిగి యితరభాషలతో పొందికలేకయున్న యీ 'వఱకు' అను శకటరేఫ యుక్తరూపమును గ్రహించి యిదియే మూలరూప మనికాని, దీని వలన నాభాషయొక్క పురాతనత్వము ద్యోతకమగుననికాని యెట్లు చెప్పనగును ? మఱియొక దానిని గ్రహించిచూతము : 'తేఱు' అనుదాని కఱవమున రేఫయుక్తరూప మున్నట్లు చెప్పినారు. కాని ఆ భాషలో 'తేఱు' (*To be clarified, to become clear as water*) అని శకటరేఫయుక్తరూపము కలదు. కన్నడమున మాత్రము 'తేరు' (*To reach, as the end*) అని రేఫమే కనఁబడుచున్నది. తెనుఁగునగూడ తేటపడు అనునర్థమున 'తేరు' రూపము కలదని ఆంధ్రపద పారిజాతము సూచించుచున్నది. ఇప్పుడు నిర్ణయమెట్లు? 'వరకు' శబ్దము వలెనే ద్వైరూప్యమునుబట్టి త్రోసిపుచ్చుటా అనివిచారింపగా పైని దీని కర్థముగా జెప్పబడిన 'తేటపడు' అను శబ్దమే ఇందలిది శకటరేఫ మని మనకు సూచించుచున్న దన

వచ్చును. 'తేట' అనునది 'తేఱ' అనుదానినుండి యేర్ప
డిన నామవాచకరూపమే. శకటరేఫముద్విత్వమై యుచ్చరింప
బడినపుడు 'ట్ట్ర' అనుదానివలె పలుకఁబడుట ద్రావిడభాషా
సంప్రదాయములలో నొకటి. తమిళమలయాళముల నామవా
చకరూపము 'తేఱ్ఱు' అనునదే. ఇది యుచ్చారణలో 'తేట్ట్ర'
యై తుదకు 'తేట' యైనది. ఈరూపమే తెనుగుననే కాక
కన్నడమునగూడ 'తేట' అని నిలిచియున్నది. కావున శకట
రేఫముతోఁ గూడినదే యీ శబ్దమని మనము నిర్ణయింప
వచ్చును. కాని దీని ప్రాచీనత తెలుగు రూపమును బట్టి
మాత్రమే నిర్ణయింపనగునా? శకటరేఫము టవర్ణముగా బరి
ణామమందిన రూపము లీ భాషలలో ననేకములు గలవు. cf
చిఱు-చిట్టి, చిటి; మాఱు-మాట ; కఱచు-కాటు ; మిఱ్ఱు-
మిట్టు, మెట్టు; కుఱు-కుట్టి, కుట్టుసురు; ఊఱు-(తె. నీరూరు,
త. ఊఱు-ఊఱ్ఱు-ఊట్టు్ర) ఊట మొ.' ఎఱుపు' శబ్ద విషయము
సందేహమే. తమిళ కన్నడముల రెంటను రేఫమే కనఁబడు
చున్నది. తెనుఁగులోవలె నా భాషలలో నుచ్చారణభేదము
సంపూర్ణముగా రూపుమాసిపోలేదని తద్భాషావేత్తలుచెప్పు
దురు. కన్నడమున ఎరె అనగా ఎఱ్ఱనిరంగు(*Dark red colour*)
అనియే కాక తమిళమున 'ఏఱువై' అనగా రక్తము, రాగి
(*Blood, copper*) అను నర్థములు కలవు. దీనినిఁబట్టి రక్తము,
రాగి అను వానినిబట్టి వానికి గలరంగు అను నర్థము వచ్చిన
దేమోయనియుఁ దలఁపనచ్చును. మొత్తముమీఁద తెనుఁగు
లోని 'ఎఱుపు' శబ్దము అఱవమునందలిదానికంటె శకటరేఫ
మునుబట్టి పురాతనమని మాత్రము చెప్పుట కవకాశ మే

మాత్రమును లేదు. తీఱు శబ్దమునకును ద్వైరూప్యము కల దని తెలుఁగు లాక్షణికుల మతము. నిర్ణయించుటకు వేరు సాధనములు లేవు.

ఇక రెప్ప, రెక్క, రేయి మొదలగు తెలుఁగుశబ్దముల పురాతనత్వమును సాధించుటకుఁగా తమిళ భాషా సంప్రదాయము సహాయముగా గైకొనబడినది. ఈద్రావిడ భాషలలో పదాదియందు సంయుక్తాక్షరము రానట్లే పదాదియందు రేఫ అకార లకారములు కూడ రావు. తమిళ కన్నడములలో నట్టి శబ్దము లేవియు లేవు, సంస్కృతాద్యన్య భాషలనుండి యట్టి పదము లీ భాషలోఁ బ్రవేశించినచో వాని మొదట అ, ఇ, ఉ లలో నేదో యొక వర్ణము చేర్చబడును. రాజ అను శబ్దము తమిళమున 'అరశన్' అయినది. రామ-ఇరామన్, లోకం-ఉలగం మొ. ఈ పద్ధతినిబట్టి విచారింపగా, అనగా సంస్కృతాద్యన్య భాషాపదము లీ భాషలో బొందుమార్పుల ననుసరించి చూడగా రకారముతోఁ బ్రారంభింపఁబడిన రూపము తరువాతిదియనియు తెలియవచ్చుచున్నదన్న మాట నిజమే. అట్లగుటకు కారణ మేమనగా — రకారాది శబ్దముల నుచ్చరించుట ప్రాచీన ద్రావిడజనులకు నలవాటు లేకుండుటయే. కావుననే యట్టిపదము లా భాషలలో లేకుండుటయే సంభవించినది. అట్టి పదము లితరభాషలలోనివి వారు వ్యవహరింపవలసి వచ్చినపుడు ఉచ్చారణసౌకర్యమునకై అకారేకారోకారములను ముందుఁ జేర్చికొని యుచ్చరించెడివారు. ఇది తమిళమున మాత్రము నిలిచినది. తక్కిన భాషలలోను, దెనుఁగున నంతరించినది. రథము >అరదము మొదలగువానిని

బట్టి తెనుఁగున నొకప్పుడీ సంప్రదాయ ముండెననవచ్చును. స్కూలు అను నింగ్లీషు పదమునందలి తొలి సంయుక్తాక్షర మును పలుకలేక, యుచ్చారణ సౌకర్యమునకుఁగా 'ఇ'కార మునుజేర్చి పలుకుట తెనుఁగునను గలదుగదా! స్కూలు–ఇస్కూలు; తమి. స్టేషన్–ఇస్టేషన్. ఇట్లు అన్య భాషా పద ముల విషయమునఁ గలిగిన సంప్రదాయము దేశీయపదముల పట్లగూడ నన్వయింపగూడదు. అట్లుచేసిన నాసంప్రదాయమే తారుమారగుట తటస్థించును. ఏలయన దేశీయ పదములలో రకారాదులే యుండవుగదా! అయితే పదాదిని రేఫము పలు కుట ద్రావిడులకు అలవాటులేకపోవుటచేతనే యట్టి పదము లీ భాషలలోనే లేవని చెప్పఁబడినచో తెనుఁగులో రెప్ప, రెక్క మొదలగు పదము లెట్లు వచ్చినవి? అను ప్రశ్న బయలుదేరక మానదు. దీనికిని వెనుకటి క్రారతోఁగూడిన శబ్దముల విషయమందు వలెనే ద్వితీయాక్షరము రేఫగా గలి గిన శబ్దములలోని రేఫ వర్ణప్లుతియే ముఖ్యకారణము. ఇందు వలననే తెనుగున పదాదిని రేఫసంయుక్తవర్ణము గలిగినట్లే, రేఫలకారములతో గూడిన శబ్దములుకూడ బయలుదేరినవి. ఇఱక్కై > ఎఱక్కై > ఎఱక > ఱెక్క; ఇరవు–ఇరా > రేయి; ఉరల్ > ఒరల్ > రోల్ > రోలు, ఇరట్టి (ఇరండు) > రెట్టి–రెట్టింపు మొదలగునవి. తెనుఁగు కన్నడ కోశములలోఁజూచి నచో నిట్లు రకారాదులగు దేశీయ పదములు పదిపదునైదు కంటె నెక్కుడుగా కనఁబడవు. కొన్నిటికి మూలరూపములు తెలియక పోయినను, అవి అన్నియు నజాది పదములలో ద్వితీయ స్థానమందున్న రేఫ వర్ణముయొక్క ప్లుతిచే నేర్పడిన

వనియే చెప్పవచ్చును. లకారాదిపదములు నట్టివేయైయుండు ననుటకు సందేహము లేదు. మిగిలినపదము లనేకములున్నను అవి సంస్కృతాద్యన్య భాషలనుండి వీనిలో సంక్రమించినవై యుండునేకాని దేశీయములు కావు.

శ్రీ లక్ష్మణరావుగారి రేఫాది పదముల విషయమున నీ వాదము నెఱుగనివారు కారు. కావుననే 'ఇరప్పై' మొదలగురూపములే మొదటివనియు, వానిలోని మొదటి యచ్చులు కప్పగంతులువేసి రకార మందలి యచ్చుతోఁ గలిసి రెప్ప మొదలైన రూపములు సిద్ధించెనని తలఁచు లాక్షణికులు గలరనియు చెప్పుచు, నది స్వభావ విరుద్ధమైనదని వారి తాత్పర్యమగుటచే, దానిని త్రోసివేసి రేఫాంత తెలుఁగు శబ్దముల పురాతనత్వమును సాధింపఁగడఁగిరి. అచ్చు పూర్వమందుగల రేఫ ముచ్చారణకు సులభమని, దానిని రేఫాదిగా మార్చుట కఠినమగుటచే నస్వాభావికమని వారి మతము. నిజమే కావచ్చును గాని, వర్ణోచ్చారణమందలి సౌలభ్యా సౌలభ్యములు ఆ యా భాషలను మాటలాడు జనుల యుచ్చారణ సంప్రదాయములు, నలవాటులను బట్టియుండును. ఇతర భాషా సంసర్గముచే నివి యొక్కొక్కప్పుడుమారినను మారవచ్చును గాని సహజ సంప్రదాయములు కొన్ని యుండుననుటకు సందేహము లేదు. ఒక దేశమునందలి వారికి, లేదా ఒక భాష మాటలాడు వారికి కఠినముగాఁదోఁచిన యుచ్చారణము మఱియొక భాష మాటాడువారికి సులభముగనే కనబడి వారికి పరిపాటి యగు సంప్రదాయ మగుటయుఁ దటస్థింపవచ్చును. వీని నన్నిటిని గమనించి కాని యే నిర్ణ

యమునకును రాలేము. సంస్కృతమునందు సహజములగు మహాప్రాణాక్షరములు ద్రావిడభాషలలో లేవు. ఆ వర్ణములతోఁ గూడిన పదముల నెరువు తెచ్చుకొన్నప్పుడుగూడ నా మహాప్రాణములను దొలఁగించి వానిస్థానమున నల్పప్రాణములను జేర్చుకొనియే వీరు గ్రహింతురు. అనఁగా సంస్కృత భాషా వ్యవహర్తలు సులభముగా నుచ్చరింప నలవాటుపడిన మహాప్రాణములను ద్రావిడ భాషలను వ్యవహరించు జను లుచ్చరింప లేకపోయిరనుట. కాని యిందలి శకటరేఫ, 'ఱ' కారములను వింత యక్షరము లితరులకు కష్టతరముగాఁ గనబడును. హిందూస్థానీ భాషలకు సహజమగు కంఠ్యాకారోచ్చారణ మితర భాషల వారికి కష్టతర మగును గదా. సంస్కృతమందలి 'గౌః' మొదలగుశబ్దములలోని 'గ' కారము గ్రీకు భాషలో సన్నిహిత సంబంధ మేమాత్రమును లేని 'బ' కారముగా మాఱినది. సం. గౌః-గ్రీకు. 'బౌస్' (*bous*) కావున నుచ్చారణ సౌలభ్యము కొఱకుగా గలుగు మార్పుల విషయమైన సామాన్య సూత్రములు కొన్ని సహజములు, నుచితములుగనే కనబడినను, ఆ యా భాషలలోఁ బ్రత్యేక సంప్రదాయము లెట్టివో యను విషయమును గూడ తత్తద్భాషాలక్షణపరిశీలనము మూలముగాఁ దెలిసికొననిదివానిని సర్వత్ర అన్వయింపఁగూడదు. 'ఇరవు' నుండి 'రేయి' పుట్టిన దనుట స్వభావ విరుద్ధమని వారి తాత్పర్యముగాఁ జెప్పుటయే కాక 'ఇరాత్రి'నుండి సంస్కృతమందలి 'రాత్రి' పుట్టినదన రాదా? యని కూడ లక్ష్మణరావుగారు ప్రశ్నించుటచేతనే ఇంత విపులముగా నీ విషయమును జర్చింపవలసి వచ్చినది.

'రాత్రి' శబ్దము సంస్కృతమనుట ప్రసిద్ధము. రేయాదిశబ్దముల మచ్చట ప్రవేశపెట్టుట ప్రాచీన ద్రావిడ సంప్రదాయవిరుద్ధము. కావున 'రాత్రి' శబ్దమును నీ యుచ్చారణ వలసినప్పుడు దాని కొక అచ్చును ముందుఁ జేర్చి 'ఇరాత్రి' యని చేసి యుండును కాని 'రేయి' శబ్దము అట్టి యాభాసరూపము కాదే. వీరి యుచ్చారణ సంప్రదాయమును బట్టి సరి భాషలో రేఫము పదాదిని రాకూడదుగదా. తెలుగుభాషకూడ అరవములో పాటు ద్రావిడకుటుంబమునకే చెందినదని చెప్పుచు నా భాషలో మాత్రము దేశీయముగ 'రేయి' అను రేఫాది శబ్దము కలదని. ఇదియే మూలభాషను సన్నిహితముగాని, అరవమునందలి 'ఇరవు' అను దానికంటె ప్రాచీనమని, సజాతీయమగు తెలుఁగుభాషయందలి 'రేయి' అనుదానిని పలుకలేక సౌలభ్యము కొఱకు ఆదిని 'ఇ' కారము చేర్చఁబడినదని. ఈవిధముగానే అరవముకంటె తెనుఁగునకే పురాతనత్వము నాటఁగలుగుచున్నదని వాదించుట యెట్లు? కావున వారిచ్చిన రేఫాదులగు తెనుఁగురూపములు పురాతనములు కావు, అరవరూపము లాధునికములు కావు అయితే వస్తుస్థితి ఏమి? వీనివ్యాసభేదమునకు నిర్ణాయక మెయ్యది యని యడుగవచ్చును. ద్రావిడసంప్రదాయమును బట్టి రేఫాది శబ్దములు ప్రాచీన భాషలో నుండవు గదా. కావున దేశ్యశబ్దములు రేఫాదులు తెనుఁగునను ఉండకూడదు. ఇప్పు డగపడుచున్న శబ్దములన్ననో ఇవి యిటీవలి కాలమున నేర్పడియుండవలయును. తమిళ కన్నడ శబ్దములతో వీనిని బోల్చి యివి యీ భాషలలో నెట్లు ర్పడి యుండునో, వీని మూలధాతువు లేవో పరిశీలించినచో

దెలియనగు వాని పరిణామ క్రమమునుబట్టి మనము వీని పౌర్వాపర్యమును నిర్ణయింపవలసి యుండును. 'రేయి' శబ్దము సంస్కృత 'రాత్రి' శబ్ద భిన్నమన్నచో దీనినుండి తమిళమందలి 'ఇరాతిరి' గాని, 'ఇరవు' గాని వచ్చె ననుట కభ్యంతరము లేదు. కాని ఇది దేశీయ పదమే యన్నచో దీనిని తమిళమునందలి 'ఇరా' శబ్దముతోను, ఈ రెంటిని తమిళ కన్నడాంధ్ర తుళు భాషలు నాలుగింటిలోను గాన వచ్చు ఇరుళ్, ఇరులు, ఇర్లు మొదలగు రూపములతోను బోల్చి చూడవలసియున్నది. వీనికిఁ గల చీకటి, అంధకారము అను నర్థమును బట్టి 'ఇరవు' అను శబ్దముతో సంబంధము కల్పించినచో ఇరా, ఇరవు అనువాని ప్రాచీనత్వము, ఇరా> రే > రేయి అను తెనుఁగు శబ్దముయొక్క నిష్పత్తిక్రమము తెలియనగును. ఇరుళ్ అను పద మీ నాలుగు భాషలలో గూడ గనబడుచుండుటచే నిదియే మూలభాషకు సంబంధించిన దనవలసి యున్నది. దీనికి సంబంధించియే ఇరా, ఇరావు, ఇరవు అనున వేర్పడియుండు ననుట సంభావ్యము. 'ఇరా' నుండి తెలుఁగులో 'రేయి' తరువాతి కాలమున నేర్పడి యుండును. ఈ వర్ణప్లుతి యనునది తక్కిన భాషలలో కంటె తెనుఁగున నేదో యొక కాలమున ప్రబలమై యున్నట్లగపడుచున్నదని యిదివరకే గ్రహించితిమి గదా.

ఇట్లే తెనుఁగున రేఫాది పదముల యర్వాచీనత్వము ఈ భాషలలోఁ గనఁబడు సజాతీయ మూలశబ్దములు, లేదా ధాతువులనుండి వాని పరిణామ క్రమము నన్వేషించినచో వ్యక్తము కాగలదు. ఉరల్ > ఒరల్ > రోలు అయినది.

గాని 'ఱోలు' ఉఱోలు-ఉరలు కాలేదు. cf. త. ఉరల్, మ. ఉరల్ ; క. ఒరళు; తుళు. ఒరల్. ఇట్లిది యీ నాలుగు భాషలలోను సమానరూపము గలదై యున్నది. ఒక్క తెలుఁగులోనే 'ఱోలు' అయినది. దీనికి మూలధాతువు త. ఉరళ్ ; క. మ-ఉరుళ్. తెనుగున గూడ ధాతువు ఉరలు-ఉర్లు అనునదే. ఇది తిరుగు, భ్రమించు అను నర్థముల గలదు. ఉలూఖల మన్న యర్థమున తెనుగున 'ఱోలు' అని శకట రేఫముకూడ నేర్పడినది. కాని యితర భాషలలో దేనిలోను శకటరేఫము లేకుండుటచేతను, మూలధాతువు రేఫసహితమే యగుట చేతను 'ఱోలు' అను రూప మపభ్రంశ మనవల యును. తెలుగులో శకటరేఫముతో నీ 'ఱోలు' శబ్ద మగ పడుచున్నది. గనుక ఇదియే పురాతన రూపమని, తక్కిన నాలుగు భాషలలో రేఫయుక్తములై యున్న వర్వాచీనము లని వాదించిన నెంత యాభాసముగా నుండునో విచా రింపుడు.

త. ఇఱక్కై->ఱెక్క. తమిళమునందలి 'ఇఱక్కై' అనునది తెనుఁగు 'ఱెక్క' అనుదానినుండి యేర్పడిన యర్వా చీన రూపమని తమిళ నిఘంటు చూపుచున్నది. అనగా 'ఱెక్క' అను తెనుఁగుపదము తమిళమున నిటీవల సంక్ర మించిన దనుట. మూలభాషనుండి యేర్పడినవి కాక ఒక భాషలోని పదములు మఱియొక భాషలో నాయాకాలముల సంక్రమించుచుండుటయు గలదు. కాని తమిళమునందలి దీని ప్రాచీనరూపము 'ఇఱకు' అనునది. త. ఇఱకు; మ. ఇఱహు; క. ఎఱకె. తెనుఁగునగూడ 'ఎఱక' శబ్దమున్నది. తెనుఁగున

తెక్కిన భావములతో పాటు తొలి కాలమున నేర్పడియున్న 'ఎర్' అను ధాతువునుండియే తరువాతి కాలమున సరళప్రక్రియచే 'ఎక్కు' అను రూప మేర్పడినది. కన్నడమున 'ఇఱక్కు' అని తమిళమునకు మేయక్క ఈ సందర్భములో తెలుగు 'ఎక్కు' తమిళ 'ఇరక్కు' యొక్కవని. తెలుగురూపము తమిళము కాని కంటె ప్రాచీనమని చెప్పిన చెప్పవచ్చును గాని ఏవిధి తెలుగుభాషయొక్క పురాతనత్వము మాత్రము సాధింపను కానేరదు. ఈ 'ఎఱక' అను శబ్దము క. 'ఇరంకు'. తె. క. ఎఱఁగు, మ. 'ఇఱఁగ్గు' అను ధాతువునుండి యేర్పడి యుండును. దీనికి క్రిందికి దిగుట (To descend, get down, to alight) అని యర్థము. 'ఎఱక' లు పక్షులు దిగుటకు ఉపయోగించునవి గావున నాధాతువునుండి యీ శబ్దము వచ్చి యుండునని తెలియనగును. 'ఎఱఁగు' - ప్రాలు. నమస్కారము 'Prostrate' అను నర్థములును గలిగినవి.

తెనుఁగునందలి మఱికొన్ని ద్రావిడ శబ్దములు, వాని ప్రాచీన రూపములు —

తె. రెండు, త. ఇరణ్డు, క. ఎరడు, తు. రడ్డు-ధాతువు-ఇర్, ఇప. *cf.* తె. ఇరువురు, ఇరుగడ, ఇర్నూరు > ఇన్నూరు మొ.

తె. రాయి; త. అరై క. అరె. ధాతువు - అరె, అరై (*To grind, pulverise*) *cf.* తె. రాయు, అరుగు. అరుగదీయు.

తె. రేగు, రేచు. రేపు=పైకెగురగొట్టు *cf.* తె. ఎగురు, ధాతువు—త. క. మ. – ఎట్ (*To rise, stand up etc-*) *cf.* తె. ఎత్తు, ఎక్కు, ఎగయు మొ. క. ఎట్తర, ఎచ్చు మొ.

తె. రేవు-ధాతువు-ఇట్ > డిగు > దిగు. cf. త. ఇఱంగు.

తె. రుబ్బు, త. మ. ఉరై, ఉరె (*to grind*) క. ఉర్దు (*to rub on.*) తె - రుద్దు. క, ఒరెగల్; త. ఉరై గల్; తె. ఒరగల్లు-ఒరపిడిరాయి.

రోజు, రొట్టె, రుసుము, రవీసు, రుజువు, రుమాల్ మొదలగు రేఫాదిశబ్దములు విదేశీయ భాషలనుండి ఎరువు తెచ్చుకొనినవిగాని దేశ్యములుకావు,

దీనినిబట్టి తెనుగునందలి రేఫాదిశబ్దములు లా భాషలోని కెట్లు వచ్చినవో, అరవకన్నడ మలయాళ తుళురూపముల కంటె వాని పురాతనత్వ మెంతవరకు సాధింపనగునో గ్రహింపవచ్చును.

ఇక తెనుఁగునందలి నాలుక-నాల్క యను రూప ములు శ్రీ లక్ష్మణరావుగా రనినట్లుగా తమిళము నందలి 'నాక్కు' అను దానికంటె పురాతనములు కావచ్చును. 'నాక్కు' అనుదానికి 'నా' అనికూడ మఱియొకరూపముకల దు. కాని నాలుక (*tongue*) అనునర్థమున మిక్కిలి పురాతనపు టరవమున 'నాల్కురి' అను రూపముండెననుట పొరపాటుగా గనఁబడుచున్నది. వారు చూపిన పొనరర్ ఆఱ్ఱుపడై యను గ్రంథమున గల 'నాల్కు' అను శబ్దమునకు నాలుగు (*four*)

అని యర్థమేకాని నాలుక అను నర్థమున ఈ శబ్దము తమిళ భాషలో లేదని తద్భాషావేత్తలు చెప్పుచున్నారు. అచ్చట రథమునకు నాలుగశ్వములను బూన్చుసందర్భమున 'నాల్కు' శబ్దము ప్రయోగింపఁబడినది. 'నాలుక' అనునర్థమున తమిళము, మలయాళముల 'నా' 'నాక్కు' అను రూపములే కానవచ్చుచున్నను, కన్నడ తుళుభాషలలో 'నాలగె', 'నాలాయి' యను రూపము లగపడు చుండుటచే నీ 'ల' కారముకూడ మూలశబ్దములో నుండియుండు నని యూహించుట కవకాశము లేకపోలేదు. తెలుగున 'నాలు' అను ధాతు వంతరించిపోయినను తమిళమున 'వ్రేలాడు' (*to hang, to be suspended,*) అనునర్థమున నాల్–నాలు అను ధాతువు నిలిచియున్నది. దీనినుండియే 'నాలుక' వచ్చి యుండును. 'నాయి' (కుక్క) శబ్దముకూడ దీనినుండియే వచ్చినదని చెప్పుదురు. దీనికి తెనుఁగులో వ్యవహార మంతగా లేదుగాని నన్నిచోడుడు తెనుగు కవిత్వమున దీనినిఁ జేర్చి నాఁడు. తమిళమునుండి తెనుఁ గెరువు తెచ్చుకొనినశబ్దము లలో నిది యొకటిగాఁ దలపవచ్చును. నాల్కు శబ్దములోని లకారము కకారముతో సమీకరణము (*assmilation*)నొందుటచే 'నాక్కు' రూపమేర్పడియుండును. అయినను దెనుఁగులో నాలుకతో నాకుటయేకాని 'నాల్కుట' లేదు. 'నాకు' అను ధాతుపునుండి 'నాక్కు' అను నామవాచకరూప మేర్పడ వచ్చును గాని 'నాల్క–నాలుక' యేర్పడినదని చెప్పుటకు వీలులేదుగదా. కావున తెనుగులో నిలిచిన 'నాకు' అనునది యిటీవల ఏర్పడిన ధాతువేగాని మూలధాతువు కాదనియు,

'నాలుక-నాల్క' యను తెలుఁగునందలి నామవాచక శబ్దము నకును, తమిళమునందలి 'నాక్కు' అనుదానికినిగూడ 'నాలు-నాలుకు' అనునదే మూలధాతువై యుండుననియు నూహింప వలసి యున్నది. ఇట్లే మన భాషలో వైయాకరణులు సామాన్యముగా ధాతువులని పేర్కొనునట్టివి-వచ్చు, పుచ్చు, వెలుగు, తునుగు, ఎక్కు, తగ్గు మొదలగునవి మూల ధాతువులని తలచుటకవకాశము లేదనియు, వీని నితరభాషలలోని ధాతురూపములతోడను, ఈభాషలోని యితర సన్నిహిత శబ్దములతోడను పోల్చిచూచినగాని మూలధాతు స్వరూపమును నిర్ణయించుట సాధ్యము కానేరదనియు దీనినిబట్టి మనము గ్రహింపవలసియున్నది.

తెలుఁగున మూలార్థము నిలిచి తమిళాదులలో అర్థము మాఱిపోయినశబ్దముల కుదాహరణముగా 'మగఁడు' అను దానిని వారు చూపిరి. ఇట్టివింక ననేకము లుండునను టకు సందేహము లేదు. కార్ ష్ణ్యము అను నర్థమున నల్ల, నలుపు అను శబ్దములు తెలుఁగున గలవు. 'నల్ల' యనగా నిప్పటి తమిళమున వ్యవహారమున 'మంచిది' (*good, excellent*) అని యర్థము. కాని ప్రాచీన తమిళమున నలుపను నర్థము కలదట. 'నిల్లం' అనగా బొగ్గు (*charcoal*), నల్లందనము (*blackness, darkness*) అను నర్థములు కలవని తమిళ కోశమును తెలుపుచున్నది.

వ్యాకరణ రూపముల విషయమున నొక్క 'పోదుమ్' అను తద్ధర్మార్థకరూపమే కాక భూతకాలిక క్రియా రూపములు, తుమున్నంత రూపములు మొదలగు మఱి కొన్నిటి

విషయమునగూడ తెలుఁగున నిలిచియున్న రూపములు తమిళకన్నడాదులందలి రూపములకంటె పురాతన స్వరూపమును వహించి యున్నవనియే కాక, అట్లుండుటచే మూల భాషనుండి వీని పరిణామక్రమము నన్వేషించుట కెక్కువ తోడ్పడు చున్నవనియు జెప్పుట కవకాశము కలదు. అట్టి వానిని గూర్చి మఱియొక వ్యాసమున వివరించెదను.

ఈ రీతిగా నొక్క కుటుంబమునకుఁ జెందిన భాషలలో నొక్కొక్క దానియందు కొన్ని ధాతువుల యొక్క కాని, పదముల యొక్క కాని, క్రియారూపముల యొక్క కాని మూల రూపములు కాలగతిని ఉచ్చారణభేదము వలన గలుగు పరిణామములకు లోనుగాక నిలిచి యుండుట తటస్థింపవచ్చును. అట్టివి యీ తెనుఁగు, అరవము మొదలుగాఁగల వాఙ్మయ సంస్కార రహితములై యున్న కోదు, కుయి మొదలగు ననాగరక భాషలలోఁగూడ గనఁబడవచ్చును. కావుననే యీకుటుంబమునకుఁ జెందిన భాషలలోని సమానార్థకములగు నాయా రూపములనన్నిటిని బోల్చి పరిశీలించి తత్తత్సంప్రదాయాను సారముగా వాని పరిణామ క్రమమును దెలిసికొనినగాని మూలభాషస్వరూపమును గుర్తించుట కవకాశము లేదని చెప్పబడు చుండుట. ఏవో కొన్ని పదముల సాదృశ్యము నెత్తి చూపినంత మాత్రముచే అరవమునుండి తెనుఁగు పుట్టినదని సాధింపయత్నించిన యీకాలమునందలి యరవపండితుల వాదమును ఖండించు నుద్దేశముతో శ్రీ లక్ష్మణరావుగారీ వ్యాసమును వ్రాసియుందురు. ఆ వాదమును ఖండింప యత్నించినందులకు వీరు ప్రశంసనీయులు. కాల్డ్వెల్ పండితుఁడైనను

తమిళమును తక్కిన భాషలకంటె బాగుగా నేర్చినవాఁడగుటచే దానినుండి యుదాహరణము లెక్కువగా నిచ్చి, కొన్ని సంప్రదాయముల విషయమునను, కొన్ని రూపముల విషయములోను తమిళము మూలభాషా స్వరూపమును నిలువబెట్టుకొని యున్నదిగావున నా మూలభాషా లక్షణముల నన్వేషించుటలో మన కెక్కుడు తోడ్పడగలదని చెప్పనేకాని యితరభాషల సహాయ మక్కర లేకయే తమిళము మూలభాషా స్వరూపమును మనకు దెలుపుచున్నదని చెప్పియుండలేదు. వీని పురాతనత్వము విషయముగూడ నట్టిదే. ఒక భాషలో గొన్ని పురాతన రూపములు నిలిచి యుండవచ్చును, మఱియొక భాషలో నవి మాఱిపోయినను మఱికొన్ని నిలిచి యుండవచ్చును. సజాతీయ భాషారూపముల నన్నిటిని బోల్చి పరిశీలించిన గాని వాని పరిణామ క్రమము, పురాతనత్వము నిర్ణయింప వీలుకాదు. ఒక కుటుంబమునకు జెందిన సోదరభాషలన్నప్పుడు వానిలో దేనినుండి యేది పుట్టినది, ఏది పురాతనమైనది అను ప్రశ్నలకు దావులేదు. ప్రాచీన ద్రావిడభాషా స్వరూపనిర్ణయమునుబట్టి, మూల రూపముల నిర్ణయమును బట్టి మారవచ్చును. తెలుగున దేశ్య శబ్దముల స్వరూపము విశేషముగా మారినట్లున్నను, భాషారూపములలో ప్రాచీనత ఎక్కువగా గనబడుచున్న దనుటకు సందేహము లేదు.

6

భాషా కుటుంబములు

భూభాగమం దాయా ప్రదేశముల నివసించుచుండెడి మానవకోటి యంతయుఁ గొన్ని జాతులుగా విభజింపఁబడుచుండినట్లే, యా మానవకోటిచే వ్యవహరింపఁబడుచుండెడి భాషలుకూడఁ గొన్ని కుటుంబములుగా విభజింపఁదగియుండును. భాష యనునది మానవుఁడు తన జన్మకుఁగారణభూతులగు పూర్వపురుషులనుండి వడసిన యొక యపూర్వంబగు సొత్తు. ఇట్లపూర్వ సంపత్సంపన్నుఁ డగుటచేతనే మానవుఁడు తక్కిన జంతువులకంటె భిన్నుఁడై జంతుకోటిలో నగ్రస్థానమును వహించుచున్నాఁడు. అనుకరణశక్తి, జ్ఞాపకశక్తి, విశ్వాసము, బుద్ధిబలము, సుఖ దుఃఖాద్యనుభవము, మొదలగు విషయములలో మానవులకుఁదక్కిన జంతుకోటికిని విశేష భేద మగపడదు. కాని యీ భాష యనునదిమాత్ర మీ జీవకోటిమధ్య నొక సరిహద్దుగా నేర్పడి మానవకోటిని తక్కిన జీవకోటినుండి వేఱుపఱచి దాని యాధిక్యమును జాటుచున్నదివలె నున్నది.

భాషయనున దెట్లు ఏకారణమున నేర్పడినది? ఒక భాషనుండి యనేకము లేర్పడినవా, లేక యేక కాలమున పలుచోట్ల పలుబాసలు బయలుదేరినవా యను విషయములు వివాదముతోఁ గూడినవిగా నున్నవి. కాని ప్రస్తుతము వ్యవహారములోనున్న భాషలను వాని స్థితిగతులను, అవి పొందుచున్న మార్పులనుబట్టి విచారింపఁగా, భాషలకు మార్పు సహజగుణమైనట్లును, అనేక విధములగు కారణము

లచే నొక్క భాషయే యనేక విధములగు మార్పులను జెంది, యొక్క జనసంఘముచేతనే భిన్న రీతుల వ్యవహరింపఁ బడుచుఁ దుదకుఁ గాలక్రమమున భిన్న భాషలుగా మాఱి పోవుచున్నట్లునుఁ దెలియవచ్చుచున్నది. ఒక్కయాంధ్రభాష యే దేశభేదమునుబట్టియు, వర్ణభేదమును బట్టియు, నెన్నివిధ ములుగా వ్యవహరింపఁబడుచున్నదిమన మెఱింగినవిషయమే. మొట్టమొదట భాష లనేకముగఁ బుట్టి కాలక్రమమున నవి కొంత సంస్కారమును బొందినకొలఁది కొన్ని ప్రమాణరూప ములు లేక ప్రత్యేకాకారములు (Types) కలవిగా నేర్పడి యుండి, వానినుండి యిప్పుడు భూభాగమున వ్యవహార ములోనున్న భాషలు బయలుదేరి యుండవచ్చును. అట్లు గాక అనాదియగు నొక భాషనుండి బయలుదేరిన వేవైనను, ఆయా దేశకాల స్థితులబట్టియు, నాయా జనుల ప్రకృతు లను బట్టియు నుచ్చారణరీతులనుబట్టియు, భిన్నములై వేఱు వేఱు రూపములఁ బొందినవై యుండవచ్చును. కాని మొత్తముమీఁద నిప్పుడువ్యవహారముననున్న భాషలన్నియుఁ గొన్ని మూలభాషలకుఁ జెందినవై కొన్ని కుటుంబములుగ నేర్పరుపఁదగియున్న వను విషయమున మాత్రము భాషా తత్త్వవేత్త లందఱు నేకాభిప్రాయులై యున్నారు. భాషా కుటుంబముల నేర్పఱచుట యనఁగా గొన్నికొన్ని భాషలలోఁ గల పోలికలనుబట్టి యా పోలికలకుఁ గల కారణములను వానికిఁ గల సంబంధమును గూర్చి విమర్శించి యవి పరస్ప రము జన్యజనక భావసంబంధమో, లేక సోదరభావ సంబం ధమో కలవై యుండెనని సనిదర్శనముగ నిర్ధారణచేసి యా

సంబంధమునుబట్టి వానినొక వంశవృక్షము క్రింద నమర్ప యత్నించుటయే యైయున్నది. భిన్న భాషలు మాట్లాడు వారికిఁబరస్పరము నేమాత్రము నర్థము కాకుండునంతగా మాఱి వేరుపడిపోయిన యాయా భాషలకుఁ గల సంబంధ మిట్టిదని నిర్ధారణచేయుటకుఁ దగిన మార్గము లేవో మన మిప్పుడు విచారింపవలెను.

భాషల పరస్పర సంబంధమును నిర్ధారణ చేయుటలో మనకుఁ దోడుపడినవి రెండు ముఖ్యములగు నంశములు కలవు. అందొకటి యాభాషలయందలి పదపరికరము (*Material*), రెండవది యందలి పద వాక్యముల సంఘటనా పద్ధతి (*Method of expression*) లేక వ్యాకరణాంశములు. మొదటిది కొంత సులభమైన మార్గము. ఆయా భాషల యందలి పదపరికరమును సరిపోల్చి చూచుట. అట్లు సరిపోల్చి చూచినపు డాయా భాషలయందు సమానార్థకములగు పదములు గాని; లేక పదముల మూలరూపములు (*Root elements*) గాని నేకరూపము గలవై (లేక తుల్యరూపములు గలవై కన్పడినచో నా భాషలు పరస్పర సంబంధము కలవని యూహింప వచ్చును. సంబంధము కలవనేకాదు, అవి యన్నియు నేదో యొక కాలమున నొక ప్రాచీన భాషనుండి బయలుదేరి కాలక్రమమున విడిపోయి తుదకు భిన్నత్వమును జెందినవనికూడఁ జెప్పుదుము. చరిత్ర మనకుఁ దోడ్పడినచో నీ భిన్నభాష లేయే కాలమున నేయే మార్పులను జెందినవో సూచించుచు ప్రాచీన భాషనుండి యీకాలమున విడివడి యుండవచ్చునని సూచించుచు వాని చరిత్రను

వెనుక కన్గొనఁగలుగుచున్నాము. ప్రస్తుతము స్వభాషలుగా వ్యవహరింపఁబడుచున్న, ఫ్రెంచి, స్పానిష్, పోర్చుగీస్, రుమేనియన్, ఇటాలియన్ మొదలగు భాషలొక్కొక్కటియు నాయా ప్రదేశముల వాడుకలోనున్న భాషలలో మేళవముగాంచిన వ్యావహారిక లాటిన్ భాషారూపములే. ఆయా దేశకాల పరిస్థితులను బట్టి లాటిను యొక్క భాషయే యిన్ని రూపములం జెంది భిన్నభాషలుగా మారినదను విషయమును నిర్ధారణ చేయుటలో చరిత్రకు నానా విషయములును, భాషా నిదర్శనములకుఁ జారిత్రక నిదర్శనములును పరస్పరము నుపబలకము లగుచున్నవి. ఇట్లే ఉత్తర హిందూస్థానమున వ్యవహరింపఁబడుచున్న దేశీ భాషలన్నియు నొక కాలమున నాయా ప్రదేశముల వ్యవహారమునందున్న ప్రాకృత భాషలనుండి బయలుదేరినవనియు, ఆ ప్రాకృతభాషలయందలి భేదము కూడ, ప్రాచీన ప్రాకృతమను భాష నుపాదానముగాఁ గొని నానాదేశభాగములలో భిన్నరీతుల వ్యవహరింపఁబడుటచేఁ గలిగినదనియు, ఆ ప్రాకృతములును, వైదిక భాషయుగూడ 'జెండవెస్తా' (*Zend Avesta*) భాషతోఁ బోల్చి చూచిన యెడల నివి యన్నియు సన్నిహిత సంబంధము గలవై ప్రాచీనార్యభాషనుండి వచ్చినట్లును, కేవల మాయాభాషల యందుఁగల పోలికలనుబట్టియే కాక ఆయా భాషాగ్రంథము లందలి యితర నిదర్శనములను బట్టికూడ మనము నిశ్చయింపవచ్చును. ఇంగ్లీషు భాషకును యూరపు దేశమందలి ట్యూటానిక్ కుటుంబ భాషలకుఁ గల సంబంధమును, ఒక కాలమున జర్మను దేశస్థులగు ఏంగిలులు, సాక్సనులు మొద

లగు జాతులు బ్రిటన్ దేశము నాక్రమించిరనియు, నప్పుడే తమ భాషనుకూడ నచ్చట నెలకొల్పిరనియుఁ దెల్పెడి చారిత్రకాంశములు సమర్థింపఁగలుగుచున్నవి.

ఒకవేళ నీ పై విషయములను సమర్థించుటకు చారిత్రక నిదర్శనము లేమియు లేకున్నను, ఈ భాషలయందగపడుచుండెడి సమానార్థకమగు సరూప పదజాలమును బట్టి భాషా శాస్త్రజ్ఞుఁడు వీనికిఁ గల సంబంధమును నిర్ధారణ చేయలేకపోఁడు. కాని యట్లు నిర్ధారణచేయుటకుఁబూర్వము మాత్రము కొంచెము నిదానించి యా పదములను బాగుగఁ బరిశీలించును. రెండు భాషలలోఁ గొన్ని పదములు సమానముగఁ గన్పడినంతమాత్రమున నా భాష లొక కుటుంబమునకే చెందినవని నిశ్చయింప వీలులేదు. ఏలయనఁగా నొకదేశముపై మఱియొక దేశమువారు దండెత్తుటవలనఁ గాని, వర్తక వ్యాపారముల వలనఁగాని, వలసపోవుట మొదలగు కారణములవలనఁగాని, భిన్న దేశములందు భిన్న భాషలు మాట్లాడువారికి పరస్పర సంబంధము కలుగుచుండును. అప్పుడా జనులతో పాటు ఆ భాషలకు నన్యోన్యసంబంధము కలుగుటచే, నొక భాషనుండి మఱియొక భాష యనేకములగు పదముల నెరువు తెచ్చుకొని స్వభాషా పదముల వలెనే (ఒక్కొక్కప్పుడు స్వభాషా సంప్రదాయానుసారములగు యత్కించి త్సంస్కారములతో) వాడుకొనుచుండవచ్చును. ఈ రీతి నెరువు తెచ్చుటచేఁ గలిగిన యా భాషలలోని పదముల సారూప్యమును బట్టి యవి యేక కుటుంబమునకుఁ జెందినవేయని నిశ్చయింప వలనుపడదు కదా! కావున

భాషలసాజాత్యమునునిశ్చయించుటకుఁబూర్వమా భాషలలో సరూపములై కన్పడెడు పదజాలము, ఒకదానినుండి యొకటి యెరువుగాఁ దెచ్చికొనినది కాదని రుజువు కావలెను. ఒక ప్పుడీ యెరువు తెచ్చికొనిన పదములకే యా భాషలలోఁ బ్రచారం బెక్కువ యగుటచే నంతకు బూర్వమందా భాష లలో నాయా యర్థముల వాడుకలోనున్న నైసర్గిక పదములు (*Native words*) బహిష్కృతములై క్రమముగా వాడుకలో నుండి తప్పిపోవుటయుఁ దటస్థించును. అట్టి పదముల సంఖ్యను బట్టి మనము స్థూలదృష్టితో విచారించి యా భాషల సంబంధ బాంధవ్యములను నిశ్చయించినచో నది సత్యమునకు దూరము కాకమానదు. ఆధునిక పరిషియన్ వాస్తవముగ ఇండో యూరోపియన్ భాషా కుటుంబములో (సంస్కృ తము, ల్యాటిన్, గ్రీకు, ఎవెస్టాభాష, ఇంగ్లీషు మొదలగు వానిలో) జేరినదైయెనను, ఇప్పుడా భాషలోఁ గలసిపోయిన అరబిక్ పద సమూహమును బట్టి స్థూలదృష్టితోఁ జూచి నచో నది సెమెటిక్ (హీబ్రూ, అరేబిక్ మొదలగుభాషల) కుటుంబములోఁ జేరినదిగాఁ జెప్పఁదగియుండును. ఇంగ్లీషు భాష వాస్తవముగ ఇండో యూరోపియన్ కుటుంబమునకుఁ జెందిన ట్యూటానిక్ శాఖలోనుండి బయలుదేరినదై జర్మన్ మొదలగు భాషల కత్యంత సన్నిహితమై యున్న భాష. కాని తరువాతికాలమున దేశము నార్మనులచే నాక్రమింపఁబడిన పిదప, నీ భాషకు ల్యాటిన్, ఫ్రెంచి భాషలతోఁ గలిగిన యత్యంత సాంగత్యమును బట్టి యా భాషలనుండి యమితం బగు పదజాలమును సంగ్రహించికొనియుండుటచేఁ గోశముల

యందలి పదజాలమును బట్టియే విచారించినచో నింగ్లీషు భాష ల్యాటిన్ శాఖకుఁ జెందినదని చెప్పవలసి యుండును, గాని జర్మన్ భాషకుఁగాని, ట్యూటానిక్ శాఖకుఁగాని వాని కంటె సన్నిహిత సంబంధము కలదని చెప్పుట కవకాశము చాలదు. ఇంతయేల? మన యాంధ్రభాష విషయమునఁ గూడ నిట్టి సందిగ్ధస్థితి లేకపోలేదు.

ఆంధ్రభాష వికృతియని యాంధ్రవైయాకరణు లందఱు చెప్పుదురు. అనఁగా సంస్కృత ప్రాకృతములు ప్రథమ ద్వితీయ ప్రకృతులనియు, వానినుండి వచ్చినది గావున నిది వికృతి యనియు వారి మతము. కాని సంస్కృతాంధ్ర భాషలకుఁ గల సంబంధము ప్రకృతి వికృతి సంబంధమే యగునా యను విషయముమాత్రము విచారణీయమై యున్నది. ఏలయన నాంధ్రభాషయనునది సంస్కృత భాష యొక్క వికారము లేక వికృతియే యైనట్టయితే "తజ్జా, సమాచ దేశ్యా గ్రామ్యా చేయం చతుర్విధా భవతి" (ఆంధ్ర శబ్దచింతామణి) అనియు;

ఆ. "తత్సమంబునాఁగఁ దద్భవంబన నచ్చ
తెనుఁగునాఁగ మఱియు దేశ్యమనఁగ
గ్రామ్యభాషనాఁగ గల వైదు తెఱఁగులు
వేఱవేఱ వాని విస్తరింతు."

(కేతన—ఆంధ్రభాషా భూషణము)

అనియు నీరీతిగ నాంధ్ర భాషను నాలుగు విధ ములుగనుము, నైదు విధములుగను విభాగం బొనర్చిన

యాంధ్రలక్షణకర్తల యభిప్రాయమేమో దురూహ్యంబగు చున్నది. ఆంధ్రభాష నాలుగు, ఐదు తెఱఁగు లన్నప్పుడు, తత్సమభాష, తద్భవభాష, దేశ్యభాష, అచ్చ తెనుఁగుభాష, గ్రామ్యభాష యనియా వీరి భావము అని సందేహము కలుగకమానదు. తెనుఁగుభాష, గ్రామ్యభాష యనఁగా నేమో కొంచె మర్థమగును గాని తత్సమభాష తద్భవభాషయనఁగా నర్థమేమి? మనము అచ్చ తెనుఁగుగాని, గ్రామ్య భాష గాని మాట్లాడవచ్చునుగాని తత్సమ భాష తద్భన భాష మాట్లాడుటలేదు. కావున "తెల్లమగు నైదు తెఱగులఁ దెనుఁగుబాస" (కూచి.తిమ్మ) యని తెలుఁగు బాస యైదు తెఱఁగులని చెప్పిన లక్షణకర్తల యభిప్రాయము, తెలుఁగు నందలి పదము లైదు తెఱఁగులుగా నున్నవనియే కాని తెలుఁగుభాష యైదు తెఱఁగులని కాదని, వారా "యాంధ్ర భాషాభేద చతుష్టయము–లేక పంచకము" నకుఁ జెప్పినలక్షణమునుబట్టి మనము తెలుసుకొనవలసియున్నది.

"క. మును సంస్కృత పదములపైఁ
దెనుఁగు విభక్తులు ఘటించి తేఁటపడఁగఁ జె,
ప్పిన నది తత్సమ మనఁజను
వనము, ధనము, పురుషుఁ, డబల, వసుమతి
యనఁగన్ ॥

(కేతన–ఆంధ్రభాషా భూషణము)

తే. ఆంధ్రదేశ పురస్థాయులైన సకల
జనములకును మఱుంగు లేశంబు లేక

తేట తెల్లమిగాఁ బల్కు మాటలెల్ల
నవని శుద్ధాంధ్రదేశ్యంబు లనఁగఁ బడును.''
(అప్పకవీయము.)

దీనిని బట్టి ఆంధ్రభాషాపదము - అనఁగా నాంధ్ర భాషా పదములయందలి భేదము అని యర్థమైనట్లు స్పష్టమగుచున్నది. అయితే ఒక భాషలోని కొన్ని పదములు మఱియొక భాషనుండి వచ్చిన ప్రకృతులైనప్పు డాభాష యంతయు దీని వికృతియని చెప్పవలసినదేనా? ఒకవేళ అట్లు చెప్పఁదలంచినచో వైయాకరణులు చేసిన యాంధ్ర భాషా పదముల విభాగములోఁ జేరిన దేశ్యపదములు, అచ్చ తెనుఁగు పదములు అనునవి యాద్యప్రకృతినుండిగాని ద్వితీయప్రకృతి నుండిగాని వచ్చినవి కావు, ఈ పదములతోఁ గూడినభాషనే వికృతియని చెప్పఁదలంచినచో నది యెట్లు పొసఁగును? అను సందేహములు కలుగుట కవకాశము లేకపోలేదు. దీనిని సావకాశముగఁ బరిశీలింపవలసియున్నది. పూర్వలాక్షణికులు సంస్కృతము దేవతల భాషయని, దానియందుండెడి యభిమానముచేఁ గాఁబోలును ''జనని సమస్తభాషలకు సంస్కృత భాష ధరాతలంబునన్'' అని ధరాతలంబునందలి (అనఁగా బహుశః హిందూదేశమునందలి) భాష లన్నిటికిని తల్లి భాషయే యని చెప్పఁగఁ దొడఁగినప్పు డాంధ్రభాష వికృతియనుటలో నాశ్చర్య మేమియు లేదు. ఇట్లు లాక్షణికులు సంస్కృతాంధ్రములకుఁ బ్రకృతి వికృతి భావ సంబంధమును నిరూపింప మఱికొందఱు జన్యజనకభావ సంబంధమే యని

చెప్పుచు నీ రెంటికి నభేదమును సాధించుచున్నారు. సంస్కృత భాషాభిమానముయొక్క విలాస మిట్లుండ, "ఆంధ్రవాఙ్మయ చరిత్ర" కారులు :

"కాశ్మీర దేశమునందలి శారదవుల నివసించువారు మొదలు కన్యాకుమారికడ వసించువారి వఱకు మాటలలన్నియు సంస్కృత జనితములు; కొన్ని యనాగరక జాతుల మాటలు, కొన్ని విదేశజుల మాటలు నుండవచ్చును. వానికైన వ్యుత్పత్తులు లేకపోవు. ప్రపంచ భాషలకే సంస్కృతము తల్లిభాషయనుట యసత్యమని నాకుఁ దోఁపదు" అని సంస్కృతమే ప్రపంచభాషలకుఁ దల్లియను వాదమును బలపఱచుచు, కాశ్మీర దేశమునుండి కన్యాకుమారివఱకు వ్యవహరింపబడుచుండెడి భాషలలో నెక్కడనైన కొన్ని యనాగరక జాతుల మాటలు (ఇవి దేశ్యములా?), కొన్ని విదేశజుల మాటలునుండినచో వానికిఁగూడవ్యుత్పత్తులుండకపోవనుచు, అనఁగా నే సంస్కృత ధాతువునుండియో — ఇవి విశేషములుగఁ గలవు గావునను, "ధాతునామనేకార్థత్వా" త్తమ సూత్రసహాయముచేతను — ఏదోయొక ప్రత్యయము కలుపుటచే వ్యుత్పత్తి కల్పింపవచ్చునని సూచించిరి. ఇంతమాత్రము వారు తృప్తిఁ బొందలేదు. ఇఁక నేమనఁగా నాంధ్రభాషయే ప్రాచీన ప్రాకృతమునుండియో వచ్చినదగుటచేతను ఈ ప్రాకృతములు వేదకాలముననే గ్రంథగౌరవమంది, సంస్కృతముననే మాతృకలై నట్లగపడుటచేతను, ఆంధ్ర భాషయే సంస్కృతభాషకుఁగూడ జనని కావచ్చునని సూచించుచు, సంస్కృతభాషాభిమానముకంటెఁగూడ నెక్కుడగు మాతృ

భాషాభిమానమును వెల్లడించినారు. "కావున నాయూ హచే ప్రాకృతములలో నొకటియైన యాంధ్ర భాషయు, లిపియు, నవీనభాషయగు సంస్కృతముకంటెను, దేవనాగర లిపికంటెను ప్రాచీనములని తలంచుచున్నాను. (ఆం. వాఙ్మయ చ. 26 పుట.) కావున నిట్లాంధ్రభాష ప్రపంచ భాషల కన్నిటికిని జననియగు (సంస్కృత) భాషకు జనని—వృద్ధపితామహి—యగుచున్నది. ప్రపంచ భాషల కన్నిటికిఁ గాకపోయినను ఇండో యూరోపియన్ కుటుంబమునకంతకు నీ సంస్కృతమే తల్లి భాష యయియుండునని పూర్వశాస్త్రజ్ఞులు తలంచిన కాలము గతించిపోయెను. కాని నవీనాన్వయంబునను, సువ్యాప్తంబునను నవీనతాభ్యాసము చేసినవారగు పాశ్చాత్య శబ్దశాస్త్రవేత్తలీ సంస్కృత వాఙ్మయము ఇండో యూరోపియన్ కుటుంబములకుఁ జెందిన భాషా వాఙ్మయములలో నెల్లఁ బ్రాచీనమై, ప్రాచీన భాషా లక్షణముల నధికముగఁ జూపుచున్నను గ్రీకు, ల్యాటిన్, జర్మానిక్, ఇంగ్లీషు మొదలగు భాషలు మఱికొన్ని ప్రాచీనతరములగు లక్షణములను జూపుచున్నవనియు, దీనికిని సంస్కృత భాషకును సోదర భావమే కలదనియు, ఇవియన్నియుఁ గూడ నతి ప్రాచీనంబగు ఇండో యూరోపియన్ భాషనుండి వచ్చినవేయనియు సనిదర్శకంబుగ నిర్ధారణ చేసిరి. దీనికిఁ దగిన నిదర్శనంబులఁ జూపుట కిచ్చట నవకాశము చాలదు; కాని యొక్క విషయము మాత్రము గమనింపఁదగియున్నది. యూరపు ఖండము యొక్క పశ్చిమపుఁ గొసనున్న బ్రిటిషుద్వీప నివాసుల భాషయగు నింగ్లీషుకు పెక్కువేల మైళ్లదూరమున ఖండాంతరమం

దున్న యీ సంస్కృతభాషకును, సమీపమున నొక దేశము ననే కలసియున్న తెనుఁగుకంటె, సన్నిహిత సంబంధంబు కలదని మాత్రము వ్యక్తమగుచున్నది.

భాషల సంబంధ బాంధవ్యముల నిర్ణయించుటలో సరూపపదము లొక సాధనమనియు, నా సారూప్యము సహజమై యుండవలయునుగాని యెరవు తెచ్చుకొనుట వలన వచ్చినది కాఁగూడదనిగదా సూచింపఁబడినది. అయితే మన వాఙ్మయ చరిత్రకారులు సంస్కృతాంగ్లములకుఁ గల సంబంధముకంటె సంస్కృతాంధ్రముల సంబంధమే సన్నిహితంబని తెలుపుటకుగా "సారూప్య పదములే జన్యజనక సంబంధమును, సన్నిహితత్వమును నిర్ణయింపఁగలిగినచో నీ క్రింది యుదాహరణముల వలన నాంగ్లేయభాష తెలుఁగుకంటె సంస్కృతమునకుఁ జేరువగఁ గన్పడును" (గాని నిశ్చయముగ నట్లుకాదు.) అని వ్రాయుచు నా క్రింది యుదాహరణములలో నేరీతి పదములయందు సారూప్యము కనఁబడినచో నవి యాభాషలసహజసంబంధమును సూచించునో అట్టి పదములనే కొన్నిటిని గైకొనిరి. వానిలోఁగల సారూప్యము కేవలము యాదృచ్ఛికమే కాని కొన్నిటిలోనైనను సహజము కాదని యభిప్రాయపడినట్లు కనఁబడుచున్నది, ఇంతే కాక యిట్టి పదములయందుఁ గల సారూప్యము సంస్కృతాంగ్లముల సన్నిహితత్వమును నిరూపింపలేదని యాయన తలంచిరి గావున "సారూప్యపదము లున్నంతమాత్రమున నఱివము మన భాషకంటెఁ బ్రాచీనమైనదని కాని, మన భాషకుఁ దల్లివంటిదని కాని తలంచుటకు వీలులేదు" అని యా

పై పదముల పరిశీలనవలనఁ దేలిన ఫలితముగా నొక యపూర్వ సిద్ధాంతమును జేసిరి. ఉదాహృత పదములు లోని కొన్నిటికిఁ గల సాదృశ్య మా భాషల సన్నిహిత సంబంధము నెట్లు తెల్పుచున్నదియు ముందు చూపఁబడును. ఇంతేకాక మఱికొన్నిటిలోఁ గల వైసాదృశ్య మా భాషలకు సన్నిహిత సంబంధము లేదనికూడ నెట్లు సూచించుచున్నదియు ముందే తెలుపఁబడును. మఱియొక్క విషయము గమనింపఁదగియున్నది - ఏమనఁగా సామీప్యము గలిగిన పదము లున్నంత మాత్రమున తమిళము తెలుఁగునకుఁ దల్లివంటిదగునని ఎవ రందురు? భాషాశాస్త్రజ్ఞు లెవ్వరు ననరు. తెలుఁగు భాష ఉరవమునుండి వచ్చినదనుట కేవలము పొరపాటుమాట. ఈ రెండును సోదరభాషలనుటయే నిశ్చయము.

కావున భిన్నభాషలలోని యెట్టి పదముల సాదృశ్య మెంతవఱకు వాని సాజాత్యమును వెల్లడించుచు నిర్ణయించు చున్నది యను విషయమును ముందు పరిశీలించి, తరువాత వా రుదాహరించిన యింగ్లీషు పదములలోని సామీప్యము యొక్కయు, తెలుఁగు పదములయందలి భేదముయొక్కయు లక్షణములను జూచినవలనఁ దేలు ఫలితమును గూర్చియు విమర్శించుకొందము

భిన్నభాషల కొక్కొక్క కాలమునఁ గలిగెడి సంసర్గ మువలన నొకభాష మఱియొక భాషనుండి విశేషముగా పద జాలము నెరవు తెచ్చుకొనుచుండును గావున, భాషాశాస్త్ర జ్ఞుఁడు పదజాలములబట్టి భాషల సంబంధమును నిర్ణయించు తఱి, నా పదములను గొంత జాగ్రత్తగాఁ బరిశీలింపవలసి

యుండునని స్పష్టముగఁ జెప్పఁబడియే యున్నదిగదా! ఈ పరిశీల నములో నాతఁడు చేయుపని యేమనఁగా, నాతఁడు పదజాల ములో నేవి సహజములో, యేవి యితర భాషలనుండి యెరువు తెచ్చుకొనఁబడినవో తెలుసుకొనుటకు యత్నించును. ఈ సందర్భమున నిజముగా భాషయనఁగా నేదో మనము గుర్తింపవలసియున్నది. ప్రతిభాషయందును ఏయే పదజాలము ఏయే పదవాక్య సంఘటనాదులు సామాన్యముగా నా భాష మాట్లాడువారందఱకు సులభముగ నర్థమై, నిత్యవ్యవ హారమున వారిచే వాడుకొనఁబడుచున్నవో ఆ పదములే, సామాన్య పదజాలమే నిజముగా నా భాషయని చెప్పఁదగి యున్నది. ఇట్టి పదములు నిత్యపరిచితములగు వస్తువులు, జంతువులు. వ్యాపారములు, గుణములు, మొదలగు వానిని గూర్చి చెప్పునవియు, తల. ముక్కు. కన్ను మొదలగు నవ యవ వాచకములును, తల్లి, తండ్రి. అక్క. అన్న. మొదలగు సంబంధవాచకములును. నేను. నీవు. వాఁడు, అను సర్వ నామములును సంఖ్యా వాచకములు మొదలగునవియై యుండును. కాని శాస్త్ర విషయములకు, కళలకు సంబం ధించిన పదములుగాని, మత వేదాంత విషయములకు సంబం ధించినవిగాని యీ భాషయందు కొన్నియున్నను, అవి జన సామాన్యమునకర్థమగునని కాని, ఆయా విషయములవారికిఁ బ్రసక్తి కలిగినపుడుతక్క యవి నిత్యవ్యవహారమునఁ బ్రయో గింపంబడుచుండుననిగాని చెప్పుట కవకాశము లేదు. అంత మాత్రమున నీ పదజాలమంతయు నా భాషలోనిది కాక పోదు. కాని సర్వత్ర నిత్యవ్యవహారమునమాత్ర ముండదు.

కోశములందు సంగ్రహింపఁబడిన పదజాలములో నిట్టి పదము లనేకము లుండుటచే నిత్యవ్యవహారమందున్న పదముల సంఖ్య మిగుల తక్కువమై యున్నట్లు కనఁబడవచ్చును. మఱియుఁ గోశములందలి పదజాలములోఁ గొన్ని పదము లొక భాషాపదములతో సాదృశ్యము గలవై మఱికొన్ని మఱియొక భాషాపదములతో సాదృశ్యము గలవైనచో నం దెక్కువంతుపదము లే భాషాపదములతో సాదృశ్యము కలిగియుండునో యాభాషతో దీనికి సహజ సంబంధమున్న దనికూడ మనము నిర్ధారణ చేయఁగూడదు. అనఁగాఁ గేవల సహపదముల సాదృశ్యమునుబట్టి మాత్ర మనము భాషల సాజాత్యమును నిర్ణయింపలేమనుట. ఇఁక నేమనఁగా నా సహజ పదములు పైఁ జెప్పిన నిత్యవ్యవహారములోనివై యుండవలయును. నిత్యవ్యవహారములోనున్న పదములతోడి సాదృశ్యమే భాషలోనిపదములకు విశేషముగాఁ గలదో యా భాషకు దానితోడి సాజాత్యము కలదని నిర్ణయింపవచ్చును. కాని భాషల సాజాత్యమును నిర్ణయించి కుటుంబములుగా నేర్పఱచుటకుఁ బదముల గూర్చిన సంబంధ మొక్కటియే ప్రమాణము కాదనియు, సందలి వ్యాకరణాంశములును, వాక్యరచనా విధానమును, వీనికంటెఁ గూడ బలవత్తరమైన ప్రమాణమగుచున్నదనియు, ఇదివరకే సూచింపఁబడినదిగదా! మన ప్రస్తుతాంశము పదముల విషయమైనది. ఇంగ్లీషులో ననేకపదము లనేక భాషలనుండి, మాటుమూలలనుండి

వచ్చి చేరినవి. ప్రపంచమునందుఁ బ్రతిష్ఠగాంచిన దేశభాషల లోఁ దన పదముల నింగ్లీషుభాష కెరువివ్వని భాషయే లేదనుట యత్యుక్తిగాదు. ల్యాటిన్, గ్రీకు, హీబ్రూ, కెల్టిక్, ఫ్రెంచి, స్పానిష్, హిందూస్థానీ, చీనాభాష, అరవము తెలుఁగు, మలయాళము మొదలగు భాషలలోని పదము లెన్నియో యా భాషయందుఁ గలసి తత్కోశములందు సంగ్రహింపఁబడినవి. తక్కిన భాషలలోని పదములమాట యటుండ, బ్యాండికూట్ (*Bandicoot*) జాగరి (*Jaggery*) జాక్ (*Jack-fruit*) మొదలగునవి తెలుఁగు, తమిళము, మలయాళములలోనుండి గ్రహింపఁబడినపదములై యున్నవి. మొత్తముమీఁద కోశములందలి 43566 పదములకును 29853 పదములు ల్యాటిన్ కుటుంబమునకుఁ జెందినవనియుఁ 13230 మాత్రమే ట్యూటానిక్ కుటుంబమునకుఁ జెందినవ నియు తక్కినవి మిగిలిన భాషలనుండి వచ్చినవనియు లెక్కలఁజూపి తేల్చిరి. ఇట్లు పదముల సంఖ్యను బట్టి మాత్రమే చూచినచో నింగ్లీషుభాష ల్యాటిన్ కుటుంబమునకే చేరి యున్నదని చెప్పవలపివచ్చును. కాని యేదైన నొక చిన్న పుస్తకమును దీసికొని అందొక పత్రమునందలి పదములను లెక్కపెట్టినచో తక్కిన భాషలమాట యటుండ, ల్యాటిన్ కుటుంబమునకుఁ జేరిన పదములకంటెఁగూడ ట్యూటానిక్ కుటుంబమునకుఁ జేరిన ఆంగ్లో-సాక్సన్ పదములే యెక్కుడుగాఁ గన్పట్టును. నిత్య వ్యవహారమందలి పదములలోఁ గూడ నాంగ్లో-సాక్సన్ పదములే కాక ప్రత్యయములు, క్రియలు మొదలగునవికూడ నీ భాషకు జెందినవేయగుటచే,

కోశమందలి లెక్కలన్నను, ఇంగ్లీషు భాష ట్యూటానిక్ కుటుంబమునకే చెందియున్నదని నిశ్చయింపఁబడియున్నది.

ఇట్లే యాంధ్రభాషాపదముల విషయమునఁ గూడ శబ్దరత్నాకరమందలి పదములు చూడఁగా దేశ్యపదములు 12337 అయియుండఁగా, సంస్కృతపదములు 14814 ను, తద్భవములు 2000 ను ఉన్నట్లు తెలియుచున్నది. ఇట్లు తెలుఁగులోని సంస్కృత పదములు దేశ్య పదములకంటె నెక్కుడుగాఁ గన్పడుటచేఁ దెలుఁగు సంస్కృతము నుండి వచ్చినదిగనే కన్పడును. కావుననే సంస్కృతభాషా పండితులు, దానియందు విశేషాభిమానముగల ప్రాచీనాంధ్ర వైయాకరణులందఱు నిది సంస్కృతమునుండి పుట్టిన భాషయే యని చెప్పుటకూడ తటస్థించినది. సంస్కృత పదములేకాక యింక ననేకభాషలనుండి యనేక పదములు తెలుఁగులో వచ్చి చేరినవి. అయితే యింతమాత్రమున వాఙ్మయికర్తలు చెప్పినట్లు "నాఁటి కేఁబదికంటె నధికముగఁ దత్సమ పదములు, నూటికి 15 వంతునఁ దద్భవములు, నూటికి 10 వంతున వైకృతములు, 4 వంతున తురక పదములు, 5 వంతున నాంగ్ల పదములు నిజముగఁ దీసివేసికొనుచు వచ్చుచున్న యెడలఁ దెలుఁగు భాషయే శూన్యమగును" అను భయమెంతమాత్రము మనము పడవలసిన యవసరములేదు. నిత్యవ్యవహారములోనుండి సుమారు రెండుకోట్ల జనులచే మాట్లాడఁబడుచుండెడి భాష హఠాత్తుగా శూన్యమగుట యెట్లో తెలియకున్నది. అట్లే యైనచో భూభాగమం దనేక ప్రదేశముల వ్యాపించి యెక్కువవ్యాప్తి కలదని చెప్పఁబడు

చున్న ఇంగ్లీషుభాష యింతకంటె శూన్యమైనది కావలసి వచ్చునే! ఒకభాష మాటలాడుజాతి లేక సంఘమంతయు అల్పసంఖ్యాకంబై హఠాత్తుగా నశించుట సంభవించినఁ గాని, లేక, కారణాంతరములచే వారు తమకుఁ బరిసర ప్రదేశములఁగల మఱియొకభాష నవలంబించి, మాతృభాష యందలి అభిమానమును బొత్తుగా విడుచుట తటస్థించిన గాని భాషకు నా శ మ ను న ది కలుగఁజాలదు. మఱియు నొక్కొక్కప్పుడు గ్రాంధిక భాషకును వ్యావహారిక భాషకును విశేషభేదము కలిగి కాలక్రమమున నా గ్రాంథికభాష వ్యవహారమునుండి తప్పిపోయి వ్యాకరణ నియమ బద్ధమై మార్పులేక అభివృద్ధిఁబొందుటకు వీలులేని స్థితిలోనికి వచ్చినచో నద్దానిని మృతభాష (*Dead language*) యని చెప్పుట కలదు. సంస్కృతము, ప్రాచీన ల్యాటిన్ మొదలగు భాషలిప్పుడు నిత్యవ్యవహారములో నంతగా లేనివై క్రొత్తమార్పులకు లోఁబడని వగుటచేఁ గొందఱు వీనిని మృతభాషలని చెప్పుదురు. మార్పు అభివృద్ధి యను నవే భాషయొక్క సజీవత్వమును వ్యక్తపఱచునవగుటచే నొకభాష యితర భాషాపదముల నెరువు తెచ్చుకొని వానిని స్వసంప్రదాయానుసారముగ మార్పులనొందించితనలోఁగలు పుకొనుచుఁ దానభివృద్ధినొందుచున్నప్పుడాభాషనశించునని తలంచుట కవకాశము లేదు. ఒకవేళ నితర భాషలనుండి యెరువు తెచ్చుకొనిన పదము లీ భాషకు సహజములగు పదములను గొన్నిటిని నిత్యవ్యవహారమునుండి పారఁద్రోలినఁ ద్రోలవచ్చును గాని యంతమాత్రమున నా భాషాతత్వమే

మాఱుననిగాని యది నశించుననిగాని తెలుప వీలులేదు. తెలుఁగున 'విందు' శబ్దమున కొకటి దేశ్యార్థము కలదు. దీనికి చుట్టములు మొదలగువారికిఁ బెట్టెడు భోజనము అనియు, ఆతిథ్యమనియు నర్థములు కలవు. ఇంతేగాక ఇది చుట్టము. 'అతిథి' యను నర్థములఁగూడ మునుపు వాడుకలో నున్నట్లీ క్రింది యుదాహరణమువలనఁ దెలియుచున్నది.

"... భూసురేశ్వరు ప్రీతిఁ
బొందిరి నినుఁగని పెక్కు యోగు
విందవయితె నాకు ... "

భార. శాం. 3 ఆ

క. భూసుర కైతవపసుమశ
రాసన మాయింటివింద వైనది కైకో
మ్మా సముదంచన్మణిభవ
నాసీనత సేవ దేరి యాలక్ష్యంబున్ మను. 2 ఆ.

కాని యిప్పుడతిథిశబ్దము వాడుకలోనికి వచ్చుటచేఁ గాఁబోలు నీ 'విందు' శబ్దమున కిట్టి వ్యవహారము తప్పిపోయినది. మన బంధుమిత్రుల కిప్పుడు 'విందు' చేయుట కలదుగాని వారిని 'విందుల'ని పిలుచుట వ్యవహారమున గానము. ఇట్లే తమిళమున 'కక్షు' శబ్దభవము వాడుకలోనికి వచ్చిన తర్వాత 'చంక' పదమునకుఁ బ్రాచీన రూపమగు 'కైక్కుళి' యనునదిగాని, దానినుండి వచ్చిన పదముగాని యా భాషయందంత వాడుకలో లేదు. పరిశీలించినచో నింక నిట్టి వనేకములు గన్పడకపోవు.

ఇట్లొక వేళ భాషకు సహజములగు పదము లనేకములు వ్యవహారమునుండి తొలఁగిపోవుట తటస్థించినను, అందలి వాక్యరచనా రీతులు, వ్యాకరణాంశములు, జాతీయములు మొదలగు భాషాసాంప్రదాయము లా భాషయొక్క వ్యక్తిత్వమును నిలుపుచు నది సహజముగ నే కుటుంబమునకుఁ జెందునో సూచించుచునే యుండును. లేనిచో మనుచరిత్ర యందలి

"అటఁజని కాంచె భూమిసురుఁ
డంబరచుంబి శిరస్సరఝ్ఝరీ
...............కలాపిజాలమున్
కటకచరత్కరేణుకరకంపితసాలము
శీత శైలమున్"

మొదలగునవి కొన్ని సంస్కృతపద్యము లేమోయని భ్రమపడుట కవకాశము లేకపోలేదు కాని మొదటి అట, చని, కాంచె యను పదములును, తరువాతి దీర్ఘ సమాసముల తుదినున్న 'ము' ప్రత్యయములు నీ పద్యము తెలుఁగు పద్యమని యే కాని సంస్కృతభాషాపద్యము మాత్రము కాదని సూచింపఁగలవు. అట్లే "మాకు *necessary things* అన్నీ *supply* చేయడానికి ఒక *cooly* ని *engage* చేసినాము" అని యిప్పుడు మనము సామాన్యముగా వినుచుండెడి 'ఇంగ్లీషు–తెలుఁగు' వాక్యములలో నింగ్లీషు పదములే విశేషముగఁ గనబడుచున్నను, ఇందలి సర్వనామములు, సుప్తిఙాది ప్రత్యయములు, సహాయ క్రియలు

(*auxiliary verbs*) వాక్యరచనారీతి మొదలగునవన్నియు, అనఁగా నెరువు తెచ్చుకొనిన యాపదముల నర్థబోధకంబగు నొక వాక్యములో నుపయోగపఱచుకొనుటకు వలయు సాధనములన్నియు, నాంధ్రభాషకు సంబంధించినవే యగుటచే నిది యాంధ్రభాషావాక్యమే యగుచున్నది. కాని యాంగ్లభాషా వాక్యమనుటకు వీలు లేకున్నది. కావుననే భాషాకుటుంబముల నేర్పాటుచేయుటలో, అనఁగా నే భాషయే కుటుంబమునకుఁ జెందు నను విషయములోఁ బదముల కంటెఁ గూడ బలవత్తరములగు ప్రమాణము వ్యాకరణాంశములే యగుచున్నవనియు, నొక భాషకు సహజములగు పదము లితర భాషాపదముల దాడికాఁగ లేక వ్యవహారము నుండి తప్పిపోయినను, ఆ భాషయొక్క వ్యాకరణాంశములే దాని నిజతత్త్వమును, సంబంధ బాంధవ్యములను గూర్చి తప్పక తెలుపఁగలుగునని యే భాషాతత్త్వవేత్తలు తెలుపుచున్నారు.

"This is the reason why grammar is made the criterion of the relationship, and the base of the classfication in almost all languages. We may form whole sentences of English consisting entirely of Latin or Romanic words, yet whatever there is left of grammar in English bears unmistakable traces of Teutonic workmanship."

ఇట్లు వ్యాకరణాంశములందలి సామ్యమే భాషల సంబంధ బాంధవ్యములనుఁ దెల్పుటలో పరమ సాధనమగుచున్నది. భాషకుఁ బరస్పరము గలిగెడి సంసర్గముచే నొక

దానినుండి మఱియొకటి యెన్నియేని పదముల నెరవు తెచ్చుకొన్నను వ్యాకరణాంశములనుమాత్ర మే భాషయు నెరవు తెచ్చుకొనుట సంభవింపదు. అన్యభాషాసంసర్గముచే వేదభాషయందువలె వ్యాకరణాంశములందుఁ గొన్ని మార్పు లేమైన కలుగుటగాని లేక యనవసరములైన యంశము లేమైనఁ గొన్ని లోపించుటకాని తటస్థింపవచ్చును. ప్రాచీనంబగు 'ఇండో-యూరోపియన్' భాషయందలి విభక్తి రూపములు (సంస్కృత భాషలోవలె) నేడు గ్రీకు మొదలగు భాషలలో సంక్షిప్తములగుటయు, (గ్రీకులో నేడు సప్త విభక్తులు లేవు. మూఁడే విభక్తులు) వైదికభాషలో తుము న్నర్థ రూపములు (*infinitives*) అనేకములైయుండ (cf. "తుమర్థేసేసేనసే అసేన్ క్సేకసే నధ్యై అధ్యైన్, కధ్యైన్, శధ్యై శధ్యైన్, తవైతవేఙ్ తవేనః" పాణిని అష్టాధ్యాయి) కాలక్రమమున నివియన్నియు వ్యవహారము నుండి పోయి, యొక్క తుమున్నంతమే మిగిలియుండుటయు, లేడాది (*subjunctive mood*) తిఙంతరూపములుగూడ వ్యవహారమున జారిపోవుటయు, నీ మొదలగు మార్పులన్నియు నన్య భాషా సంసర్గ ఫలితములే కావచ్చును. కాని వ్యాకరణము మాత్రము క్రొత్తది కాదు.

"It is almost unanimously admitted by philologists that however large a borrowing of foreign vocables may take place, there is no satisfactory evidence that foreign grammar is ever borrowed to any appreciable extent by a truly live and spoken language" (*Tucker's Natural History of Language.*)

కావున భాషల సంబంధ బాంధవ్యమును నిర్ణయిం చుటలో పదముల సారూప్యముకంటెనుఁ గూడ వ్యాకరణాంశ ములందలి పోలికయే యుత్తమసాధనమని తేలుచున్నది. ఇంత మాత్రముచేఁ బదపరికరమువలనఁ గలుగు ప్రయోజనమేమా త్రము తగ్గదు. సామాన్యముగా భాషలకు సంబంధ మున్న దని తెలిసికొనుట సారూప్యపదసహాయముననే జరుగుచుం డును. రెండు భాషలయం దొకే యర్థముగలిగి సరూపము లగు పదములు కొన్ని కనఁబడినపుడే యాభాషల కేమైన సంబంధము కలదేమో చూడవలయు నను కుతూహల మును, అట్టి వింక నెన్నికలవో వానిని సంగ్రహింపవలయు నను తలంపును గలుగును. పిదప నివి నిత్యవ్యవహారమున నుండి యందఱకుఁ దేటతెల్లంబుగ నర్థంబగు పదములే యైనచో నీ భాషల సహజ సంబంధమును స్థిరముచేసికొను టకు, వ్యాకరణాంశముల పరిశీలన యావశ్యకంబగును. కావున పదముల సారూప్యవిషయమైన పరిశోధన ఫలరహి తము గాదు. కాని పరిశీలించునపు డాయా సారూప్య మెట్టి పదములలోఁ గన్పడుచున్నది యను విషయమును మాత్రము జ్ఞప్తియందుంచుకొనవలయును.

ఇంతేకాక భిన్నభాషలలోని పదముల సారూప్య మును బట్టి వాని సాజాత్యము నిశ్చయించునపుడు మఱి యొక విషయమును గూడ మన దృష్టిపథమున నుంచు కొనవలెను. ఒక మూలభాషయందలి ఒక పదము కేవల మా రూపముననే తజ్జన్యభాషయందు కూడ నగపడుచుండు

నని తలంచుట కవకాశము లేదు. ఒక్కచో నివసించుచు నొక్కభాష మాట్లాడువారిలోనే కొందఱొక ధ్వని నొక రీతిగను మఱికొందఱు మఱియొక రీతిగను నుచ్చరించు చుందురు. కావున నొక్క మూలభాషనుండి వచ్చినవై నను కాలక్రమమున భిన్నములైన నానా యా భాషలను మాట్లాడు వారి యభ్యాసవిశేషములను బట్టియుఁ గొన్ని కొన్ని ధ్వనుల యుచ్చారణ విషయమున వారికి సహజముగఁ కలుగు వికారపు టలవాటులను బట్టియు, మూలభాషకుఁ జెందిన యొక పదములోని ధ్వనులే యనేకవిధముల మారుచుండును గావున. నానా భాషలలో నాపద మొక్కప్పుడు విశేష పరిశీలనము లేనిదే గుర్తించుటకు వీలు కాకయుండును. కావున నా యా వికారములను దెలిసికొని తదనుగుణంబుగ నా యా పదముల సాదృశ్యమును నిర్ణయింపవలెను. ఒక కాలమున నొక రీతిగ నుచ్చరింపఁబడిన పదము మఱియొక కాలమునకు మఱియొకరీతి నుచ్చరింపఁబడి వేఱొక రూపమును బొందవచ్చును. సంస్కృతమునందలి 'పితా' 'పితృ' లేక 'పితర్' అను శబ్దము కలదు. దీనికి మూలభాషయందలి మూలరూపము 'పెటెర్' (Peter) అనియుండెనని గ్రీకు, ల్యాటిన్ భాషలలో విశేష భేదములేక (Pater, Peter) అనియు, సంస్కృతమున 'పితర్' అనియు (ఇందు మొదటి 'అ' కారము 'ఇ' కారముగ మారినది) నుచ్చరింపఁబడగా గాథిక్ భాషలో *fadar* అనియు ఆంగ్లో-సాక్సన్ భాషలో '*faedar*' అనియు నైనది. తుద కింగ్లీషు భాషలోని (*Brother*) శబ్దసామ్యముచే *father* అను రూపమును బొందినది.

ఇట్లే, సంస్కృత పదములు తెలుఁగులోనికి వచ్చునప్పు డనేక మార్పులఁ జెందినవి. యజ్ఞంబు జన్నంబైనది. యత్నము జతన మైనది. యంత్రంబు జంత్రంబు; యముఁడు జముఁడు; యక్షులు జక్కులు; యోధు జోదు; శాణము సాన; శవము సబము; యశము అసము; దోషము దోసము; రోషము రోసము, భాష బాస; ఇత్యాదు లనేకములు గలవు. సమానార్థకములగు పదములలో తమిళమున 'క'కా రము కన్పడిన కొన్ని పదములలోఁ దెనుఁగున 'చ' కారము కన్పడుచున్నది. తమి, కివి, తె. చెవి; గిళి–చిలుక; కెయి–చేయి; కెంబొన్–చెంబు. ప్రాచీన ద్రావిడభాష యందలి కైక్కళి యను పదము కైజ్కళి, చైంకుళి, చంకుళి, చంకల్, అయి తుదకు 'చంక' అను రూపమున నిప్పుడాం ధ్రమున వ్యవహారములో నున్నది. ఇట్లే యొక్కొక్క విధ మగు మార్పు అనేకములగు పదములలోఁ గన్పడుచుండును. ప్రాచీన ద్రావిడ భాషలోను తక్కిన ద్రావిడ భాషలన్నిటి లోను, ప్రాచీన కన్నడమునను గూడ నున్న యనేక పద ములలోని 'ప' కార మాధునిక కన్నడ భాషలో 'హ' కార ముగ మాఱినది. పొన్ను–హొన్ను; పాలు–హాలు; పసరు–హసిరు; పది–హది.

ఒక భాషలోని పదము లనేకింటిలో నిట్టి మార్పులు నియతముగ పొడసూపుచుండుటచే నది యా భాషను మాట్లాడుజనుల యుచ్చారణకు సహజంబగు నొక వికార మని చెప్పవలసినదే కాని వేఱువిధమున దానిని సమర్థింప వీలులేదు. కావున ననేక పదములను బరిశీలనచేసి యాయా

భాషలయం దిట్టి వికారములను గు ర్తించి యొకధ్వని యా యా భాషలయం దాయా కాలముల నాయా వికారముల బొందుచున్నదని నిరూపించినచో, సోదర భాషలయందుఁ గల సజాతీయ పదములయందలి యత్కించి ద్భేదములు సహేతుకములుగనే కన్పడును. ఇట్టి ధ్వని వికారముఁలఁ గూర్చిన నిరూపణములనే స్వరసూత్రములు లేక స్వర నియమములు (*Phonetic laws*) అని చెప్పుదురు. ఈ స్వర నియమముల కపవాదములు అనఁగా నీ నియమములను దాటిపోయిన పదములు భాషలో నుండిన నుండవచ్చును గాని, యవి యట్లు దాటిపోవుటకును గారణము లుండకపోవు. ఆ కారణముల నన్వేషించి వానిని సహేతుకముగ సమర్థించుట భాషా శాస్త్రజ్ఞుని పనియై యున్నది.

దీనిని బట్టి యొకవేళ నొక పదము సోదరభాష లన్నిటిలో నొకేరూపము కలదై యుండకపోయినను, అనఁగా సారూప్యము గలదిగాఁ గన్పడకపోయినను అవి యా యా భాషల స్వరనియమములకు లోఁబడి యుండినచో నాపదముల సోదర భావమును గూర్చి మనము శంకింప నవసరము లేదు అని తేలుచున్నది. కావున పితర్ *father*; మాతర్, *mother*; అశ్వ, *horse*; కిళి–గిళి–చిల్క, కివి–చెవి; కంకుల్–చంక, మొదలగు పదముల సహజ సంబంధము లేక సోదర భావమునుగూర్చి శంకింప నక్కర లేదు. ఒక్కొక్కప్పుడు సహజ సంబంధము లేని భాషలలో నక్కడక్కడ కొన్ని పదములు సరూపములును, సమానార్థకములునై కన్పడుటయుఁ గలదు. అట్టివి ఆంగ్లమున *prop*, తెలుఁగు ప్రాపు; *mouth*,

మూతి మొదలగునవి. ఆంగ్లమునందే విశేషణ, విశేష్య భావములను దెల్పెడి 'sorry' (విచారకరమైన) sorrow (విచారము) అను రెండు పదములు సమానార్థకములై కన్పడినను వాస్తవముగ నా రెంటి నొక్క మూలరూపమునుండి వచ్చినవి కావు. కావున పదములయందలి కేవల సారూప్యమే దాని సాదృశ్యము నెల్లప్పుడు తెలుపునని కూడ తలంచుటకు వీలు లేదు. యత్కించిద్భేదము కలదై యున్నను, ఆ పదముల యందలి భేదము లా యా భాషలయందలి స్వరనియమములకు లోబడియుండి, వాని రూపనిష్పత్తి క్రమమును పరిశీలించినప్పుడని యొక్క మూలరూపము లేక ధాతువు నుండియే యేర్పడినవై యున్నట్లు తెలియవచ్చినచో నా పదముల సాజాత్యమే కాక వాని మూలమగు నా భాషల సంబంధ బాంధవ్యములు కూడ నిశ్చయింపదగియుండును.

ఇంక (నెట్టి) పదములందలి సారూప్యము (కూడ) భాషల జన్యజనక సంబంధమును, సన్నిహితత్వమును నిర్ణయింప లేవనియు, అవి యట్లు నిర్ణయింపగలిగినచో నీ క్రింది యుదాహరణములం బట్టి ఆంగ్లేయ భాష తెలుంగుకంటె సంస్కృతమునకుం జేరువగం గనంబడునని చెప్పవలసి వచ్చుననియుం జెప్పవచ్చు, నాంధ్ర వాఙ్మయ కర్తలు గైకొనిన యుదాహరణములనే గ్రహించి యా పదముల పరస్పర సంబంధమెట్టిదో పరిశీలించి దానివలనం దేలు ఫలితమును విచారింతము. ఆ యుదాహృత పదముల పట్టిక నీ క్రిందం బొందుపఱచుచుం, దెనుఁగు పదముల ప్రక్కను తమిళ కన్నడ పదములను గూడ నిచ్చుచున్నాను.

ఇంగ్లీషు	సంస్కృతము	తెలుఁగు	తమిళము	కన్నడము
Father (ఫాదర్)	పితర్	తండ్రి	తంద్రై	తందె
Mother (మదర్)	మాతర్	తల్లి	తాయి	తాయి
Brother (బ్రదర్)	భ్రాతర్	అన్న	అణ్ణన్	అణ్ణ
Horse (హార్స్)	అశ్వ	గుఱ్ఱము	కుదిరై	కుదిరె
Heart (హార్ట్)	హృదయ	గుండెకాయ		గుణ్డిగె
Debauchery (డిబాచరీ)	వ్యభిచార	ఱంకుతనము		
Book (బుక్)	పుస్తక	పొత్తము	పుత్తగం	పుస్తగం
Orange (ఆరెంజ్)	నారంగ	నారింజ	నారంగ	నారంగ
Pot (పాట్)	పాత్ర	కుండ		కుంబె, కుండె

పై పట్టికలోని పదములు తొమ్మిదింటిలో మొదటి మూఁడును బాంధవ్య రూపసబంధమును (*Relationship*) తెలియఁజేయు పదములు. నాలు, గైదు, తొమ్మిది పదములు మనకు పరిచితములగు వస్తువులను గూర్చి తెలుపునవి. ఎనిమిదవ పద మీ భాష లన్నిటిలోనుగూడ మఱియొక భాష నుండి ఎరువుగాఁ దెచ్చుకొనఁబడిన పదము. ఏడవది సంస్కృతమునుండి తెలుఁగు, తమిళ, కన్నడములలోని కెరువుగా వచ్చినది. ఆఱవపదముయొక్క వ్యుత్పత్తి సందేహాస్పదమగుటచే నింగ్లీషు నంస్కృతరూపములతోఁగల పోలికయాదృచ్ఛికమని చెప్పవచ్చును. కావున నీపైనఁ జూపఁ బడిన సంస్కృత పదము లన్నిటి కాంగ్ల పదములతోఁ గల సారూప్యము కేవలము యాదృచ్ఛికమని కొట్టివేయుటకుఁ గాని యీ కారణమున సంస్కృతాంగ్లములకు సంబంధము లేదని తలంచుటకుఁగాని యాధారము కనఁబడదు.

తల్లి, తండ్రి. అన్న యను సంబంధ వాచకములను బాలురు పిన్ననాఁటనే నేర్చికొని వ్యవహరించుచుందురు. కావున నిట్టి ప్రథమ సంబంధములనుఁ దెలియఁజేయు పదములు ప్రతి భాషకును సహజములై యుండును. సామాన్యముగా నట్లత్యవసరములై నిత్యవ్యవహారములో నుండు పదము లితర భాషలనుండి యెరువు తెచ్చుకొనుట సంభవింపదు. కావున నిట్టి పదములలోఁగల సారూప్య మాభాషల సోదరభావమునే సూచించునని యింతకుఁబూర్వమే చెప్పఁబడినదిగదా! పై పట్టిలోని మొదటి మూఁడు పదము లిట్టి సంబంధమును తెలియఁజేయున వగుటయు, నివి యొక్క

సంస్కృతాంగ్లముల యందేకాక ఇండో-యూరోపియన్ కుటుంబమునకుఁ జెందినవిగాఁ జెప్పఁబడిన భాషలన్నిటిలోఁ గూడ సమానరూపము గలవియు నగుటచే సంస్కృతాంగ్ల పదములందు గన్పట్టిన సారూప్యము యాదృచ్ఛికమని గాని, దానివలన నీ భాషలకు జన్యజనక భావ సంబంధముగాని, సోదర భావ సంబంధముగాని లేదని నిశ్చయించుట కేమాత్రము వీలులేదు. తక్కిన భాషలలో నీవి రూపముల నిచ్చుటఁ జూపుచున్నాను—

ఇంగ్లీషు	సంస్కృతము	లాటిన్	గ్రీకు	గాథిక్
Father (ఫాదర్)	పితర్	*pater* (ప తెర్)	*Pater* (ప తేర్)	*Fadar* (ఫదర్)
Mother (మదర్)	మాతర్	*Mater* (మా తెర్)	*Mater* (మా తెర్)	*Mouter* మౌ తెర్
Brother (బ్రదర్)	భ్రాతర్	*Frater* (ఫ్రటర్)	*Phrater* (ఫ్రటేర్)	*Brothar* బ్రోథర్
Horse (హార్స్)	అశ్వస్	*Equos* (ఎక్వొస్)	*Hippos Ihkos* (ఇక్కోస్)	*Aih-va* (ఎయిహ్వా)
Heart (హార్ట్)	హృదయ	*Cord* (కోర్డ్)	*Kardia* (కార్డియ)	*Hairto* (హైర్టో)

ఆ యా భాషలలోని కొన్ని పదములు యత్కించిద్భేదములు కలవై యున్నట్లు కన్పడినను, అవి యా యా భాషకు స్వాభావికములగు స్వరనియమముల (*Phonetic laws*) ననుసరించి యున్నవే యగుటచే వాని సోదర్యమును గూర్చి శంకింప నవసరము లేదు. పై పదములన్నియు ఇండో యూరోపియన్ కుటుంబములోని భాష లన్నిటిలో సమానార్థకములై కన్పడుచు, సంస్కృత భాషకు (లేక ఆర్యభాషా శాఖకు) సోదరియగు జర్మానిక్ భాషాశాఖకుఁ జెందిన గాథిక్ భాషనుండి ప్రాచీనాంధ్రభాషామూలముగా నాధుని కాంగ్లమునఁ జేరినవి. కావున నాంగ్ల భాషకు సంస్కృతము వృద్ధ మాతామహియగునని చెప్పవచ్చును. పదముల యందలి సారూప్యము సూచించిన యీ భాషల యేక కుటుంబత్వము వ్యాకరణాంశములు కూడ దృఢపఱచుచున్నవి.

సం.	గ్రీ.	లా.	గా.	ఇంగ్లీషు.
భరా(మి)	*Phero* (ఫెరొ)	*Fero*	*Baira*	*Bear*
భరామః	*Pheromes* (ఫెరోమెస్)	*Ferimus*	*Bairam*	
భరన్తి	*Pheronti* (ఫెరోంటి)	*Ferunt*	*Bairand*	
అస్తి	*Esti* (ఎస్తి)		*Ist*	*Is*
అశ్వస్	*Hippos* (హిప్పొస్)	*Equos*		
అస్వం	*Hippon* (హిప్పొన్)	*Equom*		
అశ్వాయ	*Hippoi* (హిప్పొయ్)	*Equi*		
అహం	*Ego(n)* (ఎగో(న్)	*Ego*	*Ik*	*I*

ఇట్టి క్రియారూప నామరూపములయందును (అనఁగా తిజంతములయందును, సుబంత రూపముల యందును) సర్వనామముల యందును, ఆయా ప్రత్యయముల యందును గన్పడుచున్న పోలికలనుబట్టి యీ భాషలన్నియు నొక మూలభాషనుండి వచ్చినవేయని చెప్పుకున్నచో, నా పోలికలకుఁ దగిన కారణమును మనము నిరూపింపలేము. వీనిలో నొక భాషకు మఱియొక భాషకు బాంధవ్యము దగ్గర కావచ్చును, దూరమును కావచ్చును; కాని యివి యన్నియు నొక కుటుంబమునకుఁ జేరినవి యని మాత్రము నిశ్చయించుటకు సందేహ మక్కఱలేదు. ఇట్టి పోలికలు హిందూదేశము మొదలుకొని ఐరోపాఖండమందలి పడమటికొనవఱకుఁ గల భూభాగములో వ్యవహరింపఁబడు చుండెడి భాషలు లేక భాషాశాఖ లన్నిటిలో అనఁగా ఆర్య భాషాశాఖ, ఆర్మీనియన్, ఆల్బేనియన్, బాల్టో-స్లెవోనిక్, ఇటాలిక్, జర్మానిక్, గ్రీక్, కెల్టిక్ అను భాషాశాఖ లన్నిటిలోఁ గన్పడుచుండుటచే, నీ భాషా శాఖల నన్నిటికిని "ఇండో - యూరోపియన్" భాషా కుటుంబమని భాషాశాస్త్రజ్ఞులు నామకరణము చేసినారు. ఇట్లే ఆయా భాషల యందుగల పోలికలను బట్టి ఇండో - యూరోపియన్ కుటుంబము కాక యట్టివి 'సెమెటిక్,' 'ఊరల్ ఆల్టాయిక్,' 'మలయోపోలినీషియన్,' 'బాంటు.' 'ద్రావిడ భాషాకుటుంబము,' ఈ మొదలగు భాషా కుటుంబములు లేర్పరుపఁబడియున్నవి.

ఈ ద్రావిడ భాషాకుటుంబములో మొదటినుండియు దక్షిణ హిందూదేశమున వ్యవహరింపఁబడుభాష లన్నిటితో పాటు తెలుఁగుభాషయుఁ జేరియున్నది. ఈ ద్రావిడ మేభాషా వర్గమునకుఁ జేరువగా నున్నదియను విషయమున భిన్నాభిప్రాయము లున్నను తెలుఁగు తమిళము మొదలగునవి యన్నియు నొక్క కుటుంబములోఁ జేరుననుటలో మాత్రము పలువు రేకాభిప్రాయులై యున్నారు. సంస్కృతాంగ్లము లొక్క కుటుంబమునకుఁ జెందియున్నవని యెట్టి సాధనముల వలన గ్రహింపఁబడినదో యట్టి సాధనములే యీ దక్షిణ హిందూ దేశ భాషలన్నియు నొక్క కుటుంబమునకుఁ జెందినవై సోదరభావమును వహించియున్నవని సూచించుచున్నవి. పై పట్టికలోని సంస్కృతాంగ్ల పదములయందుఁ గల సారూప్యమును బరిశీలించి చూచినపు డెట్లది వాని సన్నిహితత్వమును దెల్పునదయ్యెనో, అట్లే యీ సంస్కృత పదములతో సమానార్థకములైనను శుద్ధ వైరూప్యమే కలవగుటచే వానితో నెట్టి సంబంధము నున్నదని చెప్పుటకు వీలులేని తెలుఁగు పదముల కరవ కన్నడ పదములతోఁ గల సారూప్యమే యీ భాషలకుఁ గల సన్నిహిత సంబంధము లేదా ఏక కుటుంబత్వమును సాధించుచు నివి సంస్కృతాంగ్లములకంటె భిన్నమగు భాషాకుంబమునకుఁ జేరియున్నవని తెల్పుచున్నది. పై పట్టికలోని పదములే గాక నేను, మనము; నీవు, వాఁడు; తమి. నాన్, నామ్; నీన్, అవన్; కన్న. నాను, నావు, నీను, అవను; అను సర్వనామ రూపములును; తెలుఁగు ఒండు, మూఁడు పది; తమి. ఒన్రు, మూన్రు, పత్తు;

కన్న. ఒండు, మూఱు, పత్తు (హత్తు) అను వి మొదలగు సంఖ్యావాచక శబ్దములును, చేయుచున్నాను, చేసితిని, చేయును. చేయ(న్), చెయ్యి, తమి. శెయ్‌గిన్ఱేన్. శెయ్‌దనెన్, శెయ్‌గుమ్. శెయ్య, శెయ్. కన్న. గెయ్‌దెపెం. గెయ్‌దమ్, గెయ్‌వం, గెయ్య, గెయ్ మొదలగు క్రియారూపములును, ఆయా రూపముల నిష్పత్తి క్రమమునుగూడ నీ భాషలన్నియు నేక కుటుంబమునకుఁ జెందిన వను విషయమునే ప్రకటించుచున్నవి. అయితే యీవన్నియు నొకకుటుంబమునకుఁ జెందినవని చెప్పినంతమాత్రముననే యొకటి రెండవదానికంటెఁ బ్రాచీనమనిగాని, యొకదాని కొకటి తల్లివంటిదనిగాని చెప్పినట్లుగాదు. ఏక కుటుంబత్వము, సన్నిహిత సంబంధము నిరూపించినంత మాత్రమున జన్య జనక భావము నిర్ధారితమైనదని తలంచుట కవకాశ మెంతమాత్రమును లేదు. ఇవన్నియుఁ బ్రాచీనంబగు మఱియొక భాష నుండి వచ్చినవై సోదరీభావమునే వహించియుండవచ్చును. అటువమున నొకవేళ ప్రాచీనతరంబగు వాఙ్మయము గాని, ప్రాచీన భాషాలక్షణములుగాని తక్కిన వానికంటె నెక్కుడుగా నున్నను, అది తక్కిన వానికి తల్లిభాష కానేరదు. కొన్ని విషయములలో నది గొన్ని ప్రాచీనభాషాలక్షణములఁ జూపుచుండ మఱికొన్ని విశేషములు తక్కినభాషలు చూపుచుండవచ్చును. పదములలోను వ్యాకరణాంశముల యందును సంస్కృతాంగ్లములకు సన్నిహితత్వము నిరూపింపఁబడినను, ఇంగ్లీషు సంస్కృతమునకుఁగాని, సంస్కృత మింగ్లీషునకుఁగాని తల్లియని చెప్పుట కెట్లు సాధ్యపడదో, అట్లే తమిళాంధ్రముల

యందలిపదముల సారూప్యమును, వ్యాకరణాంశముల యందలి సామ్యమును, వాని సన్నిహితత్వమును లేదా బాంధవ్యమును నిశ్చయింపగలుగునే కాని, అంతమాత్రమున నొకదానినుండి మఱియొకటి పుట్టినదని చెప్పుట కవకాశము లేదు. ఆయా భాషల పరస్పర సంబంధ మిట్టిదని నిరూపించుట కా భాషా చరిత్రలు బాగుగఁ బరిశీలింపఁబడవలయును. ఇతర నిదర్శనము లనేకములు కావలయును. ఇండో - యూరోపియన్ భాషా కుటుంబము విషయమున జరిగిన యపారంబగు భాషా పరిశ్రమ యీ దక్షిణదేశ భాషల విషయమున జరుగలేదు. కనుక, యట్లు జరిగినచో నీ భాషలన్నిటికి మాతృ భాష యేదో, యెట్టి స్వరూపము కలదో నిరూపించి, వీనిలో వీనికిఁగల పరస్పర సంబంధ మిది యని మనము నిరూపింప గలిగియే యుందుము. కావున మాతృ భాషాభిమాను లందఱు దీని విషయమునఁ దగిన పరిశ్రమను జేయుదురుగాక!